








ఓం నమః శ్శివాయ

# || ఓం కేశవాయ నమః ||



"ధ్యానరత్న" కేశవరాజు

# "ఓం నమఃశ్శివాయ
# ఓం కేశవాయ నమః"

## పత్రీజీ తో ..

## 'ధ్యానరత్న' కేశవరాజు గారి స్వానుభవాలు

D. కేశవరాజు

హైదరాబాద్

“ ఓం నమఃశ్శివాయ-ఓం కేశవాయ నమః ”

పత్రీజీ తో ‘ ధ్యానరత్న ’ కేశవరాజు గారి స్వానుభవాలు

ముద్రణ : శ్రీ నవ్య గ్రాఫిక్స్
బల్కంపేట్, హైదరాబాద్-16
Ph : **040-23800757**

ద్వితీయ ముద్రణ : డిసెంబర్, **2021**

ప్రతులు : **1000**

వెల : రూ.**140 /-**

ప్రతులకు :
D. కేశవరాజు
ధ్యానజగత్, కొత్తపేట, హైదరాబాద్
సెల్ : **70754 99799**

# పత్రీజీ సందేశం



శ్రీ కేశవరాజు గారికి సాటి వచ్చే  పిరమిడ్ మాస్టర్ లేరు !

ఏమి ఆ ధ్యాన అనుభవాలు !

ఏమి ఆ కర్తవ్యదీక్ష !

ఏమి ఆ శిష్యత్వ తత్పరత !


ఏమి ఆ కార్యశూరత !

ఏమి ఆ వినయశీలత !

ఎప్పటినుంచో నేను ఎదురు చూసిన పుస్తకం ..

" ఓం నమః శ్శివాయ-ఓం కేశవాయనమః " !

థాంక్యూ ! థాంక్యూ ! కేశవరాజు గారు !



# విషయ సూచిక


| | |
|---|---|
| " స్వ పరిచయం " | **7** |
| " పత్రీజీతో తొలి పరిచయం " | **9** |
| " మొదటిరోజు ధ్యాన అనుభవం " | **11** |
| " మొట్టమొదటి గురుపౌర్ణమి " | **16** |
| " పత్రీజీతో మొట్టమొదటి ట్రెక్కింగ్ " | **17** |
| " యుద్ధగళ తీర్థం " | **18** |
| " **1996** – జేసీస్ ప్రెసిడెంట్ " | **22** |
| " సుబ్బరత్న తో .. వివాహం " | **26** |
| " ' సుబ్బరత్న '.. అనంత లోకాలకు .. " | **32** |
| " రెండవ వివాహం " | **37** |
| " పులిబోను బావి ట్రెక్కింగ్ " | **41** |
| " నో ఫుడ్ ట్రెక్కింగ్ " | **44** |
| " **1999**–పిరమిడ్ పార్టీ ఆవిర్భావం " | **51** |
| " మొట్టమొదటి .. కైలాస మానససరోవర యాత్ర " | **54** |
| " **2006**– రెండవసారి .. మానస సరోవర యాత్ర " | **61** |
| " తిరువణ్ణామలై .. అహింసా ధ్యాన మహాయజ్ఞం " | **68** |
| " పత్రీజీ ఆదేశానుసారం ..అమర్‌నాథ్ ధ్యానయాత్ర – **2008** " | **71** |
| " అమర్‌నాథ్ ధ్యాన యాత్ర విశేషాలు " | **82** |
| " హిమాలయాల ధ్యానయాత్ర–**2009** " | **91** |

“ తాండవశివ సంగీత నృత్య ధ్యానమహాయజ్ఞం-2009, శ్రీశైలం ”113
“ గుజరాత్, మౌంట్ అబు .. ధ్యానయాత్ర ” 116
“ పూరీ, కోణార్క్, భువనేశ్వర్ ధ్యాన ప్రచారయాత్ర ” 129
“ 2011- అమరకంఠ ధ్యానయాత్ర ” 134
“ 2012- దక్షిణ కర్నాటక ధ్యాన యాత్ర ” 139
“ పశ్చిమగోదావరి జిల్లాలో .. ధ్యానవిజ్ఞాన కార్యక్రమం ” 150
“ గుంటూరు జిల్లాలో .. ధ్యానవిజ్ఞాన కార్యక్రమం ” 156
“ ఖమ్మం జిల్లాలో .. ధ్యానవిజ్ఞాన కార్యక్రమం ” 160
“ ఆస్ట్రల్ మాస్టర్స్‌తో సంభాషణ ” 163
“ ఖమ్మం జిల్లా, మణుగూరులో .. ధ్యానవిజ్ఞాన కార్యక్రమాలు ” 166
“ 2004- పిరమిడ్ వ్యాలీ అనుభవం ” 172
“ మైత్రేయ బుద్ధా ధ్యానవిద్య విశ్వాలయం ” ప్రారంభోత్సవం 176
“ 1998 - పత్రీజీతో ప్రయాణం ” 180
“ ప్రతి నెలా హైదరాబాద్ ” 184
“ స్కూల్స్‌లో ధ్యానం క్లాసులు ” 189
“ తిరుమల ట్రెక్కింగ్ ” 191
“ చిన్నప్పటి అనుభవం ” 193
“ 2001 లో తిరుమల అనుభవం ” 195
“ ధ్యానం అందరికీ అవసరం ” 197
“ ధ్యానం అందరికీ అవసరం ” పాకెట్ బుక్ 199
“ గురువుగారికి ప్రణామాలు ” 238

# " ధ్యానం చేసే పద్ధతి "

సుఖాసనంలో హాయిగా కూర్చుని, చేతులు రెండూ కలిపి, కళ్ళు రెండూ మూసుకుని సహజంగా జరుగుతూన్న ఉచ్ఛ్వాస- నిశ్వాసలను గమనిస్తూ వుండాలి. ఏ దేవతా, గురు రూపాలూ ఊహించుకోరాదు. ఏ నామస్మరణా వుండరాదు. మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు ' కట్ ' చేస్తూ మళ్ళీ మళ్ళీ శ్వాస మీదే ధ్యాస మరల్చుతూ వుంటే క్రమక్రమంగా ఆలోచనారహిత స్థితి కలుగుతుంది. ఈ అద్భుత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీమండల ఆత్మానుభవాలను శ్రద్ధగా గమనిస్తూ వుండాలి. ఇదే బుద్ధ ప్రబోధిత " ఆనాపానసతి " ధ్యానం !

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంత వుంటుందో కనీసం అన్ని నిమిషాలు ఒక సిట్టింగ్‌లో తప్పనిసరిగా ధ్యానం చేయాలి. ఆ పై ఎవరి ఇష్టం వారిది! ధ్యానానికి ఏ సమయమైనా మంచి సమయమే! ధ్యానానికి ఏ ప్రదేశమైనా మంచి ప్రదేశమే!

ధ్యానం వల్ల లాభాలు : అనునిత్య ధ్యాన సాధన వల్ల ఏకాగ్రత, సంపూర్ణ మనశ్శాంతి, పరిస్థితుల అవగాహన, ఆనందం కలిగి జీవితాన్ని ఆనందమయం చేసుకుని జీవితానందంతో బాటు ఆత్మానందం, ఆత్మోన్నతి కలిగి ఈ జన్మ ధన్యమవుతుంది !

**" ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస "**

**" ధ్యానం చేద్దాం - ధన్యులమవుదాం ! "**

# " స్వ పరిచయం "

నా పేరు కేశవరాజు.

మా తల్లితండ్రులు సాలమ్మ, నాగరాజు గార్లు. నేను 1955 ఆగస్టు 14వ తేదీ వడమాలపేట మండలం " అబ్బికండ్రిగ " గ్రామం ప్రక్కన " ముప్పాలవారి ఇండ్లు " అనే కుగ్రామంలో జన్మించాను.

మా అన్నయ్య రామకృష్ణరాజు, అక్క నాగభూషణమ్మ. మాది రైతు కుటుంబం. నా ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాసం అబ్బికండ్రిగలో, హైస్కూలు **K.V.S.N.** జిల్లాపరిషత్ హైస్కూల్, తడుకు రైల్వేస్టేషన్‌లో మరి ఇంటర్ **S.V.** జూనియర్ కాలేజ్ తిరుపతిలో జరిగింది. అన్నయ్యకు, అక్కకు వివాహమై వేరే ఊర్లకు వెళ్ళిపోవడంతో నేను మా తల్లితండ్రులకు వ్యవసాయంలో తోడుగా ఉండేవాడిని.


1973లో మా మేనమామ కూతురు " సుబ్బరత్న " తో నాకు వివాహం జరగడంతో బాధ్యతలు పెరిగాయి. స్నేహితుడితో కలిసి చెన్నైలో వ్యాపారం చేయగా కాలం కలిసి రాక కష్టాల పాలయ్యాం. తర్వాత 1980 నుంచి 1983 వరకు అంకుర్ సీడ్స్, నాగపూర్ సంస్థలో ఫీల్డ్ ఆఫీసర్‌గా తిరుపతి బ్రాంచ్‌లో పనిచేశాను. 1983 జూలైలో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి " కేశవరత్న అడ్వర్‌టైజర్స్ " అని సొంతంగా యాడ్ ఏజెన్సీని ప్రారంభించాను. ఈ సంస్థ ద్వారా అన్ని రకాల వ్యాపార సంస్థలు .. (స్కూల్స్, కాలేజీలు, సినిమాలు, వెహికిల్స్, మ్యున్సిపాలిటీ, పోలీస్ డిపార్ట్‌మెంట్, RTC మొదలైన) వారికి అడ్వర్‌టైజ్‌మెంట్స్ తయారు చేస్తూ చిత్తూరు జిల్లాలో మంచిపేరు తెచ్చుకున్నాను.


తిరుపతిలో అన్ని వర్గాల వారితో పరిచయాలు పెరిగి తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్, సినీసొసైటీ, అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, జూనియర్ ఛాంబర్ (జెసీస్ ఇంటర్నేషనల్), నేతాజీరోడ్డు ట్రేడర్స్ అసోసియేషన్, క్షత్రియసేవా సంఘం, రాయల్‌నగర్ కల్చరల్ అసోషియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ .. ఇలా 13 ఆర్గనైజేషన్స్‌లో మెంబర్‌గా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ప్రెసిడెంట్‌గా, సెక్రెటరీగా మరి ట్రెజరర్‌గా ఉంటూ తిరుపతిలో ఏ కార్యక్రమం జరిగినా నేను తప్పకుండా పాల్గొనేవాడిని. ఆర్గనైజర్‌గానూ, అడ్వర్‌టైజర్‌గానూ మంచి పేరు తెచ్చుకున్నాను.

నా భార్య " సుబ్బరత్న " ఉత్తమ ఇల్లాలు! వృత్తి రీత్యా ఎంతో బిజీగా ఉన్న నేను .. ఇంటి గురించి, పిల్లల గురించి పట్టించుకోకపోయినా .. ఏ లోటూ రాకుండా కుటుంబ భారాన్నంతా తానే మోసి పిల్లలను అద్భుతంగా చదివించేది. మా బంధువుల్లో కూడా నాకంటే ఆమెకే మంచి పేరు.

ఇద్దరు అమ్మాయిలు .. " ఉష ", " నాగమణి ". ఇద్దరూ M.Com, M.A., B.Ed.,లు పూర్తి చేసారు. కుమారుడు " వెంకట రాజగోపాల్ " ఇంటర్ పూర్తిచేసి వ్యాపారంలో నాకు తోడుగా ఉండేవాడు.

1994వ సంవత్సరంలో మొట్టమొదటిసారి నేను తిరుపతిలో పత్రీజీని కలవడంతో నా జీవితం క్రొత్త మలుపు తిరిగింది.





# " పత్రీజీతో తొలి పరిచయం "

అధ్యాత్మిక ప్రగతికోసం నేను అనేక ఆశ్రమాలు తిరిగాను. అయినా తృప్తిలేదు. 1994 ఫిబ్రవరి 28వ తేదీ సోమవారం తిరుపతి, కపిలతీర్థం సమీపంలో ఉన్న " దివ్యారామం " లో పత్రీజీని నేను, కంచి రఘురామ్, M.M.స్వామి మొట్టమొదటసారిగా కలవడం జరిగింది.

1994లో జేసీస్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్‌లో కంచి రఘురామ్ ప్రెసిడెంట్, నేను సెక్రెటరీ, M.M. స్వామి ట్రెజరర్ .. అందువల్ల ఏ కార్యక్రమానికైనా కలిసే వెళ్ళేవాళ్ళం.

మిట్టా శ్రీనివాసులు తిరుపతిలో ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్. విజయ్‌కుమార్ గుంతకల్లులో ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్. విజయ్‌కుమార్ ద్వారా మిట్టా శ్రీనివాసులకు పత్రీజీ పరిచయమై .. పత్రీజీ తిరుపతి విచ్చేసారు. ప్రతి సోమవారం సాయంత్రం " దివ్యారామం " లో ఆచార్య సముద్రాల లక్ష్మణయ్య (TTD)గారు భగవద్గీత ప్రవచనాలు చేసేవారు. వివిధ శాఖల్లో రిటైర్ అయిన

వారు " బాలాజీ సత్‌సంగ్ " అనే సంస్థను స్థాపించి ఈ కార్యక్రమాలు నిర్వహించేవారు.

1994 ఫిబ్రవరి 28వ తేదీ సోమవారం మేము తిరుపతి కపిలతీర్థం సమీపంలోని దివ్యారామం చేరేప్పటికి సముద్రాల గారి ప్రసంగం జరుగుతోంది. కొద్దిసేపటి తరువాత ఆయన " మన కార్యక్రమం ముగిసింది .. ధ్యానం గురించి చెప్పడానికి కర్నూలు నుంచి సుభాష్ పత్రి గారు వచ్చారు. ఎవరికైనా ఉత్సాహం ఉంటే ఉండవచ్చు " అని తమ ప్రసంగాన్ని ముగించారు. అక్కడ ఉన్న 150 మంది వెళ్ళిపోయారు. నేను, కంచి రఘురామ్, M.M.స్వామి, మిట్టా శ్రీనివాసులు, ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట రామిరెడ్డి మిగిలాం.

" కాషాయ వస్త్రాలు, గెడ్డం లేదు కాబట్టి పాదనమస్కారం పెట్టాలా? వద్దా? " అనే సందేహంతో నేను దగ్గరకు వెళ్ళి జీన్స్‌ప్యాంటు, T-షర్ట్ వేసుకుని ఉన్న పత్రీజీ ముందు నిలబడ్డాను. ఆయన నా కళ్ళలో కళ్ళు పెట్టి చూసారు. నేను రెండు నిమిషాల పాటు ఆయన కళ్ళ వంకే చూసాను. ఏదో తెలియని అనుభూతి .. " ఈ జన్మకు ఈయనే నా ఆఖరి గురువు " అని నాలో నేను మాట్లాడుకుంటున్నాను. పరిచయాలు అయిన తరువాత పత్రీజీ .. " మనం తిరుమల తిరుపతి దేవస్థానం మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ అయిన శ్రీ నూకల చినసత్యనారాయణ గారి ఇంటికి వెళ్ళి ధ్యానం చేద్దాం. వారు నాకు సుపరిచితులు " అన్నారు.

శ్రీ నూకల చినసత్యనారాయణ గారి క్వార్టర్స్ (S.V. ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణం)లో మొదటిరోజు ధ్యానం! పత్రీజీకి ఎదురుగా అందరం కూర్చున్నాం. ధ్యానం ఎలా చేయాలో వివరించారు. ఒక్క నిమిషంలో నేను అలోచనారహిత స్థితికి చేరుకున్నాను.

# “ మొదటిరోజు ధ్యాన అనుభవం ”

నాకు ఎదురుగా ఒక చెట్టుపై ఒక రంగురంగుల పిట్ట నాతో మాట్లాడుతూ “ నీకు అనుమానాలు ఎక్కువ! 15 రోజులు తప్పక ధ్యానం చెయ్యి ” అని చెప్పింది. “ ఇది నా ఊహనా? లేక నిజమా? ” .. “ ఇది నమ్మాలా? .. నమ్మకూడదా? ” అని సందేహం. మళ్ళీ మళ్ళీ అవే మాటలు. ఇంతలో పత్రీజీ “ OK ” అన్నారు.

అందరం కళ్ళు తెరిచాం. మొదటిగా నన్నే అడిగారు .. అనుభవం చెప్పమని. “ అసలే ధ్యానం కొత్త .. ధ్యానానుభవాలు ఎలా ఉంటాయో తెలియదు .. ఇలాంటి అనుభవాలు చెపితే అందరూ నవ్వుతారేమో ” అని సందేహం. అయినా సరే చూసింది చూసినట్టు చెప్పాలనిపించి చెప్పాను. “ నువ్వు గ్రేట్ మాస్టర్ ” అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చి “ రేపు ఉదయం 5.00 గంటలకు దివ్యారామంలో కలుద్దాం ” అన్నారు.

మేమందరం ఎవరి ఇళ్ళకు వారు చేరుకున్నాం. నాకు ఒకటే ఆలోచన .. ఆ అనుభవం గురించే .. 15 రోజులే కదా! తప్పకుండా ధ్యానం చేద్దాం అనుకున్నాను.

మరుసటిరోజు ఉదయం 5.00 గంటలకు “ దివ్యారామం ” చేరుకున్నాం. ధ్యానంలో అదే అనుభవం మళ్ళీ వచ్చింది. నాలో ఇంకా

పట్టుదల పెరిగింది. వ్యాపారంలో ఎంతో బిజీగా ఉన్నా కూడా గంటలు గంటలు ధ్యానం చేసేవాడిని. ఆ రోజుల్లో పత్రీజీ తిరుపతి వస్తే వారం లేక పది రోజులు ఉండేవారు. అప్పటికి కర్నూలు, గుంతకల్లు, అనంతపురంలలో మాత్రమే ధ్యానకేంద్రాలు ఉండేవి. నాల్గవ ధ్యానకేంద్రం తిరుపతి. ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు తెలియజేస్తూ గంటల గంటలు ధ్యానం చేయించేవారు.

**<u>మూడవ రోజు</u> :**

ధ్యానంలో కూర్చున్న వెంటనే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి .. ముఖద్వారం VVIP క్యూలో ముందుకు వెళ్తూ ఉన్నాను. ద్వారం దాటగానే ఖాళీ స్థలంలో నాకు ఎదురుగా నాకంటే ఎత్తుగా, అందంగా, ఎంతో తేజస్సుతో ఆ స్వామి నా ముందు నిలబడి .. నన్ను ముందుకు వెళ్ళకుండా ఆపి " నువ్వు నా దగ్గరికి రావలసిన పనిలేదు " అన్నారు. " అదేంటి స్వామీ?! లక్షలాదిమంది క్యూలో వెళ్తున్నారు " అని ఎడమవైపు వున్న క్యూ వైపు చూపించాను. నా మాటలు పట్టించుకోకుండా " ఈ జన్మలో నా వద్దకు రావలసిన పని లేదు .. పత్రి సార్ ఏం చెపితే అది చెయ్యి చాలు " అని చెప్పి అక్కడనుంచి వెళ్ళిపోయారు. నేను వెనక్కి వచ్చేసాను.

నాల్గవ రోజు నుంచి వరుసగా మూడురోజుల పాటు ధ్యానంలో కూర్చున్న వెంటనే సూక్ష్మశరీరంతో ఉన్న ఒకానొక మాస్టర్ వచ్చి నా సూక్ష్మశరీరాన్ని ఏదో ఒక అడవికి తీసుకువెళ్ళి .. ఆ అడవి అందాలు, సెలయేళ్ళు, కొండలు, కోనలు చూపిస్తూ త్రిప్పేవారు. నేను ఏమీ మాట్లాడే వాడిని కాదు.

మరుసటిరోజు కూడా అదే పరిస్థితి .. వెంటనే నేను " రోజూ ఇంతేనా?! .. ఇంకేం లేదా?! " అని అడిగాను. కాస్తంత దూరంలో చేయి చూపించి కాస్త మట్టి తీయమన్నారు. నేను కాస్త మట్టి తీసిన వెంటనే నా చేతికి ఒక చిన్న విగ్రహం తగిలింది. వెంటనే ఆ విగ్రహాన్ని తీసి మట్టి తుడిచాను. వెంటనే నాతో ఉన్న మాస్టర్ మరి ఆ విగ్రహం మాయమై .. " నేను అన్నమయ్యను .. నీకు నాలుగు సన్నివేశాలు చూపిస్తాను, వాటిని పద్యరూపంలో వినిపించగలవా?! " అన్న మాటలు మాత్రం వినబడ్డాయి. నేను " సరే " అన్నాను. నాలుగు సన్నివేశాలకు పద్యాలు చెప్పాను. ఆయన వెళ్ళిపోయారు. అప్పటినుంచి పదిహేనురోజులవరకు ప్రతి సన్నివేశం పద్యం రూపంలో వచ్చేది .. తరువాత యధాస్థితి ఉండేది.

## ***ఎనిమిదవ రోజు :***

ధ్యానంలో కూర్చున్న వెంటనే కైలాసంలో శివపార్వతుల వద్దకు వెళ్ళాను. పార్వతీదేవి ఎదురుగా కూర్చుని ధ్యానం చేయడానికి ఆమె అనుమతి ఇచ్చారు. అర్ధగంట అయ్యింది, అమ్మవారిని చూసాను. ఇక వెళ్ళమని సైగ చేశారు. నేను వచ్చి నా శరీరంలో ప్రవేశించాను. అప్పుడు పత్రీజీ ' OK ' చెప్పారు.

ఇలా నాలుగు రోజులు గడిచింది. ఐదవరోజు ధ్యానంలో కైలాసం వెళ్ళగా శివ మాస్టర్ .. " ఎప్పుడూ అమ్మగారేనా?!, నాతో మాట్లాడవా?!" అన్నారు. నేను భయంతో " అలా ఏంలేదు స్వామీ .. మీరు ఎలా చెప్తే అలా " అన్నాను. " అయితే నాతో రా! " అన్నారు శివ మాస్టర్. " మీతో వస్తే మా గురువు గారు ' OK ' చెప్తే ఎలా?" అన్నాను. " మీ గురువు గారు ' OK ' చెప్పరు .. నాతో రా " అన్నారు శివ మాస్టర్.

వెంటనే ఇద్దరం తిరుపతి కపిలతీర్థంలో ఉన్న శివాలయం గర్భగుడిలో ఉన్నాం. ఎదురుగా ఉన్న శివలింగాన్ని చూపించి " ఆ శివలింగాన్ని ఎత్తుకో " అన్నారు. " మూడు అడుగుల ఎత్తు ఉన్న ఆ శివలింగాన్ని నేను ఎలా లేపగలను? " అన్న సందేహంతో నాకు కుడివైపున వున్న ఆయన వంక చూసాను. " నువ్వు ప్రయత్నం చెయ్యవయ్యా " అన్నారు. రెండు అడుగులు ముందుకు వేసి నా రెండు చేతులూ వెడల్పు చేసి శివలింగంవైపు చాచాను. నా చేతులు దగ్గరవుతూ .. శివలింగం చిన్నదవుతూ .. రెండు అంగుళాల సైజులో పాలరాతి శివలింగం నా కుడి అరచేతిలోకి వచ్చింది.

ఏం చెయ్యాలో తెలియక ఆయన వైపు చూసాను. ఆయన " నీలోకి తీసుకో " అన్నారు. తలవంచి రెండు నిమిషాలు పాటు పాలరాతి శివలింగాన్ని చూసాను. మెల్లమెల్లగా శివలింగం నా వక్షస్థలం లోపలికి వెళ్ళింది. " ఇక వెళ్ళు .. మీ పత్రి సార్ ' OK ' చెప్తారు " అన్నారు. నేను వచ్చి నా శరీరంలో ప్రవేశించగానే పత్రీజీ ' OK ' చెప్పి " ఏం జరిగింది?" అన్నారు. జరిగినదంతా పత్రీజీకి వివరించాను. " కంగ్రాచ్యులేషన్స్ ! శివ మాస్టర్ నీకు ఆత్మలింగాన్ని ప్రసాదించారు " అన్నారు. జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని గొప్ప అనుభవం ఇది!

* * *

ప్రతిరోజూ ఏదో ఒక అనుభవం వచ్చేది. ఒకానొక రోజు ఒక పెద్దాయన నా హృదయ భాగంలో ఆలయాలలో వేసేటటువంటి పెద్ద తాళంతో లాక్ చేసి .. తాళంచెవి తీసుకెళ్తున్నారు. నేను అడిగినా సమాధానం

చెప్పలేదు. వెంటనే పత్రి సార్ ' OK ' చెప్పి " ఏమైంది? " అని అడిగారు. జరిగిన విషయం చెప్పగా మరొకసారి ధ్యానంలో కూర్చోబెట్టారు. నాకు అనుభవం రాలేదు కానీ .. నా ప్రక్కన వున్న వారికి అనుభవం వచ్చింది. " కేశవరాజు ప్రతిరోజూ ధ్యానంలో అధికంగా తిరుగుతూ ఎక్కువ ఎనర్జీ పోగొట్టుకుంటూ ఉన్నాడు. అందుకే రాంపా మాస్టర్ వచ్చి ' లాక్ ' చేసారు. అవసరమైనప్పుడు ఆయనే వచ్చి లాక్ తీస్తారు " అని చెప్పారు. అప్పటి నుంచి అనుభవాలు తగ్గాయి.



1994- D.కేశవరాజు, వారి కుమార్తె D.ఉష

# “ మొట్టమొదటి గురుపౌర్ణమి ”

1994 జూలై నెలలో గురుపౌర్ణమికి “ నందవరం ” రమ్మని సార్ చెప్పడంతో .. పత్రీజీ గురువుగారైన శ్రీశ్రీశ్రీ సదానంద యోగి గారి ఆశ్రమం అయిన నందవరం చేరుకున్నాం.

సమాధి వద్ద తక్కువ స్థలం ఉన్నందున అందరూ “ క్యూ ” కట్టారు. ఒక్కొక్క బ్యాచ్ 10 నిమిషాలు మాత్రమే సమాధివద్ద ధ్యానం చేసే అవకాశం ఉంది. నా వంతు వచ్చింది. నేను ధ్యానంలో కూర్చున్న వెంటనే ఆకాశం నుంచి ఒక పూలమాల వచ్చింది; ఆంజనేయస్వామి ఆ మాలను నా చేతికి ఇచ్చి సమాధిపై వేయమని చెప్పారు. నేను ఆ పూలమాలను సమాధిపై ఉంచాను. ఇంతలో పత్రీజీ “ OK ” చెప్పారు.


గురుపౌర్ణమి రాత్రి సదానందయోగి ఆశ్రమంలో పత్రీజీ సందేశాలు, ధ్యానం ఎంతో ఆత్మానందాన్ని కలిగించాయి. రాష్ట్ర నలుమూలల నుంచి మాస్టర్స్ రాకతో ఆశ్రమం కళకళలాడింది. నంద్యాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ S.P.Y. రెడ్డి గారు రాత్రంతా అక్కడే వుండి .. ధ్యానకార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉదయం అక్కడ నుంచి బయలుదేరి కర్నూలు చేరుకున్నాం. మొట్టమొదటిసారి “ కర్నూలు బుద్ధా పిరమిడ్ ” ను సందర్శించి, ధ్యానం చేశాం. PSSM లో మొట్టమొదటి పిరమిడ్‌కు స్థలదాత శ్రీ B.V. రెడ్డి గారు. 1991లో కర్నూలులో పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా పిరమిడ్ నిర్మించి ఇచ్చిన శ్రీ B.V. రెడ్డి గారికి శతకోటి ధ్యాన వందనాలు!

# " పత్రీజీతో మొట్టమొదటి ట్రెక్కింగ్ "

1995 సంవత్సరం తిరుమల తిరుపతిదేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మేము ఆస్థాన మండపంలో పత్రీజీ కార్యక్రమం ఏర్పాటు చేసాం.

మరుసటిరోజు నుంచి తిరుమల పార్క్‌లో ధ్యానం చేస్తూ మళయాళ స్వామి ఆశ్రమం(గోగర్భం డ్యాం) పార్వేటి మండపం, శిలాతోరణం మొదలైన ప్రదేశాలలో ధ్యానం చేసి చివరిగా " తుంబురు తీర్థం " వెళ్ళాం. ప్రకృతి అందాల నడుమ సహజసిద్ధంగా ఏర్పడిన తుంబురు తీర్థంలో స్నానం, ధ్యానం, పత్రీజీ సందేశాలతో ఒక రోజు గడిపి తిరుపతి చేరుకున్నాం.



1995- తిరుమల, తుంబురుతీర్థంలో పత్రీజీతో D.కేశవరాజు

# " యుద్ధగళ తీర్థం "

1996వ సంవత్సరం అక్టోబర్‌లో 5 రోజుల ట్రెక్కింగ్‌కు 200 మంది వచ్చారు.

మొదటిరోజు సాయంత్రానికి తిరుమల నుంచి పాపవినాశనం గుండా " అన్నదమ్ముల బండ " అనే చోటుకు చేరుకున్నాం. కుండపోత వర్షం .. రాత్రంతా ప్లాస్టిక్ పట్టాలు క్రిందా పైనా వేసి కూర్చొని ఉన్నాం. విపరీతమైన చలి, బట్టలు, బ్యాగులు తడిసిపోయాయి, రాత్రంతా నిద్రలేదు. ఉదయం 8.00 గంటలకు కొంతమంది తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. దానిని గమనించిన పత్రీజీ " జీవితం మీద ఆశ ఉంటే తిరిగి వెళ్ళండి ! ' ఏమైనా సరే .. పరవాలేదు ' అనుకుంటే నాతో రండి !" అన్నారు. దాదాపు వందమంది వెనుతిరుగగా, మిగిలిన వందమంది ఉదయం 10 గంటలకు పత్రీజీతో కలిసి ట్రెక్కింగ్‌కు బయలుదేరాం. వర్షం ఆగలేదు, సాయంత్రం వరకూ ప్రయాణించి ఒక వాగు ప్రక్క బండలపై కూర్చుని వున్నాం.

వాగు నిండుగా ప్రవహిస్తూ ఉంది. పాములు, తేళ్ళు, మండ్ర గబ్బలు ప్రవాహానికి కొట్టుకుని వస్తూ .. కొన్ని మేము ఉన్న బండ దగ్గర చేరాయి. మాతో ఉన్న గైడ్స్ టార్చ్ లైట్ వేసి చూసి " సార్ ! ఇక్కడ ఉంటే ప్రమాదం" అన్నారు. " మేము ధ్యానులం, పత్రీజీ మావెంట ఉన్నారు; అవి మమ్మల్ని ఏమీ చేయవు " అంటూ తడిసిన బట్టలు, బ్యాగులతో రాత్రంతా అక్కడే

గడిపాము. **భీమాస్ రఘు** గారు ముందుగానే ఈ పరిస్థితిని ఊహించారేమో! వారి హోటల్ సిబ్బందితో వారం రోజులు అయినా చెడిపోని విధంగా చపాతీ, కర్రీ రోల్స్‌గా తయారు చేయించి మాకు ఒక్కొక్కరికీ విడివిడిగా ప్యాక్ ఇచ్చారు. వాటిని తీసుకుని చాక్‌లెట్‌లలా తింటూ ప్రయాణం సాగిస్తున్నాం.

మూడవరోజు ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం వరకూ నడిచినా మా గమ్యం రాలేదు. నడుస్తూనే ఉన్నాం. తడిసిన బట్టలు, తడిసిన షూలతో నడిచీ, నడిచీ మా పాదాలు వాచిపోయాయి! నడక సాగడం లేదు .. ఓపిక నశించింది. " ఇక ముందుకు వెళ్ళలేం, తిరిగి వెనక్కి వెళ్ళిపోదాం" అనుకున్నా రెండున్నర రోజులు ప్రయాణం చెయ్యాల్సిందే. తప్పదు కనుక ముందుకే ప్రయాణం సాగించాం. చివరకు రాత్రి 7.00 గంటలకు ఒక తీర్థం చేరుకున్నాం. వర్షం మాత్రం ఆగలేదు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు వేసిన ఒక గుడిసెలోకి కొంతమంది వెళ్ళాం. వెంటనే పత్రీజీ మమ్మల్ని బయటకు రమ్మని, స్త్రీలను లోపలికి వెళ్ళమన్నారు.

అప్పటికే రెండురాత్రులు నిద్రలేదు. నడచి, నడచి అందరిలో సహనం నశించిపోయింది. దట్టమైన అడవి, అడవిగడ్డి మాకంటే ఎత్తుగా ఉంది. చుట్టుప్రక్కల జంతువుల అరుపులు .. దిక్కుతోచని స్థితి!

అందరం చలికి వణికిపోతున్నాం. రాత్రి 1.00 గంట ప్రాంతంలో పత్రీజీ తాము కప్పుకున్న శాలువా మరి జర్కిన్ తీసేసి అడవిగడ్డిపై వెల్లకిలా పడుకున్నారు. మేమంతా వింతగా చూస్తూన్నాం. అర్థగంట తర్వాత వర్షం తగ్గింది. మబ్బులు ప్రక్కకు వెళ్ళి .. పండు వెన్నెల, వర్షం నిలిచిపోయిన ఆనందంలో అందరం మైమరచి నిద్రపోయాం.

నాల్గవరోజు ఉదయం 7.00 గంటలకు నిద్రలేచాం. ప్రక్కనే పెద్దవాగు ప్రవాహం ఉధృతంగా ఉంది. అయినా ఆ వాగు దాటాలి. మాతో వచ్చిన గైడ్స్ ప్లాస్టిక్ రోప్ తీసుకుని వాగుకు ఇరువైపులా చెట్లకు కట్టారు. మొదటిరోజు నుంచి ఒక కుక్క మాతోనే వస్తూ ఉంది. తడిసి మోయలేకుండా ఉన్న బ్యాగులతో రోప్ పట్టుకుని అతి కష్టం మీద అవతలివైపు చేరుకున్నాం. మధ్యాహ్నానికి వర్షం తగ్గి సూర్యుడు కనబడ్డాడు. నాలుగురోజులకు గాను సూర్యుణ్ణి చూసింది ఆ రోజే. సాయంత్రానికి ఒకచోట బండలపై బసచేశాం. అందరం హాయిగా నిద్రపోయాం.

ఐదవరోజు ఉదయం 8 గంటల నుంచి నడుచుకుంటూ 10 గంటలకు కొండపై నుంచి చూడగా కడప-తిరుపతి బస్సురూటు వైపుకు వచ్చామని అర్థమయ్యింది. మధ్యాహ్నం 12 గంటలకు కొండ దిగి ..అక్కడ మామిడి తోటల్లో పని చేస్తూన్న రైతులని " రోడ్డు మీదకు వెళ్ళడానికి ఎంత సమయం పడుతుంది? " అని ఎంతో ఆత్రుతతో అడిగాం. నడవలేని స్థితిలో, అడుగులో అడుగులు వేస్తూ నడుస్తూన్న మమ్మల్ని చూసి " సాయంత్రం అవుతుంది " అన్నారు. వర్షానికి, ఆ నీళ్ళలో నడిచి నడిచి పాదాలు వాచిపోయి ప్రతి అడుగూ ఎంతో కష్టంగా ఉంది. అయినా మెల్లగా నడుస్తూనే ఉన్నాం.

సాయంత్రం 4 గంటలకు ఓపిక నశించింది. అక్కడ ఉన్న మామిడి తోటలో నుంచి ఖాళీగా ఒక ఎద్దుల బండి బయలుదేరింది. ఆ బండి అతనితో మాట్లాడి .. మా లగేజీలన్నీ బండిలో వేశాం. పత్రీజీని బండిలో కూర్చోబెట్టాం. బండి వెంబడి అతి కష్టంమీద మెయిన్ రోడ్డుకు చేరుకున్నాం.

హమ్మయ్య! అయిదురోజులు " యుద్ధగళ తీర్థం " అందరికీ చుక్కలు చూపించింది. " జీవితంలో ఇక ట్రెక్కింగ్‌కు వెళ్ళకూడదు " అనుకున్నాం.

ఇంటికి చేరుకున్న తరువాత రెండు రోజులు పాదాలకు ఆయిల్ పూసి, కాపడం పెడితే గానీ మళ్ళీ నడవలేకపోయాం. ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జీవితాంతం గుర్తుండేది " యుద్ధగళ తీర్థం " ట్రెక్కింగ్.

ఆ తరువాత శేషాచలం కొండలలో అనేకసార్లు అనేక ట్రెక్కింగ్‌లు చేసాం. వాటిల్లో తుంబురుతీర్థం, కుమారధార, రామకృష్ణతీర్థం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నవి. తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే సంవత్సరానికి ఒకసారి అధికారికంగా నిర్వహించే ట్రెక్కింగ్‌లు ఇవి.



2001- కర్నాటక, ఖుధిరేముఖ్‌లో .. పత్రీజీతో D.కేశవరాజు

# “ 1996 - జేసీస్ ప్రెసిడెంట్ ”

1983లో “ కేశవరత్న అడ్వర్‌టైజర్స్ ” అనే వ్యాపార సంస్థను ప్రారంభించిన నేను తిరుపతిలో ఉన్న 13 ఆర్గనైజేషన్స్‌లో మెంబర్‌గా ఉంటూ 1989లో తిరుపతి జూనియర్ ఛేంబర్ ప్రారంభించగా అందులో కూడా సభ్యుడిగా చేరాను. డైరెక్టర్‌గా, జాయింట్ సెక్రెటరీగా, వైస్ ప్రెసిడెంట్‌గా, ట్రెజరర్‌గా బాధ్యతలు అద్భుతంగా నిర్వహించడంతో నన్ను వారు 1994లో సెక్రెటరీగా ఎన్నుకోవడం జరిగింది. ప్రెసిడెంట్‌గా కంచి రఘురామ్, ట్రెజరర్‌గా M.M. స్వామి ఉండేవారు. దాంతో మమ్మల్ని తిరుపతి జూనియర్ ఛేంబర్‌లో ‘ Three Men Army ’ అని పిలిచేవారు. అదే సంవత్సరంలో పత్రీజీతో పరిచయం.

1994లో పత్రీజీ తిరుపతి వచ్చినప్పుడు వారం లేక పదిరోజులు ఉండేవారు. మా ఆర్గనైజేషన్ కార్యక్రమాలకు కూడా పత్రీజీని తీసుకుని వెళ్ళేవాళ్ళం. ఒకరోజు S.V. యూనివర్సిటీ ఆడిటోరియంలో అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యక్రమానికి పత్రీజీ, నేను, కంచి రఘురామ్, M.M. స్వామి వెళ్ళి కార్యక్రమం పూర్తి అయిన తరువాత రఘురామ్ గారి ఇంటికి వచ్చాం. శ్రీమతి లీల గారు టిఫిన్ తయారు చేయటానికి వంటింట్లోకి వెళ్ళారు. “ కాస్సేపు ధ్యానం చేద్దాం ” అని ప్రతీజీ చెప్పగా .. మేము ముగ్గురం ధ్యానంలో కూర్చున్నాం. కాస్సేపటికి తలుపు తట్టిన శబ్దం వచ్చింది. నేను

వెళ్ళి తలుపు తీయగా .. బయట ఉన్న అతను " ధ్యానం గురించి చెప్తారా?" అని అడిగారు. " ఇప్పుడు వీలు కాదు; ఇంకెప్పుడైనా రండి " అని నేను తలుపు వేశాను. కాస్సేపటికి పత్రీజీ " Ok " చెప్పి .. " ఏంటి అనుభవం?" అని అడిగారు.

" మీరు వచ్చినప్పుడు ధ్యానం తరగతులు పెట్టాలని ఎంత ప్రయత్నం చేసినా వీలుకావటం లేదు. అలాంటిది .. ఒకతను వచ్చి ధ్యానం గురించి అడిగితే ' వీలు కాదు, ఇంకెప్పుడైనా రండి ' అన్నాను. ఇది ఎంతవరకు కరెక్ట్ సార్ ? " అని అడిగాను.

" కేశవరాజు ! నువ్వు ఈ రోజు గురించి ఆలోచిస్తున్నావు. రాబోయే కాలంలో ప్రతి పిరమిడ్ మాస్టర్ ధ్యానం క్లాసులు నిర్వహిస్తూ తీరికలేక 'ఈ రోజుకాదు; ఇంకొకరోజు రండి ' అని చెప్పే రోజులు వస్తాయి " అని చెప్పారు. మనం ఈ క్షణం గురించి ఆలోచిస్తాం. పత్రీజీ పది సంవత్సరాల తరువాత జరిగేది మనకు తెలియజేస్తారు అనేది అక్షరసత్యం.

ఒకానొకరోజు సాయంత్రం అందరం సినిమా చూసి రాత్రి 9.00 గంటలకు రఘురామ్ గారి అన్నయ్య కంచి ప్రకాశం గారి ఇంటికి వెళ్ళాం. " అరగంట ధ్యానం చేద్దాం! " అన్నారు పత్రీజీ. ధ్యానానికి కూర్చున్న వెంటనే " నేను ధ్యానం సరిగ్గా చేస్తున్నానా? లేదా? నాకు వచ్చే అనుభవాలు, సూక్ష్మశరీర యానం, దివ్యచక్షువు ద్వారా చూసేవి నా ఊహలేమో! నాకు ఎనర్జీ సరిపోవడం లేదేమో .. నాకు ఎనర్జీ ఇవ్వండి గురూజీ " అని మనస్సులో అనుకున్నాను. వెంటనే ఎక్కడెక్కడికో తిరుగుతున్నాను. ఏవేవో అనుభవాలు వస్తున్నాయి. కాస్సేపటికి పత్రీజీ " OK " చెప్పారు. అందరూ లేచి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని టిఫిన్ తింటున్నారు.

నాకు అంతా తెలుస్తోంది కానీ ధ్యానంలో నుంచి లేవలేకపోతున్నాను. రఘురామ్ నా దగ్గరికి వచ్చి " OK " - " OK " అని రెండు సార్లు అన్నారు. అయినా లేవలేకపోతున్నాను. " కాస్సేపటి తరువాత కేశవరాజు లేస్తాడులే!" అని పత్రీజీ అన్నారు. నేను ఎంత ప్రయత్నించినా కళ్ళు తెరవలేకపోతున్నాను .. మరి చేతులు విడదీయలేకపోతున్నాను. ఇంతలో నాకు గుర్తు వచ్చింది. నా ఎనర్జీతో నేను బయటకు వెళ్ళలేదు, గురువు గారిని ఎనర్జీ అడిగి బయటకు వెళ్ళాను కాబట్టి " నేను లేవడానికి కూడా తిరిగి ఎనర్జీ అడగాల్సిందే " అనుకుని " గురువు గారు ! నేను లేవడానికి నాకు ఎనర్జీ ఇవ్వండి " అని అనుకున్నాను.

వెంటనే కళ్ళు తెరిచాను; చేతులు విడిపోయి ధ్యానస్థితి నుంచి లేచి సార్ దగ్గరకు వెళ్ళాను. " ఎప్పుడైనా ఎవరికి వారు ఎనర్జీ సంపాదించుకోవాలే కానీ ఇలాంటి ప్రయత్నం ఎప్పుడూ చేయవద్దు" అని పత్రీజీ తెలియజేసారు.

కాబట్టి మనం గంటలు గంటలు ధ్యానం చేసి ఆత్మశక్తిని కూడగట్టుకోవాలి.

* * *

1994లో జేసీస్ కార్యక్రమాలు, తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించాం. 1995లో పూర్తిగా ధ్యానకార్యక్రమాలకే అంకితమయ్యాను. అక్టోబర్‌లో మా జేసీస్ సభ్యులు 1996 లో జేసీస్ ప్రెసిడెంట్‌గా నన్ను ఉండమని చెప్పారు. నేను, కంచి రఘురామ్ పత్రీజీని అడగగా సార్ వద్దని చెప్పారు. నేను విరమించుకోవడంతో .. మా స్నేహితులు " ధ్యాన కార్యక్రమాలు కూడా జేసీస్ ద్వారా రాష్ట్రమంతటా ప్రచారం చేయవచ్చు; వచ్చిన అవకాశాన్ని వద్దనకండి " అని తెలియజేశారు. " ఈ ఆలోచన బాగానే ఉంది కదా " అని మళ్ళీ పత్రీజీని అడిగాం. పత్రీజీ

“ సరే ” అన్నారు. అయితే ఏకగ్రీవంగా కాకుండా ఎలెక్షన్ నిర్వహించవలసి వచ్చింది.


ఎలెక్షన్‌లో గెలవడం 1996లో జూనియర్ ఛాంబర్ ఇంటర్‌నేషనల్ (జేసీస్), తిరుపతి ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించి అనేక సాంఘిక సేవా కార్యక్రమాలతో పాటు ధ్యాన కార్యక్రమాలు నిర్వహించి జాతీయ స్థాయిలో అవార్డులు పొందడమే కాక జేసీస్‌లో ఉత్తమ సేవకు గాను ***“ కమల పత్ర ”*** అవార్డును తిరుపతి MLA, TTD EO, S.V.యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ల చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది.

1996 సంవత్సరంలో ప్రతి జేసీస్ కార్యక్రమంలోనూ ధ్యాన విశిష్టత గురించి తెలియజేసాం.

1994లో పత్రీజీతో పరిచయానికి ముందు 13 ఆర్గనైజేషన్స్‌లో ఉన్న నేను మెల్లమెల్లగా అన్ని ఆర్గనైజేషన్స్‌నూ వదులుకుని “ PSSM ” లో స్థిరపడ్డాను. అంతవరకూ దేనికోసమో వెతికిన నేను “ PSSM ” లోకి వచ్చిన తరువాత “ ఇంక ఏమీ వెతకాల్సిన పనిలేదు; అంతా ‘ PSSM ’ లోనే ఉంది ” అని గ్రహించి పత్రీజీ ఏం చెప్తే అదే నా కర్తవ్యంగా భావించి “ ఆయన సూచన మేరకు నడుచుకుంటే జీవితం ధన్యం అవుతుంది ” అనే సత్యాన్ని గ్రహించాను.

# " సుబ్బరత్నతో ..

# వివాహం "



1972లో తిరుపతి S.V. జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ చదువుతూన్న రోజులలో " హిందీ డౌన్ డౌన్ " అనే నినాదంతో విద్యార్థి సంఘాలు ఆరునెలలపాటు స్ట్రైక్ చేసారు. అప్పుడు తిరుపతి నుంచి మా స్వగృహమైన ముప్పాలవారి ఇళ్ళు(అబ్బికండ్రిగ) చేరుకున్నాను.

మా మేనమామ(మా అమ్మకు అన్నయ్య) రెండవ కుమార్తె సుబ్బరత్నకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. మా నాన్న గారు కూడా కొన్ని సంబంధాలు చూసారు. ఏ సంబంధాలు కుదరటం లేదు. అప్పుడు సుబ్బరత్న మా నాన్నగారితో " ఏంటి మామగారు! పెళ్ళి సంబంధాలు ఎక్కడెక్కడో చూడటం ఎందుకు? .. మీ ఇంటిలోనే పెళ్ళికొడుకు ఉండగా! " అన్నదట. అప్పుడు మా నాన్నగారు ఆలోచనలో పడ్డారు! " ఇంకా చదివించాలి; మంచి ఉద్యోగంలో చేర్పించాలి .. అప్పటి వరకు కేశవరాజుకు పెళ్ళి చేయకూడదు" అని. ఇదే విషయాన్ని మా కుటుంబం(అమ్మ, నాన్న, అన్నయ్య, అక్క, నేను) మాట్లాడుకున్నాం. " స్ట్రైక్ వల్ల ఒక సంవత్సరం చదువు పాడైంది, అమ్మ, నాన్నకు ఇప్పటికే వ్యవసాయంలో తోడుగా ఉన్నావు .. ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు " అని మా బంధువులు అన్నారు.

" బాగా చదువుకుని అడ్వకేట్ అవ్వాలి లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అవ్వాలి " అని కలలు గన్న నేను ఆలోచనలో పడ్డాను. " విధి

ఎలా నిర్ణయించి ఉంటే అలా జరుగుతుందిలే .. అందరి నిర్ణయం మేరకు పెళ్ళి చేసుకుందాం; పెళ్ళి తరువాత అయినా చదువుకోవచ్చుకదా ” అనుకుని పెళ్ళికి “ ఓకే ” చెప్పాను. 1973 ఫిబ్రవరిలో పెళ్ళి జరిగింది.

పెళ్ళి తరువాత చదువుకోవాలన్న ఆలోచన మారింది. మా అన్నయ్య TTD లో ఉద్యోగం, తిరుపతిలో కాపురం ఉంటున్నారు. మా అక్కయ్య, బావ చిత్తూరు జిల్లా, విజయపురం మండలంలో ఉంటున్నారు. ఇక ఇంటి వద్ద అమ్మ, నాన్న, నేను, సుబ్బరత్న మాత్రమే. “ ఇక చదువు వద్దు, ఉద్యోగం వద్దు .. అమ్మ నాన్నకు తోడుగా ఇంటివద్దనే ఉందాం ” అని నిర్ణయించుకున్నాం.

నా స్నేహితుడు “ రమణ ” చెన్నై ఫ్రూట్ మార్కెట్‌లో అరటిపండ్లు హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ ఉండేవాడు. నేను చెన్నై వెళ్ళినప్పుడు అతనిని కలిసాను. ఇద్దరం కలిసి బందరు వీధిలో అన్ని రకాల పండ్లు హోల్‌సేల్ వ్యాపారం చేద్దాం రమ్మన్నాడు. అలాగే ఇద్దరం కలిసి రమణ అరటిపండ్లు మార్కెట్‌లో తన వ్యాపారం, నేను బందరు వీధిలో పండ్ల వ్యాపారం ప్రారంభించాం. చిన్నచిన్న వ్యాపారం చేసుకునే వారికి అప్పు ఇవ్వాలి. సాయంత్రం వెళ్ళి వసూలు చేయాలి. నాకు క్రొత్త ప్రదేశం, తమిళం సరిగ్గా రాదు. అయినా మన మంచితనంతో రెండు సంవత్సరాలు బాగా జరిగింది. తర్వాత నష్టాలు రాగా బందరు వీధిలో హోల్‌సేల్ పండ్లదుకాణం మానుకుని మా పల్లెటూరుకి చేరుకున్నాను.

నాగపూర్ వారి “ అంకుర్ సీడ్స్ ” కంపెనీ మా ఏరియాలో రైతులతో జొన్నలు, సజ్జలు హైబ్రిడ్ రకాలు పండించి తర్వాత వాళ్ళే కొనుగోలు చేస్తారు. మా పొలంలో కూడా జొన్న పైరు నాటాం. పంట పర్యవేక్షణకు అంకుర్ సీడ్స్ తరఫున నాగపూర్ నుంచి ఫీల్డ్ ఆఫీసర్ దివాలీ, కంపెనీ

డైరెక్టర్ విచ్చేసారు. అప్పుడే వారితో పరిచయం! తరువాత వారు నన్ను అంకుర్ సీడ్స్‌లో చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జిగా నియమించారు. నేను చేరకముందు 40 ఎకరాలలో మాత్రమే వాళ్ళు సీడ్స్ ఇచ్చారు. నేను చేరిన తరువాత ఒక సంవత్సరంలో 400 ఎకరాలు, రెండవ సంవత్సరంలో 650 ఎకరాలలో హైబ్రిడ్ సీడ్సు పంపిణీ చేసి మంచి దిగుబడి సాధించాం. రైతులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి.

ప్రతిరోజూ 250 నుంచి 350 కి.మీ. మోటార్‌సైకిల్ ప్రయాణం, పొలాలలో తిరుగుతూ .. పంటలను పర్యవేక్షిస్తూ ఉదయం 5 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు తిరుపతి ఆఫీస్‌కు చేరేవాళ్ళం. మూడవ సంవత్సరం అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయి. తిరుపతి ఆఫీస్ కర్నూలుకు మార్చారు. నన్ను కర్నూలు, హైదరాబాద్ లేక నాగపూర్ ఏదో ఒక ఆఫీస్‌లో చేరమని చెప్పారు. పిల్లల చదువులకోసం పల్లెటూరు నుంచి తిరుపతికి కాపురం మార్చాం. “చాలీచాలని జీతాలతో అటు ఇటూ ఏం తిరుగుతాంలే ” అని ఉద్యోగం వదులుకున్నాను. “ ఇంకేం చెయ్యాలి? తిరుపతిలోనే స్వంతంగా ఏదో ఒక వ్యాపారం చెయ్యాలి ” అనుకున్నాను. నా స్నేహితుడు “ ఏదైనా ఒక పెద్ద వ్యాపారం చెయ్యాలి అంటే లక్షలలో పెట్టుబడి పెట్టాలి; మరి నీ దగ్గర డబ్బు లేదంటున్నావు కాబట్టి చికెన్ షాపు పెట్టు, నువ్వు కౌంటర్‌లో కూర్చో చాలు. కోళ్ళను అప్పు ఇస్తారు, చంపేవాడు, నరికేవాడు వస్తాడు. వాళ్ళకు రోజు కూలీ ఇస్తే చాలు. సాయంత్రానికి కోళ్ళు సప్లై చేసిన వారికి కూలివాడికి ఇవ్వగా మిగిలింది నీకే. ఎలాంటి రిస్క్, నష్టం ఉండదు ” అని చెప్పాడు. నేను “ సరే ” అన్నాను.

అదేరోజు తిరుపతిలో టౌన్‌క్లబ్ సర్కిల్‌లో ఒక షాపు చూసాం. షాపు మంచి సెంటర్‌లో ఉంది. బాడుగ కూడా మాట్లాడుకున్నాం. అతను అడ్వాన్స్ ఇమ్మన్నాడు. ఆ రోజు మంగళవారం కావడం వల్ల " అడ్వాన్స్ రేపు వచ్చి ఇస్తాను " అని ఇంటికి వెళ్ళాను. ఆరోజు రాత్రి కలలో నేను భోజనం చేయటానికి కూర్చున్నాను. ప్లేటులో రైస్ పెట్టారు, ప్లేటు ప్రక్కన సాంబారు గిన్నె ఉంది. సాంబారు వేసుకోవడానికి నా చెయ్యి సాంబారులో ఉన్న గరిటెను పట్టుకుంది. అంతలో ఒక చెయ్యి గ్లాసులో రక్తం తీసుకువచ్చి అన్నంలో పోసి చకచకా అన్నం కలిపి " ఇక తిను " అన్న మాటలు వినబడ్డాయి. నేను ఉలిక్కిపడ్డాను, " రక్తం కూడు తినటం ఏమిటి?" అనుకుంటూంటే మెలకువ వచ్చింది.

" ఇన్ని సంవత్సరాలు మాంసం తిన్నా కూడా రాని కల ఇప్పుడు వచ్చింది అంటే ఏదో తప్పు చేస్తున్నాను '' అని అలోచించి " నేను చికెన్ షాపు పెడితే రక్తం కూడు తిన్నట్లే " అని మాస్టర్స్ సందేశం కావచ్చు; " రక్తపు కూడు నాకు వద్దు .. చికెన్ షాప్ పెట్టను " అని నిర్ణయం తీసుకున్నాక నిద్రపట్టింది.

తర్వాత ఆలోచించి " ఎవ్వరికీ హాని చేయకుండా .. కొంతమందికైనా మేలు చేసేలాగా ఏదైనా మంచి బిజినెస్ చెయ్యాలి " అనుకుని " కేశవరత్న అడ్వర్‌టైజర్స్ " అని స్వంతంగా వ్యాపార ప్రకటనల సంస్థ ప్రారంభించాను. దీని ద్వారా తిరుపతి మరి చిత్తూరు జిల్లాలో అనేక వ్యాపార సంస్థలకు ప్రకటనలు ఇచ్చి అందరికీ సుపరిచితుడయ్యాను. తద్వారానే 13 ఆర్గనైజేషన్స్‌లో అనేక పదవులు పొందాను.

* * *

ఇటు వ్యాపారంలో అటు ఆర్గనైజేషన్స్‌లో ఎంతో బిజీగా ఉన్న నేను కుటుంబం, పిల్లలు గురించి అస్సలు పట్టించుకునే వాడిని కాదు. కానీ ఏ లోటూ లేకుండా నా భార్య " సుబ్బరత్న " .. పిల్లల విషయంలోనూ, వారి చదువుల విషయంలోనూ, బంధువుల విషయంలోనూ ఎంతో శ్రద్ధ వహించి ప్రేమతో అందరి మన్ననలు పొంది ఆప్యాయత, అనురాగాలకు మారుపేరుగా నిలిచి అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి తన భూలోక యాత్రను 11, ఆగస్టు 1997వ తేదీన పూర్తిచేసింది.

## పత్రీజీకి గృహప్రవేశ ఆహ్వానం

1995 మే నెలలో తిరుపతి రాయల్‌నగర్‌లో " కేశవరత్న నిలయం" స్వంత ఇంటిని పత్రీజీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకున్నాం. గృహప్రవేశ పత్రికను అందరికీ పంపినట్లుగానే బుద్ధపిరమిడ్ ధ్యానకేంద్రం, కర్నూలుకు పత్రీజీ పేరు మీద పంపాను.

మేము ఎప్పుడూ సత్యనారాయణ వ్రతం చేయలేదు. నా భార్య కోరిక మేరకు గృహప్రవేశానికి మామిడి తోరణాలు, అరటిచెట్లు తెప్పించి ఇంటిముందు కట్టాం. అంతేకాకుండా సత్యనారాయణ వ్రతం కోసం 108 తెల్లకలువ పువ్వులు తెప్పించి ఇక పూజకు కూర్చోబోతూన్న సమయంలో పత్రీజీ ఆటోలో మా ఇంటి ముందు దిగారు. అందరికీ ఆశ్చర్యం .. మామూలుగా పత్రిక పంపాం; పత్రీజీ వచ్చేసారు. " పూజ " అంటే పత్రీజీకి నచ్చదు, ఇప్పుడు ఏం చెయ్యాలి? అన్నీ కంటికి ఎదురుగా కనబడుతున్నాయి. " కేశవరాజు ! పూజా కార్యక్రమం ముగించుకుని రా! " అని పత్రీజీ పిరమిడ్ మాస్టర్లతో పందిరికింద కూర్చున్నారు. పూజ, సత్యనారాయణ వ్రతం పూర్తి అయిన వెంటనే నేను సార్ దగ్గరకు వచ్చి కూర్చున్నాను.

" ఏమయ్యా కేశవరాజు ! చెట్లు నరకవచ్చునా? పూలు కోయవచ్చునా? నీటిలో అందంగా ఉండే కలువలు త్రెంచవచ్చునా? .. చూడు అరటి పిలకలు, మామిడి ఆకులు, కలువ పువ్వులు ఎలా ఎండి పోతున్నాయో; అవి విలవిలలాడితే నువ్వు ఎలా ఆనందంగా ఉండగలవు? ఇంక ఎప్పుడూ ఇలా చెయ్యకు. గృహప్రవేశ ఆహ్వానపత్రిక తీసుకురా " అన్నారు. పత్రిక తీసుకుని సార్‌కు ఇవ్వగా .. " ఎన్ని పత్రికలు పంచావు ? " అన్నారు. " మూడువందలు పంచాను సార్ " అన్నాను. " ఒక వారం నేను తిరుపతిలోనే ఉంటాను; మళ్ళీ ' సత్యనారాయణ వ్రతం ' అని ప్రింట్ చేసి అందరికీ పంచు; ఆ రోజున నేను వచ్చి సత్యనారాయణ వ్రతం గురించి చెప్తాను " అన్నారు. అలాగే అందరికీ పంచాను. మనవాళ్ళేమీ తక్కువ వారు కాదు కదా! " పత్రీజీ ఉంటే ఏ చిన్న తప్పుచేసినా తిడతారు .. పూజలు అంటే నచ్చదు" అని ఇరవై మంది మాత్రమే వచ్చారు. పత్రీజీ తనదైన శైలిలో " ' పూజ ' అంటే ఏమిటి, ' సత్యనారాయణ వ్రతం ' అంటే ఏమిటి? " అని అద్భుతంగా వివరించారు. పత్రీజీ గృహప్రవేశానికి రావడం ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగించడమే కాక మా జన్మ ధన్యం అయ్యిందని సంబరపడ్డాం.

మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. 1995 లో స్వంత ఇంటి కల నెరవేరడంతో మొదటి కుమార్తె " ఉష " వివాహం " మధు " తో తిరుత్తణిలో 15, సెప్టెంబర్ 1996 లో బ్రహ్మర్షి పత్రీజీ మరి పిరమిడ్ మాస్టర్లు, బంధువుల సమక్షంలో అద్భుతంగా నిర్వహించుకున్నాం. త్వరత్వరగా భాద్యతలు పూర్తిచేసుకుని ధ్యానప్రచారానికే పూర్తి సమయాన్ని కేటాయించాలని నిర్ణయించుకున్నాను.

# “ ‘ సుబ్బరత్న ’.. అనంత లోకాలకు .. ”

నా సతీమణి సుబ్బరత్న ఎంతో ఆరోగ్యంగా ఉంటూ పిల్లల విషయంలోనూ, అత్తమామల విషయంలోనూ, బంధువుల విషయంలోనూ ఎంతో ఆప్యాయతగా ఉంటూ అందరి మన్ననలు పొందింది.

1997 మే నెల 20వ తేదీ ఉదయం 5 గంటలకు “ ఛాతీలో నొప్పిగా ఉంది ” అని చెప్పగా మా ప్రక్కవీధిలో ఉన్న మా ఫ్రెండ్ డా॥ ఉదయ్ కుమార్‌ను ఇంటికి తీసుకువచ్చాను. ఆయన చూసి “ ఆమెకు గుండెపోటు వచ్చింది; వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్ళండి ” అని చెప్పారు. మా ఇంటిపైన కాపురమున్న ఆంధ్రబ్యాంక్ మేనేజర్ గారు, వాళ్ళ అబ్బాయి వెంటనే వాళ్ళ కారు సిద్ధం చేసారు. 10 నిమిషాల వ్యవధిలోనే హాస్పిటల్‌కు బయలుదేరి వెళ్ళాం. అర్థగంటలోపే రుయా హాస్పిటల్ కార్డియాలజీ ICU లో చేర్పించాం. అక్కడ నాకు సుపరిచితులైన డా॥ సుబ్రమణ్యం గారు, కార్డియాలజీ డిపార్ట్‌మెంటు హెడ్, వెంటనే చికిత్స ప్రారంభించారు. అన్ని పరీక్షల అనంతరం “ ఆమెకు గుండె 65 శాతం దెబ్బతింది కాబట్టి ఎలాంటి ఆపరేషను చేయలేము; మందులతో కొంత వరకు నయమైతే అప్పుడు బైపాస్ చేయవచ్చు ” అని డాక్టర్ తెలియజేసారు.

మా రెండవ కుమార్తె “ నాగమణి ” తన తల్లి దగ్గరే ఉంటూ ఏ సమయంలో మందులు ఇవ్వాలో చూసుకునేది. ICU లో పేషెంట్ దగ్గర

ఒకరికంటే ఎక్కువ ఉండకూడదు కాబట్టి నేను బయటే ఉండి కావలసినవి తెచ్చి ఇచ్చేవాడిని.

నేను ధ్యానం చేద్దామని కూర్చుంటే " ధ్యానంలో ఆమె ఎక్కువ రోజులు బ్రతకదు " అని మెస్సేజ్ వచ్చేది. నేను వాళ్ళను " చిన్న పిల్లలు .. వాళ్ళను ఎవరు చూసుకుంటారు? వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలి; ఆమె చిన్న వయస్సులో చనిపోతే నాకు చాలా కష్టమైపోతుంది. కాబట్టి ఎలా అయినా బ్రతికించండి" అని బ్రతిమిలాడే వాడిని. వాళ్ళు " నువ్వు ఏం చేసినా రెండు మూడు నెలల కంటే ఎక్కువ బ్రతకదు " అనే వాళ్ళు. " కనీసం మూడు సంవత్సరాలైనా బ్రతికించండి " అని వేడుకునేవాడిని.

పత్రీజీ హాస్పిటల్‌కు వచ్చారు. అర్ధగంట ఆమెతో మాట్లాడి వెళ్ళారు. ఇలా ముప్ఫై ఐదు రోజులు గడిచాయి. రుయా హాస్పిటల్‌లోనే ఉన్నాం. " చెన్నైలో ఏదైనా పెద్ద హాస్పిటల్‌లో చేర్పించండి " అని మా బంధువులూ, స్నేహితులూ చెప్పడంతో డాక్టర్ సుబ్రమణ్యం గారిని సలహా అడిగాం. " మీ ఇష్టం .. ఎక్కడికి వెళ్ళినా ఇదే చికిత్స; మీరు ఎక్కడికి తీసుకువెళ్ళినా కారులో గానీ, బస్సులో గానీ తీసుకెళ్ళకూడదు. ట్రైన్‌లో మాత్రమే తీసుకెళ్ళాలి" అన్నారు. అప్పుడు మన పిరమిడ్ మాస్టర్ డాక్టర్ యుగంధర్ గారు తిరుపతి మెడికల్ కాలేజీలో చదువుతూ ఉండేవారు. " మనతో డాక్టర్ ఉంటే మంచిది " అని .. డా॥ యుగంధర్‌ని అడిగితే వెంటనే వస్తానని చెప్పారు. మా చిరకాల స్నేహితుడైన కొండేటి చంద్రశేఖర్ గారితో విషయం చెప్పగా " చెన్నై విజయ హాస్పిటల్‌లో కార్డియాలజీ విభాగ అధిపతి డాక్టర్ K.N. రెడ్డి గారికి ఫోన్‌లో మీ విషయం గురించి చెబుతాను; మీరు విజయ హాస్పిటల్‌కు వెళ్ళండి " అన్నారు. మేము ఉదయం 10 గంటలకు

సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి చెన్నై వెళ్ళాం. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు విజయ హాస్పిటల్ నుంచి అంబ్యులెన్స్ వచ్చింది. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాం. వాళ్ళు ICU లో చికిత్స ప్రారంభించారు.

హాస్పిటల్ దగ్గరలో ఉండటానికి ఒక రూమ్ తీసుకున్నాం. రాత్రి సమయాల్లో మెడిటేషన్ చేస్తూంటే " ఎక్కడికి వెళ్ళి చికిత్స చేయించినా 'ఆమె బ్రతకదు ' అని చెప్పినా మళ్ళీ ఇంత దూరం తీసుకొచ్చారు. ఎంత శ్రమ, ఎంత ఖర్చు! మా మాటలపైన నమ్మకం లేదా? " అని ఆస్ట్రల్ మాస్టర్స్ అనే వాళ్ళు. " లేదు స్వామీ .. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేర్చమని సుబ్బరత్న కూడా కోరడం వల్ల తీసుకువచ్చాం. ఎలాగైనా బ్రతికించండి " అని కోరినా .. " ఏమీ లాభం లేదు! ఆమె డిజైన్ అంతే .. ఏం చేసినా బ్రతికించుకోలేవు" అని చెప్పేవారు. రోజులు గడుస్తున్నాయి .. చికిత్స కొనసాగుతూన్నా ఏమాత్రం మార్పులేదు.

ఒకరోజు డాక్టర్ K.N. రెడ్డి గారి స్నేహితుడు అమెరికాలో పేరుగాంచిన కార్డియాలజిస్ట్ ఆ హాస్పిటల్‌కు వచ్చారు. డాక్టర్ K.N. రెడ్డి గారు ఆ డాక్టర్‌ను సుబ్బరత్న ఉన్న వార్డుకు తీసుకు వచ్చారు. ఆయన సుబ్బరత్నను పరీక్షించి .. " కోటిమందిలో ఒకరికి ఇలాంటి జబ్బు వస్తుంది. ఏ మందులూ పనిచేయవు. కేశవరాజు నీ స్నేహితుడు అంటున్నావు. డబ్బులు వృథా. డిశ్చార్జి చేసి పంపించేయండి " అన్నారు. అంతవరకూ ఉన్న నమ్మకం ఇంకా సన్నగిల్లింది. మరుసటిరోజు తిరుపతి వచ్చేశాం. మళ్ళీ రెండు సార్లు తిరుపతి హాస్పిటల్‌లో చేర్పించాం. రెండవసారి హాస్పిటల్‌లో ఉండగా పత్రీజీ హాస్పిటల్‌కు వచ్చి సుబ్బరత్నతో మాట్లాడారు. సార్ సమక్షంలో సుబ్బరత్న అరగంట ధ్యానం చేసింది. తరువాత హాస్పిటల్ బయట గార్డెన్‌లో సార్

నాకు " జీవితం అంటే ఏమిటి? " .. " మరణం అంటే ఏమిటి? " .. " మరణం తరువాత జీవితం " లను గురించి వివరించారు.

" ఇన్ని రోజులుగా చెప్పని విషయాలు పత్రీజీ వివరిస్తున్నారు అంటే సుబ్బరత్న వెళ్ళిపోయే సమయం ఆసన్నం అయ్యింది" అని నేను గ్రహించాను. ఆ రాత్రి ఒక కల వచ్చింది. ఇద్దరు డాక్టర్లు సుబ్బరత్నను పరీక్షించి ఆపరేషన్ చేసారు. వాళ్ళు వెళ్తూ నా భుజం తట్టి వెళ్ళారు. ఆ తరువాత రెండురోజులు చాలా ఉత్సాహంగానూ, ఆరోగ్యంగానూ ఉన్న సుబ్బరత్న మూడవరోజు మళ్ళీ నీరసంగా ఉంది. అంటే నా విన్నపం విన్న ఆస్ట్రల్ మాస్టర్స్ ప్రయత్నం కూడా సఫలీకృతం కాలేదు అని ఋజువైంది. డెబ్బై రోజులుగా ఇంజెక్షన్స్, మాత్రలు, టానిక్‌లు, రక్త పరీక్షలు ఇలా ఎన్ని చేసినా ప్రయోజనం శూన్యం.

71వ రోజు రాత్రి నా కలలో సుబ్బరత్న మరుసటిరోజు రాత్రి 1.30 గంటలకు చనిపోతున్నట్లు, శవాన్ని తీసుకెళ్ళిన కారు నెంబరు, కారు కలర్, ఇంటి వద్ద వచ్చిన బంధువులు, అంత్యక్రియలు జరిగే సమయం, ఊరేగింపు మొత్తం క్లియర్‌గా కనబడింది.

నేను కలలో చూసిన విధంగానే 72వ రోజు అర్ధరాత్రి 1.30 గంటలకు సుబ్బరత్న తన భౌతిక శరీరాన్ని వదలి వెళ్ళింది. కలలో చూసిన విధంగానే అన్ని కార్యక్రమాలు జరిగిపోయాయి. రెండవరోజు నుండి పదిరోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు గంటల పాటు ధ్యానం మరి ఊజా బోర్డు వేసేవాళ్ళం. మూడవరోజు ఊజాబోర్డు వేసి సుబ్బరత్నని ఆహ్వానించాం. సుబ్బరత్న ఆత్మ వచ్చి " నన్ను ఎందుకు పిలిచారు?" అని ప్రశ్నించింది. " కేశవరాజుని ఒంటరిగా చేసి ఎందుకు వెళ్ళావు? " అని ప్రశ్నించాం. ఊజాబోర్డు వేయడంలో తిరుపతి పిరమిడ్ మాస్టర్ శేఖర్ మంచి ప్రావీణ్యత కలవాడు. వెంటవెంటనే

సమాధానం వచ్చేది. " నా అజెండా అయిపోయింది కాబట్టి నేను వెళ్ళిపోయాను. నేను ఇక్కడ హాయిగా ఉన్నాను. నా జీవితాన్ని ' రివ్యూ ' చేసుకుంటున్నాను. నన్ను ఇక పిలవకండి, నేను రాను " అని సమాధానం వచ్చింది.

నాలుగురోజుల తరువాత మళ్ళీ ఊజాబోర్డు వేశాం. అప్పుడు కూడా సుబ్బరత్నను ఆహ్వానించగా ఆమె రాలేదు. ఇంకొక మాస్టర్ వచ్చి " సుబ్బరత్న గారి ఆత్మ రావడానికి ఇష్టం లేదు. ఆమె ఆత్మ మంచి స్థితిలో ఉంది. ఆమెను ఎప్పుడూ ఆహ్వానించకండి. ఆమె తరఫున నేను వచ్చాను. ఉన్నత స్థాయిలో ఉన్న ఆత్మలు రావడానికి ఇష్టపడరు " అని తెలపడంతో తరువాత ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు.

24 వసంతాలపాటు నా సతీమణిగా ఉండి, ముగ్గురు పిల్లలకు తల్లిగా కుటుంబభారాన్ని మోస్తూ బంధువులకూ, స్నేహితులకూ ఎంతో ప్రేమానురాగాలను పంచి అత్తమామలకు తన కన్నతల్లితండ్రుల కంటే ఎక్కువగా ప్రేమను పంచి .. ముసలి వయస్సులో ఉన్న వారికి ఎంతో సేవ అందించిన సుబ్బరత్న .. 11 ఆగస్టు 1997లో తన భౌతిక శరీరాన్ని వదలి అనంతలోకాలకు వెళ్ళిపోయింది.



1990-తిరుమల పార్క్‌లో .. D.కేశవరాజు కుటుంబంతో

# " రెండవ వివాహం "

సుబ్బరత్న చనిపోయిన తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకోమని స్నేహితులు, బంధువులు తొందరపెట్టేవారు. " పిల్లలకు పెళ్ళిళ్ళు అయిన తర్వాత వాళ్ళు సంసారాలు వాళ్ళకు ఉంటాయి. నీకంటూ తోడు ఉండాలి కాబట్టి నా మాట విని పెళ్ళిచేసుకో " అని మా చిన్నాన్న వెంకటరామరాజు చెప్తూ ఉండేవారు. ఇలా పత్రీజీ వరకూ ఈ విషయం వెళ్ళింది." కేశవరాజును పెళ్ళి చేసుకోమని చాలామంది తొందరపెడ్తున్నారు; అయినా కేశవరాజు వద్దంటున్నాడు " అని తిరుపతి మాస్టర్స్ తెలుపగా .. దానికి పత్రీజీ " ఇంకా కొంతకాలం ఆగాలి " అని చెప్పారు.

పత్రీజీ ఆదేశానుసారం 1999లో పిరమిడ్ పార్టీ తరఫున పుత్తూరు నియోజకవర్గం నుంచి పోటీచేసాను. ప్రచారం పూర్తి అయిన తర్వాత రెండవ విడత ఎలెక్షన్ విజయవాడ ఏరియాలో కాబాట్టి ప్రచారం కొరకు విజయవాడ చేరుకున్నాను. నా స్నేహితుడు అనంత్ ఎంటర్ప్రైజెస్ " రమణ " నాకు తెలియకుండానే ఈనాడు దినపత్రికలో వివాహ ప్రకటన ఇచ్చాడు. మరుసటిరోజు నుంచే మా ఇంటికి ఫోన్లు వస్తూ ఉండడంతో మా పెద్ద పాప " ఉష " నాకు విషయం తెలిపింది. అప్పుడు నాకు సందేహం వచ్చి రమణను అడిగాను. " ప్రకటన ఇచ్చింది వాస్తవమే " అని ఒప్పుకున్నాడు. పదిహేను రోజుల వరకు అనేక పెళ్ళికూతుళ్ళ వివరాలు మరి ఫోటోలు వచ్చాయి. నేను, రమణ అన్నింటినీ పరిశీలించగా విశాఖపట్టణం నుంచి వచ్చిన సంబంధం మమ్మల్ని ఆలోచింపచేసింది. " ఒకటే కూతురు, రెండు

కోట్ల ఆస్తి, ఫ్యాక్టరీలు ఉన్నాయి. పెళ్ళి అయిన తరువాత విశాఖపట్టణం వచ్చి ఫ్యాక్టరీ వ్యవహారాలు చూసుకోవాలి; దీనికి సమ్మతమైతే వచ్చి మాట్లాడండి " అని వ్రాసి వుంది. " ఈ సంబంధం ' OK' చేద్దాం " అన్నాడు రమణ. " రెండు రోజులు నేను అలోచించుకోవాలి " అని చెప్పాను. మరుసటిరోజు ఇంకొక లెటర్ కర్నూల్ జిల్లా డోన్ నుంచి వచ్చింది. డోన్‌లో రమణ వాళ్ళ బంధువులు ఉన్నారు. రమణ వాళ్ళకు ఫోన్ చేసాడు. డాక్టర్ పెరుమాళ్ రాజు రెండవ అమ్మాయి " సుభాషిణి " వివాహ విషయమై వాళ్ళ వివరాలు అడగగా .. " ఏమీ ఆలోచించకండి, వాళ్ళు ఒప్పుకుంటే మీరు కాదనకండి; మీరు వెంటనే బయలుదేరి రండి " అని చెప్పారు.

నేను, రమణ ఇద్దరం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో డోన్ వెళ్ళీ రమణ బంధువుల ఇంటిలో దిగి ఉదయం కలవడానికి తయారయ్యాం. ఇంతలో సుభాషిణి తమ్ముడు " సుధీష్ " మమ్మల్ని ఆహ్వానించడానికి వచ్చాడు. అందరం కలసి వాళ్ళ ఇంటికి వెళ్ళాం. నేను సుభాషిణితో వాళ్ళ కుటుంబ సభ్యులతో " నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దమ్మాయికి పెళ్ళి అయ్యింది. రెండవ పెళ్ళి చేసుకుంటే మళ్ళీ పిల్లలు వద్దు అనుకుంటున్నాను. మీ అభిప్రాయం చెప్పండి " అన్నాను. అందుకు సుభాషిణి " నాకు పిల్లలు వద్దు, మీ పిల్లలనే నా పిల్లలుగా చూసుకుంటాను" అని చెప్పింది. " నాకు వారంరోజులు సమయం ఇవ్వండి; నేను మా వాళ్ళందరితో మాట్లాడి చెబుతాను " అని బయలుదేరుతూండగా సుభాషిణి అమ్మ, నాన్న ఒక పెద్ద ప్లేటులో స్వీట్సు, పండ్లు, కొబ్బరిబొండా తీసుకొచ్చి నాకు ఇవ్వబోయారు. నేను సందేహించి " ఇవి తీసుకుంటే సమ్మతించినట్లే అవుతుంది " అని ఆలోచించాను. " వారి అమ్మ, నాన్న వయసైనవారు ..

నాకు ఎదురుగా నిలబడి మర్యాదగా, ఆప్యాయతతో ఇస్తూంటే తీసుకోకపోతే బాగుండదు " అని తీసుకున్నాను. మా ఊరికి వెళ్ళి వద్దని చెప్పేద్దాం అనుకున్నాం. నాకు, రమణకు విశాఖపట్టణం సంబంధంపైనే ఇష్టం ఉంది. ఎందుకంటే రెండు కోట్లు ఆస్తి, ఫ్యాక్టరీలు!

నేను, మా పిల్లలూ, అమ్మ, నాన్న, బంధువులు ఎంత ఆలోచించినా " ఆస్తి, ఫ్యాక్టరీ శాశ్వతం కాదు. ' పిల్లలు కూడా వద్దు, మొదటి భార్య పిల్లలనే తన పిల్లలుగా చూసుకుంటాను ' అని చెప్పింది కాబట్టి సుభాషిణికే ఓటు వేద్దాం " అని ఏకగ్రీవంగా ఎంచుకున్నాం. 1999 ధ్యానయజ్ఞం కర్నూలులో డిసెంబర్ 25 నుంచి 31 వరకు కాబట్టి మా కుటుంబం అంతా ముందుగా డోన్ వెళ్ళి మా నిర్ణయాన్ని వాళ్ళకు తెలియజేసి కర్నూలు ధ్యానయజ్ఞంలో పాల్గొని తిరుపతికి చేరుకున్నాం.

2000 సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీ తిరుమలలో మా పెళ్ళి జరిగింది. ఫిబ్రవరి 25 వ తేదీ మా రెండవ కుమార్తె " నాగమణి " వివాహం " రమేష్ " తో జరిగింది. అతి తక్కువ సమయంలోనే మా పిల్లలతో, బంధువులతో ఎంతో సన్నిహితంగా మెలుగుతూ ఆప్యాయతతో అందరినీ ఆకట్టుకుంది " సుభాషిణి ". 2002లో మా స్వంత ఊరిలో ఉన్న మా అమ్మ, నాన్నను తిరుపతికి తీసుకువచ్చాం. అప్పటి నుంచి వయస్సు మళ్ళిన అత్త, మామలకు సేవ చేస్తూ అందరి మన్ననలు పొందింది.

1999లో నా కుమారుడు " D.V. రాజగోపాల్ " మాకు తెలియకుండానే జగదీశ్వరితో ప్రేమ వివాహం చేసుకుని వేరే కాపురం పెట్టాడు. " ఉన్నది ఒక్కగానొక్క అబ్బాయి .. వాడు విడిగా కాపురం పెడితే బాగుండదు " అని సుభాషిణి వాళ్ళను ఒప్పించి ఇంటికి

తీసుకువచ్చింది. నేను ధ్యానప్రచారం కోసం జిల్లాల వారిగా తిరుగుతూ, కుటుంబ విషయాలు పట్టించుకోకపోయినా సుభాషిణి ఎంతో సహనంతో అన్ని విషయాలు చక్కబెట్టి అందరి మన్ననలు పొందింది.

మొదటి భార్య " సుబ్బరత్న ", రెండవ భార్య " సుభాషిణి " వీరిరువురూ నా ధ్యాన ప్రచారానికి ఎంతో సహకరించారు. నెలల తరబడి ఇంటికి రాకుండా ధ్యానప్రచారంలో ఉన్నప్పటికీ వాళ్ళు ఎంతో సహనంతో తమ సహకారాన్ని అందించారు. కుటుంబంతోనూ, బంధువులతోనూ, స్నేహితుల తోనూ, పిరమిడ్ మాస్టర్లతోనూ తమకు ఒక ప్రత్యేకస్థానాన్ని కల్పించుకునే విధంగా వారు నడుచుకున్నందుకు నాకెంతో గర్వకారణంగా ఉంది.

ఎన్ని జన్మల పుణ్యఫలమో ఈ జన్మలో సహనశీలురు అయిన భార్యలు దొరకడం .. నా అదృష్టంగా భావిస్తున్నాను. సుబ్బరత్న ఉన్నప్పుడు " కేశవరత్న " గా చిత్తూరు జిల్లాలో అందరికీ సుపరిచితుడను. సుభాషిణి వచ్చిన తర్వాత " ధ్యానరత్న " గా పిరమిడ్ మాస్టర్లకు అందరికీ సుపరిచితుడను.



2001- D.కేశవరాజు, శ్రీమతి D.సుభాషిణి

# “ పులిబోను బావి ట్రెక్కింగ్ ”

తిరుపతికి మంచినీటిని అందించే “ కళ్యాణి డ్యామ్ ” నుంచి 8 కిలోమీటర్ల దూరంలో అడవిలో “ పులిబోను బావి ” అనే ప్రదేశం చాలా ప్రశాంతంగా, పట్టణ రణగొణ ధ్వనులకు దూరంగా .. ప్రకృతి అందాలతో, చూడముచ్చటగా ఉండే ప్రదేశం. అక్కడ బ్రిటిష్ కాలంనాటి కట్టడాలు, ఒక బావి ఉన్నవి. ఆ బావిలో 8 అడుగుల లోతులో ఎప్పుడూ స్వచ్ఛమైన నీళ్ళు ఉంటాయి. 1998 జనవరి 26వ తేదీ పత్రీజీ అక్కడకు ట్రెక్కింగ్ పెట్టమన్నారు. తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసాం.

24వ తేదీ నాకు విపరీతమైన జ్వరం .. అందులో మనం డాక్టర్ల వద్దకు వెళ్ళం కదా! అందుకే ఇంట్లోనే పడుకుని ఉన్నాను. రాత్రి 1.30 గంటలకు కలలో నేను పడుకున్న గదిలోకి ముగ్గురు వచ్చారు. వాళ్ళ తలలు మాత్రమే కనబడుతున్నాయి. మధ్యలో ఉన్న అతను నాతో “ మా లోకానికి వచ్చేయ్ .. నిన్ను రాజును చేస్తాం! ” అన్నారు. “ నేను ఒకప్రక్క జ్వరంతో బాధపడుతూ వుంటే ‘ ఇలా అడుగుతారేంటి?’ ” అని నేనేమీ మాట్లాడలేదు. అరగంట తర్వాత వాళ్ళు వెళ్ళిపోయారు.

రెండవరోజు(25వ తేదీ)రాత్రి అదే సీను. కానీ, ఇప్పుడు నడుము వరకు కనబడుతున్నారు. ముందురోజు అడిగినట్లుగానే .. మళ్ళీ అదే

ప్రశ్న! నేనేమీ మాట్లాడలేదు. కానీ, నా మనస్సులో " ఇంతకీ వీళ్ళు ఎవరు? .. నన్నెందుకు అడుగుతున్నారు? " అనుకున్నాను. అనుకున్నవెంటనే రాజ ప్రాకారాలు, సింహాసనం కనబడ్డాయి. నేను భయపడి నా ఆలోచనను వెనక్కి తీసుకున్నాను. వాళ్ళు అక్కడినుంచి వెళ్ళిపోయారు.

26వ తేదీ ఉదయం పత్రీజీ తిరుపతి వచ్చారు; అందరూ ట్రెక్కింగ్‌కు బయలుదేరుతున్నారు. " నేను రాలేను సార్! జ్వరంగా వుంది " అని అన్నాను. " జ్వరం లేదు .. ఏమీ లేదు! రా! " అన్నారు. ఇక కాదనలేక బయలుదేరి పులిబోను బావికి వెళ్ళాం. జనవరి నెల, అద్భుతమైన వాతావరణం. ప్రతి ట్రెక్కింగ్‌లో క్యాంప్‌ఫైర్, అంత్యాక్షరి, ఆటలు, పాటలు, ధ్యానం మరి పత్రీజీ సందేశాలు ఉంటాయి.

నేను అక్కడికి వెళ్ళిన వెంటనే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు నిర్మించిన వాచ్ టవర్‌లో రెండంతస్థుల పైకి వెళ్ళి పడుకున్నాను. జ్వరం తగ్గలేదు, చాలా నీరసంగా ఉంది. రాత్రంతా అక్కడ పండుగ వాతావరణం .. అందరూ మేల్కొని అంత్యాక్షరి, డ్యాన్సులు, పత్రీజీ సందేశాలతో మారుమ్రోగుతోంది.

రాత్రి 1.30 గంటలకు .. 12 అడుగుల ఎత్తులో మళ్ళీ ఆ ముగ్గురూ వచ్చారు. " రెండు రోజులుగా మీరేమీ సమాధానం ఇవ్వడంలేదు. ఈ రోజు మూడువరోజు మళ్ళీ వచ్చాం; మా రాజ్యానికి వచ్చేయండి .. మిమ్మల్ని రాజును చేస్తాం " అన్నారు. నేను ఎంతో ధైర్యంగా " నా ఇష్టం ఏమీ లేదు .. క్రింద మా గురువు గారు ఉన్నారు; ఆయనను అడగండి, ఆయన వెళ్ళమంటే వెంటనే వస్తాను " అన్నాను. వాళ్ళు " మేము అడగం .. మీకు

ఇష్టమో, కాదో చెప్పండి ” అన్నారు. “ గురువుగారి ఇష్టమే నా ఇష్టం; ఆయన వెళ్ళమంటే వెంటనే వస్తాను, లేకుంటే లేదు ” అన్నాను. ఇలా అరగంట గడిచింది. చివరికి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఉదయం 6 గంటలకు మెలకువ వచ్చింది. నాకు జ్వరం లేదు! పత్రీజీ రాత్రంతా నిద్రపోకుండా క్యాంప్‌ఫైర్ దగ్గరే కూర్చుని ఉన్నారు. ధ్యానం, కాన్సెప్ట్స్, అంత్యాక్షరి డాన్సులు ఇలా రాత్రంతా జరిగాయి. నేను మెట్లుదిగి సార్ దగ్గరకు వెళ్ళాను. “ రావయ్యా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను .. ఏమైంది రాత్రి? ” అన్నారు. రెండు రోజులుగా జరిగిన విషయం సార్‌కి అప్పటివరకు చెప్పలేదు. ఒక్కసారిగా ఆశ్చర్యం వేసి .. మొత్తం జరిగిన విషయం చెప్పాను. పత్రీజీ శ్రద్ధగా విని “ నువ్వు గెలిచావులే ” అన్నారు. “ కొంచెం వివరంగా చెప్పండి సార్ ! ” అని అడిగాను. “ ధ్యానులు ముముక్షువులుగా ఎదిగేటప్పుడు అనేక సమస్యలు వస్తాయి. నువ్వు సామాన్య కుటుంబం నుంచి వచ్చావు కాబట్టి నీకు .. రాజప్రాకారాలు, సింహాసనం చూపించినప్పుడు భౌతికమైన వ్యామోహంలో ‘ OK ’ అంటే నువ్వు ఫెయిల్; నువ్వు తిరస్కరించావు కాబట్టి ఈ పరీక్షలో గెలిచావు. ఇక నీ జోలికి ఎవ్వరూ రారు ” అన్నారు. తర్వాత ఎప్పుడూ వాళ్ళు రాలేదు.

నాకు అప్పటి నుండి జ్వరం కూడా రాలేదు. ఈ అనుభవం నా జీవితాన్ని క్రొత్త మలుపు తిప్పింది.

# " నో ఫుడ్ ట్రెక్కింగ్ "

పులిబోను బావి ట్రెక్కింగ్‌కు రాని వాళ్ళు మళ్ళీ మళ్ళీ పత్రీజీని అడుగగా .. 1999 మే నెలలో రెండురోజులు అక్కడే ఉండి తర్వాత మూడు రోజులు శేషాచలం అడవులలో ' నో ఫుడ్ ' ట్రెక్కింగ్ ఏర్పాటు చేయమని పత్రీజీ ఆదేశించారు.

అప్పుడే " పిరమిడ్ పార్టీ " రిజిస్ట్రేషన్ అయ్యింది. వెంటనే పత్రీజీకి తెలియజేయగా " అయితే సంబరాలు చేసుకుందాం .. ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయండి " అన్నారు. అడవిలో ఆర్కెస్ట్రా ఎలా సాధ్యం ?! అయినా సార్ చెప్పారు కాబట్టి తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరి ఎంజాయ్‌మెంట్ సైన్స్ అకాడెమీ సెక్రెటరీ రామచంద్రారెడ్డికి ఆ బాధ్యత అప్పచెప్పాం. ఆయన వారి టీమ్‌తో మినీ లారీలో జనరేటర్, ఆర్కెస్ట్రా సామగ్రితో అతి కష్టం మీద పులిబోను బావి వద్దకు చేరుకున్నారు. తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ప్రెసిడెంట్ కంచి రఘురాం, సెక్రెటరీగా నేను, ట్రెజరర్ M.M. స్వామి, మిగిలిన సభ్యులు మరి వివిధ ప్రాంతాల నుంచి ఐదు వందల మంది వచ్చారు!

రెండురోజులు పెళ్ళి భోజనంలాగా అన్ని రకాల రుచికరమైన వంటకాలు, ఆర్కెస్ట్రా, ఆటలు, పాటలు అద్భుతంగా ఎంజాయ్ చేసాం. మూడవరోజు " నో ఫుడ్ ట్రెక్కింగ్ ". నేను మెగాఫోన్ (బ్యాటరీతో పనిచేసే

మైక్) తీసుకుని “ అందరూ రెడీ అవ్వండి ” అని చెప్పాను. వెంటనే పత్రీజీ నన్ను పిలిచి “ క్యూలో రమ్మను ” అని చెప్పమన్నారు. “ అడవిలో క్యూలో ఎందుకు?! ” అని పత్రీజీని అడగలేము కదా! గురువుగారు చెప్పినట్లుగా మైక్‌లో చెప్పాను. ఇంతలో ఫుడ్ కమిటీ వాళ్ళు నా దగ్గరకు వచ్చి “ మూడురోజులు ఫుడ్ లేకుండా ఎలా ఉండగలం? మేము తెలివిగా బియ్యం, పప్పులు, రవ్వ, అటుకులు చిన్న చిన్న కవర్లలో వేసి ఉంచాం; మన మాస్టర్ల వద్ద ఒక్కొక్క కవర్ ఇచ్చి అవసరం అయినప్పుడు కొంత ప్రసాదంలాగా తయారు చేసుకుని తిందాం ” అన్నారు. “ నాకు తెలియదు; మీరు ఏమైనా చేసుకోండి, నేను పత్రీజీ దగ్గర ‘ టీ ’ ఇద్దామని అనుమతి తీసుకున్నాను. అందువల్ల పాలపొడి, ‘ టీ ’ పొడి, చక్కెర తీసుకుని వస్తున్నాను ” అన్నాను.

అందరూ క్యూలో వస్తున్నారు .. సార్ ఒక్కొక్కరినీ పరీక్షగా చూస్తూ “ నువ్వు ఓకే ” ..“ నువ్వు వద్దు ” అని, ఇలా 250 మందిని సెలెక్టు చేసి మిగిలిన 250 మందిని “ నో–ఫుడ్ ట్రెక్కింగ్ కు వద్దు ” అన్నారు. వారంతా “ సార్! మూడు రోజుల తర్వాత మాకు ట్రైన్ రిజర్వేషన్ ఉంది; మేము కూడా వస్తాం ” అని అడుగగా “ మీకు నో–ఫుడ్ ట్రెక్కింగ్‌చేసే అర్హత లేదు; మీరు రావద్దు ” అని కఠినంగా చెప్పడంతో మిగిలిన 250 మందితో ట్రెక్కింగ్ ప్రారంభమైంది.

పులిబోను బావి నుండి కొండ ఎక్కడం ప్రారంభించాం. మధ్యాహ్నం 1 గంటకు ఎత్తైన కొండ సగభాగం చేరుకున్నాం. ఎండ ఎక్కువగా వుంది. దారిలో చెట్లు కూడా లేవు. “ సార్ ! ఒక పది నిమిషాలు ఆగుదాం ” అన్నారు. అందరూ అలా కాసేపు నిల్చొని వారి వారి బాటిల్‌లోని నీటిని త్రాగి మళ్ళీ బయలుదేరాం.

సాయంత్రానికి ఒక ప్రదేశానికి చేరుకున్నాం. ఎండాకాలం కాబట్టి సెలయేరు సన్నగా ప్రవహిస్తోంది. స్నానాలు చేయటానికి కూడా నీళ్ళు లేవు. క్యాంప్ ఫైర్ వేసి టీ తయారుచేస్తున్నారు. ఇంతలో సార్ నాతో " అందరూ అలసిపోయారు; ఈ రోజు నో ఆటా-పాట, నో అంత్యాక్షరి .. అందరికీ రెస్ట్ ఇచ్చేయి " అన్నారు. నేను మైక్‌లో ఇదే విషయాన్ని తెలియజేసాను. ఇంతలో ఫుడ్ కమిటీ వాళ్ళు నా దగ్గరకు వచ్చి " మేము వంద మంది దగ్గర చిన్న చిన్న కవర్లలో వంటవస్తువులు(సామగ్రి) ఇచ్చాం. వాళ్ళ వద్ద కొంత తీసుకుని ఉప్మా చేస్తాం " అన్నారు. " మీ ఇష్టం " అని చెప్పాను. అప్పటికే సూర్యాస్తమయం అవ్వడంతో చీకటి పడింది. ఫుడ్ కమిటీ వాళ్ళు నా దగ్గరకు వచ్చి " సార్ ! మేము కొంతమందిని అడిగాం .. వాళ్ళు ' మాకు ఏ కవరూ ఇవ్వలేదు ' అంటున్నారు; అందరూ క్రొత్త వాళ్ళు కాబట్టి గుర్తుపట్టలేక పోతున్నాం " అన్నారు. " అయితే ఇప్పటికి టీ త్రాగి పడుకుందాం .. ఉదయం ఆలోచిద్దాం" అని చెప్పాను. ఉదయం నుంచి ఎత్తైన కొండల్లో అలవాటు లేకుండా ఎండలో నడిచి నడిచి అలసిపోయిన మాస్టర్లు ప్రకృతి ఒడిలో హాయిగా నిద్రకు ఉపక్రమించారు.

***<u>నో-ఫుడ్ ట్రెక్కింగ్ రెండవరోజు</u> :*** ఉదయాన్నే అందరూ లేచి పత్రీజీ వేణునాదంలో ధ్యానం చేసాం. ఉదయం నేను కొంతమందిని విడివిడిగా " మా వాళ్ళు మీకు కవర్లు ఇచ్చారట కదా; వాళ్ళు అడిగితే లేదన్నారట .. ఇచ్చి వుంటే ఉప్మా చేసుకుని తినేవాళ్ళు కదా " అన్నాను. " వాళ్ళు ఇచ్చింది నిజమే, మధ్యాహ్నం వరకూ మేము తెచ్చింది నిజమే; రాను రాను మా బ్యాగులు బరువుగా అవుతున్నాయి. మా లగేజీని పడేసుకోలేం కదా! అందుకే మీ వాళ్ళు ఇచ్చిన కవర్లు మధ్యాహ్నం మనం ఆగి నీళ్ళు త్రాగాం కదా ..

అక్కడ ఎవరూ చూడకుండా కంప చెట్లలో పడేశాం " అన్నారు. పత్రీజీ అనుమతి లేదు కదా .. అందుకే అలా జరిగింది!

సన్నగా ప్రవహిస్తూన్న సెలయేటిలో స్నానం చెయ్యటానికి వీలులేదు కాబట్టి అందరూ బ్రష్ చేసుకుని ' టీ ' త్రాగి బయలుదేరాం. నేను చివరిలో వెళ్తున్నాను. అందరికంటే ముందు పత్రీజీ ఉన్నారు. కొంతదూరం నడిచాక మెట్టా పల్లం లేకుండా చదునుగా ఉంది. ఇంతలో కొంతమంది అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. " ఏమైంది? " అని చూస్తే కొండ ఈతకాయలు కోయడానికి చెట్ల వద్దకు వెళ్తున్నారు. నేన మైక్‌లో " కోయకండి! అవి పండ్లు కాదు, కాయలు; వగరుగా వుంటాయి .. తినడం ఆపిన వెంటనే దాహం వేస్తుంది. మీ బాటిల్‌లో ఉన్న నీళ్ళు సాయంత్రం దాకా సరిపోవాలి" అన్నాను. అయినా నా మాట వినకుండా ఎర్రగా మెరుస్తూన్న ఈతకాయలు కోసుకుని తింటూ .. ప్రక్కవారికి ఇస్తూ వస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు అందరి బాటిళ్ళలో నీళ్ళు అయిపోయాయి. ఈతకాయల వగరు వల్ల నాలుక ఎండిపోతోంది.

ఒకప్రక్క ఎర్రని ఎండ, ఒకప్రక్క తట్టుకోలేని దాహం .. " ఎందుకు వచ్చామా? " అని నిరుత్సాహ పడుతూన్న సమయంలో కొన్ని చెట్లు కనబడ్డాయి. అందరూ చెట్లనీడలో కూర్చుని పత్రీజీ వేణునాదంలో అరగంట ధ్యానం చేసాం. ఇంతలో చిరుజల్లు కురిసింది. పత్రీజీ ' OK ' చెప్పారు. అందరూ ధ్యానంలో నుంచి లేచి మళ్ళీ అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. " మళ్ళీ ఏమైంది? " అని చూడగా టేకు చెట్లు పెద్ద పెద్ద ఆకులపై ఉన్న నీటి బిందువులను నాలుకతో నాకుతున్నారు. " ఈతకాయలు తిననేల? ఈ తిప్పలు పడనేల!" అని మనస్సులో అనుకుంటూ పత్రీజీతో " నేను

ముందుగా వెళ్తాను సార్ ” అని అడిగాను. సార్ “ సరే ” అన్నారు. నాతో పాటు పదిమంది మాస్టర్లు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న “ అన్నదమ్ముల బండ ” అనే ప్రదేశానికి చేరాం. ఆ రోజు రాత్రి బస అక్కడే.

వెయ్యి మంది అయినా పడుకునేందుకు వీలుగా చదునైన బండలు మధ్యమధ్యలో చిన్న చిన్న చెట్లు. “ ఇంతకు ముందుకూడా ట్రెక్కింగ్‌లో ఇక్కడే బస చేసాం కానీ అప్పుడు వర్షాకాలం, నీళ్ళు పుష్కలంగా ఉన్నాయి. కానీ ఇప్పుడు ఎండా కాలం అవడం వల్ల చిన్న కుంటలో పది బిందెలు నీళ్ళు కూడా లేవు. అవికూడా బాగాలేవు; త్రాగడానికి పనికిరావు ” అని అలోచిస్తూ .. “ ట్రెక్కింగ్‌లో ఉన్నవారికి ఆహారం ఎలాగూ లేదు; కనీసం నీళ్ళు కూడా లేకపోతే ఏలా? ” అనుకుంటూ .. “ సరే ! కాస్సేపు ధ్యానం చేద్దాం ” అని నేను మాత్రం చెట్టుచాటుకు వెళ్ళి ధ్యానంలో కూర్చుంటూ “ ఈయన మాటలు విని ఈ ఎండల్లో ట్రెక్కింగ్‌కు వచ్చాం .. అది కూడా ‘ నో–ఫుడ్ ట్రెక్కింగ్ ’ .. ఫుడ్ ఎటూ లేదు కనీసం నీళ్ళు అయినా లేకపోతే ఎలా? ” అనుకుని ధ్యానం మొదలుపెట్టాను.

కొద్దిసేపటికి ఇంకొంతమంది అక్కడికి చేరుకుని .. “ ఎక్కడ కేశవరాజు?, ఇక్కడ నీళ్ళు ఉంటాయని చెప్పారు కదా! ” అంటూ గట్టిగా మాట్లాడుతున్నారు. ఇక ధ్యానం కుదరలేదు. వాళ్ళ దగ్గరకు వెళ్ళి “ నేను మాత్రం ఏం చెయ్యను? .. ఎప్పుడు ట్రెక్కింగ్‌కు వచ్చినా ఇక్కడే రాత్రి బస చేసేవాళ్ళం. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు ” అంటున్నాను. ఇంతలో నల్లటి మేఘాలతో, ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం! సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు రెండు గంటల వరకూ ఎడతెరపిలేని వర్షం! కొండపై నుంచి వస్తూన్న

నీటి ప్రవాహం శబ్దం విని " మన బ్యాగులు ప్రక్కకు తీయండి .. లేకపోతే ఆ ప్రవాహంలో కొట్టుకుపోతాయి " అని గట్టిగా అరిచాను. అప్పటికే ప్రవాహం పెద్దదై రెండు బ్యాగులు కొట్టుకుపోయాయి. ఉరుములతో కూడిన వర్షం తగ్గింది. నీటి ప్రవాహ వేగం తగ్గి స్వచ్ఛమైన నీళ్ళు ప్రవహిస్తున్నాయి. చాలామంది గాలి, వానకు దారిలో ఆగిపోయారు. చిమ్మచీకటిలో టార్చ్‌లైట్స్‌తో గైడ్స్, మనవాళ్ళు వెళ్ళి దారిలో నిలిచిపోయిన వారిని తీసుకొచ్చారు.

ఇంతలో మేము క్యాంప్‌ఫైర్ వేసి ' టీ ' రెడీ చేస్తున్నాం. అందరూ తడిసిపోయారు, బ్యాగులు తడిసిపోయాయి. వాతావరణం చల్లచల్లగా తయారైంది. పత్రీజీ క్యాంప్‌ఫైర్ వద్దకు వచ్చి కూర్చొని చలిమంట కాచుకుంటూ " ఎక్కడయ్యా కేశవరాజు? .. ఇక్కడకు రమ్మను! " అన్నారు. నేను సార్ దగ్గరకు వెళ్ళగానే .. " ఏమయ్యా! ముందుగా ఇక్కడికి వచ్చి నన్ను తిట్టుకున్నావు కదా! " అన్నారు. నాకు మతి పోయింది. ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. " నేను ఎవ్వరికీ వినబడకుండా నా మనస్సులో అనుకున్న మాట ఈయనకు ఎలా తెలిసింది? " అనుకుంటూ .. " తిట్టలేదు సార్ .. అనుకున్నాను " అని చెప్పాను. " నువ్వు ఏం అనుకున్నావో, ఏం తిట్టుకున్నావో అందరికీ వినబడేటట్లు చెప్పు " అన్నారు. నేను మనస్సులో అనుకున్నదంతా అందరికీ వినబడేటట్లు చెప్పాను. " కూర్చో .. నీ కోరిక నెరవేరిందా! " అంటూ నీటినీ, ఆకాశాన్నీ చూపిస్తూ అన్నారు. నాకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. నా మనస్సులో అనుకున్నది ఈయనకు ఎలా తెలుసు? ఎవ్వరికీ చెప్పలేదు .. అరగంటలో కుండపోత వర్షం ఎలా వచ్చింది?! ఎర్రటి పారే నీరంతా పోయి .. త్రాగు నీళ్ళు ఎలా వచ్చాయి?!

అంతా మాయగా అనిపించింది. " అంతటి మహానుభావుల సన్నిధిలో ఉన్నాం " అనుకుంటూ ఆటపాటలతో, పత్రీజీ కాన్సెప్ట్‌లతో, వేణునాద ధ్యానంతో రాత్రంతా గడిచిపోయింది!

మూడవరోజు ఉదయం అందరం రెడీ అయ్యి " అన్నదమ్ముల బండ" లో జరిగిన వింత అనుభవాలు నెమరువేసుకుంటూ బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటలకు పాపవినాశనం చేరుకుని అక్కడనుంచి తిరుమల, తిరుపతి చేరుకున్నాం.

" మూడు రోజులూ అప్పుడే అయిపోయిందా! " అనుకుంటూ ఒక రోజు కూడా భోజనం లేకుండా ఉండలేని మనం మూడు రోజులు భోజనం లేకుండా ..రెండుపూటలు ' టీ ' మాత్రమే తీసుకుని కొండకోనల్లో, మండుటెండల్లో ఎలా తిరిగాం?! ఎంతో ఆశ్చర్యం అయినా ఇది నిజం. జీవితంలో మరచిపోలేని మధురఘట్టం. " పత్రీజీ వెంట వుంటే అన్నీ అద్భుతాలే " అని మరొకసారి ఋజువైంది.



1996-తిరుమల ట్రెక్కింగ్‌లో పత్రీజీతో పిరమిడ్ మాస్టర్స్

# " 1999-పిరమిడ్ పార్టీ ఆవిర్భావం "

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో అనేకానేక ధ్యానకార్యక్రమాలు విస్తారంగా జరుగుతూన్న తరుణంలో " మనం ఒక రాజకీయ పార్టీ పెడుతున్నాం; అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలలో అభ్యర్థులను నిలబెట్టాలి " అని పత్రీజీ తెలియజేసారు.

ఏమీ అర్థం కాలేదు. " ధ్యానం, శాకాహారం అన్నాం .. ఇప్పటికే చాలా మంది మిత్రులను, బంధువులను దూరం చేసుకున్నాం. ఇప్పుడు రాజకీయ పార్టీ అంటే మిగిలిన వాళ్ళు కూడా దూరం అవుతారేమో " అని చాలామంది పిరమిడ్ మాస్టర్లు స్తబ్ధతగా ఉండిపోయారు.

" ఆత్మజ్ఞానులే రాజ్యపాలన చేయాలి " అని సోక్రటీస్ చెప్పిన విషయాలను కొందరు పిరమిడ్ మాస్టర్లు అర్థం చేసుకుని పోటీచేయడానికి సిద్ధం అయ్యారు.

" కేశవరాజూ! నువ్వు పుత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చెయ్యవయ్యా ! " అన్నారు పత్రీజీ. " ఎవ్వరినీ ఓటు అడగవద్దు .. ధ్యానం, శాకాహారం కరపత్రాలు ప్రతి ఇంటికి చేరేటట్లు చూడు; 15 రోజులలో మొత్తం పూర్తి కావాలి; చివరి రోజు పుత్తూరు టౌన్‌లో ప్రచారం చేసి సాయంత్రం 5 గంటలకు పూర్తి చేయాలి " అని పత్రీజీ ఆదేశించారు.

పుత్తూరు నియోజకవర్గంలో మా సొంత ఊరు వడమాలపేట మండలం, అబ్బికండ్రిగ(ముప్పాల వారి ఇండ్లు) గ్రామం. 1983లో మా ఊరి నుంచి పిల్లల చదువుకై తిరుపతికి మకాం మార్చడం వల్ల మా ఊరి వాళ్ళతో పరిచయాలు తగ్గిపోయాయి. అయినా పత్రిసార్ మాటంటే నేను ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. అందుకే నామినేషన్ వేయడానికి సిద్ధం అయ్యాను.

నా చిరకాల మిత్రుడు " K.V. రమణ " ఒక అంబాసిడర్ కారును ప్రచార నిమిత్తం వాడమని ఇచ్చారు. కావేరీ ట్రావెల్స్ వెంకటేశ్వర్లు అతి తక్కువ అద్దెకు జీపు ఏర్పాటు చేసారు. ఇక అబ్బికండ్రిగ, S.V. పురం, బేరివాని కండ్రిగ, పుత్తూరు మొదలైన ప్రాంతాల బంధువులు మరి మిత్రులతో కలిసి నామినేషన్ వేసాను.

ప్రచారానికి కావలసిన అనుమతులు, కరపత్రాలు, గోడ పత్రికలు, మైకుసెట్టు తీసుకుని పత్రీజీ చెప్పిన విధంగా 15 రోజులు ముందు ప్రచారం మొదలు పెట్టాను. మా చిన్నాన్న వెంకట్రామరాజు, మా అన్న D.R.K.రాజు, సుమతి మేడమ్, మా అబ్బాయి D.V. రాజగోపాల్ మరి వారి మిత్రులతో కలసి ప్రచారం మొదలుపెట్టాం. వడమాలపేట మండలం, S.V. పురం, కొటాలలో మా బావమరిది S.R. సుబ్రహ్మణ్యంరాజు, ఆయన సతీమణి అనసూయ .. మాకు అందరికీ పదిరోజులు పాటు భోజన సదుపాయాలు ఏర్పాటుచేశారు.

మాకు తెలియని అనేక గ్రామాలు .. ఒక గ్రామంలో ప్రచారం ముగిసిన సమయంలో ఎవరో తెలియని వారు వచ్చి " తరువాత ఏ గ్రామం వెళతారు? " అని అడగడం .. " మాకు తెలియదు " అని చెప్పగానే " ఈ

చుట్టుప్రక్కల గ్రామాలు మాకు బాగా తెలుసు; నేను మీతో వస్తాను ” అని మాతో వచ్చి ప్రచారంలో పాల్గొనేవారు. ఈ విధంగా ఎంతో మంది వారి వారి ప్రాంతాలలో మాతో కలిసి మాకు తెలియని ప్రదేశాలలో వారి సహకారంతో అద్భుతంగా ప్రచారం చేస్తూ వచ్చాం. చివరి రోజు ప్రచారంలో సార్ చెప్పిన విధంగా పుత్తూరు టౌన్‌లో సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం చేసి పూర్తిచేసాం.

ఎలెక్షన్ సందర్భంగా పుత్తూరు నియోజకవర్గంలో ధ్యానం, శాకాహారం, పిరమిడ్ శక్తి గురించి 50 వేల కరపత్రాలను పంచి .. అనేక గ్రామాల ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని ధ్యాన విశిష్ఠత తెలియజేసే భాగ్యాన్ని పత్రీజీ నాకు అందించారు!




1999–పుత్తూరు నియోజకవర్గంలో పిరమిడ్ పార్టీ ప్రచారం

# " మొట్టమొదటి ..
# కైలాస మానససరోవర యాత్ర "

తిరుపతిలో " భీమాస్ రఘు " గారిచే నిర్మించిన " భీమాస్ రెసిడెన్సీ హోటల్ " 2000 సంవత్సరంలో ప్రారంభమైంది. అప్పుడు తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులతో బ్రహ్మర్షి పత్రీజీ 2001వ సంవత్సరం " కైలాస మానస సరోవరం వెళ్దాం! ఏర్పాట్లు చెయ్యండి " అన్నారు.

2001వ సంవత్సరం మార్చినెలలో నేను కంచి రఘురామ్ ఢిల్లీ వెళ్ళి .. యాత్రకు కావలసిన అనుమతులు తీసుకున్నాం. జూన్‌లో 32 మందితో ట్రెయిన్‌లో వారణాసి చేరుకున్నాం. అక్కడ గంగాస్నానం, కాశీ విశ్వనాథుని గుడి, సారనాథ్ మొదలైన ప్రదేశాలు తిలకించి ధ్యానం చేసాం. రెండవరోజు బస్సులో ఖాట్మండు బయలుదేరి .. కొండకోనల్లో, ఇరుకు రోడ్లలో, ప్రకృతి అందాలు తిలకిస్తూ, నదులు దాటుకుంటూ, ఎప్పుడూ చూడనటువంటి రోడ్లు(కొండను త్రవ్వి రోడ్డు ఏర్పాటు చేసారు), లోతైన లోయలో నదీ ప్రవాహం, ఒకప్రక్క కొండ ఇంకేమీ కనపడదు. ఎంతో ఎత్తులో ప్రయాణిస్తూ ఉంటే కొంతమంది ఆ లోయను చూడాలంటే భయపడేవాళ్ళు. అలా 20 గంటలు పాటు ప్రయాణం చేసి ఖాట్మండు చేరుకున్నాం. మరుసటిరోజు ఖాట్మండులో చూడవలసిన ప్రదేశాలు తిలకించి రెస్ట్ తీసుకున్నాం. పత్రీజీ విమానంలో ఖాట్మండు చేరుకున్నారు.

మరుసటిరోజు ఖాట్మండు నుంచి బయలుదేరి సాయంత్రానికి నేపాల్ బోర్డర్ " ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ " ప్రాంతంలో ఇమ్మిగ్రేషన్ ఆఫీస్ ఉంది. మేము అక్కడికి వెళ్ళడం ఆలస్యమైనందున మరుసటిరోజు ఉదయం రమ్మన్నారు. రాత్రి అక్కడే బసచేసాం. దట్టమైన అడవులు, ఎత్తైనకొండలు, కోనలు, నదీ ప్రవాహం .. మేము బసచేసిన లాడ్జి విచిత్రంగా ఉంది. 200 అడుగుల లోతులో నది ప్రవహిస్తోంది. కొండ ఏటవాలు ప్రదేశంలో పిల్లర్స్ వేసి కర్రలు, పలకలతో లాడ్జి నిర్మించారు. మేము ఉన్న రూమ్ నుంచి చూడగా నది మధ్యలో మేమున్నాం .. అంటే గాలిలో ఉన్నట్లుండి ఒక్కసారిగా భయపడ్డాం.

ఉదయం 10 గంటలకు ఇమ్మిగ్రేషన్ ఆఫీసులో ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని .. " ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ " దాటితే టిబెట్. చైనా వారు ఏర్పాటు చేసిన ల్యాండ్ క్రూసర్ వాహనాలలో .. ఒక్కొక్కదానిలో నలుగురు చొప్పున కూర్చొని సాయంత్రానికి " న్యాలం " అనే ఊరు చేరుకున్నాం. రాత్రి వారు ఏర్పాటు చేసిన టెంట్స్‌లో .. అవి చిన్నవిగా ఉండడం వల్ల ఒక్కొక్క టెంట్‌లో ఇద్దరికి మాత్రమే పడుకునే అవకాశం ఉంది.

ఉదయం 6 గంటలకు అందరం లేచి ప్రయాణానికి సిద్ధం అవుతున్నాం. నిన్నటి వరకూ ప్రకృతి అందాలను తిలకిస్తూ ప్రయాణం చేసిన మేము ' న్యాలం ' లో చూస్తే అంతా ఎడారిలా .. ఎటువంటి చెట్లు లేకుండా వుంది. అస్సలు పచ్చదనం లేదు, ఒక నదీ ప్రవాహం లేదు. శ్వాస ఆడటం కష్టంగా వుంది. ఈలోగా " టిఫిన్ రెడీ " అన్నారు. " తిందాం " అనుకుంటే వాంతి వచ్చేలా వుంది. తినకుండానే ల్యాండ్‌క్రూసర్

(కారు)లో  పత్రీజీ, భీమాస్ రఘు, కంచి రఘురాం, నేను ఇలా ఒక్కొక్క వాహనంలో నలుగురు చొప్పున బయలుదేరాం.

ఎడారిని తలపించే ఇసుకదిబ్బలు, నల్లటి కొండలు, పచ్చదనం లేనేలేదు. ప్రయాణం సాగుతూవుంది. నేను కొంతసేపటికి కళ్ళు మూసుకున్నాను. వెంటనే నా చెవిలో ఒక వ్యక్తి స్వరం .. " నువ్వు భోజనం చేయవద్దు; భోజనం చేస్తే కైలాస పర్వతం పరిక్రమ చేయలేవు " అని పదే పదే వినిపిస్తోంది. నాలుగు రోజులు ప్రయాణం చేసి మానస సరోవరం చేరుకున్నాం. రాత్రి అక్కడ గెస్ట్‌హౌస్‌లో  బసచేసి ఉదయం మానస సరోవరంలో స్నానం, తీర్థం తీసుకొని " దార్చన్ " అనే ఊరు చేరుకున్నాం.

కైలాస పర్వతం వెళ్ళేవారికి ' దార్చన్ ' బేస్ క్యాంప్. రాత్రి అక్కడే బస. రాత్రంతా శ్వాస ఆడలేదు, నిద్ర కూడా సరిగ్గా పట్టలేదు. " ఉదయం 6 గంటలకే పరిక్రమం చేయాలనుకున్న వారు త్వరగా రెడీ అవ్వండి " అని మా గైడ్ మాటలు వినపడ్డాయి. సముద్రమట్టానికి దాదాపు 18,000 అడుగులు ఎత్తులో ఉన్నందున శ్వాస ఆడక అందరూ నీరసించిపోయారు. 17 మంది అక్కడే ఉండిపోగా 15 మంది మాత్రం బయలుదేరాం. కైలాస పర్వతం పరిక్రమ మొత్తం దూరం 52 కిలోమీటర్లు. దార్చన్ నుండి 10 కి.మీ. జీపులో వదులుతారు. మూడవరోజు 10 కి.మీ. తిరిగి తీసుకొస్తారు. మిగిలిన 32 కి.మీ. మూడురోజులలో కాలినడకన పరిక్రమ చేయాలి. మేము 15 మంది, మాకు తోడుగా వంటవాళ్ళు, గైడ్స్ అంతా కలసి బయలుదేరాం!

మూడురోజులు పాటు కుడిప్రక్కగా కైలాసపర్వతం, ఎడమవైపు నదీ ప్రవాహం, మంచుకొండల మధ్యలో ప్రయాణం. మేము బయలు దేరిన

తరువాత నడక సాగక దూర దూరంగా నడుస్తూ ఉన్నాం. నాకు ఎడమవైపు ఒక ఆస్ట్రల్ మాస్టర్ వచ్చి " మీకు ముందూ, వెనుకా 10 అడుగుల దూరంలో ఎవ్వరూ రాకుండా చూసుకుని నడవాలి; అప్పుడే నేను మీతో రాగలను " అన్నారు. " ఇంతకీ ఎవరు మీరు? " అని అడిగాను. " నేను మాంధాత మహర్షి శిష్యుడిని .. మాంధాత మహర్షిగారు మీతో నడుస్తూ .. మీకు ఎనర్జీ ఇమ్మని చెప్పారు; ఆయన ఆజ్ఞ ప్రకారం వచ్చాను " అన్నారు! కొంత దూరం నడిచాక " నా ఏరియా అయిపోయింది, నేను వెళ్తున్నాను " అని ఆయన వెళ్ళిపోయారు!

కొంతసేపటికి " మూషిక రాజు " వచ్చారు. నా ఎత్తులో ఉన్న ఆయనను చూసి .. చిరునవ్వు నవ్వాను. ఇంతలో ఆయన " నన్ను తక్కువ అంచనా వేయవద్దు; నా వెనుక ఎవరున్నారో చూడు " అన్నారు. ఆయన వెనుక విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి వస్తూన్నారు! నేను వెంటనే " మీరు వద్దులే స్వామీ .. ఈయన చాలు " అన్నాను. కాస్సేపటికి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. అప్పుడు మూషికరాజుతో మాట్లాడుతూ " మిమ్మల్ని ఎవరు పంపారు? " అని అడిగాను. కుడిచేతివైపు చూపి " పెద్దాయన " అన్నారు. " ' పెద్దాయన ' అంటే ఎవరు? " అని అడిగాను. " శివ మాస్టర్ " అని చెప్పారు. కొంత దూరం వెళ్ళాక " నా ఏరియా అయిపోయింది; నేను వెళ్తున్నాను " అని వెళ్ళిపోయారు!

కొంతసేపటికి " నాగాభరణి మాస్టర్ " వచ్చారు. తరువాత నారద మహర్షి వచ్చారు. " వచ్చాడబ్బా! కలహాల రాయుడు " అని నా మనస్సులో అనుకున్నాను. వెంటనే ఆయన " నీకు మంచి చేయడానికే వచ్చాను .. ఇప్పటి వరకూ వచ్చిన మాస్టర్స్ శివ మాస్టర్ ఆజ్ఞతోనే నీ వద్దకు వచ్చి

నీకు ఎనర్జీ ఇస్తూ నిన్ను నడిపించారు ” అని చెప్పి కొంతసేపటికి ఆయన కూడా వెళ్ళిపోయారు!

నేను మెల్లిగా నడుస్తూనే ఉన్నాను. కొంత దూరంలో ఒక తెల్లని కుందేలు నన్ను చూసి గంతులు వేస్తోంది (మన పెంపుడు కుక్క చాలా రోజుల తరువాత మనల్ని చూస్తే ఎలా గంతులు వేస్తోందో అలా). “ ఈ సీన్ ఎక్కడో చూసానే ?! ” అని అలోచిస్తున్నాను. అంతలో సమీపంలో యాక్స్(బర్రెలు) కాపరి దగ్గరికి రాబోయాడు. వెంటనే కుందేలు కలుగులోకి వెళ్ళింది. అక్కడ మట్టి ఇసుకలాగా చాలా మెత్తగా ఉంటుంది. చిట్టి ఎలుకలు, కుందేళ్ళు ఎక్కువగా ఉంటాయి. మనం దగ్గరకు వెళ్తే కలుగులోకి వెళ్ళిపోతాయి. కలుగులోకి వెళ్ళిన కుందేలు నాకు ఆస్ట్రల్‌గా “ నువ్వు ఆలోచిస్తున్నది కరెక్ట్! రెండు నెలలు ముందు నువ్వు తిరుపతి మహతి అడిటోరియంలో ధ్యానం చేస్తూన్నప్పుడు నీకు ఈ సన్నివేశం చూపించాను ” అని చెప్పింది. ఎంత గొప్ప మాస్టర్ అయితే ఇలా చెప్పగలిగింది!?

మాకంటే ముందుగా వెళ్ళిన టూర్ ఆర్గనైజర్స్ .. మొదటి రోజు బస కోసం టెంట్స్ వేసి, మేము వెళ్ళిన వెంటనే టీ ఇచ్చారు. ఒక్కొక్క టెంట్‌లో ఇద్దరు మాత్రమే ఉండగలరు. విపరీతమైన చలిలో అందరం టీ త్రాగి ఎవరి టెంటులోకి వారు వెళ్ళాం. కొంత సేపటికి భోజనానికి రమ్మని పిలిచారు. నేను భోజనం చేయటంలేదు కనుక వద్దని చెప్పి .. నా వద్ద ఉన్న డ్రై ఫ్రూట్స్ తిని, స్లీపింగ్ బ్యాగ్ ఓపెన్ చేసి పడుకున్నాను. రాత్రి 1 గంటకు మెలకువ వచ్చి నిద్ర పట్టడం లేదు. మరుసటి రోజు ఇంకా కష్టమైన ప్రయాణం అని సాయంత్రమే గైడ్ చెప్పాడు. “ నిద్ర లేకపోతే ఎలా? ” అని “ ధ్యానం అయినా చేద్దాం ” అని విపరీతమైన చలి వుంది కాబట్టి

టెంటులోనే ధ్యానం చెయ్యటానికి కూర్చున్నాను. నాకు 20 అడుగుల దూరంలో ‘ 52’ అనే అంకె కనబడుతోంది. ధ్యానం కుదరడం లేదు. నా ప్రయాణం మొదలయినప్పటి నుంచీ కుటుంబం గురించి గానీ, వ్యాపారం గురించి గానీ ఆలోచించలేదు. “ ఎందుకు ‘ 52 ’ అంకె కనబడుతోంది?” అని ప్రశ్నించుకున్నాను.

వెంటనే అటువైపునుంచి “ మేము 52 మందిమి వివిధ ప్రాంతాలలో ఆత్మహత్య చేసుకున్నాం. శరీరం విడిచిన తరువాత ఎటు వెళ్ళాలో తెలియక తిరుగుతూ వుంటే .. మీరు కనబడ్డారు; మీ దగ్గర నుంచి ఒక వెలుగు కనబడుతోంది; మాకు ఏదైనా దారి చూపి సహాయం చేయండి ” అన్నారు!


నేను ఇలాంటి సన్నివేశం ఎప్పుడూ చూడలేదు, వినలేదు. వెంటనే ఒక ఆలోచన వచ్చింది. “ శరీరం ఉంటే ధ్యానం- శ్వాస మీద ధ్యాస పెట్టాలి అని చెప్పేవాళ్ళం; శరీరం లేదు కాబట్టి .. శరీరం వదిలివేసిన తరువాత మీకు ఇక్కడ పనిలేదు, ఇక్కడ వుంటే ఏం లాభం లేదు .. ఆత్మ లోకాలకు వెళ్ళాలి ” అని చెప్పగానే మూడు బ్యాచ్‌లుగా 52 ఆత్మలు వెళ్ళిపోయాయి! వెంటనే మళ్ళీ రెండు ఆత్మలు వచ్చాయి. వారిని వివరాలు అడుగగా ఒకరు పంజాబ్, రెండవ వారు నేపాల్‌లో ఆత్మహత్య చేసుకున్నవారు. వీరికి కూడా అదే విధంగా చెప్పి పైలోకాలకు పంపాను. తర్వాత హాయిగా నిద్రపోయాను.

రెండవరోజు అతికష్టమైన ప్రయాణం .. నిలువెత్తు మంచుకొండలు ఎక్కుతూ ఉంటే అతి ఎత్తైన ప్రదేశం కాబట్టి శ్వాస ఆడటంలేదు. మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ “ డోలమా పాస్ ” చేరుకున్నాం. అద్భుతం! సముద్ర మట్టానికి 19,500 అడుగుల ఎత్తులో ఉన్నాం. మంచు బిందువులు సుతి మెత్తగా పైనుంచి ముత్యాలులా మా పై పడుతూంటే ఒకవైపు దూరంగా

ఎవరెస్ట్ శిఖరం, మరోవైపు ప్రక్కనే కైలాస పర్వతం, ఎటు చూసినా మంచు పర్వతాలు మెల్లగా కరుగుతూ గలగలా ప్రవహించే నీరు అతి చల్లగా .. తాకాలంటే భయం వేస్తోంది. మధ్యమధ్యలో ఉష్ణగుండాలను దాటుకుంటూ సాయంత్రానికి వారు ఏర్పాటుచేసిన టెంట్స్ వద్దకు చేరుకుని అక్కడే రాత్రి బస చేసాం.

మూడవరోజు ఉదయాన్నే బయలుదేరుతూంటే మా ప్రక్కనే చిట్టి ఎలుకలు, పొట్టిపొట్టి కుందేళ్ళు చిందులేస్తూ మాకు వీడ్కోలు పలుకుతూండగా .. మధ్యాహ్నం 1 గంటకు బేస్ క్యాంప్‌కు చేరుకున్నాం. పత్రీజీ మూడు రోజుల అనుభవాలు చెప్పమని అడుగగా సవివరంగా తెలియజేసాను.

నాలుగు రోజుల తరువాత ఖాట్మండు తర్వాత ఇండియా చేరుకున్నాం. ఈ విధంగా మా మొదటి కైలాస మానస సరోవర ధ్యానయాత్ర ఆత్మానందకరంగా మరి దిగ్విజయంగా జరిగింది.



2001-మానస సరోవరంలో పత్రీజీతో D.కేశవరాజు

# " 2006- రెండవసారి ..
# మానస సరోవర యాత్ర "

తిరుపతి నుంచి సీనియర్ పిరమిడ్ మాస్టర్ కంచి రఘురామ్ ఆధ్వర్యంలో 2001 నుంచి ప్రతి సంవత్సరం కైలాస మానస సరోవర యాత్ర నిర్వహిస్తూండగా 2006లో యాత్రకు ఏర్పాట్లు జరిగిపోయాయి.

కంచి రఘురామ్‌కు చిన్న ఆరోగ్య సమస్య రావడంతో .. " ఈసారి కైలాస మానస సరోవర యాత్రను కంచి రఘురామ్‌కు బదులుగా కేశవరాజు నిర్వహించాలి " అని పత్రీజీ ఆజ్ఞాపించారు. నేను " అలాగే సార్ " అన్నాను. 32 మంది బెంగళూరు విమానాశ్రయం నుంచి ఢిల్లీకి .. అక్కడ ఐదు గంటల విరామం తరువాత ఖాట్మండుకు చేరుకోగా .. ట్రావెల్ ఏజెంట్ మమ్మల్ని రిసీవ్ చేసుకుని మంచి హోటల్‌లో బస ఏర్పాటు చేసారు. మరుసటిరోజు ఖాట్మండులో పశుపతినాథ దేవాలయం, బుద్ధ దేవాలయం సందర్శించి .. ధ్యానం చేసి విరామం తీసుకున్నాం.

రెండవరోజు ఖాట్మండు నుంచి బయలుదేరి సాయంత్రానికి చైనా బోర్డర్, ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్ దగ్గర ఇమ్మిగ్రేషన్ పూర్తిచేసుకుని .. అంతవరకూ మాతో వచ్చిన కంచిరఘురామ్ మరి వారి కుమారుడు సాయి వీడ్కోలు పలుకగా మా యాత్ర ప్రారంభమైంది.

రాత్రి న్యాలంలో బస చేసాం. “ కైలాస మానస సరోవర యాత్రకు వెళ్ళేవాళ్ళు రెండు రోజులు న్యాలంలో బసచేసి ప్రయాణం చెయ్యాలి. అప్పుడే మనం ఆ వాతావరణంకు అలవాటుపడతాం ” అని మా గైడ్ చెప్పారు.

మా గ్రూపులో ధర్మవరం మేడమ్, మహబూబ్‌నగర్ మేడమ్ ఆరోగ్యం సరిగ్గాలేక, నడవలేని స్థితిలో అతి కష్టం మీద వారిని తీసుకుని సాగా బయలుదేరాం. పోనుపోను ఎత్తైన ప్రదేశాలు మరి పచ్చని చెట్లు, పచ్చిక బయళ్ళు ఉండవు ఆక్సిజన్ లేక అడుగు తీసి అడుగు వేయాలన్నా శ్వాస కష్టం అవుతుంది. అక్కడ ఆంధ్రా భోజనం దొరకదు. వాళ్ళ వంటలు మనకు నచ్చవు. అయినా మనం కైలాస పర్వతం, మానస సరోవరం దర్శించాలి, ధ్యానం చేయాలి అదే లక్ష్యంగా ముందుకుసాగాం.

సాయంత్రానికి “ సాగా ” చేరుకున్నాం. ఇద్దరు మేడమ్స్ చాలా అనారోగ్యంగా ఉన్నారు. వాళ్ళు జీపులోనుంచి క్రిందకు కూడా దిగలేని పరిస్థితి. మనవాళ్ళు మోసుకుని లాడ్జిలోకి తీసుకుని వచ్చారు. వారు ఆహారం తీసుకోవడం లేదు కాబట్టి స్పూన్‌తో పాలు తాగించారు. వాళ్ళు చాలా నీరసంగా వున్నారు. మా గైడ్ నా వద్దకు వచ్చి “ వాళ్ళిద్దరినీ వెనక్కు పంపించేద్దాం. లేకుంటే  చాలా కష్టం; ఏదైనా జరిగితే ట్రిప్పు మొత్తం కేన్సిల్ అవుతుంది. కాబట్టి వారిద్దరినీ ఖాట్మండుకు పంపితే ఆరోగ్యం బాగుంటుంది. మనం చాలా ఎత్తైన ప్రదేశాలకు వెళ్తున్నాం కనుక ఆక్సిజన్ అందక చాలా ఇబ్బంది పడాల్సివుంటుంది ” అని చెప్పారు.

నాకు వాళ్ళిద్దరనీ వెనక్కు పంపడం ఇష్టంలేదు. ఎందుకంటే ఒక్కొక్కరూ లక్ష రూపాయలు యాత్ర కోసం కట్టారు. అంతేగాక జీవితంలో మళ్ళీ మళ్ళీ కైలాస మానస సరోవర యాత్ర చేసుకునే అవకాశం రాకపోవచ్చు.

అందువల్ల గైడ్‌తో " ఈ రోజు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నాం కదా! రేపు ఆలోచిద్దాం " అన్నాను.

రాత్రి 10 గంటల వరకు అందరికీ ఏర్పాట్లు చూసిన తర్వాత నేను మొదటి అంతస్థులో ఏర్పాటు చేసిన రూమ్‌కు వెళ్ళి పడుకునే ముందు " కొంతసేపు ధ్యానం చేద్దాం " అని కూర్చుని ఒక సంకల్పం చేసాను.

" దేశం కాని దేశం, పవిత్ర పుణ్యక్షేత్రం, శక్తిక్షేత్రం అయిన కైలాస మానస సరోవర యాత్రకు వస్తే ఏంటీ మాకు ఇన్ని కష్టాలు? " అని మనస్సులో అనుకుని ధ్యానంలో కూర్చున్నాను.

నా సూక్ష్మశరీరం విడుదలై ఒక ప్రదేశం వెళ్ళాను. అక్కడ శివ మాస్టర్, బుద్ధుడు, కృష్ణుడు, రాముడు, ఆంజనేయస్వామి, పత్రీజీ మొదలైన అనేక మాస్టర్స్ ఒక సాంస్కృతిక కార్యక్రమంలో బిజీగా ఉన్నారు! ధ్యానస్థితిలో ఉన్న నా సూక్ష్మశరీరాన్ని చూసిన శివ మాస్టర్ .. " ఎప్పుడూ ధ్యానమేనా? .. రా! మాతో ఎంజాయ్ చెయ్యి! " అన్నారు. నేను వారితో " మీకేం హాయిగా ఉన్నారు! మీ దగ్గరకు వస్తుంటే ఎన్ని కష్టాలు .. మా గ్రూపులో ఇద్దరు చావుబ్రతుకులలో ఉన్నారు; ఏం చెయ్యాలి? " అన్నాను. వెంటనే శివ మాస్టర్ రాముడిని చూసారు; ఆయన ఆంజనేయస్వామిని చూసారు; వెంటనే ఆంజనేయస్వామి తల ఊపారు.

అప్పుడు శివ మాస్టర్ నాతో " మీ టూర్‌కు ఆంజనేయస్వామి ఇన్‌ఛార్జ్! ఏ సమస్యా లేకుండా మీరు మీ మీ ఇళ్ళకు చేరే వరకూ బాధ్యత తీసుకుంటారు; మీరు నిశ్చింతగా ఉండండి " అన్నారు. వెంటనే ఆంజనేయస్వామి వద్ద నుంచి ఒక వెలుగు ప్రసారమై మా లాడ్జిపై అరగంటసేపు నిలిచింది. ఆ వెలుతురుతో పాటు నేను కూడా వచ్చి తరువాత

వారు జరుపుకుంటోన్న సాంస్కృతిక కార్యక్రమాల వద్దకు వెళ్ళి కార్యక్రమాలలో పాల్గొని పూర్తి అయిన తరువాత తిరిగి లాడ్జికి వచ్చాను. అప్పుడు ధ్యానంలో నుంచి లేవగా రాత్రి 12.30 అయ్యింది.

మరుసటిరోజు లేచి చూడగా నిన్నటివరకూ అనారోగ్యంతో ఉన్న వారిద్దరూ లేచి రెడీ అయ్యి .. ఉత్సాహంగా కనబడ్డారు. అంటే ఆంజనేయస్వామి ఎనర్జీ ఇచ్చి వారిద్దరినీ బాగుచేసారని అర్థం అయ్యింది. ఇక ఎలాంటి సమస్య లేకుండానే కైలాస మానససరోవర యాత్ర పూర్తి చేసుకుని ఖాట్మండుకు చేరుకున్నాం!

ఖాట్మండు చేరిన వెంటనే పత్రిసార్‌కు ఫోన్ చేసాను. సార్ మాట్లాడుతూ " కేశవరాజు ! నీకు అప్పగించిన పని అద్భుతంగా నిర్వహించావు; ఇండియా వచ్చిన తరువాత ఇంకా వివరంగా మాట్లాడుకుందాం " అన్నారు. నేను చెప్పకుండానే అన్ని విషయాలు సార్‌కు ఎలా తెలిసాయి? దటీజ్ ' పత్రీజీ ' !

ఒకరోజు విశ్రాంతి తరువాత ఖాట్మండు నుంచి ఢిల్లీ .. ఢిల్లీ నుంచి బెంగళూరు, మద్రాసు, హైదరాబాద్‌కు మూడు ఫ్లైట్స్‌లో వారి వారి గమ్యాలకు చేరాలి. మేము ఢిల్లీ నుండి ఖాట్మండుకు వెళ్ళేటప్పుడు ఢిల్లీలో ఫ్లైట్ మారడానికి ఐదు గంటలు సమయం ఉండేటట్లు టికెట్సు బుక్ చేసారు. తిరుగు ప్రయాణంలో ఖాట్మండు నుంచి ఢిల్లీ వచ్చిన తరువాత ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి ఫ్లైట్ ఎక్కడానికి ఒక గంట సమయం మాత్రమే వుంది. ఈ లోగా ఇమ్మిగ్రేషన్, లగేజీ, ఎయిర్‌పోర్ట్ మారడం అసాధ్యం. ఒకవేళ ఖాట్మండు నుండి ఢిల్లీ ఫ్లైట్ లేటయితే ఏంటి పరిస్థితి? ఢిల్లీ నుంచి ఖాట్మండుకు వెళ్ళేటప్పుడు కూడా ఒక గంట

ఆలస్యమయ్యింది అని ఆలోచించి నేను ఖాట్మండులో ఎయిర్ ఇండియా ఆఫీసుకు వెళ్ళి ఆఫీసర్‌ను కలిసాను. అప్పటికి ఉదయం 10.30 గంటలు. ఆయన కంప్యూటర్‌లో చూసి " ఇప్పటి వరకూ కరెక్ట్ టైమ్‌కు అన్ని ఫ్లైట్స్ వెళ్తున్నాయి " అన్నారు. " మేము కైలాస మానస సరోవర యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వెళ్తున్నాం. ఒక వేళ లేటైతే మాకు ఇబ్బంది; మీరే సహాయం చెయ్యాలి " అని అడిగాను. అప్పుడు ఆయన ఖాట్మండు మరి ఢిల్లీ ఆఫీసర్స్‌తో మాట్లాడి " ఒక స్పిరిచ్యువల్ గ్రూప్ కైలాస మానస సరోవర యాత్రకు వెళ్ళి వచ్చారు. వారు ఖాట్మండు నుంచి ఢిల్లీ .. ఢిల్లీ నుంచి హైదరాబాద్, మద్రాసు, బెంగళూరు వేరు వేరు ఫ్లైట్స్‌లో వెళ్ళాలి; ' ప్లీజ్ కనెక్ట్ ' " అని మెయిల్ పెట్టి " ఇక మీరు వెళ్ళండి " అని చెప్పారు.

నేను మా లాడ్జికి వచ్చి అందరం బయలుదేరి ఖాట్మండు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాం. అనుకున్న విధంగానే మా ఫ్లైట్ లేటవుతోంది. ఇంకా లేటైతే ఢిల్లీలో టైమ్‌కు చేరుకోలేం. ఈ విషయాన్ని అక్కడ ఉన్న ఆఫీసర్స్‌తో మాట్లాడాను. ఆయన మేనేజర్ వద్దకు తీసుకెళ్ళి పరిచయం చేసారు. మేనేజర్ గారు నన్ను ఒక స్నేహితుడిలాగా, బంధువులాగా మాట్లాడుతూ ఫోన్‌లో వాళ్ళ కోడ్ భాషలో ఏదో మాట్లాడారు. " ఇక మీ పని అయిపోయింది వెళ్ళండి " అన్నారు. ఆయన సమాధానం నాకు తృప్తిగా లేదు. అది గమనించిన ఆయన " ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ వారికి విషయం చెప్పాను; మీకు ఎలాంటి సమస్య రాదు; సమస్యవస్తే నాకు ఫోన్ చెయ్యండి " అంటూ వారి పర్సనల్ విజిటింగ్ కార్డ్ ఇచ్చారు.

మేమందరం లాంజిలో వేచి వున్నాం. కాస్సేపటికి మా ఫ్లైట్ వచ్చిందని చెప్పగా ఫ్లైట్ ఎక్కాం. కొద్దిసేపటికి ఎయిర్‌హోస్టర్స్‌తో విషయం చెప్పాను.

అరగంట తర్వాత ఎయిర్‌హోస్టెస్ నా వద్దకు వచ్చి “ మీరు ఖాట్మండు ఎయిర్‌పోర్ట్ మేనేజర్‌తో మాట్లాడిన విషయాన్ని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మేనేజర్ గారికి చెప్పారట. మీ కోసం ఇద్దరు ఆఫీసర్స్‌ను ఏర్పాటు చేసారు. మిమ్మల్ని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వారు రిసీవ్ చేసుకుని డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్ ఎక్కించే వరకూ బాధ్యత తీసుకుంటారు ” అని తెలియజేశారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగాం. లగేజీ తీసుకుని మన గ్రూప్‌ని తొందరపెడుతూండటం చూసిన ఇద్దరు ఆఫీసర్స్ నా వద్దకు వచ్చి “ మీరేనా మా మేనేజర్‌కు ఫోన్ చేసింది? ” అన్నారు. “ మీకు డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్ వరకూ టాక్సీలు ఏర్పాటు చేసాం. మీరు ఏమీ చెల్లించవలసిన అవసరం లేదు. అంతా డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది ” అని టాక్సీలలో మమ్మల్ని ఎక్కించారు. మా లగేజీ చూసి .. డ్రైవర్ “ లగేజీ చాలావుంది, లగేజీకి ఐదువందలు ఇవ్వండి ” అన్నారు. వెంటనే ఆఫీసర్స్ “ టాక్సీ వారికి 100 రూపాయలు ఇవ్వండి చాలు ” అని డ్రైవర్‌కు నచ్చచెప్పి పంపారు. నేను చివరి కారులో ఎక్కాను.

ఎయిర్‌పోర్ట్ నుంచి మెయిన్ రోడ్డుకు వచ్చాం. నేను డ్రైవర్ ప్రక్క సీటులో కూర్చున్నాను. ఎదురుగా దూరం నుంచి ఎర్ర సిగ్నల్ కనబడుతూ ఉంటే .. “ ఎలా ఇప్పటికే లేటయ్యింది కదా ? ” అనుకుంటూ ముందుకు వెళ్తూంటే సిగ్నల్ దగ్గరకు వచ్చేసరికి గ్రీన్ సిగ్నల్ పడుతోంది! ఇలా నాలుగైదు సిగ్నల్స్ దాటి డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌కు చేరాం. కౌంటరు ముందు ప్రయాణీకులు ఎవ్వరూ లేరు. మేము వెళ్ళి కౌంటర్ల వద్ద నిలబడి బోర్డింగ్ పాస్ అడిగాం. “ బుకింగ్ క్లోజ్ అయ్యింది ” అన్నారు. మా సమస్య

వివరించి చెప్పాం. “ మాకు పవర్స్ లేవు! మా మేనేజర్ గారు ఎప్పుడూ కౌంటర్‌కి రారు. ఈ రోజు మాత్రమే ఎందుకో వచ్చారు. ఆయన మాత్రమే మీ సమస్యని పరిష్కరించగలరు ” అన్నారు. వెంటనే మేనేజర్ గారు ఉన్న కౌంటర్‌కి వెళ్ళి జరిగిన విషయం చెప్పగా .. “ మీరు వెళ్తూంది ఒకే ఫ్లైటా ? ” అని అడిగారు. “ కాదు సార్! మూడు ఫ్లైట్స్ .. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్” అని వివరించాను. “ హైదరాబాద్ వెళ్ళేవారికి నేను బోర్డింగ్ పాస్ ఇస్తాను; మిగిలిన వారు వేరే కౌంటర్లలో తీసుకోండి ” అని చెప్తూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ వారితో మాట్లాడి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న మూడు ఫ్లైట్లను ఆపారు! హైదరాబాద్ ఫ్లైట్‌లో వెళ్ళే మేడమ్ చాలా వయస్సు అయిన ఆవిడ కాబట్టి ఆమెకు ఒక వీల్‌చైర్ తెప్పించి ఆఫీసర్‌ను తోడుగా పంపి ఫ్లైట్ ఎక్కించారు. మేము బోర్డింగ్ పాస్ తీసుకునేలోగానే ఆఫీసర్ ఆమెను ఫ్లైట్‌లో కూర్చోబెట్టి వీడ్కోలు పలికి వచ్చారు. మేము వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఫ్లైట్స్‌లో మా గమ్యస్థానాలు చేరుకున్నాం!

మా యాత్ర మొత్తం ఆంజనేయస్వామి దగ్గర ఉండి నడిపించారని మేమందరం గ్రహించాం !!




2006–ఖాట్మాండ్‌లో మానససరోవర యాత్ర మాస్టర్స్‌తో D.కేశవరాజు

# " తిరువణ్ణామలై .. అహింసా ధ్యాన మహాయజ్ఞం "

2007 జూన్ నెలలో ధ్యాన ప్రచారంలో భాగంగా విశాఖ జిల్లా " పాడేరు " వెళ్ళాను. పత్రీజీ ఫోన్ చేసి " ఎక్కడ ఉన్నావు? " అని అడిగారు. " పాడేరులో 11 మండలాలలో ధ్యానప్రచారం కోసం జాయింట్ కలెక్టర్ పిలుపు మేరకు వచ్చాను " అని చెప్పాను. " ఆ పని నీది కాదు; తిరుపతి వెళ్ళి వారం రోజులు విశ్రాంతి తీసుకుని తర్వాత తిరువణ్ణామలై వెళ్ళు; తిరువణ్ణామలైలో డిసెంబర్ 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అహింసా ధ్యానమహాయజ్ఞం నిర్వహించబడుతుంది. అక్కడ ధ్యానప్రచారం చెయ్యి " అన్నారు.

తమిళనాడు మాస్టర్స్ జగదీష్, సునీత, మధుసూదన్ గార్లు మరి జ్యోతి మేడమ్ ఇంకా చెన్నై మాస్టర్స్ ద్వారా తిరువణ్ణామలైలో ప్రతి పౌర్ణమికి లక్షల మంది గిరి ప్రదక్షిణకై వచ్చే వారికి కరపత్రాలను పంపిణీ చేసేవారు. ధ్యానం నేర్పించడానికి రమణమహర్షి, శేషాద్రి ఆశ్రమం దగ్గరలో అగ్నిలింగం కాలనీలో ఒక సెంటర్ ఏర్పాటు చేసారు. సెంటర్‌కు సమీపంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఆంధ్ర మరి తమిళనాడు మాస్టర్లు పదిమంది అక్కడే ఉండి ధ్యాన ప్రచారం నిర్వహించే వాళ్ళం.

పత్రీజీ “ అహింసా ధ్యాన మహాయజ్ఞం ” నిర్వహణ బాధ్యతను మారం శివప్రసాద్, చెన్నై జగదీష్ మరి నాకు అప్పగించారు. మారం శివప్రసాద్ ఆంధ్రలో, జగదీష్ తమిళనాడులో విరాళాలు సేకరించటానికీ మరి నేను సెంటర్ నిర్వహణ, ధ్యానప్రచారం ఇలా మూడు విభాగాలుగా ఏర్పరచుకుని తమిళనాడు మరి ఆంధ్రప్రదేశ్ నుంచి మాస్టర్లను రప్పించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అద్భుతంగా ధ్యాన ప్రచారం నిర్వహించాం.

అక్టోబర్‌లో కమిటీ ఏర్పాటు చేసి మధుసూదన్ గారి కుటుంబం, వెంకటాచలం గారి కుటుంబం, సువర్ణమేడమ్ కుటుంబం, సుబ్రహ్మణ్యం గారి కుటుంబం, స్వర్ణశ్రీ మేడమ్, తిరుత్తణి శ్రీనివాస్ గారు ఇంకా తమిళనాడు మరి ఆంధ్ర మాస్టర్స్ సంపూర్ణ సహాయసహకారంతో ధ్యానయజ్ఞం అద్భుతంగా జరిగింది!

శ్రీకాళహస్తి మాస్టర్స్ మణి, ఉదయ్, శివ, శాంతి, కడప జిల్లా మాస్టర్ భానుప్రసాద్, వైజాగ్ మాస్టర్ రామరాజు, కిషోర్, గుడివాడ లక్ష్మి మేడమ్ ఏలూరు ఝాన్సీ మేడమ్, ఒంగోలు సునీల్ కుటుంబం .. ఇంకా అనేక మంది ఆరు నెలలపాటు ధ్యాన ప్రచారంలో పాల్గొని దిగ్విజయం చేసారు!

తిరువణ్ణామలై గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో 2007వ సంవత్సరం డిసెంబర్ 25 నుంచి 31 వరకు నిర్వహించిన యజ్ఞం అత్యంత వైభవంగా జరగడానికి కారణం “ మధుసూదన్ గారి కుటుంబం ” యొక్క గొప్ప సంకల్పం. PSSMలో మొట్టమొదటిసారి సూపర్ స్ట్రక్చర్స్‌తో చంద్రా డెకార్స్, చెన్నై వారు పందిళ్ళు అద్భుతంగా వేశారు. తమిళనాడులో క్యాటరింగ్‌లో గొప్ప పేరున్న “ అరుణశాస్త్రి క్యాటరర్స్ ”, వెల్లూరు, వారి సేవలు అమోఘం. ఆ పందిళ్ళు, భోజనాలు గురించి ఇప్పటికీ ప్రతి యజ్ఞంలో చర్చించుకునే విధంగా చాలా అద్భుతంగా చేసాం!

మారం శివప్రసాద్ గారు ఆంధ్ర, జగదీష్ తమిళనాడులో విరాళాలు సేకరించటానికి వెళ్ళగా నేను పందిళ్ళు(సూపర్ స్ట్రక్చర్స్) వేయించే పనిలో కాలేజీ గ్రౌండ్‌లో ఉన్నాను. పందిళ్ళు వేయటం దాదాపుగా పూర్తి అయ్యింది. మరుసటి రోజు తుఫాన్ వల్ల విపరీతమైన గాలులు వీయగా పైన కప్పిన రేకులు గాలిపటాలు లాగా క్రింద పడిపోతున్నాయి. ఆ సమయంలో పత్రీజీ బెంగళూరు నుంచి ఫోన్ చేసి " పనులు ఎలా జరుగుతున్నాయి? " అని అడిగారు. " బాగా జరుగుతున్నాయి సార్! కానీ, తుఫాను వల్ల వర్షం, విపరీతమైన గాలికి వేసిన రేకులు అన్నీ దాదాపుగా క్రింద పడిపోయాయి" అని చెప్పాను. దానికి పత్రీజీ " ప్రకృతి తన పని తాను చేసుకుని పోతుంది; ఇంకా రెండురోజులు ఇలాగే ఉంటుంది; తరువాత మనం రాత్రి, పగలు పనిచేస్తే పూర్తి అవుతుందిలే " అన్నారు. పత్రీజీ చెప్పిన విధంగానే 25వ తేదీ సాయంత్రానికి సభాప్రాంగణం, డైనింగ్, వంటశాల, స్టోరు, V..I.P. డైనింగ్ ఇలా అన్ని పనులు సకాలంలో పూర్తి అయ్యాయి!

2007 డిసెంబర్, 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పత్రీజీ సందేశాలు, సామూహిక ధ్యానం, ఆధ్యాత్మిక గురువుల సందేశాలు, సంగీత, నృత్య కార్యక్రమాలతో ఏడురోజుల కార్యక్రమం అంబరాన్ని అంటింది!

మారం శివప్రసాద్, జగదీష్, నేను, ముఖ్యంగా చెన్నై టీమ్ మరి పిరమిడ్ మాస్టర్లు అందరం కలసి అద్భుతంగా నిర్వహించుకున్నదే తిరువణ్ణామలై అహింసా ధ్యానమహాయజ్ఞం. ఇందుకు సహాయ, సహకారాలు అందించిందిన అందరికీ ధ్యానవందనాలు.

# " పత్రీజీ ఆదేశానుసారం .. అమర్‌నాధ్ ధ్యానయాత్ర - 2008 "

అమర్‌నాధ్ ధ్యానయాత్ర 185 మంది పిరమిడ్ మాస్టర్లతో నిర్వహించడం జరిగింది. జూన్ నెలలో ఏర్పాట్లకోసం నేను, S.R.ప్రేమయ్య ఢిల్లీ వెళ్ళి అక్కడ మన " పిరమిడ్ మెడిటేషన్ సెంటర్ " లో బస చేసాం. మరుసటి రోజు యాత్రకు వచ్చేవారికోసం కమలానగర్‌లోని ' గీతాభవన్' మేనేజర్‌ని కలసి వసతి గురించి అడుగగా " శాకాహారులకూ, ఆధ్యాత్మికులకూ మాత్రమే ఇస్తాం " అన్నారు. కరెక్టుగా మనం కూడా అదే మార్గంలో ఉన్నందున బుక్ చేయడం జరిగింది.

ఆ రోజు రాత్రి శ్రీనగర్ బయలుదేరాం. మరుసటిరోజు రాత్రి 9.30 గంటలకు శ్రీనగర్ చేరుకున్నాం. మాకు తెలిసిన పిరమిడ్ మాస్టర్‌కు ఫోన్ చేస్తే ఫోన్ కలవడంలేదు. నడిరోడ్డులో ఉన్నాం .. ఎటు వెళ్ళాలో తెలియదు. అంతలో ఒక ఆటో అతను మా దగ్గరకు వచ్చి " మీకు వసతి కావాలా? " అని అడిగాడు. " అవును " అనగానే .. మమ్మల్ని తీసుకెళ్ళి ఒక ఆశ్రమంలో దింపాడు. అప్పుడు సమయం రాత్రి 10.30 గంటలు.

ఉదయం ఆశ్రమం గురువు గారితో మాట్లాడగా .. వారు " ఆశ్రమం ఇస్తాం " అన్నారు. కానీ మనవాళ్ళు రెండువందల మంది వరకూ వస్తారు

కాబట్టి " ఈ ఆశ్రమం సరిపోదు " అని చెప్పాం. మధ్యాహ్నం సమయానికి శ్రీనగర్‌లో మన మెడిటేషన్ సెంటర్‌కు చేరుకున్నాం. అక్కడ విజయలక్ష్మి మేడమ్ గారితో మాట్లాడి తిరిగి సాయంత్రానికి " దాల్ లేక్ " ఎదురుగా ఉన్న పార్క్‌లో కూర్చుని నేను, ప్రేమయ్య మాట్లాడుకుంటూ .. " లాడ్జి కాకుండా ఏదైనా ఆధ్యాత్మిక క్షేత్రం లేక ఆశ్రమం దొరికితే బాగుంటుంది " అనుకున్నాం. కాస్సేపటికి పార్క్ దగ్గరలో ఉన్న లాడ్జ్ యజమాని మా దగ్గరకు వచ్చి వివరాలు తెలుసుకుని " ఇక్కడికి సమీపంలో జ్యేష్ఠాదేవి మందిరం ఉంది; అక్కడ ట్రస్ట్‌లో నేను కూడా మెంబర్‌ని; అక్కడ రూమ్‌లు, హాలు, గార్డెన్, వంటశాల అన్నీ ఉన్నాయి, 200 మందికి సరిపోతుంది. రేపు అక్కడికి వెళ్దాం; మీకు నచ్చితే ఇప్పిస్తాను " అన్నారు. ఉదయం అక్కడికి వెళ్ళి చూస్తే .. దాల్ లేక్ ఎదురుగా, కొండపైన, ప్రకృతి ఒడిలో చాలా అద్భుతంగా ఉంది ఆ ప్రదేశం! వెంటనే 'OK' చెప్పాం. శ్రీనగర్‌లోని ఒక లాడ్జి యజమాని మా వద్దకే వచ్చి మనకు నచ్చే విధంగా వసతి ఏర్పాటు చేసారంటే అది ధ్యానశక్తి మరి పత్రీజీ అనుగ్రహం వల్లనే సాధ్యం!

పత్రీజీ ఆదేశానుసారం శ్రీనగర్‌లో ఉన్న అత్యున్నత మిలిటరీ ఆఫీసర్ " బ్రిగేడియర్ సత్యనారాయణ " గారిని కలవడం, వారికి నా అనుభవాలు చెప్పడం, వారితో కలిసి ధ్యానం చేయడం జరిగింది. " పత్రీజీ, స్వర్ణమాల పత్రి మరి పిరమిడ్ మాస్టర్లు 200 మంది అమర్‌నాథ్ వస్తున్నాం " అని చెప్పాను. వెంటనే ఆయన పర్సనల్ విజిటింగ్‌కార్డ్ ఇచ్చి " యాత్రలో ఏదైనా సమస్యవస్తే ఫోన్ చెయ్యండి " అని చెప్పారు.

అదే సంవత్సరం అమర్‌నాథ్ యాత్రికుల వసతికోసం " బాల్‌తాల్ బేస్ " క్యాంపులో గవర్నమెంట్ వంద ఎకరాలు కేటాయించింది. దానికి

వ్యతిరేకంగా జమ్ము, కాశ్మీరులో అల్లర్లు జరుగుతున్నాయి. " మన యాత్రకు ఏమైనా ఆటంకాలు జరుగుతాయేమో " అని యాత్రకు వచ్చే వాళ్ళు సందేహిస్తున్నారు. " పత్రీజీ ఆధ్వర్యంలో .. పత్రీజీ కేటాయించిన తేదీలలో మన యాత్ర జరుగుతోంది. ఎలాంటి ఆటంకం లేకుండా అద్భుతంగా నిర్వహించుకుంటాం " అని నేను తెలియజేసాను.

యాత్రలో 185 మంది పిరమిడ్ మాస్టర్లు, వంటవాళ్ళు, వాలంటీర్స్ అందరూ కలసి 200 మంది ఆగస్టు 1వ తేదీ ఢిల్లీ కమలానగర్‌లోని గీతాభవన్ చేరుకున్నారు. హిందీ, ఇంగ్లీష్ కరపత్రాలను పంచుతూ గీతాభవన్ చుట్టుప్రక్కల వీధులలో ధ్యానప్రచారం చేసాం. పత్రీజీ వచ్చిన వెంటనే అందరం ఘనస్వాగతం పలికి .. గీతాభవన్‌లో ధ్యానం క్లాసు ఏర్పాటు చేసాం. గీతాభవన్‌లో ఉన్న మేనేజర్, ఉద్యోగులతో పాటు స్థానికులు కూడా పాల్గొన్నారు. మరుసటి రోజు ఢిల్లీలో చూడవలసిన ప్రాంతాలు తిలకించి, రాత్రి 11.30 గం॥లకు 5 బస్సులలో 200 మంది పిరమిడ్ మాస్టర్స్ అమృతసర్ బయలుదేరాం. ఒక్కొక్క బస్సుకు ఇద్దరు మాస్టర్స్‌ను బస్సు ఇన్‌ఛార్జీలుగా నియమించాం. ప్రతి ఒక్కరికీ సీటు నెంబర్‌లు కేటాయించి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసాం.

## ఆగస్టు 2 వ తేదీ

2వ తేదీ మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణదేవాలయం తిలకించి, అక్కడ నుంచి సాయంత్రం 6 గం॥లకు 'వాఘా', ఇండియా - పాకిస్తాన్ సరిహద్దుకు వెళ్ళాం. అక్కడ సాయంత్రం వేళల్లో ఇండియా, పాకిస్తాన్ జవాన్లు ఒకరికొకరు సెల్యూట్ చేసుకోవడం, దేశభక్తి స్లోగన్స్ చెప్పడం చూసి పులకరించిపోయాం..!

రాత్రి అక్కడి నుండి జమ్మూ బయలుదేరాం. అర్థరాత్రి 1.30 గం॥ల ప్రాంతంలో పోలీసులు బస్సులను ఆపారు. "ముందురోజు జమ్మూలో గలాటా జరిగి ట్రాఫిక్ స్తంభించింది. అది క్లియర్ అయ్యేంతవరకూ మీరు వెళ్ళటానికి వీలులేదు; బహూశా ఒకరోజు మీరు ఇక్కడే ఉండాలి " అన్నారు.

మేము కొంతమందిమి బస్సు దిగి రోడ్డు ప్రక్కగా, మెడిటేషన్‌కు కూర్చున్నాం. అప్పుడు నేను "మీ వద్దకు వస్తున్నాం! మాకెందుకు ఈ అవాంతరాలు..?! " అంటూ సంకల్పం చేసి ధ్యానంలో కూర్చున్నాను. " పది నిమిషాలలో మీ దగ్గరికే పోలీసులు వచ్చి 'రోడ్డు క్లియర్ అయ్యింది ఇక వెళ్ళండి' అని పిలుస్తారు .. మీరు అంతవరకు ధ్యానం కంటిన్యూ చేయండి" అని శివ మాస్టర్ సందేశం ఇచ్చారు! అదే విధంగా పది నిమిషాల తర్వాత పోలీసులు వచ్చి మమ్మల్ని వెళ్ళమని చెప్పారు!

## ఆగస్టు 3 వ తేదీ

ఉదయం జమ్మూ బైపాస్ గుండా క్రాస్ చేసి సాయంత్రానికి శ్రీనగర్‌కి 60 కి.మీ. దూరంలో ఆగాం. ఎదురుగా వచ్చే జీపులకు, కార్లకు, లారీలకు, బస్సులకు అద్దాలు పగిలివస్తున్నాయి "కారణమేంటి?" అని అడుగగా " దారిలో ఆందోళన కారులు రాళ్ళు విసురుతున్నారు; మీరు వెళ్ళొద్దు " అని అక్కడివాళ్ళు అన్నారు.

శ్రీనగర్‌కు ఫోన్ చేసి, **బ్రిగేడియర్ G.V. సత్యనారాయణ** గారికి విషయం చెప్పాము. కాస్సేపటికి నాలుగు వాహనాలలో ఆర్మీ వచ్చారు! **మేజర్ శివకుమార్** గారు, **కెప్టెన్ అంకిత్ శర్మ** గారు వచ్చి " మీరేనా ఆంధ్రా నుంచి వచ్చింది? బయలు దేరండి మేమున్నాం!" అంటూ ముందు

రెండు వాహనాలు, వెనుక రెండు వాహనాలు తోడురాగా ఆర్మీ రక్షణతో మమ్మల్నందరినీ సురక్షితంగా శ్రీనగర్ లోని జ్యేష్ఠా దేవి ఆలయ ప్రాంగణం చేర్చారు! అక్కడే రాత్రి బస!

## ఆగస్టు 4 వ తేదీ

4వ తేదీ ఉదయం అందరం రెడీ అయ్యాం. పత్రీజీ, స్వర్ణమాల పత్రి మేడమ్ ఉదయం 10.00 గంటలకు జ్యేష్ఠాదేవి ఆలయ ప్రాంగణానికి రాగానే పిరమిడ్ మాస్టర్లు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.00 గంట వరకు మీటింగ్ హాల్‌లో పత్రీజీ సందేశం మరి ధ్యానం, పిరమిడ్ మాస్టర్ల అనుభవాలు పంచుకున్నారు. తరువాత ముందు ఒక మిలిటరీ జీపు, ఒక మిలిటరీ వ్యాన్ మధ్యలో ఐదు బస్సులు వెనుక ఒక మిలిటరీ జీపు, ఒక మిలిటరీ వ్యాన్ మాతో వెంటరాగా మిలిటరీ నేతృత్వంలో **" బాల్‌తాల్ "** చేరాం. **కల్నల్ డిసౌజా** నేతృత్వంలో **మేజర్ సరోద్‌కర్** అక్కడ మాకు ఆత్మీయ స్వాగతం చెప్పారు!

## ఆగస్టు 5 వ తేదీ

ఉదయం వందమంది హెలికాప్టర్‌లోనూ, మిగిలినవారు నడక, గుర్రం, డోలీలలోనూ వెళ్ళి **అమర్‌నాథ్** దర్శించి కొంతమంది " బాల్‌తాల్" చేరుకున్నారు. సాయంత్రం వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ తిరగకపోవడంతో **పత్రిసార్** మరి **మేడమ్ స్వర్ణమాల పత్రి** తో పాటు 35 మంది అమర్‌నాథ్ వద్దనే ఆ రాత్రి ఉండవలసి వచ్చింది.

పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలుకు చెందిన **బ్రిగేడియర్ G.V. సత్యనారాయణ** గారు మరి వారి శ్రీమతి **G. వాణి మేడమ్** శ్రీనగర్ నుంచి ఎప్పటికప్పుడు మా కదలికలను తెలుసుకుంటూ మిలిటరీ వారితో

సంప్రదించి మాకు అన్ని ఏర్పాట్లు చేసారు! ఆ రాత్రి మిలిటరీ క్యాంప్‌లోనే మాకు అందరికీ బస ఏర్పాటు చేసి... భోజనం, టీ, కాఫీ ఏర్పాట్లు చేసారు! **పత్రీజీ** గురించి అక్కడి ఆర్మీ వారికి తెలియడంతో వారందరూ వచ్చి ధ్యాన విశిష్టత తెలుసుకుని ధ్యానం చేసారు!

## ఆగస్టు 6 వ తేదీ

ఉదయం 5 గంటలకే చక్కటి కాఫీతో మిలిటరీ వారు మమ్మల్ని నిద్రలేపారు. అందరం రెడీ అయిన తరువాత మిలిటరీ వారు వీడ్కోలు పలుకగా హెలికాప్టర్‌లో **" బాల్‌తాల్ "** చేరుకున్నాం. అప్పటికే మన సభ్యులు బాల్‌తాల్ లో మాకోసం ఎదురుచూస్తూ వున్నారు.

" మధ్యాహ్నం 2 గంటల తర్వాత బాల్‌తాల్ నుండి శ్రీనగర్ వెళ్దాం" అనుకున్నాం. మార్గమధ్యంలో వాహనాలపై ఆందోళనకారులు రాళ్ళు రువ్వుతున్నారు, వెళ్ళవద్దని చెప్పడంతో అక్కడే ఆగిపోవలసి వచ్చింది.

## ఆగస్టు 7 వ తేదీ

ఉదయం 7 గంటలకు వాహనాలకు ముందు వెనుక మిలిటరీ కాన్వాయ్ వెంటరాగా మమ్మల్ని క్షేమంగా శ్రీనగర్ చేర్చారు! ఈ ప్రయాణంలో **G.V. సత్యనారాయణ** గారు వారి శ్రీమతి G. వాణి గారి సహకారం మరువలేనిది! అప్పటివరకు **పత్రీజీ** మాతో ప్రయాణించి వారు శ్రీనగర్ నుండి ఢిల్లీకి విమానంలో వెళ్ళారు. **స్వర్ణమాల పత్రి** మేడమ్ మరి మన ధ్యానులందరం శ్రీనగర్‌లోని **" శంకరాచార్య హిల్స్ ", "దాల్ లేక్" మరి "బొటానికల్ గార్డెన్"** మొదలైన ప్రదేశాలు తిలకించి రాత్రి జ్యేష్ఠాదేవి మందిర ప్రాంగణంలో బసచేసాం.

## ఆగస్టు 8 వ తేదీ

ఉదయం 5 గంటలకే అందరం శ్రీనగర్ నుండి " కట్రా " బయలుదేరాం. ఆ రోజు " శ్రీనగర్, జమ్ము బంద్ " కారణంగా వీధులన్నీ ఖాళీగా ఉండి నిర్మానుష్యంగా వున్నాయి. అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా దారి పొడవునా మిలిటరీ కాన్వాయ్‌తో మేం సాయంత్రానికి " కట్రా " చేరుకున్నాం.

## ఆగస్టు 9 వ తేదీ

ఉదయం **వైష్ణవీ దేవి** ఆలయ దర్శనానికి బయలుదేరి, నడక, గుర్రం, డోలీలలో వెళ్ళి దర్శన అనంతరం రాత్రి **" కట్రా "** లోనే బసచేసాం.

## ఆగస్టు 10 వ తేదీ

ఉదయమే **కురుక్షేత్రం** ప్రయాణమయి రాత్రికి **కురుక్షేత్రం** చేరుకున్నాం.

## ఆగస్టు 11 వ తేదీ

" కురుక్షేత్రం " లో ప్రసిద్ధిచెందిన **" బ్రహ్మసరోవర్ "**, **" గీతోపదేశం "** మొదలైన ప్రదేశాలు తిలకించి, ధ్యానం చేసి, సాయంత్రం ఆగ్రా ప్రయాణమయ్యాం. అర్ధరాత్రి 3 గంటలకు **" ఆగ్రా "** పట్టణం చేరుకున్నాం.

## ఆగస్టు 12 వ తేదీ

ఉదయం ఆగ్రాలోని ఎర్రకోట, తాజ్‌మహల్‌లను తిలకించి మధ్యాహ్నం 4 గంటల నుండి బయలుదేరి మథుర, బృందావనం ప్రదేశాలు తనివితీరా తిలకించి రాత్రికి ఢిల్లీ చేరుకున్నాం.

## ఆగస్టు 13 వ తేదీ

ఉదయం బయలుదేరి ఢిల్లీలో కుతుబ్‌మీనార్, ఇండియా గేట్, లోటస్ టెంపుల్ మొదలైన ప్రదేశాలను తిలకించి అతిముఖ్యమైన " అక్షరధామం " చేరుకున్నాం. అక్షరధామంలోని అద్భుత కళానైపుణ్యాన్నీ, స్వామి నారాయణ జీవితచరిత్ర చిత్రాన్నీ మరి మన సంస్కృతి, జీవం ఉట్టిపడేలా చెక్కబడిన శిల్పాల నైపుణ్యాన్నీ చూసి అందరం ఆనందపరవశు లమయ్యాం!

## ఆగస్టు 14 వ తేదీ

ఢిల్లీలోని " ఇంద్రపురి " లో ఉన్న " గౌతమ బుద్ధా పిరమిడ్ కేర్ సెంటర్ " కు వెళ్ళి అందరం ఆ రోజు ధ్యానం చేసాం! కేర్‌సెంటర్ చాలా, చాలా బాగుంది! ఆఫీసు, కౌన్సిలింగ్ రూం, లైబ్రెరీ, మినీ థియేటర్, ధ్యానం చేసుకోడానికి పిరమిడ్స్‌తో కూడిన హాలు వంటి అన్ని సౌకర్యాలతో " కేర్ సెంటర్ అంటే ఇలా వుండాలి " అన్నట్లుగా వుంది. ఆ రోజు సాయంత్రం గీతాభవన్‌లో నా పుట్టినరోజు సంబరాలు 200 మంది పిరమిడ్ మాస్టర్ల సమక్షంలో జరుపుకున్నాను. 15వ తేదీ విశ్రాంతి మరి షాపింగ్, 16వ తేదీ తిరుగు ప్రయాణం .. ఎన్నెన్నో అనుభూతులను మూటగట్టుకొని అందరం బయలుదేరాం.

❀ ❀ ❀

పత్రీజీ సంకల్పం అద్భుతంగా నెరవేరింది ! పత్రీజీ మాట శిరసావహించి ప్రతి విషయంలోనూ ఎంతో జాగ్రత్తగా ఈ యాత్రకు రూపకల్పన చేసాం. భోజనం, రవాణా మరి వసతి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాను. ఢిల్లీలోని గీతాభవన్‌లో A.C. గదులు, శ్రీనగర్‌లో పచ్చని

చెట్లతో నిండిన ఆహ్లాదకర వాతావరణంలో, **" జ్యేష్ఠాదేవి ఆలయప్రాంగణం"** లో ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలు అందరికీ ఆనందాన్ని పంచాయి. ముఖ్యంగా కట్రాలోని **వైష్ణవీ దేవి** ఆలయట్రస్ట్ వారి **" త్రికూట్‌భవన్ "** రాజమందిరాన్ని తలపించే విధంగా వుంది. రాజమండ్రి నుంచి వచ్చిన వంట మాస్టర్స్ వండిన వంటకాలు అతి రుచికరంగా వున్నాయి.

❀ ❀ ❀

25 సం॥ల వయస్సు నుండి 75 సం॥ల వయస్సు వరకు వున్న రెండు వందల మంది పిరమిడ్ మాస్టర్స్‌తో జరిపిన ఈ **" అమర్‌నాథ్ ధ్యాన యాత్ర "**.. జమ్ముకాశ్మీర్‌లో అల్లర్లు విపరీతంగా జరుగుతూన్నప్పటికీ .. ఎలాంటి ఇబ్బందులకూ గురికాకుండా టైమ్ ప్రకారం యాత్ర చేస్తూ చూడవలసిన ప్రదేశాలు చూస్తూ, ధ్యానం చేస్తూ, వీలైనంత ధ్యాన ప్రచారం చేస్తూ, సకాలంలో, సక్రమంగా నిర్వహించామంటే... " ఆ సాహసం ఒక్క పత్రీజీ శిష్యులకు మాత్రమే సాధ్యం " అని నిరూపించుకున్నాం!

❀ ❀ ❀

పత్రీజీ మాతో ఉన్నా, లేకపోయినా ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడుతూ, సూచనలిస్తూ యాత్రను సంపూర్ణంగా నడిపించారు!! తిరుగు ప్రయాణంలో జమ్ము దాటిన తర్వాత పఠాన్‌కోట ప్రాంతానికి రాగానే ఒక బస్సు టైర్ పంక్చర్ అయ్యింది. మిగిలిన బస్సులు కూడా ఆపారు. టీ త్రాగడానికి కొంతమంది క్రిందికి దిగాం. 1 నెంబర్ బస్సులో ఉన్న ఒక మేడమ్ కళ్ళు తిరిగి నీరసించిపోయారు. వెంటనే ఆటోలో ప్రక్కనే ఉన్న హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాం. అంతవరకూ కళ్ళుకూడా తెరువని ఆమె డాక్టర్ వచ్చి చెయ్యి పట్టుకున్నవెంటనే లేచి కూర్చుంది. " ఆమెకు చక్కెర వ్యాధి వుంది, మీరు తెల్లవారుజామున 4 గంటలకే బయలుదేరారు అంటున్నారు.

ఇప్పుడు ఉదయం 9 గంటలు అవుతోంది. ఆమెకు వెంటనే టిఫిన్ పెట్టండి చాలు .. ఎలాంటి అనారోగ్యం లేదు " అని డాక్టర్ చెప్పారు.

అప్పుడే పత్రీజీ బెంగళూరు నుండి ఫోన్ చేసి " ఎక్కడున్నారు? " అని అడిగారు. " పఠాన్‌కోటలో ఉన్నాం " అని చెప్పాం. " వెంటనే పఠాన్‌కోట నుండి బయలుదేరండి! మీకు ఇక ఎలాంటి ఇబ్బంది వుండదు! " అని చెప్పారు. అలాగే బయలుదేరాం. " సార్ ఎక్కడ వున్నా మావెంట వుండి మమ్మల్ని నడిపిస్తున్నారు " అని అందరికీ అనిపించింది. ధ్యానం చేసిన ప్రతిసారీ ప్రతి ఒక్క మాస్టర్ అనేకానేక అనుభవాలు పొందారు. " పత్రీజీ, ఆస్ట్రల్ మాస్టర్స్ సాక్షాత్తు పరమశివుడు అండగా వుండి అమర్‌నాథ్ యాత్ర అద్భుతంగా నిర్వహించారేమో " అని అందరం భావించాం!

* * *


" జమ్ము, కాశ్మీర్ అల్లర్లతో, అమర్‌నాథ్ స్థలం వివాదంతో దేశమంతా అట్టుడికిపోతున్న ఈ తరుణంలో 200 మందితో **అమర్‌నాథ్ యాత్ర** సాధ్యమేనా? " అని చాలామంది అడిగారు.

" సాధ్యమే! పత్రీజీ తేదీ నిర్ణయించారు. ఆ తేదీ ప్రకారం అందరం వెళతాం! చూస్తాం! ఆనందంగా తిరిగివస్తాం!! " అనే సమాధానమే అందరికీ చెప్పాను. ఆ సంకల్పమే నేరవేరింది! 1994 నుండి ఇంతవరకు పత్రీజీ మాటకు ఎదురు చెప్పలేదు. ఆయన ఏది చెయ్యమంటే అది నా భాగ్యంగా భావించి, విజయవంతంగా నిర్వహించడమే నా లక్ష్యంగా పెట్టుకున్నాను!

* * *

1994 సంవత్సరంలో పత్రీజీతో తొలిపరిచయం నా జీవితాన్ని క్రొత్త మలుపు తిప్పింది! సత్యయుగ స్థాపనకై భూమండలానికి విచ్చేసిన మహాపురుషునితో కలిసి పనిచేయడం, వారి అడుగుజాడలలో నడవడం, నా అదృష్టం .. మరి అది నాకు మహాభాగ్యం!!

అమర్‌నాథ్ ధ్యానయాత్రలో పాల్గొని అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్క పిరమిడ్ మాస్టర్‌కూ నా హృదయపూర్వక ధన్యవాదాలు!



2008–అమర్‌నాథ్ గుహ వద్ద
శ్రీమతి స్వర్ణమాల పత్రీజీ మరి పితామహ పత్రీజీతో పిరమిడ్ మాస్టర్స్

# " అమర్‌నాథ్ ధ్యాన యాత్ర విశేషాలు "

## " జయప్రదమైన యాత్ర ! "

**– మేడమ్ స్వర్ణమాల పత్రి**

" ఆగస్టు 3వ తేదీ తెల్లవారుజామున నేను డా॥ K. న్యూటన్ అమ్మగారు " రాధ మేడమ్ " కలిసి ఢిల్లీకి బయలుదేరాము. ఢిల్లీ నుండి మధ్యాహ్నం బయలుదేరి సాయంత్రం కల్లా శ్రీనగర్ చేరుకున్నాము. మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి పత్రిసార్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు! అక్కడి నుంచి **బ్రిగేడియర్** G.V. **సత్యనారాయణ** గారింటికి వెళ్ళాము. వాళ్ళింట్లో ఆ రాత్రి ఉన్నాం. 4వ తేదీ ఉదయం 10.00 గంటలకు **' జ్యేష్ఠాదేవి ఆలయం '** ప్రాంగణంలో బస చేసి వున్న కేశవరాజు గారు మరి 200 మంది పిరమిడ్ మాస్టర్ల దగ్గరికి వెళ్ళాము.

" మధ్యాహ్నం అందరమూ కలిసి 5 బస్సుల్లో బయలుదేరి అమర్‌నాథ్ బేస్‌కాంప్ అయినటువంటి **' బాల్‌తాల్ '** లో బస చేశాం. మరుసటిరోజు ఉదయం 7 గం॥లకు కొందరు కాలినడకలో, కొందరు గుర్రాలపై, కొందరు హెలికాప్టర్‌లో బయలుదేరి అమర్‌నాథ్ కొండపైకి చేరుకున్నాము. హెలికాప్టర్‌లో ప్రయాణం చాలా అద్భుతంగా ఉంది! ఆ హిమాలయ పర్వతాల మధ్య నుండి అలా వెళ్తూంటే దేవలోకంలో ప్రయాణం చేస్తున్నట్టుగా అన్పించింది!!

" హిమాలయ పర్వతాల మధ్యలో.. అమర్‌నాథ్‌లో.. ఆ రాత్రి గడపటం అనేది జీవితాంతం మరచిపోలేని అనుభవం! వాతావరణం

అనుకూలించక పోవటం వలన కొంతమందిమి అక్కడే ఉండాల్సి వచ్చింది.

" మరుసటిరోజు ఉదయం అందరం కలిసి క్రిందికి వచ్చేశాము. కర్ఫ్యూ మూలంగా ఎప్పుడు బయలుదేరతామో తెలియక నేను, పత్రిసార్, దామోదర్ రెడ్డి కుటుంబం అంతా మిలిటరీ వాళ్ళ పర్మిషన్‌తో మిలిటరీ క్యాంప్‌కు చేరుకున్నాము. ఆ రాత్రి అక్కడే క్యాంప్‌లో ఉన్నాం.

" మరుసటిరోజు ఉదయమే బస్‌లకు పర్మిషన్ దొరకడంతో అందరం కలిసి శ్రీనగర్‌కు ప్రయాణం అయ్యాం. మధ్యాహ్నం 3 గం॥ల సమయంలో శ్రీనగర్‌కు చేరాం. జమ్ము పిరమిడ్ మాస్టర్ " రాజేంద్ర కౌల్ " వెహికిల్ తీసుకొని వచ్చి నన్ను, వైజాగ్ ఆశ, దామోదర్ రెడ్డి కుటుంబం మరి నవకాంత్‌లను శ్రీనగర్ అంతా తిప్పి చూపించారు.

" మొదటగా శంకరాచార్యుల **' తపస్థలి '** కి వెళ్ళి అక్కడ కొద్దిసేపు ధ్యానం చేసుకున్నాం. అక్కడి నుండి బయలుదేరి **లాల్‌చౌక్** అనే మెయిన్‌మార్కెట్‌కు తీసుకెళ్ళారు. కర్ఫ్యూ మూలంగా అక్కడ జనాలు ఎవ్వరూ రోడ్లపై తిరగడం లేదు. అంతా కూడా పోలీస్ మరి మిలిటరీ ఆఫీసర్లు మాత్రమే వున్నారు. దాంతో ఆ మార్కెట్ అంతా ఖాళీగా, బోసిగా వుంది.

**" 'దాల్ సరస్సు'** లో హౌస్ బోట్ తీసుకొని దాంట్లో ఆ రాత్రి అందరం కలిసి వున్నాము. ఇలా హౌస్ బోట్‌లో ఉండటం అనేది నా చిరకాల కోరిక! అది నెరవేరినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది! మరుసటిరోజు ఉదయం 4 గం॥లకు చిన్ని చిన్ని బోట్లలో నలుగురిని చొప్పున రెండు ట్రిప్పులలో మమ్మల్ని జ్యేష్ఠాదేవి ఆలయం వద్దకు చేర్చారు. ఈ బోట్‌లో ప్రయాణం కూడా చాలా ఆహ్లాదకరంగా సాగింది! మేమంతా అక్కడికి చేరేసరికి పిరమిడ్ మాస్టర్లందరూ కూడా రెడీ అయి బస్సులలో కూర్చుని మా కోసం ఎదురుచూస్తున్నారు.

" ఇక్కడ కర్ఫ్యూ మూలంగా మేము ఎక్కడికి బయలుదేరినా ఉదయం పూటే త్వరగా బయలుదేరేవాళ్ళం. అందరం కలసి **వైష్ణవీ మాత** మందిరానికి బయలుదేరాం. సాయంత్రం 5 గం॥లకు 'కట్రా' బేస్ క్యాంప్‌కు చేరాం. దారి పొడవునా ప్రకృతి సౌందర్యాలు తిలకిస్తూ బస్‌లో ప్రయాణం చక్కగా ఎంజాయ్ చేశాం. ఇలాంటి అవకాశాలు కల్పిస్తున్న మన పిరమిడ్ సొసైటీకీ, పిరమిడ్ మాస్టర్లకూ ధన్యవాదాలు !!

" జమ్ము, కాశ్మీర్‌లు బంద్‌లతో, అల్లర్లతో అట్టుడికి పోతూంటే మేమందరమూ అక్కడ హాయిగా ధ్యానం చేసుకుంటూ ఉండటం అనేది ఒక గొప్ప సంఘటన !

" అడుగడుగునా కూడా సెక్యూరిటీతో మరి పర్మిషన్‌లతో అమర్‌నాథ్ మరి వైష్ణవీ మాత యాత్ర ఇలాంటి సమయాల్లో చేయడం ఒక్క పిరమిడ్ మాస్టర్లకే సాధ్యం !

" అమర్‌నాథ్ కొండపై కానీ, వైష్ణవీ కొండపై కానీ 95 శాతం మన పిరమిడ్ మాస్టర్లే ఉన్నారు. శ్రీ కేశవరాజు గారి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్ర చాలా జయప్రదంగా జరిగింది ! "

## " భయాన్ని అధిగమించాను "

**– లక్ష్మీనాగమల్లిక, హైదరాబాద్**

" నాకు చిన్నప్పటి నుంచీ పైనుండి క్రింద పడిపోయినట్లు కలలు వస్తూ వుండేవి. మామూలుగా కూడా ఏవైనా స్టెప్స్ ఎక్కాలన్నా, దిగాలన్నా రోడ్డు దాటాలన్నా చాలా భయంగా అనిపిస్తూ వుండేది. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రలో ఆ భయాన్ని అధిగమించి నన్ను నేను ముందుకు నడిపించుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

" బాల్‌తాల్ నుంచి అమర్‌నాథ్‌కి వెళ్ళడానికి గుర్రం ఎక్కిన దగ్గర నుండి చాలా భయంగా అనిపించింది. గట్టిగా పత్రీజీనీ, మాస్టర్స్‌నూ మధ్యమధ్యలో తలచుకుంటూ, ధ్యానం చేసుకుంటూ గుహ దిగువ వరకు వెళ్ళటం జరిగింది. అక్కడి నుండి ఇంకొక కిలోమీటరు వెళితే కానీ దర్శనం అవదు.

" ఒక్కసారి అక్కడ కూర్చొని గట్టిగా కళ్ళు మూసుకొని, బలమైన శ్వాస తీసుకున్నాను. ఒక్కసారిగా పైపొట్ట అంతా మడతపడి విడతలు విడతలుగా జలదరించింది. అది ఎట్లా ఉన్నదంటే వెక్కిపెట్టి ఏడ్చిన అనుభూతి మరి కన్నీళ్ళు బయటికి వెళ్ళిపోయిన ఒక అద్భుతమైన భావన కలిగింది. ఒక కాంతిపుంజం దర్శనం కలిగింది. నాలోని ఎన్నెన్నో భయాలు పటాపంచలైన అనుభవం కలిగింది.

" ఆమర్‌నాథ్ యాత్ర సాహసంతో కూడిన ఒక అద్భుతమైన ధ్యానయాత్రగా నేను పొందిన అనుభూతి."

## " కాశ్మీర్ అందాలు "

**– Ch. రమాదేవి, విజయవాడ**

" అమర్‌నాథ్‌లో విపరీతమైన చలి. మంచు గడ్డలపై నడిచినట్లు వుంది. ఇటువంటి వాతావరణంలో పత్రీజీ స్వెట్టర్, గ్లౌజ్, మంకీక్యాప్ అన్నీ తీసేస్తూ మమ్మల్ని కూడా తీసేయమన్నారు. మేమంతా కూడా వాటిని తీసేసాము. చిత్రం .. పత్రీజీ సమక్షంలో చలి మా దరి చేరలేకపోయింది. చేతులు రెండు పైకెత్తి ' హో... ' అంటూ సంతోషంతో గట్టిగా అరిచాము!

" అల్లరే కాదు సుమా, పత్రీజీ ఫ్లూట్ వాయిస్తూ వుంటే అందరం ధ్యానం చేసాము. మాతోపాటు కొంతమంది ఆర్మీ స్టాఫ్ కూడా ధ్యానం

చేసారు. అమర్‌నాథ్ అంతా ధ్యానమయం, బయటివాళ్ళు కొద్దిమంది మాత్రమే. అంతా ధ్యానులతో నిండి వున్నది. వీటన్నింటిని ఫోటోస్‌లో, వీడియోలో విజయశ్రీ, గాంధీగారు, ఫోటోగ్రాఫర్ శ్రీను, మరికొంత మంది భద్రంగా బంధించారు. ఈ అమర్‌నాథ్ యాత్రలో పాల్గొన్న ప్రతిధ్యాని జీవితం ధన్యం సుమండీ!..

" ఆకాశాన్ని అంటి వున్నట్లు వున్న ఎత్తైన కొండలు, లోతైన లోయలు, 'మీరేనా... మీ ఎత్తును మేము అందుకోగలం' అన్నట్లు వున్న ఎత్తైన అందమైన చెట్లు. భూమాత ఒడిలో ఒదిగి పోవాలని ఎంతో ఆతృతగా జలజల దుమికే ఎత్తైన జలపాతాలు, 'హలో నేస్తం! నేను మీవెంటే వస్తున్నా' అన్నట్లున్న సెలయేళ్ళు, అందాల సోయగాలతో చూపరులను ఇట్టే ఆకర్షించే అందమైన రకరకాల పువ్వులు, ఆ పూల సౌకుమార్యంతో పోటీపడే కాశ్మీరీ అమ్మాయిల వన్నె చిన్నెల అందాలు .. ఇవేకాక ప్రయాణం మధ్యలో లంగరు అనబడే చోట మా ఐదు బస్సులను ఆపి అక్కడ వంటలూ .. కొత్త కొత్త రుచులతో భోజనాలూ, సరదాగా ఆటలూ, పాటలూ, డాన్స్‌లు, సత్సంగాలూ, గ్రూప్ డిస్కషన్స్, మధ్యమధ్యన ధ్యానం చేయటం... అబ్బో, ఏం ఆనందం!!

" అంతా ఒకే కుటుంబం - ఉన్నది ఒక్కటే - సంతోషం. ఇలా అమర్‌నాథ్ యాత్ర విజయవంతంగా ముగిసింది. "

## " సరియైన ప్రణాళిక "

**- Ch. నవకాంత్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా**

" నా పేరు నవకాంత్.

"సీనియర్ పిరమిడ్ మాస్టర్, ధ్యానరత్న కేశవరాజు గారితో కలిసి 'అమర్‌నాథ్ ధ్యానయాత్ర' ఆర్గనైజ్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

" దాదాపు 45 రోజుల ముందే శ్రీ కేశవరాజు గారు ఢిల్లీకి వచ్చారు. టూర్ ప్లాన్ చేసుకుని బస్సులు అరేంజ్ చేసుకోవడం, వసతి సౌకర్యాలు బుక్ చేసుకోవడం ఇంకా పర్మిషన్స్ తీసుకోవడం ఇలాంటి వంటివన్నీ కేశవరాజు గారితో కలిసి పనిచేస్తూ ఎంతో నేర్చుకున్నాను. మంచి ప్లానింగ్, సమయస్ఫూర్తితో ప్రశాంతంగా పనులు చేసుకుంటూ వెళ్ళే మాస్టర్ ఆయన! తోడుగా ధ్యాన శక్తి, పత్రీజీ అండ వుండనే వున్నాయి !!

" దేశమంతా అమర్‌నాథ్ ట్రస్ట్ భూమి గురించి అట్టుడికి పోతూంటే మేం మాత్రం రెండు వందల మంది ధ్యానులు, పత్రిసార్, పత్రి మేడమ్‌లతో కలిసి ప్రతి నిమిషం ఎంజాయ్ చేస్తూ అద్భుతంగా ఈ యాత్రని జరుపుకున్నాం. ధ్యాన మహిమ .. జిందాబాద్ ! "

## " అందమైన హిమస్వప్న సాహసయాత్ర "

**– కనక లక్ష్మీవాణి, వైజాగ్**

" నేను అమర్‌నాథ్ యాత్రకు మూడు నెలలు ముందుగానే సూక్ష్మశరీరయానం ద్వారా 'అమర్‌నాథ్' అంతా తిరిగి మంచు పర్వతాలపై ఉండే చల్లటి స్పర్శను భౌతికంగానే అనుభవించాను. ఆ తరువాత నెలరోజులకు ' ధ్యానాంధ్రప్రదేశ్ ' పత్రికలో వచ్చిన 'అమర్‌నాథ్ ధ్యానయాత్ర పిలుపు' చూసి ఎంతో సంతోషపడి యాత్రకు బయలుదేరాను.

" నాకు అమర్‌నాథ్‌లో రాత్రి సమయంలో ఎవరో నలుగురు వచ్చి నా ఈ శరీరం అంతా శుభ్రపరచి నా దేహమంతా చందనంతో నింపారు. ఆ వాసన నిజంగానే నా గది అంతా వ్యాపించింది. అదే విధంగా నా బట్టలు కూడా అదే వాసన, ఆ విధంగా నన్ను శివదర్శనార్థమై ప్రిపేర్ చేసి వారు వెళ్ళిపోయారు... అంతే! నాకు మెలకువ వచ్చింది.

" అదే విధంగా నేను మర్నాడు అమర్‌నాథ్‌కు హెలికాప్టర్‌లో వెళ్ళాను. పత్రీజీ చేతిని తీసుకొని ముద్దుపెట్టుకొని హెలికాప్టర్‌లో ఎక్కాను. అంతే !...

" నాకు నేనే అంతే తెల్లని స్వచ్ఛమైన ప్రకాశంతో గాలిలో ఎగురుతూ పైకి వెళ్ళాను. ఆ ప్రదేశం అంతా నాకు ధ్యానంలో కనిపించినట్లుగానే వుంది.

" కొంతసేపు ధ్యానం చేసాను. అప్పుడు నేను నాలో నుంచి ఒక స్వర్ణపుష్పం నా చేతిలోకి తీసుకొని ఆ హిమప్రదేశంలో వుంచాను. ఇది అంతా నాచేత చేయించింది పత్రి సార్! అంతే కాదు అక్కడ నాకు కొన్నివేల కాంతి దేహాలతో వున్న మాస్టర్స్ కనిపించారు! అక్కడే నేను ఓంకారం, ఢమరుక శబ్దాలు విన్నాను! సప్తర్షుల శక్తి నావైపు ప్రసరించింది! ఇలా నాకు ఈ అమరనాథ్ యాత్ర 'అందమైన హిమ స్వప్న సాహస యాత్ర' గా మిగిలిపోయింది. "

## " చక్కటి వసతి "

**- N. వెంకట్రామరాజు,**
**వడమాలపేట మండలం, చిత్తూరు జిల్లా**

" పత్రీజీ సంకల్పం, కేశవరాజు గారి ప్లానింగ్ అద్భుతం! ఈ యాత్ర ఆద్యంతమూ 200 మంది మాస్టర్స్ అంతా ఒకే మాట, ఒకే బాటలా వుండేవాళ్ళం! ఉదయం 5 గం॥లకే బయలుదేరాలి అంటే కూడా సమయపాలన పాటించి ఏమాత్రం ఆలస్యం లేకుండా బయలుదేరే వాళ్ళం.

" బస్సులలో సీట్ల కేటాయింపులో ముసలివారికి ముందు సీట్లు, నడివయస్సుల వారికి మధ్యకి, చిన్నవయస్సు వారికి చివర కేటాయిస్తూ,

భోజనం, వసతి, ఇలా ఇలా అన్ని విషయాలలో ప్రత్యేక శ్రద్ధ వహించిన కేశవరాజు గారు ఎంతైనా అభినందనీయులు!

" ట్రెక్కింగ్‌ల్లో రెండు, మూడు రోజులు వెళ్ళిన సందర్భాలున్నాయి కానీ, ఇలా ఇన్నిరోజులు రెండు వందల మంది మాస్టర్స్, ధ్యానం, ధ్యాన అనుభవాలతో పాలుపంచుకుంటూ ధ్యానయాత్ర చేయడం అందరికీ ఆనందాన్ని పంచింది.

" జమ్ముకాశ్మీర్ రాష్ట్రమంతటా అల్లర్లతో, బంద్‌లతో, కర్ఫ్యూలతో అట్టడుకుతూంటే ఏ సంఘటనా లెక్కచేయక, పత్రీజీ మావెంట ఉన్నారు... మాకేం కాదు అనే దృఢసంకల్పంతో, బయలుదేరిన మాకు, అడుగడుగునా ఆనందాలు, అద్భుతాలు! అదే పిరమిడ్ మాస్టర్ల స్టయిల్!

" అమర్‌నాథ్ యాత్ర - అద్భుత యాత్ర గా చిరకాలం అందరి గుండెల్లో నిలచిపోయింది. "

## " యాత్ర ఫలితాలు "

**- గండి బ్రహ్మరాజు, Z.P.T.C. రాజానగరం, తూ.గో.జిల్లా**

" సంస్కృతి ఛానెల్‌లో పత్రీజీ ' ధ్యానలహరి ' కార్యక్రమం చూసి ప్రభావితమై ఆయన్ని చూడాలనే తహతహతో కలవచర్ల రాజుగారిని కలిసాను. అప్పటికే విజయవాడ వారి ద్వారా అమర్‌నాథ్ యాత్ర వెళ్ళాలని టికెట్ బుక్ చేసుకుని కూడా దాన్ని కాన్సిల్ చేసుకుని 'ధ్యాన ప్రచార పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్ ' ద్వారా మళ్ళీ టికెట్టు తీసుకుని వినూత్నంగా 'ధ్యాన యాత్ర' చేసి ఏదో క్రొత్త లోకంలోకి వెళ్ళివచ్చానా? కొత్త జన్మ ఎత్తానా?! 'అనే సంభ్రమాశ్చర్యాలతో ఎన్నెన్నో అనుభూతులను మూటకట్టుకున్నాను. ఈ యాత్ర ద్వారా నేను పొందిన ఫలితాలు:

1. గురు సాంగత్యం పటిష్టం కావటం !

2. లెక్కలేనన్ని ధ్యానానుభవాలు కలగటం !

3. దేశభక్తి పెరగటం !

4. సేవాభావం పెంపొందటం !

5. అద్భుతమైన ప్రకృతి అందాలతో మమేకం కావడం !

6. వివిధ ప్రాంతాల మాస్టర్లతో సఖ్యతగా వుండటం !

7. జీవితంలో ఎదురయ్యే నెగెటివ్‌ను 'పాజిటివ్' గా ఎలా మార్చుకోవచ్చునో తెలుసుకోవడం !

8. దేవారాధనలో మార్పులు కలగటం ! "




2008-ఢిల్లీలో ఎర్రకోటవద్ద పిరమిడ్ మాస్టర్స్

# " హిమాలయాల ధ్యానయాత్ర-2009 "

జగద్గురువు, **పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్** వ్యవస్థాపకులు ***బ్రహ్మర్షి పత్రీజీ*** గారి సంకల్పం, పిరమిడ్ మాస్టర్ల ఉత్సాహం వెరసి 275 మంది పిరమిడ్ మాస్టర్లతో అత్యంత వైభవోపేతంగా ***" హిమాలయాల ధ్యానయాత్ర "*** 13 రోజుల పాటు నిర్వహించుకున్నాం.

2008 సం॥లో ***" అమర్‌నాథ్ ధ్యానయాత్ర "*** జరిగిన తరువాత 2009 సం॥లో ***" హిమాలయాల ధ్యానయాత్ర "*** నిర్వహించాలనీ.. దానికి తగిన ఏర్పాట్లు చేయమనీ ***బ్రహ్మర్షి పత్రీజీ*** నాకు సూచించారు. ఎలాంటి కార్యక్రమమైనా అత్యంత వైభవంగా నిర్వహించడం పిరమిడ్ మాస్టర్లకు ***" వెన్నతో పెట్టిన విద్య "*** కాబట్టి ఈ యాత్రను రూపకల్పన చేసి ***పత్రీజీ*** ముందుంచగా .. ఆయన ' OK ' చెప్పడంతో షెడ్యూల్ ఖరారైంది.



2009–పిప్పలకోటలో పత్రీజీ ధ్యానం క్లాసు

## " ఆగస్టు 1 వ తేదీ "

ఉదయం 4 గం॥ల నుంచి వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీ కి విచ్చేసిన పిరమిడ్ మాస్టర్లు ***" కమలానగర్ "*** లోని ***" గీతాభవన్ "*** కు చేరుకోవడం మొదలైంది. సాయంత్రం 6 గం॥ల కల్లా 275 మంది పిరమిడ్ మాస్టర్లతో గీతాభవన్ కిటకిటలాడింది ! అందరం పరిచయ కార్యక్రమం తర్వాత విశ్రాంతి తీసుకున్నాం.

## " ఆగస్టు 2 వ తేదీ "

ఉదయం 7.30 గం॥కు ***" గీతాభవన్ "*** నుంచి బయలుదేరి మొట్టమొదట ***" ఇంద్రపురి "*** లోని ***" గౌతమబుద్ధా పిరమిడ్ స్పిరిచ్యువల్ కేర్ సెంటర్ "*** ను అందరూ సందర్శించి ధ్యానం చేసాం. అటు నుంచి ***ఇండియా గేట్, కుతుబ్‌మీనార్, గాంధీజీ మ్యూజియమ్, ఇందిరాగాంధీ మెమోరియల్, లోటస్, అక్షరథామ్***.. మొదలైన ముఖ్యమైన ప్రదేశాలు తిలకించి రాత్రి భోజనానంతరం 11 బస్సులలో ***ఋషీకేష్*** ప్రయాణమయ్యాం.

## " ఆగస్టు 3 వ తేదీ "

ఉదయం 6.30 గం॥లకు ***ఋషీకేష్*** లోని ***స్వామిదయానంద ఆశ్రమం*** చేరుకున్నాం. వెంటనే వరుణదేవుడు చిరుజల్లులతో మాకు స్వాగతం పలికాడు. గంగానది ఒడ్డున విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన ***స్వామి దయానంద ఆశ్రమం*** లో అందరికీ వసతి ఏర్పాటు చేసాం. పరవళ్ళు త్రొక్కుతూన్న పవిత్ర గంగానదిలో స్నానమాచరించి ఋషీకేష్‌లోని రామ్‌ఝూలా, లక్ష్మణఝూలా మొదలైన ప్రదేశాలు తిలకించి భోజనానంతరం ***హరిద్వార్*** బయలుదేరాం. అక్కడ చండీదేవి, మానసాదేవి ఆలయాలను

రోప్‌వేలో వెళ్ళి దర్శించుకుని షాపింగ్ ముగించుకుని రాత్రి 7 గం॥లకు వైభవోపేతంగా నిర్వహించే ***" గంగాహారతి "*** కనులారా తిలకించి ఆనందపరవశులై రాత్రి 9 గం॥లకు ఋషీకేష్ చేరుకున్నాం!

***బ్రహ్మర్షి పత్రీజీ*** బెంగళూరు నుంచి ఋషీకేష్ రావడంతో అందరిలో నూతనోత్సాహం మొదలైంది ! రాత్రి 9.30 గం॥ల నుండి 10.30 గం॥ల వరకు ***పత్రీజీ*** సందేశం మరి ధ్యానం కార్యక్రమం ***స్వామి దయానంద ఆశ్రమం*** లోని కాన్ఫరెన్స్ హాలులో ***పత్రీజీ*** స్టైల్‌లో నిర్వహించారు. అందరూ ఆనందపరవశులై హాయిగా విశ్రాంతి తీసుకున్నారు !

**" ఆగస్టు 4 వ తేదీ "**

ఉదయం 8.30 గం॥లకు ఋషీకేష్ నుండి బయలుదేరి హిమాలయాల అందాలను తిలకిస్తూ కొండలు, కోనలు, సెలయేళ్ళు, నదీప్రవాహాలు, పొడవాటి వృక్షాలు, ప్రకృతి అందాలు తిలకిస్తూ సాయంత్రం 4 గం॥లకు ***" పిప్పల్‌కోటి "*** చేరుకొని, ఇంద్రలోక్, దేవలోక్ హోటళ్ళలో బసచేసాం.

**" ఆగస్టు 5 వ తేదీ "**

ఉదయం 5 గం॥లకే అందరం బయలుదేరి జోషీమఠ్, గోవిందఘాట్ గుండా ప్రయాణిస్తూంటే ఎప్పుడు ఏ కొండ జారిపోతుందో అనే ఉత్కంఠ, కొద్దిపాటి వర్షానికే ఏదో ఒకచోట, ఏదో ఒక కొండజారి రోడ్డుకు అడ్డంగా పడి ప్రొక్లైనర్లతో రోడ్డు క్లియర్ చేసే దృశ్యాలు భయాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించాయి.

ఎటుచూసినా జలప్రవాహాలు, ఎత్తైన కొండలు, కొండచరియలు జారి కుప్పలు, కుప్పలుగా రోడ్డుపై అడ్డుపడడం, మధ్యమధ్యలో ట్రాఫిక్

జాములు అన్ని ఆటంకాలను దాటుకుని   ఉదయం 8.30 గం॥లకే ***“ బదరీనాథ్ ”*** చేరుకుని **చిన్నజీయర్‌స్వామి మఠం** లో మకాం వేసాం. ***పత్రీజీ*** తో కలిసి 275 మంది పిరమిడ్ మాస్టర్లు ఉష్ణగుండాలలో స్నానమాచరించి బదరీనాథుని దర్శించి ధ్యానం చేసి పవిత్ర పుణ్యక్షేత్రంలో పత్రీజీతో కలిసి వివిధ భంగిమల్లో తనివితీరా ఫోటోలు దిగాము! నలువైపులా మంచుతో కూడిన పర్వతాలు, హోరెత్తించే నదీప్రవాహాల నడుమ ఆనందంగా గడిపాం.

మధ్యాహ్నం 3 గం॥లకు **వ్యాసమహర్షి** ధ్యానం చేసిన స్థలం (వ్యాసగుహ)కు వెళ్ళి ధ్యానం చేసాం. ప్రక్కనే “ సరస్వతీ నది పుట్టుక ” చూసాం. సరస్వతీ నది వేరెక్కడా కనబడదు. వేరే నదులలో ప్రశాంతంగా కలిసిపోతుంది. అక్కడమాత్రం కొండల మధ్యలో  ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహిస్తూ ఎంతసేపు చూసినా తనివితీరలేదు. ప్రక్కనే పాండవులు స్వర్గారోహణ చేస్తున్న సమయంలో సరస్వతీనది అడ్డురాగా రెండు కొండల మధ్య భీముడు  ఒక శిలను అడ్డుగా వేయగా అది ఒక వారధిగా ఏర్పడి దాని మీదగా పాండవులు వెళ్ళారని ప్రతీతి. అందరూ ఆ ప్రదేశాన్ని వదలలేక వదలలేక వదులుకుని **చిన్నజీయర్‌స్వామి మఠం** చేరాం. రాత్రి 7 గం॥లకు ***పత్రీజీ*** సందేశం మరి ధ్యానంతో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

## “ ఆగస్టు 6 వ తేదీ ”

ఉదయం 5 గం॥లకే బయలుదేరి 7.30 గం॥లకు ***“ గోవిందఘాట్ ”*** చేరాం. అక్కడి నుంచి 14 కి.మీ. నడక, గుర్రం, డోలీలలో ప్రయాణిస్తూ ప్రకృతి అందాలు తిలకిస్తూ జీవితంలో ఇదివరకెన్నడూ చూడని ఎత్తైన కొండలు, సెలయేళ్ళు, లోయలు మొదలైన

రమణీయదృశ్యాలు కనువిందు చేస్తుంటే ఆనందిస్తూ ***" గంగారియా "*** చేరాం. హిమాలయన్ హోటల్, గంగోత్రి హోటల్, కృష్ణా లాడ్జిలలో రాత్రి బస.

**" ఆగస్టు 7 వ తేదీ "**

ఉదయం 8 గం॥లకు ఇన్ని రోజులు ఎదురుచూసిన **"వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ "** కు ప్రయాణమయ్యాం. చాలా ఎత్తైన ప్రదేశం, నడక చాలా కష్టం. గుఱ్ఱాలు కూడా వెళ్ళవు. నడక, డోలీల్లోనే వెళ్ళాలి. ఏ విషయాన్నైనా అతి సులభంగా తీసుకునే పిరమిడ్ మాస్టర్లు ఎక్కువగా నడకనే ఇష్టపడ్డారు. మూడు కి.మీ. దూరం నడవడానికి మూడు గం॥ల సమయం పట్టింది. జలప్రవాహాలు, కొండచరియల మధ్య ఏమాత్రం ఏమరుపాటుగా అడుగువేసినా కొండపై నుంచి జారి జలప్రవాహంలో కలవాల్సిందే! అంత ఏటవాలుగా ఉన్న కొండలు దాటుకుంటూ **" వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ "** అనే ప్రదేశం చేరుకున్నాం. పత్రీజీ వేణునాదంలో పరవశించిన పిరమిడ్ మాస్టర్లు అద్భుతంగా ధ్యానమాచరించి అమితానందంతో అనేక అనుభవాలు పొందారు. కనువిందు చేసే ప్రదేశం **" వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ "** చూస్తుంటే " ప్రకృతిఒడిలో ఇన్ని రకరకాల పుష్పాలున్నాయా ? " అని ఆశ్చర్యం వేసింది. **" వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ "** ఏరియాలో ప్రయాణిస్తుంటే ఇంకా ఇంకా వెళ్ళి ఆ సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలను తిలకించాలనే ఆకాంక్ష కలిగింది. వివిధ భంగిమల్లో అందరూ ఫోటోలు దిగాము. ఇంతలో ఒక మిలిటరీ ఆఫీసర్ వచ్చి " ఇంకా 3 కి.మీ. వెళ్తే అసలు సిసలైన **వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్** కనబడుతుంది .. తిరిగి రావాలనే ఉద్దేశ్యమే కలుగదు, అంత అద్భుతంగా ఉంటుంది " అని చెప్పారు. అప్పటికే మన మాస్టర్స్ నడచి అలసిపోవడం వల్ల వెళ్ళలేక తిరుగుముఖం పట్టాం.

## “ ఆగస్టు 8 వ తేదీ ”

ఉదయం 5 గం॥లకు ***“ గంగారియా ”*** నుండి ***“ గోవిందఘాట్”*** వెళ్ళటానికి ప్రయాణమయ్యాం. తిరుగుప్రయాణంలో కూడా నడక, గుర్రం, డోలీలలోనే గోవిందఘాట్ చేరుకోవాలి. మధ్యాహ్నం 12 గం॥లకు గోవిందఘాట్ చేరుకున్నాం. అక్కడి నుంచి వెనక్కు తిరిగిచూస్తే “ ఇంత ఎత్తైన కొండలు ఎక్కి, దిగామా ” అని ఆశ్చర్యం వేసింది. సాయంత్రానికి ***“ పిప్పల్‌కోటి ”*** చేరి రాత్రి 7 గం॥లకు ***పత్రీజీ*** సందేశం మరి ధ్యానం క్లాసుతో ఆనాటి కార్యక్రమం ముగిసింది. ఇంద్రలోక్, దేవలోక్ హోటళ్ళలో రాత్రి బస.

## “ ఆగస్టు 9 వ తేదీ ”

ఆ రోజు ఆదివారం ***“ ఏకతాధ్యానం ”*** చేయటానికి హోటల్ మేడపైకి అందరం చేరుకున్నాం. ఇంతలో విజయవాడ పిరమిడ్ మాస్టర్ ***రామిరెడ్డి గారు*** నా వద్దకు వచ్చి “ ***A.V. చలపతిరావు గారు*** ఇప్పుడే శరీరాన్ని విడిచిపెట్టారు ” అన్నారు. వెంటనే ఆయన గదివద్దకు చేరుకున్నాం. ***A.V. చలపతిరావు గారి*** కి ఉదయం 5 గం॥లకు శ్వాస సరిగ్గా అందకపోవడంతో వారి శ్రీమతి ***కళ్యాణి వెంకటరత్నం గారు*** ప్రక్క రూములో వున్న చెన్నై డాక్టర్ ***T. నరసింహారెడ్డి గారి*** ని పిలవగా ఆయన వచ్చి “ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది ” అని చెప్పారు. ముందురోజు వరకు ఎంతో ఉత్సాహంగా సతీసమేతంగా పాల్గొన్న చలపతిరావు గారు ***వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్*** నుంచి తిరిగివస్తూ “ ఈ హిమాలయాల్లో ఇంతమంది పిరమిడ్ మాస్టర్ల సమక్షంలో ***పత్రీజీ*** చెంత ఉండగా శరీరాన్ని వదిలినా ఫరవాలేదు ” అన్నారట ! వారి సంకల్పం నెరవేరింది, వారిది ఇచ్ఛామరణం!

వారి జన్మ ధన్యమయ్యింది ! 275 మంది యోగుల మధ్య సాక్షాత్తు భగవత్ స్వరూపుడైన ***బ్రహ్మర్షి పత్రీజీ*** చేతితో తలకొరివి పెట్టించుకున్న **చలపతిరావు *గారు*** ధన్యజీవి ! పత్రీజీ మాటల సందర్భంలో " వీరికి ఇక జన్మలేదు " అన్నారు.

❖ ❖ ❖

వారి చివరి కోరిక ప్రకారం హిమాలయాల్లో తుదిశ్వాస వదలడం, ***పత్రీజీ*** చేతులమీదుగా దహనక్రియలు జరుపుకోవడం అన్నది వారి అమరత్వానికి నిదర్శనం.

ప్రతి పిరమిడ్ మాస్టర్ కళ్ళు చెమ్మగిల్లాయి. భౌతికంగా బాధ, ఆత్మపరంగా ఆనందం, ఇదంతా తట్టుకున్న ఆ ఇల్లాలు ***" శ్రీమతి కళ్యాణి వెంకటరత్నం*** గారు " గొప్ప జ్ఞాని, వారి స్థితప్రజ్ఞతకు, నిబ్బరానికి, సమయస్ఫూర్తికి శతకోటి ధన్యవాదాలు. ఆ రోజు సాయంత్రానికి ***" ద్వారాహట్ "*** చేరుకున్నాం. మయాంక్ హోటల్‌లో బస.

## " ఆగస్టు 10 వ తేదీ "

ఉదయం 8 గం॥లకు బయలుదేరి 22 కి.మీ. బస్సులో ప్రయాణించి అక్కడి నుంచి మూడు కి.మీ. ట్రెక్కింగ్ చేసి జగత్ విఖ్యాతిగాంచిన పరమ గురువర్యులు ***మహావతార్ బాబా*** ధ్యానం చేసిన గుహవద్దకు అందరం చేరుకున్నాం. నలువైపులా ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలు, లోయల మధ్య పిరమిడ్ ఆకారంలో ఉన్న కొండలో ఈ గుహ ఉంది. ఆ కొండపై అడుగిడిన క్షణం నుంచీ నిశ్శబ్ద వాతావరణం, ప్రతిఒక్కరూ ఆ కొండపై వున్న ఎనర్జీని ఆస్వాదిస్తూ ధ్యానం చేసి ఎన్నో అనుభవాలు పొందారు.

***పత్రీజీ*** వేణునాదంతో ప్రకృతి పులకరించి చిరుజల్లు కురిసింది. అందరూ ధ్యాన సముద్రంలో మునిగారు. అందరి చిరకాల వాంఛ నెరవేరింది. జ్ఞాన గురువైన ***మహావతార్ బాబా*** గురించి ఆయన ధ్యానం చేసిన గుహ గురించి పుస్తకాలలో చదివాం. అక్కడికి చేరి ధ్యానం చేస్తామని కలలో కూడా అనుకోలేదు! అలాంటిది ***పత్రీజీ*** తో కలిసి ప్రయాణించి ఆయన సమక్షంలో అందరం కలిసి ధ్యానం చెయ్యడంతో మా జన్మ ధన్యమయ్యిందని అందరి మదిలో మెలిగింది. మయాంక్ హోటల్‌లో ఆ రోజు రాత్రి అందరం కలిసి ఆటపాటలతో, వయస్సుతో నిమిత్తం లేకుండా పాటలకు స్టెప్పులు వేస్తూ సంబరాలు జరుపుకున్నాం!

❖ ❖ ❖

***బ్రహ్మర్షి పత్రీజీ*** ఆధ్వర్యంలో ఎన్నెన్నో ట్రెక్కింగులు కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ధ్యానయాత్రలు, " అమర్‌నాథ్ ధ్యానయాత్ర ", " హిమాలయాల ధ్యానయాత్ర ", " కైలాస మానస సరోవర ధ్యానయాత్ర", " ఈజిప్ట ధ్యానయాత్ర ", " శ్రీలంక ధ్యానయాత్ర", " అండమాన్ ధ్యానయాత్ర " .. ఇలా ఇలా ప్రపంచ నలుమూలల ధ్యానయాత్రలు నిర్వహించడంలో గొప్ప రహస్యమే దాగివుంది .. అదే అదే 2012 సం॥ కల్లా ***" ధ్యానజగత్ "*** కావాలన్న బృహత్ ప్రణాళిక, ఈ ప్రణాళికలో భాగంగానే పిరమిడ్ మాస్టర్లు ***పత్రీజీ*** తో కలిసి ధ్యాన యాత్రల ద్వారా ప్రపంచాన్నే చుట్టేస్తున్నాం. జగమంతా ధ్యామమయం చేస్తున్నాం !

**" ఆగస్టు 11 వ తేదీ "**

ఉదయం 9 గం॥లకు ***" ద్వారాహట్ "*** వద్ద ***వేదానందబాబాజీ ఆశ్రమం*** వారిచే నిర్మించిన శ్రీ షిర్డీసాయిబాబా మందిరం దర్శించి, ధ్యానం

చేసి, ***' యోగదా సత్సంగ్ వారి ఆశ్రమం'*** తిలకించి మధ్యాహ్నం 12 గం॥లకు బయలుదేరి రాణీఖేత్ గుండా ***" నైనిటాల్ "*** చేరుకున్నాం. నైనిటాల్‌లో హనుమాన్ మందిరం, నైనాదేవి మందిరం దర్శించుకుని నైనిటాల్ ఊరిమధ్యలో నున్న అతిపెద్ద సరస్సులో బోట్లలో ఆనందంగా విహరిస్తూ చుట్టూ కొండల్లో అందంగా, అద్భుతంగా నిర్మించిన సుందర భవంతులను తిలకిస్తూ షాపింగ్ ముగించుకుని రాత్రి 10 గం॥ల వరకు విద్యుద్దీపకాంతులలో సరస్సు అందాలను తిలకించి ఢిల్లీకి ప్రయాణమయ్యాం.

**" ఆగస్టు 12 వ తేదీ "**

ఉదయం 7.30 గం॥లకు ఢిల్లీలో ***" కమలానగర్ "*** లోని ***" గీతాభవన్ "*** చేరుకున్నాం. ***పత్రీజీ*** చెంతరాగా హిమాలయాల ధ్యానయాత్ర అద్భుతంగా నిర్వహించుకున్నాం. జీవితంలో ఎన్నడూ చూడని కొండకోనలు, సెలయేళ్ళు, నదీప్రవాహాలు, ఇరుకురోడ్లలో ప్రయాణాలు, కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డ మార్గాలు, మలుపు మలుపుకూ ఉత్కంఠ, క్షణం క్షణం భయం, ఆనందం మనం పిరమిడ్ మాస్టర్లం మనకేం కాదు అన్న దృఢ సంకల్పం వెరసి ***" హిమాలయాల ధ్యానయాత్ర"*** 275 మంది పిరమిడ్ మాస్టర్లతో వంటవాళ్ళు, వాలంటీయర్స్‌తో కలిపి 300 మందితో యాత్ర అద్భుతంగా నిర్వహించుకున్నాం !

ఈ రోజు విశ్రాంతి దినం. విశ్రాంతి తీసుకుని, షాపింగ్ చేసుకుని సాయంత్రం 7 గం॥లకు ***పత్రీజీ*** సందేశం, ధ్యానం మరి పిరమిడ్ మాస్టర్ల అనుభవాలతో అద్భుతంగా కార్యక్రమం మరి యాత్ర ముగిసింది!

## " ఆగస్టు 13 వ తేదీ "

ఉదయం 6.20 ని॥లకు **పత్రీజీ** విమానంలో చెన్నై వెళ్ళారు. మాస్టర్లంతా **పత్రీజీ** కి వీడ్కోలు పలికారు. 3వ వ తేదీ మధ్యాహ్నం నుంచి 13 వ తేదీ ఉదయం వరకు **పత్రీజీ** తో గడిపామన్న ఆనందం వారి కళ్ళలో కనబడుతోంది. ఎన్నడూ ఇంత సన్నిహితంగా **పత్రీజీ** తో గడపలేదు! యాత్ర ద్వారా పత్రీజీ తో సన్నిహితంగా ఉంటూ దిగ్విజయంగా, ఆనందంగా, ఆహ్లాదంగా యాత్ర జరుపుకున్నాం.

అందరం వారి వారి ఊళ్ళకు తిరుగుప్రయాణమయ్యాం. హిమాలయాల ధ్యానయాత్ర నిర్వహించడానికి అవకాశం ఇచ్చిన ***బ్రహ్మర్షి* పత్రీజీ** కి మరి యాత్రలో సమయపాలన, సమయస్ఫూర్తి ఇంకా ఇంకా అన్ని విషయాలలో పూర్తి సహాయసహకారాలు అందించిన పిరమిడ్ మాస్టర్లకు పేరుపేరునా హృదయపూర్వక ధ్యానాభివందనాలు !

ముఖ్యంగా అతిరుచికరంగా వంటలు చేసి సమయానికి అందించిన ***" రాజమండ్రి "*** వంటవారికీ, ఎలాంటి ఇబ్బంది లేకుండా 11 బస్సులు నడిపిన ***" గుప్తా బస్ సర్వీస్ "*** ఆగ్రా వారికీ, చక్కటి వసతి ఏర్పాటు చేసిన ఢిల్లీ కమలానగర్ ***" గీతాభవన్ "*** వారికీ, ఋషీకేష్‌లో స్వామిదయానంద ఆశ్రమం వారికీ, బదరీనాథ్‌లో చిన్నజీయర్‌స్వామి మఠం వారికీ, పిప్పల్‌కోటిలో హోటల్ ఇంద్రలోక్, దేవలోక్ యాజమాన్యం వారికీ, గంగారియాలో హిమాలయన్ హోటల్, గంగోత్రి హోటల్, కృష్ణా లాడ్జి యాజమాన్యం వారికీ, ద్వారాహట్‌లో మయాంక్ హోటల్ యాజమాన్యం వారికీ ఇంకా ఈ యాత్రలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధ్యానాభివందనాలు!

## " హిమాలయ ధ్యానయాత్ర లో .. పత్రీజీ దివ్యసందేశాలు "

**" నా** పేరు **సత్యవతి.**

" హిమాలయాల అద్భుత ధ్యానయాత్రతో పాటుగా ప్రతి మనిషి జీవితాలను పండించే విజ్ఞానసంపదను దివ్యసందేశాల రూపంలో ***బ్రహ్మర్షి పత్రీజీ*** మనకందించారు.

***3వ తేదీ రాత్రి 8.30 గం॥లకు ఋషీకేశ్ దయానంద ఆశ్రమంలో పత్రి గారి " మైండ్" సందేశం :***

" దూరంగా చూస్తే నాలుగువ్రేళ్ళు ఒకటిగా కనిపిస్తాయి. దగ్గరగా చూస్తే నాలుగుగా కనబడతాయి. ఆ నాలుగు మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారం. ' మనస్సు ', ' బుద్ధి ' అనేవి సైడ్ హీరోలు. ' చిత్తం ', ' అహంకారం ' అనేవి ' విలన్ ' లు. విదేశీయులు ఈ నాలుగింటినీ ఒకటిగా చూసి ***' మైండ్ '*** అని పేరు పెట్టారు. హిందూత్వంలో స్వామీజీలు ' ఈ నాలుగూ ఉన్నాయి ' అన్నారు కానీ వాటిని తేటతెల్లం చేయలేదు. ధ్యానం ద్వారా మాత్రమే చిత్తవృత్తి నిరోధం జరుగుతుంది. చిత్తం ఎప్పుడు అయితే నిరోధం అవుతుందో .. అప్పుడు అహంకారం నశిస్తుంది. దాంతో మనస్సు నిశ్చలంగా అయి బుద్ధి ' రియల్ హీరో ' లా మారుతుంది. "

***5వ తేదీ రాత్రి 9.00 గం॥లకు పత్రీజీ ఇచ్చిన " భక్తి " అనే సందేశం :***

" చేసే విషయం మీద భక్తి ఉండాలే కాని, వ్యక్తిమీద కాదు. సైన్స్ మీద భక్తి ఉంటే సైన్స్‌లో మాస్టర్ అవుతాడు. క్రికెట్ మీద భక్తి ఉంటే క్రికెట్‌లో మాస్టర్ అవుతాడు. అలాగే ధ్యానం మీద భక్తి ఉండాలి కానీ ***పత్రీజీ*** మీద కాదు. ఎవరు ఏ పని అయితే చేస్తారో ఆ పనిపైన మనకు

భక్తి అనేది ఉండాలి, దానికి సంబంధించిన వ్యక్తుల పైన కాదు. సత్యం పైన భక్తి ఉండాలి, కానీ రూపం పైనా, నామం పైనా ఉండకూడదు."

***<u>8 వ తేదీ సాయంత్రం ధ్యానం క్లాసులో పత్రీజీ .. షిర్డీ సాయిబాబా సూత్రాలు అయిన " శ్రద్ధ, సబూరీ " గురించి సందేశం :</u>***

" ' శ్రద్ధ ' అంటే ఏకధాటిగా చూసేది. అంటే చేస్తున్న దాని మీదే శ్రద్ధపెట్టడం మరి ' సబూరి ' అంటే సహనం, ఓర్పుగా ఉండటం. ప్రాపంచిక జీవితంలో అయినా, ఆధ్యాత్మిక జీవితంలో అయినా, సాంసారిక జీవితంలో అయినా, నిర్వాణంలో అయినా శ్రద్ధ, సబూరీ అవసరం. "

***<u>9 వ తేదీ ఆదివారం ఉదయం పత్రీజీ సమక్షంలో ' ఏకతాధ్యానం ' జరిగింది. అనంతరం ' భగవద్గీతలో ' సందేశం :</u>***

***అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।***
***గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥*** *(2 అ॥ 11 శ్లో॥)*

" శోకింపదగని దాని గురించి శోకించగూడదు; తక్షణ కర్తవ్యం ఆలోచించాలి." ఈ సందేశం అనంతరం మాకు తెలిసిన విషయం :

" విజయవాడకు చెందిన ***A.V. శ్రీ చలపతిరావు గారు*** ఆ తెల్లవారుఝూమున శరీరాన్ని విడిచిపెట్టారు. ఆయన ఆత్మ ముక్తాత్మగా పైలోకాలకు వెళ్ళి చేరినట్లుగా ***పత్రీజీ*** తెలిపారు. A.V. చలపతిరావు గారి భార్య మాటల ప్రకారం .. ఆయనకు మరణం వస్తున్నట్లుగా ముందే తెలిసి తన భార్యకు అన్నీ అప్పచెప్పి తనకు ఈ యాత్రలో ఎక్కడ మరణం సంభవించిందో అక్కడే అంత్యక్రియలు చేయవలసిందిగా కోరారట. ఆ ప్రకారం ***పత్రీజీ*** సమక్షంలో, పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యంలో ***పత్రీజీ*** స్వయంగా ఆయనకు తలకొరివి పెట్టడం పిరమిడ్ సొసైటీకే ఒక తలమానికమైన

విషయం ! ఈ కార్యక్రమం అంతా **'అలకనంద'** నదిఒడ్డున జరిగింది. అందరితో పాటు చలపతిరావు గారి భార్య కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని స్త్రీ జాతికే తలమానికంగా నిలిచిన ధీరవనితగా భాసిల్లింది. ఆమె మనోధైర్యం చెప్పనలవికానిది. ఇది ఒక పిరమిడ్ మాస్టర్లకే చెల్లింది !

" ఇలా మనం మన సామర్థ్యాన్ని గుర్తింపగలిగేలా చాలా సామాన్యమైన సూత్రాలను అసామాన్యంగా వివరించి ఆధ్యాత్మిక రహదారి వెంబడి వ్యక్తిగత సంతృప్తిని పొందేమార్గం చూపిన .. జగద్గురువు **బ్రహ్మర్షి పత్రీజీ** కి శతకోటి ధ్యానాభివందనాలు."

– ***బొడ్డేటి సత్యవతి***, చింతల అగ్రహారం,
విశాఖపట్నం, సెల్ : 9985313423

## " పోయింది, దొరికింది "

**" నా** పేరు **సుబ్బారావు**. తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ.

" నేను ఎప్పుడూ ఏ ట్రెక్కింగ్‌కూ వెళ్ళలేదు. పది అడుగులు మించి నడిచినదీ లేదు. అంతా ద్విచక్ర వాహనంలో ప్రయాణం. అలాంటివాణ్ణి ఈ ధ్యానయాత్రలో రోజుకు ఐదు కి.మీ. మరి ఎనిమిది కి.మీ. గురువు గారితో కూడా ***మహావతార్ బాబా*** గుహకు నడిచి వెళ్ళానంటే, నిజంగా గురువుగారి దివ్యశక్తితో వెళ్ళగలిగాను !

" ధ్యానం చేస్తూండగా ఉదయించే సూర్యునివలె శివుడు కొండపైకి వస్తున్నాడు మరి బంగారు పిరమిడ్లు కనిపించాయి. బదరీనాథ్ దేవాలయంలో ధ్యానం చేస్తూండగా, సింహం మీద దుర్గాదేవి శూలం పట్టుకొని కూర్చొని కనిపించింది.

" ప్రతిరోజూ గురువు గారిని చూడడం, వారు ***' సుబ్రావ్ ! సుబ్రావ్ ! "*** అంటూ అమితానందంతో నన్ను పిలవడం వారి కంటిద్వారా ఎనర్జీని పంపడం .. నడవడానికి నాకెంతో ఉత్సాహాన్ని కలిగించింది !

***<u>మరో విశేషం :-</u>***

" ' గంగారియా ' నుంచి ' గోవిందఘాట్ ' కు అతికష్టం మీద గుఱ్ఱం మీద 14 కి.మీ. వచ్చి చేరాను. ఇక్కడ టీ అంగడిలో టీ త్రాగాను. వారికి ధ్యానం గురించి చెప్పాను. అక్కడ నా పర్సు పడిపోయింది. 11/2 కి.మీ. దూరంలోని బస్టాండు కి వెళ్ళిన తర్వాత పర్సు చూసుకున్నాను. ***కేశవరాజు గారి*** తో ఈ విషయం చెప్పాను.

" ఇంతలో షాపు గుమాస్తా, నన్ను ప్రక్కకు పిలిచి ' చాయ్ పీయేగా, ఆప్‌కా ఐడి కార్డ్ బతావో ' అన్నారు. వెంటనే నేను 'మేరా పర్సు మే రాఘవేంద్రస్వామి ఫోటో, పాన్‌కార్డ్, రిటర్న్ టికెట్ రూ. 400 నుంచి 500రూ॥లు హై ' అన్నాను. నా పర్సు నాకిచ్చారు, ఎంతో ఆనందమయింది!

" చిత్తశుద్ధితో దృఢమైన సంకల్పం, విశ్వాసంతో ధ్యానం చేసామంటే, మనవెంట గురువు గారు, మాస్టర్స్ తప్పక మనలను కాపాడుతూంటారు!!"

## " హిమాలయాలలో ట్రెక్కింగ్ ! 44 కిలోమీటర్లు ! "

**" నా** పేరు ***సత్యవతి***. వయస్సు 63 సం॥లు. ధ్యానంలోకి వచ్చి 4 సం॥లు అయ్యింది. ***మహావతార్ బాబా*** సందేశం వల్ల మా యింట్లో ఆయన పేరున పిరమిడ్ ధ్యానకేంద్రం వెలిసింది. ధ్యానంలోకి రాకముందు 40 సం॥ల ఉబ్బసంతో చాలా బాధపడ్డాను. అప్పట్లో మందులు వాడేదాన్ని.

ఇప్పుడు ధ్యానం ద్వారా తగ్గించుకున్నాను, ఇప్పుడు మందులు వాడటం లేదు. ధ్యానం, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం, ధ్యానప్రచారం చేస్తున్నాను.

" ఆగస్టు 1వ తేదీన బయలుదేరి **బ్రహ్మర్షి పత్రీజీతో 'హిమాలయాల ధ్యానయాత్ర '** కు వెళ్ళడం జరిగింది. 275 మందితో ఆ యాత్ర చేయగలనో లేదో అన్న సందేహంతో ' మానేద్దాం ' అనుకున్నాను. అంతలోనే **మహావతార్ బాబాజీ** ప్రేరణతో బయలుదేరడం .. 13 రోజుల యాత్ర చాలా అద్భుతంగా జరగడం.. ' ట్రెక్కింగ్ మొత్తం 44 కి.మీ. నడవడం .. ఇదంతా ధ్యానం వల్లనే సంభవం ' అనిపిస్తోంది. నాకు తెలిసింది నీటి బొట్టంత .. తెలుసుకోవలసింది సముద్రమంత ! నేను, నా భర్త ఈ ధ్యాన మార్గంలోకి వచ్చి ఎంతో బ్రహ్మానందాన్ని పొందుతున్నాం.

" హిమాలయాలలో ***' గంగారియా '*** అనే ప్రాంతంలో ఒక హోటల్‌లో పదిమంది కుర్రాళ్ళ చేత ధ్యానం చేయించాను.

***" బ్రహ్మర్షి పత్రీజీ*** గారికి ధ్యానాభివందనాలతో .. ***"***

***– C. సత్యవతి***

మహావతార్ బాబాజీ పిరమిడ్ ధ్యానకేంద్రం,

సీతమ్మధార, విశాఖపట్నం. ఫోన్ : 0891-2704399

## " విశ్వం చేసుకున్న అదృష్టం "

***" నా*** పేరు ***వెంకట సత్య అన్నపూర్ణాదేవి***. మాది పశ్చిమగోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం.

" నేను 2004 డిసెంబర్‌లో ధ్యానంలోకి రావడం జరిగింది. ఇక అప్పటినుంచి నా జీవితమే ఒక అద్భుత జీవనయాత్రగా మారింది. 2009

ఆగస్టు 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ***పత్రీజీ*** తో పాటు ***' హిమాలయాల ధ్యాన యాత్ర '*** లో పాల్గొనడం నా జన్మజన్మల అదృష్టం! ఆద్యంతమూ అద్భుతంగా సాగిన ఈ ధ్యానయాత్రలో ఎందరెందరో మాస్టర్స్ నుంచి నేను సందేశాలు పొందడం జరిగింది.

" 5వ తేదీన బదరీనాథ్ లోని ***లక్ష్మీనారాయణ గుడి*** లో ***పత్రీజీ*** మా అందరిచేత ధ్యానం చేయించినప్పుడు నేను ***బదరీనారాయణుణ్ణి*** ఒక సందేశమడిగాను. దానికి ఆ స్వామి మన ***పత్రీజీ*** ని చూపించి ' ఈయనే ఒక పెద్ద సందేశం మీకందరికీ ' అన్నారు!

" ఆయన గురించి ఏమని చెప్పను? పత్రిసార్ లాంటి వ్యక్తి ఇప్పటివరకు ఈ భూమిమీద జన్మించలేదు. నిజాన్ని నిర్భయంగా చెప్పిన ఏకైక వ్యక్తి. సత్యాన్ని బట్టబయలు చేసారు. ఎంతోమంది గురువులు వచ్చారు. 'శిష్యులను' తయారుచేసారు. కానీ రహస్యాన్ని మాత్రం బట్టబయలు చేయలేకపోయారు. ఉన్నది ఉన్నట్లు చెప్పలేక పోయారు. ఆశ్రమాల పేరిట శిష్యులను అలాగే వుంచారు. భయపడి సత్యాన్ని వెల్లడించలేక ఆచారాల పేరిట, పూజలు, జపాల పేరిట, శిష్యులను అలానే ఉంచారు. కానీ ***పత్రిసార్*** నిర్భయుడు ! కాబట్టి స్వంతంగా ధ్యాన ప్రచారం చేస్తూ ఇంతమంది ధ్యానులను తయారుచేసాడు ! ఆ ధ్యానుల ద్వారా విశ్వమంతా ధ్యానపరిచయ ఉద్యమాన్ని చేపట్టిన మహామనీషిఆయన ! ఎంతోమంది ఆస్ట్రల్ మాస్టర్స్ ఈ భూమిమీదకు వచ్చి ధ్యానప్రచారం చేపట్టారు. మిగతా మాస్టర్స్ పత్రిసార్ లో ప్రవేశించి ఆయనకు సహాయపడుతూ వుంటారు " అంటూ ***పత్రిసార్*** ని భూమికీ, ఆకాశానికీ సరిపోయేంత వ్యక్తిగా చూపించారు ! ఎంతోమంది మాస్టర్స్ మరి ఆ బదరీనారాయణుడు

పత్రిసార్‌లో కలవటం చూసాము. ' నీవే దేవుడవు ' అనే రహస్యాన్ని వెల్లడించిన ఏకైక వ్యక్తి మన పత్రిసార్ ! ధ్యానమే నీ జీవితం. శ్వాసయే నీ గురువు. శ్వాసే నీ ప్రాణం అని చెప్పిన మహిమాన్వితుడు. ఇంతటి జగద్గురువు లభించటం ఈ విశ్వం చేసుకున్న అదృష్టం ' అని ***బదరీ నారాయణుడు*** జ్ఞానసందేశమిచ్చాడు. ఆయనకు నా కృతజ్ఞతలు. "

V.S. ***అన్నపూర్ణాదేవి, జంగారెడ్డిగూడెం.***

## " పుష్పవనం లో స్వస్థత పొందాను "

" ***నా*** పేరు ***దేవరాజ్,*** తిరుపతి పిరమిడ్ మాస్టర్‌ని.

" తిరుపతి నుంచి హిమాలమాల ధ్యానయాత్ర కై 1-8-2009 తేదీన ఢిల్లీ చేరుకొని, 275 ధ్యానులతో 11 బస్సులలో ఋషీకేష్ దయానందాశ్రమం చేరుకొన్నాం. ఉదయం గంగానదిలో అతి చల్లని నీటిలో స్నానం చేసి, ఒడ్డున ధ్యానం చేస్తున్నప్పుడు వర్షం పూలజల్లుగా కురిసింది. అప్పుడు హిమశిఖరాల అందాలు మాటల్లో వర్ణించలేము.

" బదరీనాథ్‌లో ***' ఉష్ణగుండం '*** లో సహజంగా వున్న అతి వేడినీటిలో స్నానం చేసినప్పుడు కలిగిన అనుభూతి వర్ణనాతీతం ! బదరీనాథ్‌లో వున్న వ్యాస గుహ, గణేష్ గహల దర్శనం మరి అచ్చట చేసిన ధ్యానం అత్యద్భుతం. అక్కడే వున్న ***' భారతీయ ఆఖరీ టీ స్టాల్ ' (అచ్చ తెలుగులో బోర్డు వ్రాసి ఉంది)*** లో తోటి ధ్యానులతో కలిసి ' టీ' త్రాగడం మరువలేనిది ! ఆ ' టీ' కొట్టు అతను నేపాలీ భాషలో ***' టీ త్రాగండి '*** అని అప్యాయంగా ఆహ్వానించారు !

" ధ్యానం చేస్తున్నప్పుడు నాకు మంచి సుగంధం వాసనలు వచ్చి ఎవరో ఆస్టల్ మాస్టర్ స్పర్శ కలిగింది. అటు తరువాత నేను చక్కగా ధ్యానం చేస్తున్న చోటు నుంచి 5 కి.మీ. గంగారియాలో మేము బస చేసి ఉన్న హోటల్‌కు వచ్చాను. ఆ మరుసటిరోజు 14 కి.మీ. ఘాట్‌రోడ్డులో నడక ద్వారా గోవింద్ ఘాట్ చేరుకొన్నాను.

" అప్పటికి సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం నాకు కారు ఆక్సిడెంట్ జరిగినప్పుడు కుడికాలు నడుము వద్ద జారిపోయి 80 రోజులు హాస్పిటల్‌లో వున్నాను. అప్పటి నుంచి ఈ రెండేళ్ళు జాగ్రత్తగా ఎక్కువ నడవకుండా కారులో తిరుగుతూ వుండేవాడిని. అటువంటి నేను ఈ యాత్రలో ఎన్నో యుగాల నుంచి ప్రసిద్ధిపొందిన ***' సుగంధ పుష్ప వనం '*** లో స్వస్థత పొందడం పిరమిడ్ ధ్యాన విశిష్టత మరి మన పరమగురువు ***బ్రహ్మర్షి పత్రీజీ*** గారి కృప తప్ప మరేమీ కాదు ! అప్పటి నుంచి యాత్ర అంతా నేను కాలినడకన ఉత్సాహంగా పాల్గొన్నాను.

***" ' పుష్పవనం '*** 12 కి.మీ. విస్తరించివుంది. దానిని ***వరల్డ్ హెరిటేజ్*** కింద గుర్తించి 14 కి.మీ. ఘాట్ రోడ్డుతో సహా దాదాపు ఎటుచూసినా పరిశుభ్రత ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. అది ఎంతో అత్యద్భుతం !

" ద్వారాహాట్‌లో బసచేసి, ***మహావతార్ బాబాజీ*** గుహవద్దకు 3 కి.మీ. ల నడకతో చేరుకుని ధ్యానం చేసాం. తిరుగు ప్రయాణంలో గురువు గారి సహచర్యం, ఫోటోలు దిగడం వగైరా మరచిపోలేనివి. హిమాలయ ప్రాంతమంతా పూర్తి శాకాహారమయం. అది ధ్యానులకు మంచి అనుభూతి మిగిల్చింది.

" తిరుగు ప్రయాణంలో **' నైనిటాల్ '** సోయగాలు, బోట్‌లో విహారం. అక్కడ వాళ్ళు పాటిస్తున్న పరిశుభ్రత వర్ణించ సాధ్యం కాదు. ***ఆగ్రాకోట, తాజ్‌మహల్*** అందాలు అద్భుతాలు. ***' మధుర '*** లోని **కృష్ణాష్టమి వేడుకల** ను మేం యాదృచ్ఛికంగా కృష్ణాష్టమి రోజే చూడడం మా అదృష్టం!

" ఈ యాత్ర ద్వారా తెలిసిన సందేశం ' ధ్యానం, శాకాహారం, పరిశుభ్రత ద్వారానే దైవత్వం అలవడుతుంది ' అని. "

## " అనుభవిస్తేనే .. ఆ ఆనందం "

**– చిట్టూరి కల్పనామూర్తి**, రాజమండ్రి

***" బ్రహ్మర్షి పత్రీజీ*** ఆధ్వర్యంలో, ' ధ్యానరత్న ' **కేశవరాజు గారి** సారథ్యంలో జరిగిన 13 రోజుల ***' హిమాలయాల ధ్యానయాత్ర '*** బ్రహ్మానంద భరితం. ప్రతిరోజూ ఏనాటిది ఆనాటిదే, ఎవరిది వారిదే అనుభవాల మాలిక! కష్టం, సుఖం ప్రక్కప్రక్కనే వుంటాయన్న సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాం. రోజంతా ఎత్తైన శిఖరాలలో ట్రెక్కింగ్ .. ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారు నడక, గుఱ్ఱం, డోలీలలో ! ఆ రోజుకి కొంత శ్రమ అనిపించినా – ఉదయానికి అంతా హుష్ కాకి ! మళ్ళీ మంచి ఎనర్జీతో ఫ్రెష్, మరో ట్రెక్కింగ్‌కి సిద్ధం.

" మేం 1990 లోనే ఢిల్లీ, హరిద్వార్, ఋషీకేశ్, కేదార్‌నాథ్, బదరీనాథ్‌లు ఆ తర్వాత అమర్‌నాథ్, నేపాల్‌లోని ముక్తీనాథ్, టిబెట్‌లోని మానస సరోవర్‌లను దర్శించడం జరిగింది. తిరిగి ఇప్పుడు ఆగస్టు 2009 లో ఈ యాత్ర. ఈ రెంటికీ ఎంతో వ్యత్యాసం !

" అప్పుడు ' ఈ సృష్టికి మూలకారణం దేవుడు ' అనే స్థితిలో వున్నాను. ఒక నిజమైన భక్తురాలిగా ఆనందించాను. ఇప్పుడు ' అదే నేను;

నేను దేవుని అంశను ' అనే భావంతో .. అదే యాత్ర ఎంతో ఎనర్జీతో హుషారుగా, సామూహిక ధ్యానాలతో ఎంజాయ్ చేసాను. మేము ప్రయాణం చేసిన ట్రైన్, బస్సులలోని వారంతా ధ్యానులే ! ' ప్రపంచమంతా ఇలా వుంటే ఎంత బాగుండు ' అనిపించింది. తినుబండారాలు పంచుకుంటూ, ధ్యానానుభవాలు తెలుసుకుంటూ, అందరితోను స్నేహాన్ని పెంచుకుంటూ .. అంతా థ్రిల్లింగ్ ! అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది !

" మొదటి రెండు రోజులలో ఢిల్లీలో అద్భుత నిర్మాణమైన అక్షరధామ్, మరింత ఆశ్చర్యకరమైన లోటస్ టెంపుల్, హరిద్వార్‌లో మానస దేవాలయం దర్శించాము. బదరీనాథ్ దారిలో పెద్ద కొండ విరిగిపడగా, దానిని పూర్తిగా తొలగించగా మాకు ముందుకు దారి ఏర్పడింది. వర్షాలతో, చలితో వుండాల్సిన వాతావరణం వేడికి అలవాటైన వాళ్ళమని వేడిగా మారటం ఒక వింతగా అనిపించింది. బదరీనాథ్ సమీపంలో వ్యాసాశ్రమం, సరస్వతీ లోయ మమ్మల్ని స్వాగతించాయి. ఎప్పుడూ ఎంతో రద్దీగా వుండే బదరీనారాయణ గుడి కూడా ఖాళీగా మాకు స్వాగతం చెప్పింది. చక్కగా **పత్రీజీ** వారి సమక్షంలో ధ్యానం చేసుకున్నాము.

" పత్రీజీ కలల లోయ **' వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ '** కు ప్రయాణం పరమాద్భుతం ! గుఱ్ఱంపై బ్యాలెన్స్ చేసుకుంటూ కొండ అంచుల మీదే ఏమాత్రం తడబడకుండా నడుస్తూన్న గుఱ్ఱాన్ని భగవంతునిగా భావిస్తూ ఆ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ జీవితంలో ఎన్నడూ చూడని అందాల మేఘాల తోరణాలు, అప్పటికప్పుడే వచ్చే చిరుజల్లులు, పువ్వుల సువాసనలు, రంగుల ఇంద్రధనుస్సులు, జలపాతాల హోరుతో ఏర్పడిన ఆ మంచుపొగ, ఆ ఆనందం చూసి ఆనందించవలసిందే !

“ మా అబ్బాయి **‘ రవి ’** U.S.A. లో టూర్‌కి ‘ Smoky Mountains’ కి తీసుకువెళ్ళాడు. అక్కడ సహజంగా ఉన్న అందం కంటే వాళ్ళు కల్పించిన కృత్రిమ అందాలే ఎక్కువ. రోప్‌వేలు, లిఫ్ట్‌లు మొదలైనవి **వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్** అందాల ముందు దిగదుడుపే !

“ ఆ తరువాత సుదీర్ఘ ప్రయాణం. ఉల్లాసంగా, ఉత్సాహంగా బస్సులో జోక్స్ వేసుకుంటూ, పాటలు పాడుకుంటూ, వయస్సును మరచి చిన్నపిల్లలా ఆనందించాను. **‘ ద్వారాహట్ ’** చేరాము. ‘ హోటల్ మయాంక’, నిజంగా మయసభలానే వుంది. ఎన్ని మెట్లు, ఎన్నో చుట్లు తిరిగినా ఎంట్రన్స్ రాదు. చలిలేదు, హాయిగా స్నానాలు చేసుకుని మహావతార్ బాబా గుహకి ప్రయాణం, రజనీకాంత్ ‘ బాబా ’ సినిమా గుర్తుకు వచ్చింది. మళ్ళీ ట్రెక్కింగ్. మూడు కిలోమీటర్లు. ఆయన కట్టించి, **‘ యోగదా సత్సంగ్ ’** వారికి యిచ్చిన హాలు ముందు ఎత్తైన కొండ మీద వున్న బాబాజీ ధ్యానం చేసిన గుహ వద్దకు చేరుకున్నాం. అక్కడ ఎంతో ఎనర్జీ లెవెల్స్ వున్నాయి. ధ్యానంలో కూర్చున్న క్షణమే ఆలోచన లేని ధ్యానస్థితి వచ్చింది. కొండమీద వృక్షాల పచ్చదనం, మనస్సు హాయిగొలుపు చల్లదనం, ఆ సెలయేరుల హోరు. అహా ! ఏం ఆనందం, వర్ణనాతీతం !


“ కళ్ళు మూసుకొని ధ్యానం చేద్దామంటే, ‘ ఇంత ఆనందాన్ని కోల్పోతామేమో ’ అనిపించింది. కళ్ళు తెరిచినా ధ్యానస్థితే ! బాబాగారు పత్రిగారి రూపంలో మావెంటే వున్నట్లు అనిపించింది. 3 కి.మీ. కొండ ఎక్కినా ఎక్కినట్లే అనిపించలేదు. నా జన్మ తరించింది. ‘ నేనేనా యిక్కడికి వచ్చింది ? ఇది కలా ! నిజమా ? ’ అనే అనుమానంతో గిల్లి చూసుకున్నాను.

గుహలో కూడా సహజంగా, కూల్‌గా అనిపించింది. స్వర్గంలోనికి 10 ని॥లు వెళ్ళి, తిరిగి భూమి మీదకు వచ్చినట్లు అనిపించింది. ఆ రోజు రాత్రి జరిగిన సంబరాలలో నేను డాన్స్ కూడా చేసాను !!


" తిరుగుప్రయాణంలో ఆఖరుగా **' నైనిటాల్ '** పర్వత శిఖరాల సౌందర్యాలు, సరస్సులోని బోటు విహారాలతో ధ్యాన విహారయాత్ర ముగించుకొని మరుసటి ఉదయానికి ఆగస్టు 12వ తేదీకి ఢిల్లీ చేరుకున్నాము.

" ఈ యాత్ర నా జీవితంలో ఎన్నటికీ మరచిపోలేని, మరపురాని, మధురానుభూతిని కలిగించింది ! "

2009–బదరీనాథ్‌లో పిరమిడ్ మాస్టర్లతో పత్రీజీ



2009–మహావతార్ బాబాజీ గుహ వద్ద పిరమిడ్ మాస్టర్లతో పత్రీజీ



# " తాండవశివ సంగీత నృత్య ధ్యానమహాయజ్ఞం-2009, శ్రీశైలం "

పత్రీజీ ఆదేశానుసారం .. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో జరిగే ధ్యాన యజ్ఞాలలో భాగంగా 2009 శ్రీశైలంలో నిర్వహించటానికి పత్రీజీ నిర్ణయించారు. నిర్వాహణ కమిటీలో జక్కా రాఘవరావు, పాల్ విజయ్ కుమార్, మారం శివప్రసాద్, నన్ను నియమించారు. నన్ను మూడు నెలలు శ్రీశైలంలో ఉండమని పత్రీజీ ఆదేశించారు.

కమిటీ ఆధ్వర్యంలో గ్రౌండ్ సెలెక్ట్ చేయడం జరిగింది. ప్రతి నిత్యం వేలాది మంది భక్తులకు మన కార్యక్రమం గురించి తెలిసేవిధంగా బోర్డులు, కరపత్రాల ద్వారా చుట్టుప్రక్కల ధ్యానప్రచారం చేసాం. శ్రీశైలంలో నిర్వహించిందే ఆఖరి ధ్యానమహాయజ్ఞం. ఆ తర్వాత 2010 నుంచి ధ్యానమహాచక్రంగా రూపుదిద్దుకోవడం జరిగింది. ఆఖరి యజ్ఞం శ్రీశైలంలో నిర్వహించడం చాలా గొప్ప విశేషం. సాక్షాత్తు శివుని సన్నిధిలో వేలాదిమంది భక్తులు, పిరమిడ్ మాస్టర్లు విచ్చేసారు. ఎత్తైన ప్రదేశం కనుక మామూలు షామియానాలు వేస్తే గాలికి నిలవవు కాబట్టి హైదరాబాద్ నుంచి సూపర్ స్ట్రక్చర్స్ తెప్పించి ఐరన్ పైపులతో మరి రేకులతో భారీ సెట్టింగ్స్ వేయడం జరిగింది. అందరికీ వేదికపై జరిగే కార్యక్రమాలు దగ్గరగా చూసే విధంగా మొదటిసారి LED TV లు, ఇంటర్నెట్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఇవ్వడంతో

దేశ, విదేశాలలో వేలాదిమంది మాస్టర్లు కార్యక్రమాన్ని తిలకించి .. అక్కడికి వచ్చి స్వయంగా పాల్గొన్న విధంగా ఉందని మాకు ఆనందంగా తెలియజేశారు.

శ్రీశైలంలో వసతి, అకౌంట్సు విజయవాడ మాస్టర్స్ ప్రత్యేక శ్రద్ధతో అద్భుతంగా నిర్వహించారు. పాల్ విజయ్‌కుమార్ గారు కర్నూలు వంట వారిచే అద్భుతంగా భోజనం ఏర్పాట్లు చేసారు. మారం శివప్రసాద్ గారు విరాళాల సేకరించడంలో కృషి చేసారు. నేను ఇంటర్నెట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ, వాటర్ వర్క్స్ ఇలా పంచుకున్న పనులను నిర్వహించాను.

జక్కా రాఘవరావు గారు ఛైర్మన్‌గా పక్కా ప్రణాళికతో అన్ని పనులూ పర్యవేక్షిస్తూ తాండవ శివ సంగీత, నృత్య ధ్యానమహాయజ్ఞం శ్రీశైలంలో అద్భుతంగా నిర్వహించుకోవడం జరిగింది. ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజు CD లు తయారు చేసి మరుసటిరోజు ఉదయానికే అందించడం ద్వారా అనేక మంది మాస్టర్లు ఆనందం వ్యక్తం చేస్తూ కొనుగోలు చేయడం జరిగింది.

చివరి మహాయజ్ఞం శ్రీశైలంలో శివుడి సన్నిధిలో జరుపుకోవడం ఎంతో ఆనందదాయకం. ఈ యజ్ఞం నిర్వహణలో నేను ఒక కమిటీ మెంబర్‌గా ఉండడం పత్రీజీ నాకు ఇచ్చిన గొప్ప వరం!

2009లో శ్రీశైలంలో నిర్వహించింది 11వ ధ్యానమహాయజ్ఞం. 2010లో మొదటి ధ్యానమహాచక్రం అమరావతి, గుంటూరులో; 2011లో విశాఖపట్టణంలో రెండవ ధ్యానమహాచక్రం జరుపుకోగా .. 2012 నుంచి మహేశ్వర మహాపిరమిడ్, కైలాసపురి, కడ్తాల్, హైదరాబద్‌లో ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో ధ్యానమహాచక్రాలు నిర్వహించుకుంటూన్నాం.

దేశ విదేశాల నుంచి వచ్చే వేలాదిమందికి కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ వేదికగా మన స్వంత విశాలమైన ప్రాంగణంలో జరుపుకోవడం మన అందరికీ గర్వకారణం.

ఈ కార్యక్రమాలలో పాల్గొంటూన్నవారికి, దాతలకూ, సేవాదళ్ సభ్యులకూ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.



1999 సం॥లో శ్రీ T.N. శేషన్ గారికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా బ్రోచర్ అందిస్తున్న కేశవరాజు

జూన్, 2001వ సం॥లో జరిగిన పిరమిడ్ మాస్టర్ల మొదటి కైలాస మానస సరోవర ధ్యాన యాత్రలో పాల్గొ
శ్రీ దీరూభాయ్ అంబానీతో శ్రీ పత్రీగారు, కంచి రఘురామ్, కేశవరాజు, కోయంబత్తూర్ సెల్వకుమార్.



# “ గుజరాత్, మౌంట్ అబు .. ధ్యానయాత్ర ”

***బ్రహ్మర్షి పత్రీజీ*** ఆధ్వర్యంలో ***“గుజరాత్, మౌంట్ అబు ధ్యానయాత్ర”*** 40 మంది పిరమిడ్ మాస్టర్లతో 9 రోజులపాటు వివిధ ప్రాంతాలలో ధ్యానతరగతులు నిర్వహించుకుంటూ మరి అద్భుతమైన ప్రదేశాలు తిలకిస్తూ ఆనందపరవశంగా సాగింది.

## “ ఫిబ్రవరి 2 తేదీ .. 2010 ”

వివిధ ప్రాంతాల నుంచి పిరమిడ్ మాస్టర్లు **అహ్మదాబాద్** లో ***“కచ్‌కడవాపతేదార్ సమాజ్ సత్రం ”*** చేరుకుని పరిచయ కార్యక్రమ అనంతరం ధ్యానం చేసి విశ్రాంతి తీసుకున్నాం.

## “ ఫిబ్రవరి 3 తేదీ .. 2010 ”

ఉదయం అహ్మదాబాద్‌లో ***సబర్మతీనది*** ఒడ్డున నిర్మించబడిన ***“ సబర్మతీ ఆశ్రమం ”*** చేరుకున్నాం. గాంధీజీ నివసించిన గది, ఆయన వాడిన వస్తువులు, మీటింగ్ హాలు తిలకించాం! అక్కడ పిరమిడ్ ఆకారంలో ప్రతి గది ని నిర్మించారు. విశాలమైన ప్రాంగణంలో గార్డెన్, మ్యూజియం, పుస్తకభాండాగారం .. ఇంకా ఎన్నో దేశ, విదేశీయులను ఆకర్షించేవిధంగా పిరమిడ్ ఆకారంలో నిర్మించిన కట్టడాలు, ఆనాటి వారి స్వాతంత్ర్య పోరాట ఫోటోలు, పోస్టర్స్ అందరినీ ఆకర్షించి చిరకాలం గుర్తుండే విధంగా నిలిచిపోయాయి.

అందరం కలిసి ***గాంధీజీ*** విగ్రహం వద్ద ధ్యానం చేసాం. హిందీ, గుజరాతీ భాషల్లో కరపత్రాలు పంపిణీ చేసాం. అక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో వున్న గాంధీనగర్ పట్టణానికి వెళ్ళి **" స్వామినారాయణ ట్రస్ట్ "** వారి ***అక్షరధామ్*** తిలకించాం. ***" స్వామి నీలకంఠ "*** జీవితచరిత్ర, ఆయన చిన్నతనంలోనే ధ్యానసాధన కోసం దేశనలుమూలల పర్యటించడం, అనేక ప్రదేశాలు తిరుగుతూ ఆధ్యాత్మికత గురించి వివరించి ప్రజలలో మార్పుతెచ్చిన విధానం .. సినిమా రూపంలో ప్రదర్శించారు. అక్కడి ప్రతిఒక్క కట్టడంలో కళానైపుణ్యత అద్భుతంగా మేళవించబడి అందరినీ ఆశ్చర్య, ఆనందపరవశంలో పరవశింపజేసింది.

***వైష్ణవీదేవి ఆలయం*** సందర్శనం జమ్మూ రాష్ట్రంలోని కట్రా ప్రాంతంలో గల వైష్ణవీదేవి ఆలయంలో ఉన్న అనుభూతి కలిగించింది. అంత అద్భుతంగా డిజైన్ చేసి సహజసిద్ధంగా కొండలపైన ఉన్నట్లు ఆలయనిర్మాణం ఏర్పాటుచేసారు. అహ్మదాబాద్‌లోని తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అద్భుతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. ఆలయ దర్శన అనంతరం అందరం ధ్యానం చేసాం.

తర్వాత ***ఇస్కాన్ మందిరం*** తిలకించి ధ్యానం చేసి అక్కడినుంచి ***మేడమ్ స్వర్ణమాల పత్రి గారి*** అక్కగారైన ***రత్నమాల పటేల్ గారి*** ఇంటివద్ద నిర్మించిన పిరమిడ్‌లో అందరం ధ్యానం చేసి రాత్రి 8 గంటలకు బస్సులో ద్వారక బయలుదేరాం.

***పత్రీజీ*** బెంగళూరు నుంచి అహ్మదాబాద్ చేరుకుని దారిలో మేము ప్రయాణిస్తున్న బస్సును స్కార్పియోలో క్రాస్ చేసి రాత్రి 12 గంటలకు ఆపగా .. అందరం ఆనందపరవశంతో కేరింతలు కొడుతూ ***పత్రీజీ*** సందేశం

తీసుకుని వేడి వేడి టీ త్రాగి తిరిగి ప్రయాణమయ్యాం. ఉదయం 5 గంటలకు ద్వారక చేరుకున్నాం.

## " ఫిబ్రవరి 4 తేదీ .. 2010 "

ఉదయం 8 గంటలకే బయలుదేరి ***ఓఖా*** OKHA పట్టణం చేరుకుని అక్కడి నుంచి పడవలమీద సముద్రంలో విహరిస్తూ ***" బెడ్ ద్వారక "*** చేరుకున్నాం. ద్వాపరయుగం నాటి ఆలయం సముద్రగర్భంలో కలిసిపోయిందని ప్రతీతి. సముద్రపు ఒడ్డున ఒక అతిపురాతనమైన ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. అక్కడ ధ్యానం చేసుకుని అందరం కలిసి సముద్రపు ఒడ్డున ***పత్రీజీ*** తో కలిసి ఫోటోలు దిగాం.

సముద్రం అలలు లేకుండా నిర్మలంగా ఉంటూ వివిధ రకాల పక్షుల కేరింతలతో సముద్రతీరం చూడముచ్చటగా అందరినీ పరవశింపచేసింది. సముద్రంలో బోట్లలో ప్రయాణిస్తూంటే చేపలకు వేసే ఆహారం కోసం అనేక పక్షులు వెంబడిస్తాయి. సముద్రంలో ప్రయాణం ఒక మధురానుభూతి.

అక్కడి నుంచి జ్యోతిర్లింగాలలో పదవదైన ***నాగేశ్వర ఆలయం*** తిలకించి ధ్యానం చేసి ***" ద్వారక "*** చేరుకున్నాం. సాయంత్రం 5 గంటలకు ***భగవత్ భాయ్*** సహకారంతో కందపుబాపు ఆశ్రమంలో వారి గురువుగారి సమాధి వద్ద వందమంది సభ్యులకు ***పత్రీజీ*** సందేశం మరి ధ్యానశిక్షణా తరగతి నిర్వహించారు.

" ద్వారక " అనగానే మనకు శ్రీకృష్ణుడు గుర్తుకు వస్తాడు. సముద్రతీరాన, గోమతీ నది ఒడ్డున ఐదువేల రెండువందల సంవత్సరాలకు

పూర్వం అతిసుందరంగా నిర్మించిన కృష్ణమందిరం తిలకించి అందరం ఆనందపరవశులమయ్యాం. ఆలయం ఆనుకునే **శారదాపీఠం** ఉంది. శారదాపీఠం వారి మీటింగ్ హాలులో నిర్వాహకులు **చంద్రకాంత్ భట్** ఆధ్వర్యంలో జరిగిన ధ్యానసభలో పురప్రజలు, వేదపాఠశాల విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు. ఆ సభలో **పత్రీజీ** హిందీలో అద్భుతంగా సందేశం ఇచ్చి అందరిచేత ధ్యానం చేయించారు.

### " ఫిబ్రవరి 5 తేదీ .. 2010 "

ఉదయం 8 గంటలకు ప్రయాణమై ***" పోర్‌బందర్ "*** లో ***గాంధీజీ*** జన్మించిన ఇంటిని సందర్శించాం. అక్కడ ధ్యానం చేసి ***గాంధీజీ మ్యూజియం*** లో ఫోటో ఎగ్జిబిషన్ తిలకించాం.

అక్కడికి సమీపంలోని దినేష్ హాలులో ***ఓషో సత్సంగ్ సంస్థ*** అధినేత ***ఆత్మారామ్ ఆనంద్ గారి*** చే ఏర్పాటు చేయబడిన ధ్యానశిక్షణా కార్యక్రమంలో 150 మంది ఓషో సంస్థవారు పాల్గొన్నారు. ***పత్రీజీ*** వారందరికీ తనదైనశైలిలో ధ్యానం, ఆత్మజ్ఞానం వివరించి ధ్యానం చేయించారు. యాత్రలో పాల్గొన్న పిరమిడ్ మాస్టర్లచే వారి అనుభవాలు చెప్పించారు. ఆత్మారామ్ ఆనంద్ గారు నిర్మించిన 40'×40' పిరమిడ్ అద్భుతంగా ఉంది. ***ఆత్మారాం ఆనంద్ గారు***, ***పత్రీజీ*** ని చూసి ఆనందవరవశులై " ***'ధ్యాన గుజరాత్'*** కు అన్నివిధాల సహకరిస్తాం; మా కార్యవర్గసభ్యులు కూడా పోర్‌బందర్‌లో ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలు ప్రారంభిస్తారు " అని చెప్పారు.

సాయంత్రం 5 గంటలకు ***సోమనాథ్*** దగ్గరలోని మాధాపూర్‌లో ***ఓషో*** గారితో కలిసి జీవించిన వారి శిష్యులు ***భగవాన్ బ్రహ్మవేదాంత్‌జీ***

ఆశ్రమంలో వారి సభ్యులు 160 మందికి పత్రీజీ క్లాస్ ఏర్పాటు చేసారు. ***పత్రీజీ*** అద్భుతంగా హిందీలో సందేశమిచ్చి ధ్యానం చేయించారు. ***భగవాన్ బ్రహ్మవేదాంత జీ*** మాట్లాడుతూ .. " నేను జీవిస్తున్నాను ; నాతో అందరూ జీవించడానికి సహకరిస్తున్నాను " అని చెప్పారు. ఆశ్రమం 35 ఎకరాలు, ఇంకొకచోట 70 ఎకరాల విస్తీర్ణంలో అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. ***పత్రీజీ*** ఆ రోజు రాత్రి అక్కడే బస చేసారు.

## " ఫిబ్రవరి 6 తేదీ .. 2010 "

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో మొట్టమొదటిదైన **సోమనాధ్ ఆలయ దర్శనం**, ధ్యానం. హరిణి, కపిల, సరస్వతి నదుల త్రివేణీ సంగమం, శంకరాచార్యుల మందిరం, సూర్యదేవాలయం, హరిణీదేవి ఆలయం (గుహ) లక్ష్మీనారాయణ, గీతామందిరం, ***" కృష్ణుడి నిర్వాణస్థలం "***(కృష్ణుడికి బాణం తగలగా, శరీరాన్ని వదిలిన స్థలం) మొదలైన ప్రదేశాలు తిలకించి సాయంత్రం 5 గంటలకు జునాఘడ్ చేరుకున్నాం.

***జునాఘడ్*** లో హైవే ప్రక్కన ***రాజుభాయ్ గారు*** అద్భుతమైన 40'×40' పిరమిడ్ నిర్మించి వున్నారు. అక్కడ వారి కుటుంబసభ్యులు, ఇంకా 100 మందికి ***పత్రీజీ*** ధ్యాన జ్ఞాన బోధ చేసారు. ***రాజుభాయ్***, వారి కుటుంబసభ్యులు ధ్యానం గురించి తెలియదనీ, ' పిరమిడ్ పవర్ ' బుక్ చదివి పిరమిడ్ నిర్మించామనీ ఇక మీదట తప్పక ధ్యానం చేసి చుట్టుప్రక్కల వారికి కూడా ధ్యానం క్లాసులు నిర్వహిస్తామనీ తెలియజేసారు. రాత్రి మౌంట్అబు ప్రయాణమయ్యాం. ***పత్రీజీ*** అహ్మదాబాద్ నుంచి 7వ తేదీ ఉదయం హైదరాబాద్‌కు విమానంలో వెళ్ళారు.

## " ఫిబ్రవరి 7 తేదీ .. 2010 "

మౌంట్‌అబులో **స్వామినారాయణ్** గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి ***ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం*** వారి ***' పీస్ పార్క్ '*** చేరి అక్కడ వివిధ రకాల పూలచెట్లు, వృక్షాల మధ్య వనవిహారం చేస్తూ, ధ్యానం చేసి, లేజర్ షో తిలకించి, ఎత్తైన కొండల మధ్య ప్రయాణిస్తూ గురుశిఖరం చేరుకున్నాం. అక్కడ రెండు గుహలు ఉన్నాయి. అది " దత్తాత్రేయుడు తపస్సు చేసిన స్థలం " అని చెప్పారు. అచలేశ్వర మందిరంలో వివిధ స్ఫటిక దేవతామూర్తులు, ఈశ్వరుని బొటనవ్రేలు స్వయంభువుగా ఏర్పడినట్లు అక్కడివారు తెలియజేసారు.

***" దిల్‌వాడా మందిరం "*** .. 1,115 తెల్లటి పాలరాతి స్తంభాలు, సీలింగ్, చిన్నచిన్న మందిరాలలో విగ్రహాలు, కళాఖండాలతో నిండి ఉన్నది. ఒకచోట ఉన్న డిజైన్ ఇంకొకచోట లేకుండా అద్భుత నైపుణ్యంతో చెక్కిన పాలరాతి శిల్పాలు, తోరణాలు, అలనాటి కళానైపుణ్యానికి నిదర్శనాలు. సాయంత్రం ***" నక్కి లేక్ "*** సందర్శించాం. పూర్వకాలంలో ఒకానొక యోగీశ్వరుడు తన గోళ్ళతో త్రవ్వి ఏర్పరచిన సరస్సే ***' నక్కి లేక్ '***. అందరం సరస్సు సందర్శించి షాపింగ్ ముగించుకుని రాత్రి విశ్రాంతి తీసుకున్నాం.

## " ఫిబ్రవరి 8 తేదీ .. 2010 "

అధార్‌దేవి ఆలయ దర్శనం, ధ్యానం, గోముఖ్ 700 మెట్లు దిగి, ఎక్కడం అసాధ్యం అనుకున్నాం కానీ అక్కడి ప్రకృతి అందాలు తిలకిస్తూ ప్రయాణిస్తే అతి సునాయాసంగా గోముఖ్ చేరుకుని అద్భుతమైన ప్రకృతి

అందాలను తిలకించి ముగ్ధులమై ధ్యానం చేసి, సాయంత్రం **బ్రహ్మకుమారీస్ వారి పాండువన్**, ధ్యానమందిరం, మీటింగ్ హాలు తిలకించి ధ్యానం చేసి వారి అతిథ్యం స్వీకరించాం. సెక్రెటరీ ***శాంతారాం కోడే*** గారు మాకు అన్ని ఏర్పాట్లు చేసారు.

## " ఫిబ్రవరి 9 తేదీ .. 2010 "

ఉదయం 6 గంటలకే బయలుదేరి అబురోడ్డులోని బ్రహ్మకుమారీస్ వారి మ్యూజియం, ఇరవై వేలమంది కూర్చోవడానికి స్తంభాలు లేకుండా నిర్మించిన మీటింగ్ హాలును తిలకించి షాపింగ్ ముగించుకుని **అంబాజి** లోని అమ్మవారి ఆలయదర్శనం, ధ్యానం చేసుకుని సాయంత్రం 5 గంటలకు అహ్మదాబాద్ చేరుకున్నాం. రాత్రి ధ్యానం, సత్సంగం మాస్టర్ల అనుభవాలతో ఆనందంగా గడిచింది.

## " ఫిబ్రవరి 10 తేదీ .. 2010 "

వివిధ ప్రాంతాల నుంచి ధ్యానయాత్రకు విచ్చేసిన పిరమిడ్ మాస్టర్లు షాపింగ్ ముగించుకుని వారి వారి ప్రాంతాలకు తిరిగి వెళ్ళటానికి సంపూర్ణ ఆనందంతో సిద్ధమయ్యారు.

" ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదట ధ్యానం, తర్వాత పిరమిడ్స్ అటు తర్వాత శాకాహారం మూడంచెలుగా ప్రగతి సాధించాం అయితే గుజరాత్‌లో దాదాపు అందరూ శాకాహారులే ఉన్నారు. పిరమిడ్ శక్తి గురించి తెలుసుకుని మనం ఈ రాష్ట్రానికి రాకముందే పిరమిడ్స్ నిర్మించి వున్నారు. అందులో పోర్‌బందర్‌లో 40'×40' పిరమిడ్, జునాఘడ్‌లో 40'×40' పిరమిడ్ చూస్తూంటే గుజరాత్ ప్రజలు ఎంతో ముందంజలో ఉన్నారు. వీరికి ఇక ధ్యానం గురించి చెబితే చాలు, వారు సిద్ధంగా ఉన్నారు. మనం ప్రతి

జిల్లాను సందర్శిస్తే చాలు. అతి త్వరలో **' ధ్యాన గుజరాత్ '** అయిపోతుంది" అని **పత్రీజీ** సెలవిచ్చారు.

అనేక ఆధ్యాత్మిక సంస్థల ప్రముఖులు కూడా **పత్రీజీ** రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఈ యాత్రలో కొంతమంది పత్రీజీని కలిసి వారి సంస్థలకు ఆహ్వానించారు.

**పత్రీజీ** తో కలిసి గుజరాత్‌లో అనేక ప్రదేశాలు తిలకిస్తూ, ధ్యానం చేస్తూ, ధ్యాన సందేశాలు తీసుకుంటూ, హాయిగా, ఆనందంగా **గుజరాత్, మౌంట్‌అబు ధ్యానయాత్ర** సాగిపోయింది.

ఈ యాత్రలో గుజరాత్ చీఫ్‌ప్యాట్రన్ **రీటా కెప్టెన్**–సూరత్, **షీలా మెహతా**– ముంబాయి, **రేఖా మెహతా**–సూరత్ పాల్గొని **పత్రీజీ** హిందీలో క్లాసులు నిర్వహించగా వారు వారి ప్రాంతీయ భాష అయిన గుజరాతీలో అనువాదం చేస్తూ ఎంతో సహకరించారు.



2010–జునాఘడ్ పిరమిడ్ వద్ద పత్రీజీతో
యాత్రలో పాల్గొన్న పిరమిడ్ మాస్టర్స్

## " గుజరాత్ ధ్యాన జ్ఞాన యాత్ర - ఓ మధురానుభూతి "

**- చిట్టూరి కల్పనామూర్తి,** రాజమండ్రి

***" బ్రహ్మర్షి పత్రీజీ*** ఆశీస్సులతో .. **ధ్యానరత్న *D.* కేశవరాజు** (అన్నమయ్య) గారి ఆధ్వర్యంలో 40 మంది ధ్యానులతో ఫిబ్రవరి 2 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు తొమ్మిది రోజుల ***'గుజరాత్, మౌంట్అబు ధ్యాన జ్ఞాన యాత్ర '*** మరపురాని మధురానుభూతి. ఈ యాత్రలో పాల్గొన్నవారు ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నై, మహారాష్ట్ర, సూరత్‌ల నుంచి 2 వ తేదీ రాత్రికి అహ్మదాబాద్ చేరుకున్నారు.

" పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యానులు ఏదో సందర్భంలో ఎక్కడో ఒకచోట కలుసుకుంటున్న ఇటువంటి యాత్ర వలన ఒకరికొకరు మరింత దగ్గర అవుతారు. ఈ యాత్రలో ముందుగా ఒకరికొకరు ఏమాత్రం తెలియనివారు కూడా ఆఖరుకు ఎంతో సన్నిహితమై ఒకే కుటుంబంలా .. ఎంతో ఆప్యాయంగా, ఉత్సాహంగా గడిపాం.

ఈ యాత్ర ముఖ్యంగా ఏదో మామూలు టూర్‌లా కాకుండా ***'ధ్యానప్రచారం '*** తో ***' ధ్యాన గుజరాత్ '*** కావాలి. ఇప్పటికే 3 నెలల నుంచి **ధ్యానరత్న కిషోర్** కుటుంబంతోనూ, పైమా మాస్టర్లతోనూ సూరత్‌లోనే ఉంటూ ధ్యానప్రచారం చేస్తున్నా, ఇప్పుడు ఈ యాత్రలో గుజరాత్ మాస్టర్లు **రీటా మేడమ్ టీమ్** తో మా యాత్ర మెంబర్స్ ఎక్కడికి వెళ్ళినా నెత్తిమీద పిరమిడ్స్ క్యాప్స్‌తో, చేతిలో పాంప్లెట్స్ పెట్టుకుని ఎదురైన గుజరాతీయులకు

ధ్యానం చెప్తూ, సాధన చేయిస్తూ వారి స్పందనను చూసి ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ముందుకు సాగాం ! మా పిరమిడ్ క్యాప్స్‌ను ఎందరో అడిగి తీసుకున్నారు, దానికి ఖరీదు ఇస్తామని కూడా అన్నారు ! వారికి ఉచితంగా ఇవ్వటం మాకు సంతోషం కలిగించింది !

" 4వ తేదీన ఉదయానికి ద్వారక చేరుకున్నాం. అక్కడకు 20 కి.మీ. దూరంలో ఉన్న అరేబియన్ సముద్ర తీరానికి చేరుకున్నాం. అప్పటి నుంచి ***పత్రీజీ*** సమక్షంలో మూడు రోజులు - ప్రతి క్షణం ఏదో ఒక అనుభూతి. అక్కడ ద్వారక. పురాతన ద్వాపరయుగంలో కృష్ణమందిరం ఉండేదనీ, కాలక్రమంలో సముద్రగర్భంలో కలిసిపోయిందనీ అక్కడి వాళ్ళు చెప్పారు. అతిపురాతనమైన కృష్ణమందిరం ఇప్పుడున్న ద్వారక దీవి (ఐలెండ్) కి మోటార్ బోట్‌లో చేరుకున్నాం.

" ఆ సముద్రంలో అరగంట మార్గంలో ప్రయాణీకులు వేస్తున్న మరమరాలు (బొరుగులు), గింజలకై కొన్ని వందల తెల్లని పిట్టలు వెంటవచ్చే దృశ్యం అందరినీ ఎంతో ఆహ్లాదపరచింది. ఆ ఐలెండ్‌లో ***పత్రీజీ*** సమక్షంలో సామూహిక ధ్యానం తర్వాత తిరిగి ఈవలకు వచ్చి ద్వారక మధ్యలో నాగేశ్వర్ శివాలయం చూసాం. అది జ్యోతిర్లింగాలలో 10వది. ఆ గోపురం పైన ప్రతి స్టెప్‌పైన అందమైన పావురాలు అందరినీ ఆకర్షించాయి. ఆ ప్రాంగణంలో ధ్యానముద్రలో ఉన్న 60 అడుగల ***శివుని విగ్రహం*** ఓ హైలైట్ !

" ఆ సాయంత్రం మేము బసచేసిన ప్రాంగణంలోనే కొంతమంది గుజరాతీ భక్తులచే ***పత్రీజీ*** ధ్యానసాధన చేయించారు. తిరిగి సార్ ద్వారకలోని

కృష్ణమందిరంలో కనీసం 500 మందికి ధ్యానం పరిచయం చేసి, ధ్యానసాధన చేయించారు. ఆ సాయంత్రం అందరికీ చాలా ఆత్మ తృప్తిగా గడిచింది.

" 5వ తేదీ ఉదయాన్నే బయలుదేరి మొదట ***పోర్‌బందర్*** వెళ్ళి ***గాంధీజీ*** జన్మించిన స్థలం, ఆయన చదువుకున్న గది, చరిత్ర, ఫోటో ఎగ్జిబిషన్ చూసి విస్మయం చెందాం. అక్కడకి దగ్గరలోనే ఓషో శిష్యులు ఏర్పాటు చేసిన ధ్యానం క్లాస్‌లో 150 మంది గుజరాతీలచే పత్రీజీ ధ్యానం చేయించి వారి అనుభవాలు తెలుసుకుని, వారి సందేహాలను నివృత్తి చేసారు.

" తర్వాత బయలుదేరి ' మాధవపూర్ ' అనే గ్రామంలో ఓషో శిష్యుని ఆశ్రమం చేరుకుని ***భగవాన్ బ్రహ్మవేదాంతి జీ*** గారు ఎంతో ఆత్మీయతతో ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి విశ్రాంతి తీసుకున్నాం. ఆ సాయంత్రం ***పత్రీజీ*** చే ఆశ్రమంలో ఉన్న 160 మంది శిష్యులతో సామూహిక ధ్యానం చేయించబడింది. ఆ రాత్రికి 2 గంటలకు ప్రయాణంతో సోమనాథ్ క్షేత్రం చేరి అక్కడే బస చేసాం.

" 6వ తేదీన సోమనాధాలయంలో జ్యోతిర్లింగాలలో మొదటిదైన లింగాన్ని దర్శించి, చేరువనే ఉన్న సముద్రంలోని తరంగాలను, బీచ్ చూసి ఆనందించాం. ఆ సాయంత్రానికి జునాఘడ్‌కు చేరుకున్నాం. అక్కడ ఉన్న 40'×40' పిరమిడ్‌తో గుజరాత్ పౌరులతో ***పత్రీజీ*** ధ్యానం చేయించారు.

***" పత్రీజీ*** మాట్లాడుతూ .. ' మన వాళ్ళకు ముందు శాకాహారులుగా మారమనీ, తర్వాత ధ్యానం నేర్చుకుని పిరమిడ్‌లు కట్టుకోమనీ చెప్తాం. కానీ గుజరాత్‌లో రివర్స్. 90% శాకాహారులే !! పిరమిడ్లు కడతారు కానీ ధ్యానం తెలియదు. అందుకే ఈ రాష్ట్రాన్ని ***' ధ్యాన గుజరాత్ '*** గా చేయడం సులభం ' అన్నారు.

“ జునాఘడ్ పిరమిడ్ దగ్గరనే **పత్రీజీ** మా అందరినీ ఆత్మీయతతో పలుకరించి, చక్కటి గ్రూప్ ఫోటో తీయించుకుని ఎంతో ఉల్లాసంగా వీడ్కోలు చెప్పారు. ఆ పైన రాత్రంతా ప్రయాణం. సుమారు 650 కి.మీ. ప్రయాణంతో 7వ తేదీ ఉదయం 9 గంటలకు అబూ (రాజస్థాన్) చేరుకున్నాం.

“ ఇక 7, 8 తేదీలలో ఎప్పటి నుంచో మా కలలపంట ***‘ మౌంట్ అబూ ’*** చేరుకున్నాం! 7వ తేదీన 450 అడుగుల ఎత్తులో ఉన్న గిరి శిఖరంలో ఉన్న మహర్షులు ధ్యానం చేసుకున్న గుహల దర్శనం కోసం 350 మెట్లు సునాయాసంగా ఎక్కడం ఎంతో ఆనందం కలిగించింది.

“ మధ్యాహ్నం చూసిన అద్భుతం ***‘ దిల్‌వాడా టెంపుల్ ’*** ! ఒకే ప్రాంగణంలో ముప్పయి జైనుల ఆలయాలు ఉన్నాయి. వెయ్యినూట పదహారు స్తంభాలు, ప్రతి స్తంభం మీదా అమోఘమైన శిల్పాలు ! పైన చూస్తే కళ్ళు చెదిరే శిల్పచాతుర్యం. ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి శిల్ప నైపుణ్యాన్ని చూడలేమేమో ! ఇదొక రికార్డ్ ! 106 మహావీర్ జైన్ విగ్రహాలు ప్రతి సెం.మీ. అద్భుతమే ! ఆ సాయంత్రం **నక్కి సరస్సు** చూసి తర్వాత షాపింగ్ చేసాం.

“ 8వ తేదీ ఉదయం ‘ ఆధార్‌దేవి ’ ఆలయానికి ప్రయాణం. 350 మెట్లు పైన ఎక్కిన తర్వాత అక్కడ ఓ గంట సామూహిక ధ్యానం చేసి మధ్యాహ్నం గోముఖం పైనుంచి 700 మెట్లు క్రిందకు దిగాం. క్రింద వశిష్టాశ్రమంలో ప్రకృతి రమణీయ దృశ్యాలతో ఒళ్ళు పులకరించింది. అదే ఉత్సాహంతో ఆ 700 మెట్లు ఎక్కడం ఓ అనుభూతి ! అక్కడ కోతులు మాతో ఎంతో సన్నిహితంగా దగ్గరికొచ్చి చేతిలోని బిస్కట్లు తీసుకుని ఇంకా, ఇంకా అడిగేవి. అదంతా భయంతో కూడుకున్న సరదా. అందరి కెమెరాల్లోనూ బంధించాం.

" ఉదయం 9 గంటలకు బయల్దేరి క్రింద ***" ప్రశాంతి నిలయం "*** దర్శించాం ! అదొక అద్భుత కట్టడం. 15,000 నుంచి 20,000 మంది కూర్చోగలిగే పెద్దహాలు ఆశ్చర్యకరంగా ఉంది. తిరుగు ప్రయాణంలో అంబాజీలోని దేవి ఆలయం దర్శించి సాయంత్రానికి అహ్మదాబాద్‌కు చేరుకోవడంతో ఈ ధ్యాన యాత్ర పూర్తి అయ్యింది. 10 వ తేదీన అందరం వారి వారి ప్రదేశాలకు అనుకున్న సమయాలను బట్టి ట్రైన్‌లో వెళ్ళటం జరిగింది. ఆఖరి వరకు ***శ్రీ కేశవరాజు గారు*** అన్ని విషయాల్లోనూ శ్రద్ధతో వారి ఆత్మీయతను పంచుతూనే ఉన్నారు.

" ఈ ధ్యానప్రచార యాత్రలో ఎన్నో తెలుసుకున్నాను. మాకు తెలిసినవి అందరితో పంచుకున్నాము. ఇటువంటి యాత్రలు – స్వకార్యం – స్వామికార్యంతో కూడి .. ఇంకా ఎన్నో జరగాలని కోరుకుంటూ, ఇంతగా విజయవంతం కావడానికి కారణభూతులు అయిన ముఖ్యంగా ***బ్రహ్మర్షి పత్రీజీ, కేశవరాజు గారు, సూరత్ కిషోర్ టీమ్***, సహధ్యానులు, మమ్మల్ని క్షేమంగా చేరవేసిన వాహనాలు, శాంతి ఆశ్రమ కార్యకర్తలు, అన్నిటికన్నా మిన్న అన్నట్లు ఎప్పటికప్పుడు, ఏ సమయంలోనైనా మాకు రుచికరమైన ఆహారం అందించిన ***' రాజమండ్రి వంటవాళ్ళు '*** అందరికీ వందనాలు !"

*(*94404 83875*)*

# " పూరీ, కోణార్క్, భువనేశ్వర్ ధ్యాన ప్రచారయాత్ర "

**- D. చంద్రశేఖర్, హైదరాబాద్**

" జగద్గురువు **బ్రహ్మర్షి పత్రీజీ** ఆధ్వర్యంలో **ధ్యానరత్న D. కేశవరాజు** గారు ఒరిస్సా రాష్ట్రంలో నిర్వహించిన ధ్యాన ప్రచారయాత్ర 2010 డిసెంబర్ 1 వ తేదీ నుంచి 4 వ తేదీ వరకూ అద్భుతంగా సాగింది. నవంబర్ 30 వ తేదీన ఆంధ్రప్రదేశ్ నుంచి బయలుదేరిన 60 మంది పిరమిడ్ మాస్టర్స్ .. డిసెంబర్ 1 వ తేదీన **' పూరీ '** చేరడంతో మా ధ్యానయాత్ర మొదలైంది.

## డిసెంబర్ 1 వ తేదీ

" మొదటి రోజు అంటే డిసెంబర్ 1 వ తేదీన " పూరీ " లోని జగత్ప్రసిద్ధమైన ***' జగన్నాథ మందిరం '*** దర్శించాము.

" ఉదయం జగన్నాథుడి దర్శనం తరువాత భోజనం ముగించి మధ్యాహ్నం 3.00 గంటల నుంచి పూరీలోని మరికొన్ని దేవాలయాల దర్శనం చేసుకుంటూ ***" శ్రీ యుక్తేశ్వర్‌గిరి గారి ఆశ్రమం "*** మరి వారి సమాధి ని సందర్శించి అక్కడ సుమారు 45 ని॥ ధ్యానం చేయడం జరిగింది. ఇక్కడి ధ్యానం ప్రతి ఒక్కరికీ చక్కటి అనుభవాలను అందించింది. ఆ తరువాత అక్కడి గోల్డెన్ బీచ్‌లో షాపింగ్ చేసి ఆ బీచ్‌లోని అందాలన్నీ తిలకించి ఆ మధురానుభూతులతో మా వసతికి చేరాము."

## డిసెంబర్ 2 వ తేదీ

" రెండవ రోజు డిసెంబర్ 2 వ తేదీ పూరీ నుంచి రెండు బస్సుల్లో ' చిల్కా సరస్సు ' కు బయలుదేరాం.

" పూరీకి సుమారు 150 కి.మీ. దూరంలో ఉన్న చిల్కా సరస్సు వద్దకు 4 గంటలు ప్రయాణం చేసి అక్కడ పత్రీజీనీ మరి ఒరిస్సా మాస్టర్స్‌నూ కలవడం జరిగింది! ఈ చిల్కా సరస్సు ఆసియాలోకెల్లా అతిపెద్ద బ్యాక్ వాటర్ ఉప్పునీటి సరస్సు. ఎన్నో పక్షులకు ఆవాసం అయిన ఈ ప్రదేశానికి ప్రతి సంవత్సరం జనవరిలో సుమారు 150 జాతుల పక్షులు వలస వస్తూంటాయి.

" ఈ చిల్కా సరస్సులో రెండు బోట్లలో ఆంధ్ర మరి ఒరిస్సా మాస్టర్స్ పత్రీజీతో కలసి ఒక గంట ప్రయాణం చేసి సరస్సు మధ్యలో ఉన్న ఒక దీవికి చేరాం. ఇక్కడ పత్రీజీ అందరిచే 30 ని॥లు అద్భుతమైన మురళీనాదంతో ధ్యానం చేయించడం జరిగింది.

" చిల్కా సరస్సు ప్రయాణం ఆద్యంతం అందరినీ ఎంతగానో అలరించింది .. మరి ఇక్కడ పత్రీజీతో సహా అందరూ ఎంతో సరదాగా గడిపి సాయంత్రం పరస్పరం వీడ్కోలు పలికి మా, మా వసతులకు బయలుదేరాము.

" అక్కడి నుంచి పత్రీజీ ఒరిస్సా మాస్టర్స్‌తో కలిసి భువనేశ్వర్ వెళ్ళిపోయారు. "

## డిసెంబర్ 3 వ తేదీ

" డిసెంబర్ 3 వ తేదీ ఉదయం పూరి నుంచి బయలుదేరి **' కోణార్క్ '** చేరుకున్నాము. కోణార్క్‌లోని సముద్రం ఒడ్డున ఉన్న **' సైకత**

**శిల్పాలను '** చూస్తూ ఉండగా .. పత్రీజీ భువనేశ్వర్ నుంచి ఒరిస్సా మాస్టర్స్‌తో వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు. అక్కడ నుంచి దగ్గరలోనే ఉన్న కోణార్క్ సూర్య దేవాలయానికి వెళ్ళడం మరి దేవాలయం లోనికి వెళ్ళిన తరువాత పత్రీజీ ఒకచోట ధ్యాన నిమగ్నమై అందరినీ వెళ్ళి సూర్య దేవాలయాన్ని చూసి రావలసిందిగా ఆజ్ఞాపించడం జరిగింది."

## " కోణార్క్ సూర్య దేవాలయం "

" ఒరిస్సా శిల్పకళానైపుణ్యానికి కోణార్క్ సూర్య దేవాలయం ఒక చక్కని తార్కాణం అని చెప్పవచ్చు. 13 వ శతాబ్దంలో గ్రానైటు రాళ్ళతో నిర్మించిన ఈ మందిరంలోని శిల్పాలలో ఆనాటి సాంస్కృతిక జీవన విధానం ప్రతిబింబిస్తుంది.

" ఈ ఆలయాన్ని తూర్పు గంగా వంశానికి చెందిన నరసింహ దేవుడు 1236-1264 ల మధ్య నిర్మించాడని చరిత్ర. సూర్యుని రథం ఆకారంలో నిర్మించిన ఈ ఆలయం నగిషీలు చెక్కిన శిల్పాలతో అద్భుతంగా అలంకరించబడి ఉన్నది. ఈ సూర్య దేవాలయం మొత్తం ఏడు బలమైన అశ్వాలు, పన్నెండు జతల అలంకృత చక్రాలతో లాగబడుతూన్న పెద్ద రథం ఆకారంలో కట్టబడింది.

" సముద్ర తీరంలో నిర్మించిన ఈ సూర్య దేవాలయం, సూర్య గమనానికి అనుగుణంగా నిర్మాణం జరిగి .. అద్భుతాల్లోకెల్లా అద్భుతంగా కనిపిస్తుంది.

" రథానికి పన్నెండు చక్రాలు ఉన్నాయి. సంవత్సరానికి పన్నెండు మాసాలు, పన్నెండు రాశులు మరి వీటికి అనుగుణంగా సూర్య గమనం

అన్నీ ఈ చక్రంలో దోబూచులాడుతూంటాయి. రథాకారం కలిగి వున్న ఈ దేవాలయం పైన పద్మం మరి కలశం ఆకర్షణీయంగా చెక్కబడి ఉన్నాయి.

" కోణార్క్ దేవాలయంలో సుమారు 40 నిమిషాలు మా అందరితో పత్రీజీ ధ్యానం చేయించారు ! కోణార్క్ ఆలయ సందర్శన అనంతరం భువనేశ్వర్‌కి ప్రయాణం దారిలో పూరి-కోణార్క్ హైవేలో భువనేశ్వర్‌కి 8 కి.మీ. దగ్గరలో గల ' దౌలి (బుద్ధా) శాంతి స్థూపాన్ని ' సందర్శించాము.

" క్రీ.పూ. 250 సం॥లో కళింగరాజైన అశోకుడు ఘోరమైన యుద్ధంలో విజయం పొందాక .. ఆ యుద్ధంలో జరిగిన రక్తపాతానికి పశ్చాత్తాపం చెంది, ఒక ఎత్తైన కొండ పైన ఈ శాంతి స్థూపాన్ని నిర్మించారు. కాలక్రమంలో శిథిలావస్థకు చేరిన ఈ స్థూపాన్ని కళింగ రాజులు ' బుద్ధ సంఘం ' గా తిరిగి అందుబాటులోకి తెచ్చారు.

" మధ్యాహ్నం 3.30 గం॥లకి ఇక్కడ నుండి భువనేశ్వర్‌లోని ' లింగరాజు దేవాలయం ' సందర్శించాము. ఈ దేవాలయం సోమవంశీయులకు చెందిన రాజు క్రీ॥శ॥ 617-657 లో నిర్మించాడని చరిత్ర తెలియజేస్తోంది. ఈ దేవాలయంలో తెల్లని గ్రానైట్ రాయితో మలచబడిన శివుడు ' త్రిభువనేశ్వరుడు ' గా ప్రసిద్ధి చెందాడు. శివ కేశవులు కలిసి ఉన్న ఈ దేవాలయం చుట్టూ 108 చిన్న చిన్న దేవాలయాలు ఉండటం విశేషం.

" సాయంత్రం 4.00 గం॥లకు భువనేశ్వర్ మాస్టర్స్ ఏర్పాటు చేసిన ' శాకాహార ర్యాలీ ' లో పత్రీజీతో పాటు పాల్గొనటం జరిగింది! సుమారు 2 కి.మీ. సాగిన ఈ ర్యాలీ ' ఉట్కల్ మండపం' మీదుగా

‘ రవీంద్ర మండపం ’ దగ్గర చేరుకుంది. ఈ శాకాహార ర్యాలీలో సుమారు 200 మంది ఆంధ్ర, ఒరిస్సా మాస్టర్స్ పాల్గొన్నారు.

“ ర్యాలీ అనంతరం పత్రీజీ వేణునాదంతో ఒక గంట ధ్యానం అందర్నీ ఆనంద డోలికల్లో ముంచింది ! ఒరిస్సా మాస్టర్స్ ధ్యాన అనుభవాలు విన్న తర్వాత, ‘ ఆనాపానసతి కోర్సు ’ చేసిన వారికి పత్రీజీ చేతుల మీదుగా సర్టిఫికేట్స్ ప్రదానం అద్భుతంగా జరిగింది!

“ పత్రీజీ మా అందరితో ఎంతో హుషారుగా గడపడం ఈ యాత్రలో మాకు మరచిపోలేని అనుభూతిని ఇచ్చింది ! అక్కడ నుంచి బయలుదేరి ‘ పూరీ ’ వచ్చి .. అద్భుతమైన విందును ఆరగించి విశ్రాంతి తీసుకున్నాము.”

## “ డిసెంబర్ 4 వ తేదీ ”

“ డిసెంబర్ 4 వ తేదీ మధ్యాహ్నం బయలుదేరి ఎవరి ప్రాంతాలకు వాళ్ళం వెళ్ళడంతో ఈ యాత్ర ముగిసింది.

“ ఇక్కడ మా యాత్ర నిర్వాహకులు **D. కేశవరాజు** గారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా .. అద్భుతమైన వసతితోపాటు రుచికరమైన, శుచికరమైన ఫలాహారాలూ, భోజనం ఏర్పాటు చేసారు. రాజమండ్రి నుంచి వచ్చిన వంట మాస్టర్స్ ఇంటి భోజనాన్ని మరిపించే విధంగా ఏర్పాట్లు చేసి అందరి మన్ననలూ అందుకున్నారు. ”

– 70755 94555

# “ 2011- అమరకంఠ ధ్యానయాత్ర ”

***– జక్కా పద్మ రాఘవరావు, విజయవాడ***

**“ బ్రహ్మర్షి పత్రీజీ** ఆధ్వర్యంలో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 200 మంది పిరమిడ్ మాస్టర్లతో కూడిన బృందం **మధ్యప్రదేశ్** రాష్ట్రంలోని **నర్మదానది** జన్మస్థానం అయిన ‘ **అమరకంఠ** ’ కు బయలుదేరింది. అద్భుతమైన ప్రకృతి సౌందర్యంతో అలరించివున్న **అమరకంఠ** యాత్ర అందులో పాల్గొన్న వారందరికీ మధురాను భూతులను మిగిల్చింది.

“ జూలై 19వ తేదీ ఉదయం 10.00 గంటలకు 18 మంది మాస్టర్లతో కూడిన మా విజయవాడ బృందం .. రైలు ప్రయాణం మొదలుపెట్టాము. తాడేపల్లిగూడెం, వరంగల్, హైదరాబాద్ మాస్టర్స్ అక్కడికక్కడ .. అదే రైలు ఎక్కడంతో ఇక ట్రైన్‌లో ధ్యానయోగుల సందడే సందడి మొదలైంది. విజయవాడ మాస్టర్ **‘ మాధవీలత ’ సత్యాన్ని** ఎన్ని కోణాల్లో దర్శించవచ్చో అనుభవపూర్వకమైన అనుభూతులతో ధ్యానులందరికీ చక్కగా వివరించారు.

“ రాత్రి 11 గంటలకు రాయపూర్ చేరుకుని, వరుణుడి ఆత్మీయ ఆహ్వానంతో .. మాకు ఏర్పాటు చేసిన ‘ **సింధు భవన్** ’ విడిదికి చేరుకున్నాము. వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన మాస్టర్స్‌తో పరిచయ కార్యక్రమాల తరువాత నిర్వాహకులు D. **కేశవరాజు** గారు అందరికీ .. ట్రెక్కింగ్ వివరాలు తెలియజేసారు.

" 20వ తేదీ ఉదయం 8 గంటలకు మా ప్రయాణం మొదలై దారిలో ' **మహామాయ టెంపుల్** ' దర్శించుకున్నాం. ఆ గుడి 6 వ శతాబ్దానికి చెందింది. అక్కడ ' మొదలు ' ఎక్కడఉందో తెలియని వందల యేళ్ళ వయస్సు ఉన్న మర్రి వృక్షం ఒకటి అందరినీ ఆశ్చర్యపరచింది. అద్భుతమైన దివ్యశక్తితో కూడి ఉన్న ఆ ప్రదేశంలో ధ్యానం చేసి ప్రతి ఒక్కళ్ళం మధురానుభూతులను పొందాం. శరీరం గాలిలో తేలుతూన్న అనుభవం అక్కడ చాలా మందికి కలిగింది.

" బస్సులన్నీ రాత్రి 9.00 గంటలకు **అమరకంఠ** చేరుకోవడం తో అక్కడ ' **జైన్ భవన్** ' లో ఏర్పాటు చేసిన గదుల్లో మేము విశ్రాంతి తీసుకున్నాము. అదే రోజు రాత్రి 11.00 గంటల కల్లా పత్రీజీ కూడా అమరకంఠకు చేరుకోవడంతో .. ధ్యానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది ! "

★ ★ ★

" 21వ తేదీ ఉదయం 6.00 గంటల నుంచే **' చత్తీస్‌ఘడ్ '** లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్స్ ధ్యానానుభవాలతో పత్రీజీ కాన్సెప్టులతో సత్సంగం మొదలైంది. తెలుగు, హిందీ భాషల్లో వేదసారాన్నంతా అయిదు వ్రేళ్ళల్లో ఇమిడ్చి .. పత్రీజీ వివరించిన తీరు ప్రతి ఒక్కరికీ .. ఎంతో ఆనందాన్నిచ్చింది !

" ఫలహారాలు అయిన తరువాత అమరకంఠేశ్వర దేవాలయాన్నీ, నర్మదానదినీ చూడడానికి బయలుదేరాం ! భూలోకవాసులకు ఆధ్యాత్మికానందాన్ని కలుగజేసే పుణ్యస్థలం అయిన ' **అమరకంఠ** ' అద్భుతమైన ప్రకృతి సంపదతో విరాజిల్లుతోంది. ' సృష్టి లయ కారకుడైన పరమశివుడు తపస్సులో ఉండగా .. అతని కంఠం నుంచి జాలువారిన

స్వేదబిందువుల ప్రవాహమే .. నర్మదా నదిగా ఉద్భవించింది ’ అని పురాణాలు చెప్తున్నాయి. ఇక్కడ జన్మతీసుకున్న నర్మదానది అనేక మలుపులు తిరుగుతూ వెళ్ళి .. అరేబియా మహాసముద్రంలో కలుస్తుంది.

“ సువిశాల భారతావనిని ఉత్తర, దక్షిణాలుగా విభజిస్తోన్న వింధ్య-సాత్పూరా పర్వతాలు .. ఇక్కడ చక్కని ల్యాండ్ - స్కేప్‌గా ఏర్పడి.. అతి పొడవైన వృక్షాలతో, చల్లని వాతావరణంతో .. అమాయక గిరిజనులకు ఆవాస భూమిగా అలరారుతున్నాయి !

“ ఇది పరమశివుని యొక్క తపోభూమి కనుక ఇక్కడికి అమరులు .. కూటములు, కూటములు .. అంటే సమూహాలు, సమూహాలుగా రావడం వల్ల ఈ ప్రదేశానికి **అమరకూటమి** గా పేరు వచ్చి .. కాలక్రమంలో ***‘ అమరకంత ’*** గా మారిపోయింది. ***‘ బాల బ్రహ్మచారిణి ’*** అయిన ***‘ నర్మదా దేవి ’*** ఇక్కడే ఆత్మవిద్యను అభ్యసించిందట.

“ యోగ పరిభాషలో .. ‘ గంగ ’, ‘ యమున ’, ‘ సరస్వతి ’ నదులను .. ‘ ఇడా ’, ‘ పింగళ ’, ‘ సుషుమ్న ’ నాడులుగానూ .. నర్మదా నదిని ‘ కుండలినీ శక్తి ’ గా అభివర్ణిస్తారు. ప్రతి మానవుడిలోని నిద్రాణ స్థితిలో ఉన్న ఈ కుండలినీ శక్తే .. నర్మదా శక్తిగా మరి ఆ కుండలినీ చైతన్య జాగృతే ‘ అనంత శక్తి స్వరూప దర్శనం ’ గా పురాణాల్లో చెప్పబడింది.

“ పత్రీజీ మనకు అందించిన వజ్రాయుధం లాంటి ఆనాపానసతి ధ్యానం ద్వారా మనలోని కుండలినీ జాగృతం చేసుకుని .. సర్వవ్యాపకమైన అనంత శక్తి స్వరూపాన్ని దర్శిస్తోన్న యోగులెందరో మనలో ఉన్నారు.”

★ ★ ★

" అక్కడ ఏర్పాటు చేయబడిన ' ***గైడ్*** ' మాకు అన్ని విశేషాలనూ చక్కగా వివరించాడు. నర్మదా దేవి ఆలయాల దర్శనం తరువాత నదిలోకి వెళ్ళేముందు .. అందరితో బ్రహ్మర్షి పత్రీజీ ***' స్టాండింగ్ మెడిటేషన్ '*** చేయించారు ! అతి పవిత్రమైన నర్మదా నదిని దర్శించుకునే ముందు మనం అంతా కూడా ధ్యానం ద్వారా పరమ పవిత్రం కావాలని అలా చేయించారు.

" ' ***నర్మదా నది పరిక్రమణ*** ' వరుణుడి పూలజల్లులతో అందరికీ దివ్యాతిదివ్యమైన అనుభవంగా మారింది !

" మార్గమధ్యంలో చిన్నప్పుడు నర్మదాదేవి ఆడుకున్న ప్రదేశంలో ధ్యానం చేసి .. అందరం ఆనందంతో గంతులేసే లేడికూనల్లా మారిపోయాం !

" అక్కడి నుంచి ' సోమా ' నదికి బయలుదేరాం. ఆ అద్భుతమైన ప్రకృతిలో, అనంత శక్తివంతమైన ప్రదేశంలో బ్రహ్మర్షి పత్రీజీ తో కలిసి లయబద్ధంగా అడుగులు వేస్తూ నడవడం .. ' ఎన్ని జన్మల పుణ్యఫలమో ' అనిపించింది. పరిక్రమ పూర్తయ్యాక.. నదిలో స్నానాలు చేసి రూములకు చేరుకున్నాం.

" సాయంత్రం 5.00 గంటలకు బయలుదేరి ***' జైన్ టెంపుల్'*** ***' కల్యాణ దాసుగారి ఆశ్రమం '*** మరి వారి గురువు ' ***స్వస్వరూప దాస్ మహారాజ్*** ' గారి సమాధి దగ్గర ధ్యానం చేసాం ! అవి అన్నీ కూడా అనంతమైన శక్తిక్షేత్రాలు ! రాత్రి 7.00 గంటల నుంచి 9.00 గంటల వరకు బ్రహ్మర్షి పత్రీజీ సమక్షంలో అద్భుతమైన వేణునాదంలో లీనమవుతూ చేసిన ధ్యానం అందరినీ ఏవేవో లోకాలకు తీసుకుని వెళ్ళింది."

★ ★ ★

“ మర్నాడు 23వ తేదీ ఉదయం మాకు అందరికీ వీడ్కోలు ఇస్తూ ‘ నాలుగేళ్ళుగా అమరకంఠకు రావాలనీ, ఇక్కడి విశేషాలన్నీ చూడాలనీ నాకు ఉన్నా .. అది ఇప్పుడు ఇలా సరి అయిన సమయంలో, సరి అయిన మాస్టర్స్‌తో కలిసి నెరవేరింది ’ అని బ్రహ్మర్షి పత్రీజీ అనడం మాకు అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది. దారిలో ‘ ***గంగిరేని డ్యామ్*** ’ మరి నర్మద, సోమ, పుణ్య నదుల ‘ ***త్రివేణి సంగమం*** ’ చేరి అక్కడి ఆశ్రమంలో ధ్యానం చేసాం.

“ సాయంత్రం 7.00 గంటల కల్లా రాయపూర్ చేరుకుని అక్కడ ధ్యానప్రచారంతో పాటు, షాపింగ్ కూడా పూర్తి చేసుకున్నాము.”

★ ★ ★

“ 24వ తేదీ ఉదయం ***రాయపూర్*** లోని ***‘ జెఠానీ ’*** గారి ఇంట్లో ‘ ***ఏకతాధ్యానం*** ’ ఏర్పాటు చేయబడింది. అతి సుందరమైన వారి పిరమిడ్‌లో .. వీనులవిందైన బ్రహ్మర్షి పత్రీజీ వేణునాదంతో కూడిన ధ్యానం అందరికీ అలౌకిక ఆనందాన్ని ఇచ్చింది. జెఠానీదంపతుల ఆతిధ్యం అందరికీ ఆత్మీయతను పంచింది.

‘‘ అనంతరం అక్కడినుంచి ఎవరి ప్రాంతాలకు వాళ్ళం బయలుదేరాం.

“ జోరువానలో కూడా ఎవ్వరికీ, ఎక్కడా .. ‘ ఇబ్బంది ’ అన్నది లేకుండా ***‘ ఆహార-విహారాలన్నీ ’*** చక్కగా ఏర్పాటు చేసిన ***‘ ధ్యానరత్న ’ కేశవరాజు*** గారికీ, ‘ రాయపూర్ మాస్టర్స్ ’ అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం !”

***– 98481 92801***

# “ 2012- దక్షిణ కర్నాటక ధ్యాన యాత్ర ”

***బ్రహ్మర్షి పత్రీజీ*** ఆదేశానుసారం 2012, ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు .. తొమ్మిది రోజులపాటు ***దక్షిణ కర్నాటక ధ్యానప్రచార యాత్ర*** జరిగింది.

**ఫిబ్రవరి-2**

యాత్రలో పాల్గొనడానికి 60 మంది మాస్టర్స్ వివిధ ప్రాంతాలనుంచి బయలుదేరి ***బెంగళూరు, పిరమిడ్ వ్యాలీ*** చేరుకున్నారు. సాయంత్రం 5.30 గం॥లకు నుండి 7.30 గం॥ల వరకు ధ్యానం చేసి ***పత్రీజీ ధ్యాన సందేశం*** అందుకుని మాస్టర్స్ అనుభవాలు పంచుకున్నాం.

**ఫిబ్రవరి-3**

ఉదయం 6.30 గం॥లకు ***పిరమిడ్ వ్యాలీ*** నుండి రెండు ***ఎసి బస్సుల్లో*** 60 మంది పిరమిడ్ మాస్టర్స్ యాత్రకు బయలుదేరగా .. ***పత్రీజీ, స్వర్ణమాల పత్రిమేడమ్*** అందరినీ పేరుపేరునా పలుకరించి వీడ్కోలు పలుకుతూంటే పిరమిడ్ మాస్టర్స్ ఆనందడోలికలలో మునిగిపోయారు !

ఉదయం 9.30 గం॥లకు ***శ్రీరంగపట్టణం*** చేరుకుని ***శ్రీరంగనాథస్వామి ఆలయ దర్శనం,*** ధ్యానం అనంతరం ఆనాటి ***టిప్పుసుల్తాన్*** యొక్క వేసవి విడిది బంగళా మరి గార్డెన్ సందర్శించాం. విహారయాత్ర కోసం అక్కడికి విచ్చేసిన రెండు వేల మంది విద్యార్థులకు

ధ్యానం కరపత్రాలు పంచడం జరిగింది ! వారిని అక్కడి గార్డెన్‌లోని చెట్ల నీడలో కూర్చోబెట్టి నాలుగు గ్రూపులుగా విభజించి 20 నిమిషాల పాటు ధ్యానం చేయించి .. పిల్లలతో సహా **బెంగళూరు పిరమిడ్ వ్యాలీని** సందర్శించమని టీచర్స్‌ని కోరాం !

అనంతరం **కావేరీ నది సంగమం** సందర్శించి అక్కడి ప్రకృతి అందాల నడుమ మధ్యాహ్నం **వనభోజనం** ముగించుకుని **మైసూర్ ప్యాలెస్** చేరుకున్నాం.

సువిశాల ప్రాంగణంలో అలనాటి రాజవైభవాన్ని ఇప్పటికీ కనులవిందు చేసే ఆ ప్యాలెస్ అందాలు చూడవలసిందేగానీ .. మాటలలో చెప్పనలవి కావు ! అక్కడ నుంచి **" చాముండీ హిల్స్ "** వెళ్ళి **చాముండేశ్వరీ దేవి ఆలయ సందర్శన** చేసుకుని అక్కడికి విచ్చేసిన వందలాది భక్తులకు ధ్యానకరపత్రాలు పంచి .. సాయంత్రానికి KRS **డ్యామ్**కు చేరుకున్నాం.

ఆ డ్యామ్ సందర్శనకోసం వివిధ ప్రదేశాల నుంచి అక్కడికి విచ్చేసిన సందర్శకులకు చకచకా కరపత్రాలు పంచుతూ, ధ్యానం, పిరమిడ్ గొప్పదనాలను వివరించాం. పిరమిడ్ వ్యాలీని సందర్శించమని వారిని కోరుతూ, **" బృందావన్ గార్డెన్స్ "** అందాలు తిలకిస్తూ ఆనంద పరవశులం అయ్యాం. ఇంతలో మ్యూజికల్ ఫౌంటెన్ ప్రారంభం కాగా కేరింతలతో ప్రాంగణం మారుమ్రోగింది. రాత్రి 8.30 గంటలకు " **అయ్యంగార్ ప్లాజా హోటల్** " లో బసచేసాం.

## ఫిబ్రవరి-4

ఉదయం 7.00 గంటలకు బయలుదేరి 60 కి.మీ దూరంలోని **కుశాల్ నగర్**లో టిబెటన్స్ అద్భుతంగా నిర్మించిన **గోల్డెన్ బుద్ధా టెంపుల్**

దర్శించి .. ధ్యానం చేసి .. అక్కడ విశేషంగా ధ్యాన కరపత్రాలు పంచాం. అక్కడి నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తూ అందరినీ ఆకర్షించే **కూర్గ్**లోని ***" రాజాసీట్ "*** అనబడే ఎత్తైన ప్రదేశంలో నిర్మించిన గార్డెన్‌లో ఫోటోలు దిగి అక్కడ నుండి ఎత్తైన కొండలూ, లోయలూ చూసి పులకించి పోయాం! అందరం వయస్సు మరచిపోయి గార్డెన్‌లోని చిన్న పిల్లల ట్రైన్ ఎక్కి కేరింతలు కొడుతూ ట్రెయిన్‌లో ప్రయాణిస్తూ ప్రకృతి అందాలను తిలకించాం.

***కూర్గు పట్టణంలో*** లో రద్దీగా ఉన్నచోట గంటసేపు కరపత్రాలు పంచి బయలుదేరాం. ఎటుచూసినా కొండలు, లోయలు, పచ్చదనం, సేలయేళ్ళు మధ్య ప్రయాణిస్తూ ప్రకృతి ఒడిలో మధ్యాహ్న వనభోజనం అనంతరం **కుకే సుబ్రమణ్యస్వామి ఆలయం** చేరుకున్నాం. ఆలయదర్శనం, ధ్యానం అనంతరం అక్కడ భక్తులకూ, స్థానికులకూ, కరపత్రాలు పంచి, ***" ధర్మస్థల "*** బయలుదేరాం.

రాత్రి 8.00 గంటలకు ***ధర్మస్థల*** లోని ***రజతాద్రి గెస్ట్ హౌస్*** కు చేరుకున్నాం. అప్పటికే ఆలయం అధికారి ***శ్రీ మంజునాధ్*** గారు మా కోసం ఎదురుచూస్తున్నారు. ***ధర్మస్థల***లో మాకు కేటాయించిన రూముల్లో మా సామాన్లను ఉంచి ఆలయానికి బయలుదేరాం. ఆలయంలో అందరికీ ప్రత్యేక దర్శనం చేయించి .. అక్కడ సామూహిక ధ్యానం అయిన తర్వాత భోజనశాలకు తీసుకుని వెళ్ళి అతిధి మర్యాదలతో ప్రేమపూర్వకంగా మాకు భోజనం వడ్డించారు. అంతేకాక ఉదయం 8.30 గం॥లకు టిఫిన్‌కు కూడా రావలసిందిగా ఆత్మీయంగా ఆహ్వానించారు.

## ఫిబ్రవరి-5

ఉదయం 7.00 గంటలకే ***"ధర్మస్థల ఆలయం"*** తరపున ముగ్గురు వ్యక్తులు ***రజతాద్రి గెస్ట్ హౌస్*** కు విచ్చేసి రిసెప్షన్‌లో మా కోసం ఎదురుచూస్తున్నారు. మేమంతా వారితో కలిసి వెళ్ళగా VVIP **డైనింగ్ హాల్**లో అతి రుచికరమైన టిఫిన్ వారు మాకు ఆప్యాయంగా మరీ మరీ వడ్డించారు.

టిఫిన్ ముగించుకుని ఆలయం వద్దకు రాగానే ధర్మాధికారి ***"శ్రీ వీరేంద్ర హెగ్డే గారు"*** అప్పటికే అక్కడికి విచ్చేసిన ***బ్రహ్మర్షి పత్రీజీ***తో తమ ఛేంబర్‌లో కూర్చుని మాట్లాతూండగా మేమంతా మౌనంగా కూర్చున్నాం.



ధర్మస్థల ధర్మాధికారి శ్రీ వీరేంద్ర హెగ్డే గారితో పత్రీజీ

అనంతరం పత్రీజీ వారికి మమ్ములనందరినీ పరిచయం చేసారు. ***హెగ్డే గారు*** పిరమిడ్ వ్యాలీని సందర్శించామనీ .. అది తమకు ఎంతో నచ్చిందనీ చెప్పారు. ***నవంబర్‌లో మూడు రోజుల ధ్యానయజ్ఞం ధర్మస్థల లో నిర్వహించమని వారు పత్రీజీని కోరగా .. పత్రీజీ తమ ఆమోదం తెలియజేసారు.***

***హెగ్డే గారి*** సోదరులు పత్రీజీ వెంటవచ్చి సంస్థకు సంబంధించిన నిత్య అన్నదాన మండపం, వంటశాల, కూరగాయలు భద్రపరచుకునే స్టోరు రూమ్ వంటి అనేక విభాగాలను చూపించి అక్కడి నిర్వహణ తీరుని వివరించారు. ప్రతి నిత్యం వేలాది మందికి ఉచిత భోజనం వండి వడ్డిస్తున్నా ఎంతో పరిశుభ్రంగా, వేగంగా, రుచికరంగా దానిని వారు క్రమశిక్షణతో నిర్వహించే వారు మరి భోజనానంతరం ఆ మండపాన్ని శుభ్రం చేసే సాంకేతిక విధానం, భోజనానికి ' క్యూ ' వదిలే పద్ధతి అన్నీ ఎంతో ప్రత్యేకతను సంతరించుకుని వున్నాయి.

అనంతరం అక్కడి ***' కార్‌ల మ్యూజియం '*** ను తిలకించి ఆశ్చర్యపోయాం! ఆ సంస్థ మొదటి నుండి వాడిన కార్లు, వివిధ కంపెనీల మోడల్స్ ఇప్పటికీ రన్నింగ్ కండిషన్‌లో మ్యూజియంలో ఉంచారు. అందరం వాటిని తిలకించి అమితంగా ఆశ్చర్యపోయాం!

అక్కడి నుంచి వారి ***నేచురోపతి హాస్పిటల్*** కు పత్రీజీనీ, మమ్మల్నీ తీసుకెళ్ళారు. " ఇండియాలో నెంబర్ వన్ నేచురోపతి హాస్పిటల్ గా అది పేరుగాంచింది " అని వారు తెలిపారు. అక్కడ కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్స్‌కూ, ప్రొఫెసర్స్‌కూ, నర్సులకూ, ధ్యాన విశిష్టతను తెలుపుతూ పత్రీజీ తమదైన శైలిలో వారిచే ధ్యానం చేయించారు ! హాస్పిటల్‌లోని తమ ఎక్విప్‌మెంట్స్, జనరల్ వార్డు, స్పెషల్ వార్డు, VVIP వార్డుల్లోని సౌకర్యాలను, ట్రీట్‌మెంట్ విధానాన్ని వారు మాకు తెలియజేసారు. ప్రకృతి అందాల నడుమ ఎత్తైన ప్రదేశంలో పచ్చని చెట్ల మధ్య నిర్మించబడిన ఆ ***ప్రకృతి చికిత్సాలయం ( నేచురోపతి హాస్పిటల్ )*** అందరికీ ఎంతగానో నచ్చింది.

***ధర్మస్థల*** లో పరిశుభ్రత, శ్రీ ***మంజునాథేశ్వర ఆలయం*** ఉద్యోగుల్లో క్రమశిక్షణ, విధేయత, ప్రేమపూర్వక పలకరింపు, వృత్తి పట్ల

వారి శ్రద్ధ, అధికారులపై గౌరవం, అతిథులపై అత్యంత శ్రద్ధతో కూడిన ఆప్యాయత, యాత్రికులపై అపారమైన ప్రేమ, తెలియని వారికి తెలియజేప్పే విధానం ఉంది. గుడి, బడి, వైద్యశాల, అన్నదాన మండపం, అతిథిగృహాలు .. ఇంకా ఇంకా వారి ఆధ్వర్యంలో నడుస్తూన్న అన్ని విభాగాల్లో కూడా ఎంతో నైపుణ్యత, నిరాడంబరత, శ్రద్ధ, సమయస్ఫూర్తి, పరిశుభ్రత చూసి తీరవలసిందే ! వారిని చూసి నేర్చుకోవలసింది కూడా ఎంతో వుంది. అందుకే పత్రీజీ .. ***" వివిధ ప్రదేశాలకు వెళ్ళి వారి దగ్గర నేర్చుకోవలసింది ఏమైనా ఉంటే .. తప్పక నేర్చుకోవాలి "*** అంటూంటారు.

అక్కడి నుంచి బయలుదేరి ***కటీల్*** అనే ప్రదేశానికి వెళ్ళాం. అక్కడ ఉన్న నది రెండు పాయలుగా విడిపోగా .. నది మధ్యలో ***దుర్గాదేవి ఆలయం*** ఏర్పడి ఉంది. అక్కడ ఆలయదర్శనం, కరపత్రాల పంపిణీ ధ్యానం, అనంతరం .. ***మంగళూరు*** చేరుకున్నాం. ***మంగళూరు*** లో A.M. ***శెట్టిహాలు***లో సాయంత్రం ***5.00 గంటల నుండి 7.30 వరకు బ్రహ్మర్షి పత్రీజీ*** ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణా కార్యక్రమం జరిగింది మరి అందులో 700 మంది స్థానికులు క్రొత్త వాళ్ళు పాల్గొన్నారు ! ఈ కార్యక్రమాన్ని ***మంగళూరు*** మాస్టర్స్ ***శ్రీ గురుప్రసాద్, శ్రీ దేవకుమార్*** గార్లు ఏర్పాట్లు చేసారు.

## ఫిబ్రవరి-6

***మంగళూరు*** లో ఉదయం 7.30 గం॥లకు ***" లలిత్ ఇంటర్నేషనల్ హోటల్ "*** నుండి బయలుదేరి 9.30 గం॥లకు ***ఉడుపి*** సమీపంలోని ***' మల్పే '*** బీచ్ కు చేరుకున్నాం అక్కడి నుంచి 3 కి.మీ బోటులో ప్రయాణించి ఒక ద్వీపానికి చేరుకున్నాం. మాస్టర్స్ అంతా ఆ ***ఐలాండ్*** లో ధ్యానం చేసి సముద్రస్నానం చేస్తూ మధ్యాహ్నాం 12 గంటల వరకు సమయమే

తెలియకుండా గడిపారు. అక్కడ వున్న ***విదేశీ సందర్శకుల***కు ఆంగ్లంలో ఉన్న కరపత్రాలు పంచి ధ్యానం గురించి తెలియజేసాం !

అక్కడి నుండి ***ఉడుపి*** చేరుకుని ***" ఉడుపి శ్రీ కృష్ణ భగవాన్ "*** ఆలయ దర్శనం మరి ధ్యానం చేసి విశేషంగా పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసాం. సాయంత్రం 5.30 గం॥లకు ***" స్వదేశీ హోటల్ " కాన్ఫరెన్స్ హాల్*** లో ***పత్రీజీ*** ధ్యాన శిక్షణా తరగతిని ఏర్పాటు చేసారు ***ఉడుపి*** మాస్టర్ ***శ్రీ హరీష్ సయాగ్*** గారు.

ఈ కార్యక్రమంలో 200 మంది పాల్గొన్నారు. " బృందావనమది అందరిదీ గోవిందుడు అందరివాడే లే" అన్న గీతాన్ని పత్రీజీ తమ ***వేణుగానం***తో అలరించగా .. అక్కడ ధ్యానం చేసిన ప్రతిఒక్కరూ పరవశించి పోయారు !!

## ఫిబ్రవరి-7

***ఉడుపి*** నుంచి ఉదయం 7.00 గంటలకు బయలుదేరి ***" కొల్లూరు .. మూకాంబికా దేవాలయం "*** వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్నాం. ఆలయ ప్రధాన అర్చకులు మరి ఆలయ అధికారులు, సిబ్బంది పత్రీజీకి ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి ఆలయ విశిష్టతను తెలియజేసి ***ఆదిశంకరాచార్యులు*** తపస్సు చేసిన స్థలాన్ని చూపించారు. పత్రీజీ అందరిచేత అక్కడ ధ్యానం చేయించారు.

అక్కడి నుంచి బయలుదేరి ***" మురేశ్వర "*** చేరుకున్నాం. సముద్రం ఒడ్డున ధ్యానముద్రలో ఉన్న ఎత్తైన శివుడు అందరినీ దూరం నుండే ఆకర్షిస్తాడు. అక్కడ గోపురం చాలా ఎత్తైనది కావడంతో గోపురం లోపల లిఫ్ట్ కూడా ఏర్పాటు చేసారు. 18 అంతస్తుల లిఫ్టులో ప్రయాణించి పై

అంతస్తు నుండి చూడగా చుట్టు ప్రక్కల కొండలు, సముద్రం, ఊళ్ళూ చూడముచ్చట గొలిపే విధంగా వుంది. అక్కడి నుండి ***గోకర్ణ*** బయలుదేరాం.

***గోకర్ణ***లో ***" రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ "*** వారి ఆధ్వర్యంలో ***" కాల్‌వే ఫంక్షన్ హాల్ "*** లో పత్రీజీ ఆధ్వర్యంలో ధ్యానశిక్షణా తరగతి ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కర్నాటక మాస్టర్స్ ***శ్రీ మహేష్‌శెట్టి, శ్రీ అశోక్ గోకర్ణ, శ్రీ మోహన్‌దాస్*** చేసిన కృషి అమోఘం.

***' పిరమిడ్ వ్యాలీ '*** గురించీ, పత్రీజీ గురించీ తెలుసుకుని .. ***పత్రీజీ, గోకర్ణ*** విచ్చేస్తున్న సందర్భంగా ఆ మాస్టర్స్ అమితానందంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఇందులో 300 మంది పాల్గొన్నారు; వారి ఆనందానికి అవధులు లేవు !

***గోకర్ణ***లో బీచ్ గోవు చెవి ఆకారంలో ఉన్నందున దానికి ***" గోకర్ణం "*** అని పేరు వచ్చిందనీ, అక్కడ అతిపురాతనమైన శివాలయం (ఆత్మ లింగం) స్వయంభువుగా వెలిసిందనీ తెలిపారు. అందరం అక్కడ సముద్రస్నానాలు, ఆలయ దర్శనం, ధ్యానం, పత్రీజీ క్లాసుతో పరవశించిపోయాం.

## ఫిబ్రవరి-8

గోకర్ణ నుండి ఉదయం 5.30 గం॥లకే బయలుదేరి 9.30 గంటలకు ***" జోగ్ ఫాల్స్ "*** చేరుకున్నాం. రమణీయమైన ప్రదేశంలో ఎత్తైన కొండల మధ్య నుండి నీటి ప్రవాహం లోతైన కోనలలోకి ఉధృతంగా ప్రవహిస్తుంది. అందుకే ***' జోగ్ ఫాల్స్ '*** పర్యాటక కేంద్రంగా పేరుగాంచింది. ***జోగ్ ఫాల్స్*** తిలకించి ఫోటోలు దిగి అక్కడి నుండి ***" శృంగేరి "*** కి బయలుదేరాం.

**శ్రీ ఆదిశంకరాచార్యుల** వారు స్థాపించిన శారదాపీఠం, **శారదాదేవి** దేవస్థానంలో ధ్యానం చేసాం. గుడి ప్రక్కనే ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో మనలని ముద్దుగా పలకరించే పెద్ద పెద్ద చేపలను కన్నుల పండుగగా తిలకించాం. అక్కడి నుండి కొండ కోనలు దాటుకుంటూ, కాఫీ, టీ తోటలు, మిరియాల తోటలు, వక్క చెట్ల అందాలను ఆస్వాదిస్తూ పచ్చదనం పరచుకున్నట్లున్న ప్రకృతి అందాలు తిలకిస్తూ సాయంత్రానికి **" హొరనాడు "** చేరుకున్నాం.

**" హొరనాడు అన్నపూర్ణేశ్వరీదేవి "** ఆలయం వారు **మీటింగ్ హాల్**లో పత్రీజీ ధ్యాన శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన వారితో పత్రీజీ కరచాలనం చేసుకుంటూ వేదికపైకి రాగా ఆలయ **ధర్మాధికారి శ్రీ భీమేశ్వర్ జోషి** గారు స్వాగతం పలికారు. సుమారు 200 మంది క్రొత్తవారు పాల్గొన్న ఈ ధ్యానసభ అద్భుతంగా జరిగింది మరి ఆలయ సిబ్బంది కూడా పాల్గొని ధ్యానం, పిరమిడ్ శక్తుల గురించి వివరంగా తెలుసుకున్నారు.

అనంతరం ఆలయ మర్యాదలతో పత్రీజీనీ, మమ్మల్నీ **అన్న పూర్ణేశ్వరీ దేవి** ఆలయ దర్శనం కు తీసుకెళ్ళారు. పెద్ద పెద్ద కొండల మధ్య నిర్మించబడిన ఆలయం అద్భుతమైన అనుభూతిని మిగిల్చింది. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి **శ్రీ రవీంద్రగారు** ఎంతో కృషిచేసారు.

## ఫిబ్రవరి-9

**హొరనాడు** నుండి ఉదయం 5.30 గంటలకు పత్రీజీ హైదరాబాద్‌కు బయలుదేరగా .. మేమందరం, **" బేలూరు "** ప్రయాణమయ్యాం. అక్కడ పురాతన శిలాసంపద అద్భుతంగా అందరినీ ఆకర్షించింది. **చెన్నకేశవ**

**స్వామి ఆలయాన్ని** విష్ణువర్ధన మహారాజు నిర్మించారని చెబుతారు. అక్కడి నుండి ***" హళిబేడు "*** వెళ్ళాం. క్రీ.శ. 12,13 శతాబ్దాలలో కోసలరాజు కాలంలో రాజధాని అయిన హళిబేడు ప్రముఖ **హొయసేశ్వరాలయం** అపూర్వశిల్ప కళతో అలరారుతూ ఉంటుంది.

అక్కడ అందరం ధ్యానం చేసి గ్రూపు ఫోటోలు దిగాం. సాయంత్రం 4.30 లకు ***" శ్రావణబెళగొళ "*** చేరుకున్నాం. జైనులు పరమపావనమైన పుణ్యక్షేత్రంగా భావించే వాటిలో ***శ్రావణబెళగొళ*** ముఖ్యమైంది. అక్కడ ఇంద్రగిరి పర్వతం పైన ఉన్న ***59 అడుగుల గోమతేశ్వరుని విగ్రహం*** చూడాలంటే 600 మెట్లు ఎక్కాల్సిందే ! మేమందరం ఆ పర్వతాన్ని చేరుకుని అక్కడ యాత్రికులకు కరపత్రాలు పంచి, ధ్యానం చేసాం !

అక్కడ నుండి బయలుదేరి రాత్రి 10.00 గంటలకు ***పిరమిడ్ వ్యాలీ*** చేరుకుని 10వ తేదీ అందరం ఎవరి ప్రాంతాలకు వాళ్ళం తిరుగు ప్రయాణం అయ్యాం.

* * *

పత్రీజీ చేపట్టే ప్రతి కార్యక్రమానికీ ఒక క్రొత్తదనం వుంటుంది. ఈ టూర్‌లో కర్నాటకలో మన ధ్యానం సెంటర్స్ లేని క్రొత్త ప్రదేశాలు ***ధర్మస్థల, మంగళూరు, ఉడుపి, గోకర్ణ, హొరనాడు*** మొదలైన చోట్ల అద్భుతంగా ధ్యాన కార్యక్రమాలు జరగడం చిన్న విషయం కాదు.

***<u>వైజాగ్ ధ్యానమహాచక్రం</u>*** లో పత్రీజీ .. ***" 2012 లో మనం రాజుల్లాగా జీవిస్తాం "*** అన్న పదం .. ఫిబ్రవరి లోనే సాకారం ధరించి, పేరు గాంచిన దేవాలయాలు, సంస్థలు పత్రీజీకి, మాకు బ్రహ్మాండమైన ఆహ్వానం పలికి ధ్యాన కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో ఆనందించదగ్గ విషయం !!

తొమ్మిది రోజుల పాటు సాగిన **కర్నాటక ధ్యానప్రచార యాత్ర**లో పాల్గొన్న ప్రతి ఒక్క పిరమిడ్ మాస్టర్ .. నిర్మాహకులకు ఎంతగానో సహకరించారు కాబట్టే అన్ని ప్రదేశాలనూ అద్భుతంగా తిలకిస్తూ ధ్యానం చేస్తూ ధ్యానప్రచారం చేస్తూ, పత్రీజీ ధ్యాన సందేశాలు తీసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపాం.

పిరమిడ్ వ్యాలీ ఇంజనీరు ***ప్రసాద్*** గారు, ***మాండ్య మురళీగారు***, ***గారపాటి సత్యనారాయణగారు***, ఇంకా అక్కడి సిబ్బంది, పిరమిడ్ వ్యాలీలో ఏర్పాట్లు అద్భుతంగా నిర్వహించారు. R. **చంద్రమోహన్** డిజైన్ చేసిన బ్యానర్స్, కరపత్రాలు, ఎంతో అందంగా రూపుదిద్దుకుని టూర్ మొత్తంలో 60 వేల కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది.

టూర్ ఆద్యంతం అద్భుతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్క పిరమిడ్ మాస్టర్‌కు ధ్యానాభివందనాలు !



కూర్గు పర్యాటక కేంద్రంలో పిరమిడ్ మాస్టర్స్

# పశ్చిమగోదావరి జిల్లాలో ..
# " ధ్యానవిజ్ఞాన కార్యక్రమం "

మేము తిరుపతిలో పళణి థియేటర్ ఎదురుగా (తుడా అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ) తుడా వారు అమ్మిన తుడా సౌత్ ఎక్స్‌టెన్షన్‌లో ప్లాట్లు కొన్నాం. రిజిస్ట్రేషన్ చెయ్యడంలో కాలయాపన చేసేవారు. అందువల్ల తుడాఫ్లాట్స్ ఓనర్స్ అసోషియేషన్‌గా ఏర్పడి వారితో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాం.

మా అసోసియేషన్‌లో నేను యాక్టివ్‌గా ఉండేవాడిని. అప్పుడు కాలనీకి మంచి పేరు పెట్టాలి అని మీటింగ్‌లో మాట్లాడుకోవడం, రకరకాల పేర్లు సూచించగా అప్పుడు నేను " మనకు అతి సమీపంలో రాయల చెర్వు గేటు, రాయల్ చెర్వు రోడ్డు ప్రక్కనే మన కాలనీ ఉంది కాబట్టి ' రాయల్ నగర్ ' అని పెడితే బాగుంటుంది; తిరుపతిలో ఆ పేరు లేదు " అని చెప్పగా అందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారు. అలా మా కాలనీకి " రాయల్ నగర్ " అని పేరు వచ్చింది.

మా కాలనీలో పార్కు స్థలంలో సాంఘిక సేవాలయం పేరుతో రెండు బిల్డింగ్స్ నిర్మించి సేవా కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించుకునే వాళ్ళం. మా కాలనీలోని సభ్యులు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరు ఉగాది నుంచి వేచ్చే సంవత్సరం ఉగాది వరకు బాధ్యతలు స్వీకరించి సాంఘిక కార్యక్రమాలు నిర్వహించాలి.

2004వ సంవత్సరం ఉగాది నుంచి 2005వ సంవత్సరం ఉగాది వరకు నా వంతు వచ్చింది. నాకు బాధ్యతలతో పాటు ఆరువేలు రూపాయలు అప్పు కూడా ఇచ్చారు. ప్రతినెలా ఆరు వేల నుంచి పదివేల వరకు ఖర్చు వస్తుంది. నేను వెంటనే కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి కాలనీ తరఫున చిట్ వేస్తూ అందులో వచ్చే కమీషన్, అలాగే సాంఘిక సేవాలయంలో ఉన్న హాలులో జన్మదినం, పెండ్లిరోజు కార్యక్రమాలు, అయ్యప్ప పూజలు, వినాయకచవితి, దసరా వేడుకలు ఇలా కార్యక్రమాలు చేయటానికి కమిటీలు వేసుకుని డొనేషన్స్ వసూలు చేస్తూ అద్భుతంగా కార్యక్రమాలు నిర్వహించాం. 2005 ఉగాది రోజు ఇంకొకరికి బాధ్యతలు అప్పజెప్తూ 65 వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి ఇవ్వడం జరిగింది.

ఇప్పటికీ మా కాలనీలో అనేక సాంఘిక, సాంస్కృతిక, పూజా కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించు కుంటున్నాం.

" 2005వ సంవత్సరం చిత్తూరు జిల్లా పల్లెపల్లెకూ తిరిగి ధ్యానప్రచారం చేయటానికీ ఒక జీపు కొందాం " అని నిర్ణయించాను. ఈ విషయం పత్రీజీకి తెలియజేసాను. పత్రీజీ " జీపు కొనవద్దు .. నీవు పశ్చిమగోదావరి జిల్లా వెళ్ళి ధ్యానప్రచారం చెయ్యి; అక్కడ మీ రాజులు(క్షత్రియులు) నీ కోసం ఎదురు చూస్తున్నారు " అని చెప్పారు.

2005 జూన్‌లో భీమవరం వెళ్ళి అక్కడ తటవర్తి వీరరాఘవరావు గారితో కలవడం, అటునుంచి ఆకివీడు డాక్టర్ ప్రతాప్ కుమార్ గారితో కలవడంతో పత్రీజీ చెప్పిన కార్యక్రమం మొదలైంది.

ప్రతాప్ కుమార్ గారు ఒక మోటార్‌సైకిల్ ఇచ్చారు. నేను అండలూరు వెంకటేశ్వరరావు ఇద్దరం కలసి ప్రతిరోజూ ఏదో ఒక గ్రామానికి వెళ్ళి

ప్రచారం చేసేవాళ్ళం. ప్రచారంలో భాగంగా ఏలూరు వెళ్ళి చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రచారం చేస్తూ సాయంత్రానికి శాంతినగర్‌లోని అప్పారావు గారి ఇంటికి చేరే వాళ్ళం.

ఏలూరు టౌన్‌లో క్లాసులు నిర్వహిస్తూండగా DEO పార్వతి గారు నా క్లాసుకు వచ్చి కొన్ని సందేహాలు వ్యక్తపరచారు. దానికి సరైన సమాధానం దొరకటంతో మరుసటిరోజు కూడా క్లాస్‌కి వచ్చి " మీరు ఎన్ని స్కూల్స్‌కు, కాలేజీలకు వెళ్ళి క్లాసులు చెప్పారు? " అని అడిగారు. " మేము క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థిని, విద్యార్థులకు ధ్యాన విశిష్టత తెలియజేస్తూ ధ్యానం ఎలా చెయ్యాలో నేర్పిస్తాం; తరువాత వాళ్ళ ఇష్టం. మళ్ళీ రెండవసారి వెళ్ళే అవకాశం చాలా తక్కువ. ఎవరైతే ప్రతినిత్యం ధ్యానం చేస్తారో వాళ్ళు తప్పక ధ్యానఫలాలను అనుభవిస్తారు " అని చెప్పాను. " అయితే ఏలూరులో ఒక స్కూల్‌లో ముప్పైరోజులు .. ప్రతిరోజూ 15 నిమిషాలు ధ్యానం చేయిస్తే పిల్లలలో ఎలాంటి మార్పులు వస్తాయో చూద్దాం" అని మేడమ్ ఏలూరులో కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలను ఎంపిక చేసారు. మరుసటిరోజు ధ్యానం క్లాసు ప్రారంభించాం.

ప్రతిరోజూ ఉదయం ప్రేయర్ సమయంలో 15 నిమిషాల పాటు ధ్యానం అయిన తరువాతే క్లాసులు ప్రారంభం. ఒక వారం తరువాత DEO పార్వతి మేడమ్ ఫోన్ చేసి " 30 రోజులు అవసరం లేదు! ఒక్క వారంలోనే పిల్లలలో మార్పును గమనించాం. ఎలా అంటే .. స్కూల్ ఆవరణలోకి వచ్చినా కూడా వాళ్ళ తరగతి వరకూ దుమ్ములేపుతూ, శబ్దం చేస్తూ వెళ్ళేవాళ్ళు. ఇప్పుడు ఇలా కాకుండా నిశ్శబ్దంగా వాళ్ళ తరగతికి వెళ్తున్నారు. ఇంతకు ముందు పాఠాలు శ్రద్ధగా విన్నట్లు నటించేవారు,

హోమ్ వర్క్ సరిగ్గా చేసే వాళ్ళు కాదు, ఒక పీరియడ్ పూర్తి అయిన తరువాత పాఠాలు చెప్తున్న టీచర్ వెళ్ళి ఇంకొక టీచర్ వచ్చే లోపు గిచ్చుకుంటూ, గిల్లుకుంటూ టాప్ లేచే విధంగా శబ్దం చేసేవారు. ఇప్పుడు శ్రద్ధగా పాఠాలు వింటున్నారు. హోమ్‌వర్క్ శ్రద్ధగా చేసుకుని వస్తున్నారు, ఒక టీచర్ వెళ్ళి ఇంకొక టీచర్ వచ్చేలోగా అప్పటి వరకూ జరిగిన పాఠాన్ని మననం చేసుకుంటూ ఎలాంటి శబ్దం చేయకుండా నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. ఇవన్నీ కూడా ధ్యానం ద్వారా వచ్చిన గొప్ప లక్షణాలు కాబట్టి మీరు వస్తే కలెక్టర్ గారితో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలు చేస్తే పిల్లలలో మార్పు వచ్చి ఉత్తమమైన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడతారు " అని చెప్పారు.

మరుసటిరోజు నేను, DEO పార్వతి మేడమ్, భీమవరం ఆదిత్య కృష్ణంరాజు, అండలూరు వెంకటేశ్వరరావు, ఏలూరు అప్పారావు గారు కలిసి కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళాం. కలెక్టర్ " లవ్ అగర్వాల్, IAS " గారు చాలా స్ట్రిక్ట్. ఎలాంటి ప్రారంభోత్సవాలకూ, స్కూల్ ఫంక్షన్స్‌కూ, కాలేజీ ఫంక్షన్స్‌కూ వెళ్ళేవారు కాదు. ఏలూరు అప్పారావుకు ఒక స్కూలు ఉంది. ఆయన స్కూల్ ఫంక్షన్‌కు పిలవాలని కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్తే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కాబట్టి అప్పారావుగారు " అప్పాయింట్‌మెంట్ దొరకదు " అని సందేహం వ్యక్తం చేసారు.

మేము వెళ్ళిన వెంటనే కలెక్టర్ గారు లోపలికి పిలిచారు. DEO పార్వతి మేడమ్ .. " కస్తూరిబా స్కూల్‌లో జరిగిన ధ్యానకార్యక్రమాలు గురించి వివరించి జిల్లా వ్యాప్తంగా స్కూల్స్‌లో ఈ కార్యక్రమం చేయడానికి మిమ్మల్ని కలవడానికి వచ్చాం సార్ " అన్నారు. " అలాగే చేద్దాం! ..

ముందుగా నాకు ధ్యానం నేర్పించండి ” అని వాళ్ళ అటెండర్‌తో “ అరగంట ఎలాంటి ఫోన్లు గానీ ఏవరైనా వచ్చినా గానీ నాకు చెప్పవద్దు ” అని చెప్పి మాతో కలిసి ధ్యానం చేసారు. “ చాలా బాగుంది! తప్పకుండా జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు చేద్దాం ” అని అన్ని మండలాలల్లో మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్స్‌కు ప్రొసీడింగ్స్ పంపారు. మొత్తం 46 మండలాలు .. ఒక్కోరోజూ ఒక్కో మండలంలో ఉంటాం. MDO కార్యక్రమం ఏర్పాటు చేయాలి.

ఉదయం 10 గంటలకు మండలంలోని ఒక్కొక్క స్కూలు నుంచి ఒక టీచర్, MRO, MEO, పోలీస్ డిపార్ట్‌మెంట్, ZPTC, MPTC సభ్యులు హాజరయ్యేవారు. మధ్యాహ్నం 2 గంటలకు డ్వాక్రా గ్రూప్స్‌కు, సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ క్లాస్. టీచర్స్ ధ్యానం నేర్చుకుని వాళ్ళ వాళ్ళ స్కూల్స్‌లో ప్రతిరోజూ 15 నిమిషాలు విధిగా ధ్యానం చేసేటట్లు ఏర్పాటు చెయ్యాలి. ఈ విధంగా కలెక్టర్, DEO గార్లు ప్రొసీడింగ్స్ పంపారు.

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం అద్భుతంగా జరిగింది! 2006 మార్చిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో పశ్చిమగోదావరి జిల్లా అత్యధిక ఉత్తీర్ణత సాధించి స్టేట్ ఫస్ట్ వచ్చింది! ప్రెస్ మీట్‌లో విలేఖర్లు ప్రశ్నించగా “ మా పిల్లలు బాగా చదివారు, దానికి తోడు ధ్యానం వారిని ఉన్నత శిఖరాలకు చేర్చింది ” అని DEO పార్వతి గారు తెలియజేసారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రముఖపాత్ర వహించిన ఆకివీడు డా॥ ప్రతాప్ కుమార్ గారు (ఒక కారు, దానికి కావలిసిన ఖర్చులన్నీ ఆయనే భరించారు) ఆదిత్య కృష్ణంరాజు భీమవరం, సాంబశివరావు ఆకివీడు,

అప్పారావు ఏలూరు, గారపాటి సత్యనారాయణ తాడేపల్లిగుడెం గార్ల సహకారంతో మేము నలుగురం 1.కేశవరాజు  2. అన్నపూర్ణ మేడమ్ 3. సత్యనారాయణ రాజు  4. అండలూరు వెంకటేశ్వరరావు అరవై రోజుల పాటు జిల్లాలోని మండలాలు, పల్లెలు తిరిగి ధ్యానవిజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించాం.

ఈ సందర్భంగా కలెక్టర్ లవ్ అగర్వాల్ IAS గారికి, DEO పార్వతి మేడమ్ గారికి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.



2005- పశ్చిమ గోదావరి జిల్లా ధ్యానవిజ్ఞాన కార్యక్రమం బ్రోచర్‌ను విడుదల చేస్తోన్న జిల్లా కలెక్టర్ శ్రీ లవ్ అగర్వాల్, IAS గారు

# గుంటూరు జిల్లాలో ..
# " ధ్యానవిజ్ఞాన కార్యక్రమం "

పశ్చిమగోదావరి జిల్లా ధ్యానప్రచారం పూర్తి అయిన తరువాత ***" నెక్కల్లు అబ్బూరి కోటేశ్వరరావు గారు "*** మరి ***" గుంటూరు వెలగపూడి లక్ష్మణరావు "*** గారితో పరిచయమయ్యింది.

గుంటూరు జిల్లాలో ధ్యానకార్యక్రమాలు నిర్వహిస్తూండగా పశ్చిమగోదావరి జిల్లా ధ్యాన విజ్ఞాన కార్యక్రమం గురించి లక్ష్మణరావు, అబ్బూరిలతో చర్చించగా " గుంటూరు జిల్లాలో కూడా తప్పకుండా చేద్దాం" అని చెప్పారు.

మరుసటిరోజు కలెక్టర్ జయలక్ష్మి IAS గారిని కలిసి విషయం చెప్పగా " చాలా మంచి కార్యక్రమం .. మన జిల్లాలో కూడా తప్పకుండా చేద్దాం; CEO గారిని కలవండి" అని చెప్పారు. CEO గారిని కలిసి మండలాల వారిగా కార్యక్రమాన్ని తయారు చేసి .. అన్ని మండలాలకూ తెలియపరచడం జరిగింది.

గుంటూరు జిల్లా ధ్యాన విజ్ఞాన కార్యక్రమం రూపుదిద్దుకుంది. ప్రారంభోత్సవానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, శ్రీమతి K. విజయమ్మ గారిని సంప్రదించాం. ఆ మేడమ్ " మా జిల్లా పరిషత్ మీటింగ్ ఉంది. అక్కడికి MPTC, ZPTC సభ్యులు మరి జిల్లా అధికారులు వస్తారు. మీరు ధ్యానం

చెప్తారా? ” అని అడిగారు. మేము “ సరే ” అన్నాం. గుంటూరు జిల్లా పరిషత్ మీటింగ్ హాలుకు నేను, లక్ష్మణరావుగారు వెళ్ళాం. జిల్లా పరిషత్ మీటింగ్ ప్రారంభానికి ముందే మాకు పదిహేను నిమిషాలు సమయం ఇచ్చారు. పదిహేను నిమిషాలలో ధ్యాన విశిష్టత తెలియజేసి ఐదు నిమిషాలు ధ్యానం చేయించాం. ఆ తరువాత వాళ్ళ మీటింగ్ ప్రారంభం అయ్యింది.

శ్రీమతి విజయమ్మ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గారు ధ్యాన విజ్ఞాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుంటూరు జిల్లాలో జరుగుతూన్న ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా అన్ని మండలాల MPTC, ZPTC సభ్యులకు గుంటూరు జిల్లా PSSM తరఫున లెటర్స్ పంపాం. అన్ని మండలాలలో MPTC, ZPTC సభ్యులు ధ్యానవిజ్ఞాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ధన్యవాదాలు!

వెలగపూడి లక్ష్మణరావు రెండు కార్లు ఏర్పాటు చేయగా నేను, అబ్బూరి కోటేశ్వరరావు, మంగళగిరి శంకరరావు, సత్తెనపల్లె రామారావు రెండు గ్రూపులుగా విడిపోయి మండలాల్లో ధ్యానవిజ్ఞాన కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన విధంగానే రోజుకు మూడు క్లాసులు నిర్వహిస్తూ ఉంటే .. రోజూ కార్యక్రమాలు దినపత్రికలలో వచ్చేవి. అవి చూసిన గుంటూరు జైల్ సూపరింటెండెంట్ గారు మమ్మల్ని సంప్రదించగా నేను, లక్ష్మణరావు గారు జైల్ సూపరింటెండెంట్ గారిని కలిసాం.

జైల్‌లో ధ్యానం క్లాసు నిర్వహించమని సూపరింటిండెంట్ గారు అడిగారు. “ ఒక్కరోజులో మార్పు రాదు కాబట్టి 41 రోజులు జైలులో క్లాసులు నిర్వహిద్దాం ” అని నిర్ణయించాం. జిల్లా SP గారు, జిల్లా జడ్జి గారు, నేను, లక్ష్మణరావు గారు, అబ్బూరి, శంకరరావు గారు ఇంకా కొంతమంది పిరమిడ్ మాస్టర్లు ప్రారంభోత్సవం రోజు పాల్గొన్నాం. మరుసటి

రోజు నుంచి ఒక పిరమిడ్ మాస్టర్ వెళ్ళి జైలులో ఉదయం 7.30 గంటల నుంచి 8.00 గంటల వరకు జైల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అరగంట ఖైదీలతో ధ్యానం చేయించాలి. ధ్యానాంధ్రప్రదేశ్, స్పిరిచ్యువల్ ఇండియా, తులసీదళం ఇంకా కొన్ని పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది.

18వ రోజు ఉదయం నేను, లక్ష్మణరావుగారు జైలులో క్లాసుకు వెళ్ళాం. క్లాసులో ఒక ఖైదీ " ఒక నిమిషం మాట్లాడవచ్చా? " అని అడిగాడు. అతని పేరు కోటేశ్వరరావు : " గత 17 రోజులుగా ప్రతిరోజూ ధ్యానంలో కూర్చోబెట్టినా నేను ధ్యానం చేయలేదు; మా సెల్‌లో మా తోటి ఖైదీ ప్రక్కన ' తులసీదళం ' పుస్తకం ఉంది. అతను ప్రతిరోజూ చదివేవాడు నాకు ఇచ్చినా నేను ' వద్దు ' అనేవాడిని. నాకు ధ్యానం అంటే ఇష్టం లేదు. ఈ రోజు తెల్లవారుజామున మెలకువ వచ్చి నిద్రపట్టక ప్రక్కనే ఉన్న ' తులసీదళం' పుస్తకం తీసుకుని ఉదయం లోగా అంతా చదివేశాను. ' ఈ 17 రోజులు ఎందుకు ధ్యానం చేయకుండా ఉన్నానా ?' అని బాధపడుతున్నాను. ఈ రోజు అరగంట ధ్యానం నా జీవితాన్నే మార్చేసింది.

" నా గురించి చెప్పాలంటే నేను ఒక గజదొంగని. ఒంటరిగానే దొంగతనాలు చేస్తూంటాను. రెండు రోజులు రెక్కీ నిర్వహించి ' ఈ ఇంట్లో దొంగతనం చేస్తే ఒక లక్ష రూపాయలు ఉంటాయి ' అని నమ్మకం కుదిరితేనే వెళతాను. ఒకవేళ పోలీసులు వచ్చినా ఎలాంటి ఆయుధాలు లేకుండా ఆరుమందినైనా కొట్టి తప్పించుకోగలను. అలా ఇన్ని సంవత్సరాలు దొంగతనం చేస్తూవచ్చాను. నా శిక్ష పూర్తి అయిన తరువాత బయటకు వెళ్ళి జీవితంలో ఎప్పుడూ దొంగతనం చేయకుండా కష్టపడి సంపాదిస్తాను. శాకాహారం మాత్రమే తీసుకుంటాను. ఈ అరగంట ' ధ్యానం ' మరి ' తులసీదళం ' అనే పుస్తకం నా జీవితంలో గొప్ప మార్పు

తీసుకొచ్చింది ” అని అందరు ఖైదీలు మరి జైలు అధికారుల సమక్షంలో తెలియజేసారు.

ప్రతిరోజూ అరగంట ధ్యానం కొనసాగుతూ .. 61వ రోజు జైలు సూపరింటిండెంట్ ఆహ్వానం మేరకు పత్రీజీ, వెలగపూడి లక్ష్మణరావు కార్యక్రమానికి వెళ్ళగా .. జిల్లా SP గారు, జిల్లా జడ్జిగారు విచ్చేసారు. 61 రోజులుగా జైల్‌లో క్లాసులు నిర్వహిస్తున్నందున పత్రికా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఆ రోజునకూడా ఖైదీ కోటేశ్వరరావు తన అనుభవాన్ని తెలియజేశాడు. జైలు సూపరింటెండెంట్ ఈ కార్యక్రమాన్ని మొత్తం వీడియో తీసి పై అధికారులకు పంపారు. వీడియో చూసిన పై అధికారులు “ ఖైదీలను సైతం మార్చే శక్తి ధ్యానానికి ఉంది ” అని గ్రహించి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జైళ్ళలో ధ్యానం క్లాసులు నిర్వహించటానికి అనుమతి ఇచ్చారు. చర్లపల్లి, విశాఖపట్టణం, బళ్ళారి మొదలైన జైళ్ళల్లో పిరమిడ్స్ కూడా నిర్మించడం జరిగింది.

గుంటూరు జిల్లాలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగానే కాక జైళ్ళలో కూడా ధ్యానం క్లాసులు నిర్వహించటానికి అవకాశం రావటం మరి ఖైదీలలో ధ్యానం ద్వారా క్రొత్త వెలుగులు నింపడం జరిగింది.

గుంటూరు జిల్లాలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించటానికి వెలగపూడి లక్ష్మణరావు గారు(రెండు కార్లు ఏర్పాటు చేసి, అన్ని ఖర్చులు భరించారు), అబ్బూరి కోటేశ్వరరావు, ఆకురాతి శంకర రావు, నాగర్జునసాగర్ సతీష్, సత్తెనపల్లి రామారావు, రేపల్లె సుధాకర్ ఇంకా అనేకమంది సహకారంతో అద్భుతంగా జరిగింది.

# ఖమ్మం జిల్లాలో ..
# " ధ్యానవిజ్ఞాన కార్యక్రమం "

పశ్చిమగోదావరి జిల్లా మరి గుంటూరు జిల్లా ధ్యానవిజ్ఞాన కార్యక్రమాలు అద్భుతంగా జరగడంతో ఆంధ్రప్రదేశ్ మొత్తం ధ్యానప్రచారం ఊపందుకుంది.

2006వ సంవత్సరం డిసెంబర్ షిరిడీ ధ్యానయజ్ఞంలో నేను వ్రాసిన " అందరికీ ధ్యానం అవసరం " పాకెట్ సైజు పుస్తకం, టేబుల్‌టాప్ క్యాలెండర్, " ధ్యానం చెయ్యండి-ధ్యానం మిమ్మల్ని కాపాడుతుంది " అనే స్టిక్కర్ ఉచితంగా పంచడం జరిగింది. 2007వ సంవత్సరం జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని 1066 మండలాలలో MDO, MRO, MEO లకు పోస్ట్ చేసాను. చాలా మండలాల నుంచి ఫోన్లు రావడం, అక్కడకు వెళ్ళి ధ్యానం క్లాసులు నిర్వహించడం జరిగింది.

ఫిబ్రవరిలో భద్రాచలంలో పత్రీజీ కార్యక్రమానికి నేను వెళ్ళాను. అదేరోజు ఖమ్మం జిల్లా వైరా మండలం నుంచి MDO గారు ఫోన్ చేసి " బుక్ చాలా బాగుంది; మా మండలాలలో ధ్యానం క్లాసులు నిర్వహిద్దాం" అని రమ్మన్నారు. నా ప్రక్కనే ఉన్న బొల్లేపల్లి వెంకటేశ్వరరావు, నల్లజర్ల సరోజ మేడమ్‌లు MDO గారితో మాట్లాడి అందరం కలిసి ఖమ్మం జిల్లాలో కూడా ధ్యాన విజ్ఞాన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించుకున్నాం.

వెంకటేశ్వరరావు, సరోజ మేడమ్, రఘురామ్ ప్రసాద్, శైలజ మేడమ్, నేను కలసి ఖమ్మం కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళాం. కలెక్టర్ CC గారికి నా విజిటింగ్ కార్డ్ ఇచ్చాను. " సార్ మీటింగ్‌లో ఉన్నారు కాస్సేపు ఆగండి " అన్నారు. అరగంట తరువాత కలెక్టర్ దగ్గరకు వెళ్ళాం. నేను పశ్చిమ గోదావరి జిల్లా, గుంటూరు జిల్లాలలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమాల ప్రొసీడింగ్స్, పేపర్ కటింగ్స్ ఫోటోలు కలెక్టర్ శశిభూషణ్ కుమార్, IAS కు చూపించాం. " మన జిల్లాలో కూడా ఈ కార్యక్రమం మీ అనుమతితో చేయాలనుకుంటున్నాం" అనగానే " తప్పకుండా చేద్దాం " అని చెప్తూ .. మేము ఇచ్చిన లెటర్‌పై సంతకం చేసి CEO గారిని కలవమని చెప్పారు. అలాగే " మీరు వచ్చి ఎంతసేపు అయ్యింది? " అని అడిగారు. " అరగంట అయ్యింది సార్ " అనగానే CC ని పిలిచి " వీళ్ళు ఎప్పుడు వచ్చినా, నేను ఏ మీటింగ్‌లో ఉన్నా వెంటనే నా దగ్గరకు పంపండి " అని చెప్పారు. తరువాత రెండు మూడు సార్లు మేము కలెక్టర్ గారిని కలవడానికి వెళ్ళినప్పుడు CC గారు వెంటనే కలెక్టరు గారిని కలిసే అవకాశం ఇచ్చారు.

మరుసటిరోజు CEO గారిని కలిసాం. " ఇది చాలా మంచి కార్యక్రమం, తప్పకుండా చేద్దాం " అని ప్రొసీడింగ్స్ తయారుచేస్తూ .. " వచ్చే వారం జిల్లా మీటింగ్ ఉంది. అన్ని మండలాల నుంచి MDO లు ఖమ్మం వస్తారు. ప్రతి మీటింగ్ ప్రేయర్‌తో ప్రారంభిస్తాం .. ఈసారి ధ్యానంతో ప్రారంభిద్దాం; మీరు వస్తారా? " అని అడిగారు. " తప్పకుండా వస్తాం సార్! " అని చెప్పాం. జిల్లా మీటింగ్ ధ్యానంతో ప్రారంభం అంటే ఎంతో గొప్ప అవకాశం. ఆ రోజు రానే వచ్చింది. CEO గారి పిలుపు మేరకు అరగంట ధ్యానం, ధ్యాన విశిష్టత తెలియజేసిన తరువాత జిల్లా మీటింగ్ ప్రారంభించారు.

మా షెడ్యూలు ప్రకారం రెండు కార్లు ఏర్పాటు చేసుకున్నాం.(ఒక కారు లక్ష్మణరావు గుంటూరు నుంచి పంపారు) కలెక్టర్ శశిభూషణ్ కుమార్ IAS గారు జెండా ఊపి ధ్యాన విజ్ఞాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రచారంలో నేను, భాస్కర్, వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి రామారావు, సరోజ మేడమ్, శైలజ మేడమ్, రఘురామ్ ప్రసాద్ గారు శ్రీనివాస్, కృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నాము. నేను 60 రోజుల పాటు ఖమ్మం జిల్లాలోనే ఉన్నాను. ఏయే రోజులలో ఎక్కడ ఏ ధ్యానం క్లాసులు జరిగినా వాటిని వార్తాపత్రికలలో అద్భుతంగా ప్రచురించారు.

అన్ని మండలాలలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం పూర్తి అయ్యింది. ఆ పేపర్ కటింగ్స్‌ను తీసుకుని కలెక్టర్ గారిని కలవటానికి వెళ్ళి .. మేము తయారు చేసిన ఫైలును చూపించాం. కలెక్టర్ గారు “ ప్రతి రోజూ కార్యక్రమాలు గురించి తెలుసుకుంటున్నాను. ఒకరోజు ధ్యాన కార్యక్రమానికి రావాలని కూడా ప్రయత్నించాను. అర్జెంట్ మీటింగ్ ఉండడంతో రాలేకపోయాను. కొన్ని నెలల తరువాత రెండవ విడతగా మళ్ళీ ఇలాంటి ధ్యాన కార్యక్రమాలు గిరిజన పాఠశాలలలో, హాస్టల్స్‌లో నిర్వహిద్దాం ” అని మాతో తెలిపారు. ఖమ్మం జిల్లా పిరమిడ్ మాస్టర్స్ మరి మండల అధికారుల సహకారంతో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం అద్భుతంగా జరిగింది.

మూడు జిల్లాలలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో పిరమిడ్ మాస్టర్ల సహకారంతో నిర్వహించుకోవడం, ధ్యాన కార్యక్రమాలను ప్రారంభం నుంచి చివరి వరకూ ఆయా జిల్లాలలో, మండలాలలో పర్యటిస్తూ క్లాసులు చెప్పడం నా భాగ్యంగా భావిస్తున్నాను. అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు!

# " ఆస్ట్రల్ మాస్టర్స్‌తో సంభాషణ "

2003 నవంబర్ 11వ తేదీ పత్రీజీ జన్మదిన వేడుకలు హైదరాబాద్ మాస్టర్స్ అద్భుతంగా నిర్వహించారు. నాకు మారం శివప్రసాద్ గారు బాగా పరిచయం ఉండడంతో నేను ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా వారి ఇంటికే వెళ్ళే వాడిని. ఆ రోజు కూడా వారి ఇంటిలోనే ఉన్నాను.

రాత్రి 10.30 గంటలకు " మరుసటిరోజు ఉదయం 5.30 గంటలకు ఒకరి ఇంటిలో సార్ క్లాసు ఉంది .. వెళ్దామా? " అని మారం గారు అడిగారు. నేను " సరే " అన్నాను. మరుసటిరోజు ఉదయం 5.30 గంటలకు వాళ్ళ అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళేలోగా కొంచెం ఆలస్యం అయ్యింది. కూర్చోవడానికి స్థలం లేక బయట మెట్ల దగ్గర రెండు కుర్చీలు ఖాళీ ఉంటే నేను, మారం గారు కూర్చున్నాం. ఒక్క నిమిషంలోనే నేను ధ్యానస్థితిలోకి చేరుకున్నాను. ఒక ఆస్ట్రల్ మాస్టర్ వచ్చి నన్ను రమ్మని మేడపైకి తీసుకెళ్ళాడు. ఎదురుగా చూడమన్నాడు. " ప్రతి ఇంటిపైనా ఆస్ట్రల్ పిరమిడ్స్ ఉన్నాయి" అని చెప్పాను. గాలిలో ఇంకాపైకి తీసుకెళ్ళి " ఇప్పుడు చూడు " అన్నారు. " నా కనుచూపు మేర ప్రతి ఇంటిపైనా ఆస్ట్రల్ పిరమిడ్స్ ఉన్నాయి " అని చెప్పాను. " సరే " అంటూ అడవిలోకి తీసుకువెళ్ళి అక్కడ చూడమన్నారు. " అడవిలో ఎటు చూసినా అణువు, అణువునా ఆస్ట్రల్ పిరమిడ్స్ కనబడుతున్నాయి " అని చెప్పాను.

అప్పుడు ఆయన “ మీరు చాలా అదృష్టవంతులు. యుగసంధి సమయంలో జీవించి ఉన్నారు. మీరు, మేమూ ఆత్మలమే! లోకకళ్యాణంలో భాగంగా ఎంతో కృషి చేస్తున్నాం. మీరు చేసే పని అందరికీ కనబడుతోంది, మేము చేసే పని ఎవ్వరికీ కనబడదు. మా కృషి ఫలితమే నువ్వు చూసిన ఆస్ట్రల్ పిరమిడ్స్. లోక కళ్యాణంలో భాగం పంచుకోవాలని మీరు ఒక అడుగు ముందుకు వేస్తే .. వంద అడుగులు మేము మిమ్మల్ని నడిపిస్తాం. ‘ నాకెందుకులే ’ అని వెనకడుగువేస్తే వెయ్యి అడుగులు వెనక్కి వెళ్ళిపోతారు. ఈ రోజు (2003 నవంబర్ 12) నుంచి ఎనర్జీ సిస్టమ్ మారిపోయింది. ఇంతకుముందు మీరు ధ్యానప్రచారం అతికష్టం మీద నిర్వహించేవారు. ఎంత ప్రయత్నం చేసినా అంత ప్రోత్సాహకంగా ఉండేది కాదు. తెలిసిన వాళ్ళు, స్నేహితులు, బంధువులు కూడా మీకు సహకరించి ఉండరు. కానీ ఈ రోజు నుంచి మీకు ఎవ్వరూ తెలియవలసిన అవసరం లేదు. మీరు ఏ ఊరు వెళ్ళాలో మనస్సులో అనుకుని బయలుదేరండి. మీరు బస్సు, కారు, మోటర్‌సైకిల్ ఎలా వెళ్ళినా మీరు ఎక్కడ ఆగాలో మేము నిర్ణయిస్తాం. మీరు ఆగి అక్కడ ఉన్నవారిని పరిచయం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తారు. అక్కడ ఉన్నవాళ్ళు ఎంతో అప్యాయంగా మిమ్మల్ని పలకరించి .. ‘ ఎప్పటి నుంచో ధ్యానం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం, సమయానికి మీరు వచ్చారు. కాఫీ, టీ, టిఫిన్ ఏం తీసుకుంటారు? ’ అని సకల మర్యాదలతో మీకు ఆహ్వానం పలుకుతారు! ఆ ఏర్పాట్లు అన్నీ మా ఆస్ట్రల్ మాస్టర్లు చూసుకుంటారు! అతి త్వరలో భూమండలం అంతా ధ్యానమయం, శాకాహారమయం అయితీరుతుంది! ” అని చెప్పి వెళ్ళిపోయారు.

కాస్సేపటికి పత్రిసార్ ' OK ' చెప్పారు. " నేను వస్తాను " అని సార్‌కు చెప్పలేదు. మేము వచ్చింది లోపల ఉన్న ఎవ్వరికీ తెలియదు. పత్రిసార్ లోపల హాల్‌లో ఉన్నారు. " కేశవరాజు బయట మెట్లదగ్గర ఉన్నాడు. లోపలికి పిలవండి " అన్నారు. నేను లోపలికి వెళ్ళగానే " ఈ రోజు అనుభవం చెప్పు " అన్నారు. " నాకు అనుభవం వచ్చింది " అని సార్‌కు ఎలా తెలుసు? సార్‌కు నేను కనబడలేదు .. అయినా నేను వచ్చిన విషయం సార్‌కి తెలిసిందంటే " ప్రతి విషయం సార్‌కు తెలుస్తుంది " అని మరొకసారి ఋజువైంది.



2009-వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌లో పత్రీజీతో D.కేశవరాజు

# ఖమ్మం జిల్లా, మణుగూరులో ..
# " ధ్యానవిజ్ఞాన కార్యక్రమాలు "

2004వ సంవత్సరం ఆగస్టులో నేను హైదరాబాద్‌లో క్లాసులు నిర్వహిస్తూండగా నిర్మలా మేడమ్ " సార్! మీరు ఖమ్మం జిల్లాలో రెండు రోజులు ధ్యానప్రచారానికి వెళ్ళగలరా? " అని అడిగారు. " సరే " అన్నాను. ఆ రోజు రాత్రి మెడిటేషన్‌లో నేను ఊయలలో ఊగుతున్నాను. దుర్గాదేవి వచ్చి " ఈ రోజు మా టీమ్ వెళుతుంది; మీరు రేపు వస్తున్నారు కదా! " అని చెప్పి వెళ్ళిపోయారు. నేను మరుసటిరోజు ఖమ్మం వెళ్ళాను. బొల్లేపల్లి వెంకటేశ్వరరావు గారు ఆ రోజు ఒకచోట క్లాసు ఏర్పాటు చేసారు. ఆ రోజు రాత్రి ఆశ్వాపురం సాయిబాబా ఫోన్ చేసి " మా దగ్గరకు రండి సార్! మా కాలనీలో క్లాస్ ఏర్పాటు చేస్తాను; అలాగే ఒక వారం మా దగ్గర ఉండాలి " అన్నారు. మరుసటిరోజు సాయంత్రం వాళ్ళ కాలనీలో క్లాసు జరిగింది.

నాకు హెవీ వాటర్‌ప్లాంట్ వారి గెస్ట్‌హౌస్‌లో రూమ్ ఇచ్చారు. రాత్రి సాయిబాబాగారు మాట్లాడుతూ " రేపు ఉదయం మణుగూరు వెళదాం సార్! ఎప్పటినుంచో అక్కడ క్లాసులు చేయాలని అనుకుంటున్నాను కానీ వీలు కావడంలేదు. మీరు ' ఓకే ' అంటే వారం రోజులు మణుగూరులోని స్కూల్స్, కాలేజీలలో ధ్యానం క్లాసులు నిర్వహిద్దాం. అందుకే ' వారం రోజులు ఉండగలరా ' అని, మీరు ఖమ్మంలో ఉండగానే అడిగాను "

అన్నారు. “ సరే వెళ్దాం ” అన్నాను. మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు మోటార్‌సైకిల్ మీద బయలుదేరి మణుగూరు ఎంట్రెన్స్‌లో జూనియర్ కాలేజీ చేరుకున్నాం. ప్రిన్స్‌పాల్ తో మాట్లాడగా “ ఈ రోజు మాకు వీలుకాదు, మాది డిగ్రీ కాలేజ్ ప్రక్కవీధిలో ఉంది. మీరు అక్కడికి వెళ్ళండి, నేను ఆ ప్రిన్సిపాల్‌కి ఫోన్ చేసి చెప్తాను ” అని చెప్పారు. అక్కడికి వెళ్ళిన వెంటనే ప్రిన్సిపాల్ సాదరంగా ఆహ్వానం పలికి .. “ చిన్నగా వర్షం పడుతోంది కాబట్టి ఒకే చోట కూర్చోబెట్టలేము; ప్రతిక్లాసుకు వెళ్ళి చెప్పగలరా? ” అన్నారు. మేము “ అలాగే చెప్తాం ” అన్నాం. నేను, సాయిబాబా వేరువేరుగా ఒక్కొక్క సెక్షన్‌కు వెళ్ళి విద్యార్థులకు ధ్యానం గురించి చెప్పాలని నిర్ణయించుకుని నేను BA రెండవ సంవత్సరం విద్యార్థుల క్లాసుకు వెళ్ళాను.

అరగంటలో ధ్యాన విశిష్టత, ధ్యానం చేయించి బయటకు వస్తూండగా నాతో పాటు శ్రీనివాస్ అనే స్టూడెంట్ “ మీతో మాట్లాడాలి సార్ ” అన్నాడు. “ సరే చెప్పండి ” అన్నాను. “ నేను ABVP సెక్రెటరీగా ఉన్నాను. నాకు మణుగూరులోని అన్ని స్కూల్స్, కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో పరిచయాలు ఉన్నాయి. ప్రతి స్కూల్, కాలేజీలలో ధ్యానం క్లాసులు నిర్వహించాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. మీరు ‘ OK ’ అంటే వారం రోజులు మీతో ఉండి అన్ని స్కూల్స్, కాలేజీలలో ధ్యానం క్లాసులు నిర్వహిద్దాం సార్!” అన్నాడు. నేను, సాయిబాబా ఇద్దరం ‘ OK ’ అన్నాం. శ్రీనివాస్‌ది అశ్వాపురం, మణుగూరు మధ్యలో ఒక పల్లెటూరు. మాకంటే ముందుగానే శ్రీనివాస్ మణుగూరు వెళ్ళి ఏదో ఒక స్కూల్ లేక కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి క్లాసులు ఏర్పాటు చేసి మాకు ఫోన్‌లో చెప్పేవాడు. నేను,

సాయిబాబా అక్కడికి వెళ్ళగానే నన్ను అక్కడ క్లాస్ చేయమని చెప్పి వాళ్ళిద్దరూ వేరే చోట క్లాసు ఏర్పాటు చేసుకుని .. వాళ్ళను ధ్యానంలో కూర్చోబెట్టి ఒకరు అక్కడే ఉండి ఇంకొకరు నేను ఉన్న స్కూల్‌కి వచ్చి నన్ను తీసుకెళ్ళేవారు. ఈ విధంగా ప్రతిరోజూ నాలుగు క్లాసులు చేసేవాళ్ళం.

మూడవరోజు ఒక స్కూల్ వద్ద నన్ను వదలి వెళ్ళారు. నా క్లాసు అయ్యేలోగా వాళ్ళు వచ్చి నన్ను తీసుకెళ్ళాలి. క్లాసు పూర్తి అయ్యింది. శ్రీనివాస్ లేక సాయిబాబా ఇంకా రాలేదని ఎదురుచూస్తున్నాను. అంతలో ఆ స్కూల్ కరెస్పాండెంట్ రాంబాబుగారు నాతో మాట్లాడారు. " క్లాసు బాగా జరిగింది సార్! విద్యార్థులకు కావలసిన అనేక విషయాలను వారికి అర్థం అయ్యే విధంగా వివరించారు .. ఇంతకీ మీది ఏ ఊరు? మీ గురువు గారు ఎవరు? మీది ఏ సంస్థ ? మీకు క్లాసు చెప్పినందుకు ఏమైనా డబ్బులు ఇవ్వాలా? " అని అడిగారు. అన్నింటికీ సమాధానం చెప్పిన తరువాత " మణుగూరులోని ప్రభుత్వం గుర్తింపు పొందిన స్కూల్స్ అసోషియేషన్‌లో నేనొక ఎగ్జిక్యూటివ్ మెంబర్‌ను. మా అసోషియేషన్ ద్వారా ధ్యానం క్లాసులు నిర్వహించుకోవచ్చా? మీ సంస్థపేరు ఉపయోగించుకోవచ్చా? " అని రాంబాబు గారు అడిగారు. నేను " అలాగే .. ఏర్పాటుచేసుకోవచ్చు " అన్నాను. రెండు రోజులలో వాళ్ళు అసోసియేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి నన్ను పిలిచారు. నేను వెళ్ళి అదేరోజు(అంటే మూడవరోజు) " మణుగూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ " అని నామకరణం చేయటం జరిగింది. ప్రతిరోజూ ధ్యానకార్యక్రమాల గురించి అన్ని దినపత్రికలలో వస్తున్నందున విస్తృత ధ్యాన ప్రచారం జరిగింది.

దినపత్రికలలో వస్తూన్న వార్తలను చూసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గారు మమ్మల్ని ఆహ్వానించారు. మధ్యాహ్నం 3.30

గంటలకు ధ్యానం క్లాసు, ఆరుబయట చెట్ల క్రింద ప్రారంభమైంది. 4.30 గంటలు అయ్యింది కానీ సూడెంట్స్ ఎవ్వరూ వెళ్ళడం లేదు. " ఇంకా చెప్పండి " అంటున్నారు. వేదికపై ఉన్న ప్రిన్సిపాల్ మరి లెక్చరర్స్ లేచి ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళి ఐదునిమిషాల తరువాత వచ్చి వేదికపై కూర్చున్నారు. స్టూడెంట్స్‌కి క్లాసు నచ్చింది కానీ ప్రిన్సిపాల్ మరి లెక్చరర్స్‌కు క్లాసు నచ్చలేదేమో అనుకున్నా.

ఇంతలో ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ " కో-ఎడ్యుకేషన్ కాలేజీలో ఒక గంటపైగా నిశ్శబ్దంగా కూర్చుని ధ్యానంక్లాసు వింటున్నారు అంటే ధ్యానం గొప్పతనం ఏంటో అర్థం అయ్యింది. స్టూడెంట్స్ ఒప్పుకుంటే ప్రతిరోజూ అరగంట ధ్యానంకోసం కేటాయిస్తాం. " అన్న వెంటనే స్టూడెంట్స్ అందరూ కరచాల ధ్వనులతో ముక్తకంఠగా ఒప్పుకున్నారు. " మా సర్వీసులో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. మామూలుగా క్లాసులో ఉన్న నలభైమంది స్టూడెంట్స్‌కు మేము క్లాసు చెప్తూంటే అల్లరి చేస్తారు. అలాంటిది పన్నెండు వందల మంది స్టూడెంట్స్ ఒకేచోట ఒకగంటపైగా నిశ్శబ్దంగా ఉండి ధ్యానం క్లాసు విన్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉంది " అని ప్రిన్సిపాల్ గారు ధ్యానశక్తిని కొనియాడారు.

మరుసటిరోజు మణుగూరులోని " మదర్ థెరిస్సా వుమెన్స్ కాలేజీ" వారి ఆహ్వానం మేరకు వెళ్ళటం జరిగింది. మూడు వందల మంది కాలేజీ ఆవరణలోని చెట్ల క్రింద కూర్చున్నారు. ఎండ ఎక్కువగా ఉండి చెట్ల మధ్యలో పడుతూన్న ఎండకు స్టూడెంట్స్ తలపై చున్నీలు కప్పుకుంటున్నారు. " ఎండవల్ల మీకు అసౌకర్యంగా ఉంది కాబట్టి తొందరగా క్లాసు పూర్తి చేస్తాను " అని నేను చెప్పాను. " మాకు అసౌకర్యంగా ఏమీ లేదు, ఎండ


గురించి పట్టించుకోకండి, మళ్ళీ మళ్ళీ ఇలాంటి అవకాశం రాదు కాబట్టి మీరు ధ్యానం గురించి వివరించి ధ్యానం నేర్పించండి " అని స్టూడెంట్స్ అనడంతో ఒక గంటసేపు అద్భుతంగా ధ్యానం క్లాసు నిర్వహించడం జరిగింది.

ఇలా ఒక వారం రోజులు మణుగూరు టౌన్‌లోని స్కూల్స్ మరి కాలేజీలలో ధ్యానం క్లాసులు నిర్వహించటానికి సహకరించిన ABVP సెక్రెటరీ శ్రీనివాస్, అశ్వాపురం పిరమిడ్ మాస్టర్ సాయిబాబా, స్కూల్ కరెస్పాండెంట్ రాంబాబు గార్లకు ధన్యవాదాలు. ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలు మణుగూరులో నిర్వహించాలని .. నన్ను ఆహ్వానించి ఒక వారం రోజుల పాటు ఉద్యోగానికి సెలవు పెట్టిన సాయిబాబా గారు అశ్వాపురంలో మణుగూరు ఏరియాలో తాను స్వంతంగా(ఒంటరిగా) అనేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. వారికి కృతజ్ఞతాభివందనాలు.

మణుగూరులో స్కూల్స్ వారి కాలేజీలలో జరిగిన ధ్యాన కార్యక్రమాల గురించి పత్రీజీకి వివరించగా నవంబర్ 14వ తేదీన మణుగూరుకు పత్రిసార్ వస్తానని చెప్పారు. ఈ విషయాన్ని తెలుపగా అక్కడ వారి ఆనందానికి అవధులు లేవు. ఏర్పాట్లు చేయడం కోసం రెండురోజులు ముందుగా నేను వెళ్ళాను. మణుగూరులో సత్యభాస్కర్ స్కూల్/కాలేజీ ఆవరణలో శ్రీ గాంధి బాబు గారి పర్యవేక్షణలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమం గురించి దినపత్రికలలో, సిటీకేబుల్‌లో కూడా ప్రచారం జరుగుతోంది. సిటీకేబుల్‌లో 14వ తేదీరోజున జరిగే కార్యక్రమాన్ని లైవ్ ఇవ్వడానికి ఏర్పాట్లు జరిగాయి. మణుగూరులోని స్కూల్స్ మరి కాలేజీ బస్సులలో స్టూడెంట్లు తీసుకుని రావడానికి నిర్ణయించారు.

నవంబర్ 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం. పత్రీజీ 10.30 గంటలకు ప్రాంగణం చేరుకున్నారు. పదివేల మంది స్టూడెంట్స్‌తో ప్రాంగణం కిటకిటలాడుతోంది! 12 గంటల వరకు పత్రీజీ సందేశం, ధ్యానం జరిగింది. తరువాత ఒక్కొక్క స్కూల్ తరఫునా సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 5 గంటల వరకు కనీవినీ ఎరుగని రీతిలో కనులపండుగగా కార్యక్రమం జరిగింది.

మణుగూరులోని స్కూల్స్ కాలేజీల యాజమాన్యానికీ, పిరమిడ్ మాస్టర్లకూ హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రత్యేకంగా ABVP సెక్రెటరీ శ్రీనివాస్, అశ్వాపురం సాయిబాబా, మణుగూరు రాంబాబు, సత్యభాస్కర్ స్కూల్/ కాలేజీ గాంధీ బాబు గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత గొప్ప కార్యక్రమంలో నేను పాలుపంచుకోవడం ఎంతో ఆత్మానందాన్ని కలిగించింది!



మణుగూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో
D.కేశవరాజు గారితో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం

# " 2004 - పిరమిడ్ వ్యాలీ అనుభవం "

2004లో జూలై నెలలో కంచి రఘురామ్ ఆధ్వర్యంలో కైలాసమానస సరోవర యాత్ర వెళ్తున్నవారికి వీడ్కోలు పలకడానికి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నాం.

పత్రీజీ అందరితో ఆత్మీయంగా పలకరించి వీడ్కోలు పలికారు. " కేశవరాజు! పిరమిడ్ వ్యాలీ చూశావా? " అని పత్రీజీ అడిగారు. " లేదు సార్ " అన్నాను. " ఉదయం 5.30 గంటలకే బయలుదేరి వెళ్దాం; ఉదయం 9 గంటలకు నేను కోయంబత్తూరు వెళ్ళటానికి విమానాశ్రయానికి రావాలి " అన్నారు. ఉదయం 6.30 గంటలకు పిరమిడ్ వ్యాలీ చేరుకున్నాం. అక్కడ వంట చేసుకోవడానికి ఒక చిన్న గుడిసె, ధ్యానం చేసుకోవటానికి ఒక చిన్న పిరమిడ్ ఉంది.

పత్రీజీ అక్కడ ఉన్న వారితో మాట్లాడుతూండగా నేను పిరమిడ్‌లోకి వెళ్ళి ధ్యానంలో కూర్చున్నాను. కొంతసేపటికి బుద్ధుడు పిరమిడ్ వ్యాలీలో నిర్మించబోయే కట్టడాలు, ఎక్కడెక్కడ డార్మిటరీ, గెస్ట్‌హౌస్, అన్నదాన మండపం .. నేను కూర్చుని ధ్యానం చేస్తున్న పిరమిడ్ స్థలంలో నిర్మించే పెద్ద పిరమిడ్ ఇవన్నీ బ్లూ ప్రింట్‌లాగా నాకు చూపించి వివరించారు. ఇదంతా అర్ధగంట ధ్యానంలో జరిగింది. 7.30 గంటలకు బయటకు వచ్చాను. పత్రీజీ నా అనుభవం గురించి చెప్పమన్నారు. చెప్పిన తరువాత

" మనం వచ్చిన పని అయిపోయింది, వెళ్దాం పద! " అన్నారు. టిఫిన్ చేసి బయలుదేరి సార్ విమానాశ్రయం నుంచి కోయంబత్తూరుకూ, నేను తిరుపతికీ చేరుకున్నాం. పిరమిడ్ వ్యాలీలో ఇది నా మొట్టమొదటి అనుభవం.

2004 నవంబర్ 14వ తేదీ మారం శివప్రసాద్ గారు " మూడు రోజులు ఎక్కడికైనా వెళ్ళి ధ్యానం చేసుకుందాం .. వస్తారా? " అని నన్ను అడిగారు. ఎక్కడికో ఎందుకు .. " వెళ్తే బెంగళూరు పిరమిడ్ వ్యాలీకే వెళ్దాం " అన్నాను. వెంటనే మారం గారు పత్రీజీని అడగడం .. సార్ వెళ్ళమనడం జరిగిపోయాయి.

నేను, వెంకట్రామ రెడ్డి తిరుపతి నుంచి మారం గారు హైదరాబాద్ నుంచి నవంబర్ 17 ఉదయం పిరమిడ్ వ్యాలీ చేరుకున్నాం. పిరమిడ్ కట్టే స్థలం ప్రక్కన ఒక పెంకుటిల్లు ఉంది. పిరమిడ్ కట్టే స్థలంలో చదును చేసి, మార్కింగ్‌చేసి ఉంది. పగలంతా చెట్లుక్రింద కూర్చుని ధ్యానం చెయ్యడం, రాత్రిళ్ళు పెంకుటింట్లో ధ్యానం చెయ్యడం, అనుభవాలు పంచుకోవడం .. రాత్రి 1 గంట వరకు ఇదీ మా షెడ్యూలు. 17వ తేదీ రాత్రి ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు పిరమిడ్ నిర్మించే స్థలంలోకి గౌతమ బుద్ధుడు, జీసెస్ వచ్చి అటూ, ఇటూ తిరిగి సెంటర్‌లో అంటే కింగ్స్ ఛేంబర్ నిర్మించబోయే స్థలంలో ఒక ఆస్ట్రల్ పిరమిడ్‌ను పెట్టి వెళ్ళిపోయారు. రెండవరోజు 18వ తేదీ అర్ధరాత్రి .. బుద్ధుడు, జీసెస్ పెట్టిన ఆస్ట్రల్ పిరమిడ్‌పైకోణం నుంచి ఒక జ్వాల పైకి వెళుతోంది. వంద అడుగుల ఎత్తు వరకూ ప్రాకిన (మంట) జ్వాల చాలాసేపు అలాగే ఉండగా నేను " ఏమిటది? " అని అడిగాను. " ఈ వెలుతురు అనే ఎనర్జీ ద్వారా అజ్ఞానులు అందరూ జ్ఞానులుగా, ఆత్మజ్ఞానులుగా మారిపోతారు. అందుకోసం ఈ ఎనర్జీ ఇక్కడ సృష్టించబడింది " అని సమాధానం ఇచ్చారు.

మూడవ రోజు 19వ తేదీ రాత్రి పిరమిడ్ నిర్మించే స్థలంలో వంద అడుగుల ఎత్తువరకూ ఆంజనేయస్వామి విశ్వరూపంలో పెద్ద గద అటూ, ఇటూ త్రిప్పుతూ ఉన్నారు! త్రిప్పుతూన్న గదకు బాణాలు వచ్చి తగిలి కొన్ని ముక్కలు అవుతున్నాయి. కొన్ని వంగి కింద పడిపోతున్నాయి. “ ఏంటి స్వామి ? మిమ్మల్ని ఈ విధంగా ఎప్పుడూ చూడలేదు! ” అని అడిగాను. సమాధానం రాలేదు. అర్దగంట తరువాత విశ్వరూపం వదలి మామూలుగా మారి ఇలా సమాధానం ఇచ్చారు. “ ఇక్కడ శుద్ధి చేయబడింది, పరిశుభ్రం చేయబడింది. ఇప్పటి వరకూ ఉన్న నెగెటివ్ ఫోర్స్ ద్వారా ఆటంకాలు జరిగేవి. నెగెటివ్ ఫోర్స్‌ను ఎదుర్కోవాలంటే విశ్వరూపం అవసరం, అంత పెద్ద గద అవసరం. అందుకే అలా చేయాల్సి వచ్చింది. ఇంక రెండు రోజులలో నిర్మాణం ప్రారంభం అవుతుంది ” అని చెప్పి ఆంజనేయస్వామి వెళ్ళిపోయారు. అప్పుడు అర్థరాత్రి సమయం 1.30 గంటలు. అంతవరకూ నేను, మారం గారు ధ్యానస్థితిలోనే ఉండి తరువాత నిద్రపోయాం.

రాత్రి మూడు గంటల సమయంలో లారీ వచ్చిన శబ్దం వచ్చింది. నిద్రనుంచి మేల్కొని “ ఇంత రాత్రిలో లారీ ఏంటి? ” అని ఆలోచిస్తే గత మూడు రోజులుగా పిరమిడ్ నిర్మించే స్థలంలో పైల్స్ పద్ధతిలో పిల్లర్స్ వేయటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. “ ఎందుకు పని ప్రారంభించలేదు? ” అని అడిగితే .. “ఇంకా కొంత సామగ్రి రావాల్సింది ఉంది ” అని చెప్పారు. బహూశా అదే లారీ వచ్చి వుంటుంది అనుకుని మళ్ళీ నిద్రపోయాం. లేటుగా లేచి టిఫిన్ చేసి ఉదయం 9 గంటలకు పిరమిడ్ నిర్మాణ స్థలంలోకి వెళ్ళి చూడగా రాత్రి వచ్చిన లారీలోని సామగ్రి తీసి మిషనరీ సిద్ధం చేసి ఉంచారు. “ మిషనరీ సిద్ధంగా ఉంది కదా! ఇంకెందుకు ఆలస్యం,

ప్రారంభించండి. ఈ పైల్స్ పద్ధతిలో పిల్లర్లు వేసే విధానం మేము ఎప్పుడూ చూడలేదు, చూసి వెళ్తాం" అని అడిగాం. వాళ్ళు " మిషనరీ అంతా సిద్ధంగా ఉంది కానీ ఈ రోజు మంగళవారం కాబట్టి మేము ప్రారంభించం .. రేపు ప్రారంభిస్తాం; మీరు చూడాలంటే ఈ రోజు ఉండి రేపు చూసి వెళ్ళండి " అన్నారు. మేము రిజర్వేషన్ చేసుకున్నాం కాబట్టి బయలుదేరటానికి సిద్ధమవుతున్నాం. అంతలో పాల్ విజయ్ కుమార్ గారు సిటీ నుంచి వ్యాలీకి వచ్చారు. మూడు రోజులు మా ధ్యానానుభవాలు వారితో పంచుకుంటూ మమ్మల్ని బెంగళూరు సిటిలో వదిలారు. మేము తిరిగి మా గమ్యం చేరుకున్నాం.

ఆంజనేయ స్వామి చెప్పినట్లుగా రెండు రోజుల తరువాత అంటే నవంబర్ 21వ తేదీ పిరమిడ్ నిర్మాణం ప్రారంభమైంది. డబ్బు ఉన్నా లేకపోయినా సకాలంలో పిరమిడ్ నిర్మాణానికి కావలసిన మెటీరియల్ వచ్చి చేరేది. డిసెంబర్ 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో ధ్యానయజ్ఞం కావడంవల్ల ఏడు రోజులు సెలవు ఇచ్చారు. ఆ తరువాత మళ్ళీ నిర్మాణం ప్రారంభమై 2005 మే నెలలో బుద్ధపౌర్ణమికి ధ్యానం చేసుకునే విధంగా తయారైంది.

ఆంజనేయస్వామి ధ్యానంలో " పిరమిడ్ పని నిరాటంకంగా సాగుతుంది " అని చెప్పారు. అదే విధంగా పిరమిడ్ నిర్మాణం పూర్తి అయ్యింది. మైత్రేయ బుద్ధా ధ్యాన విద్యా విశ్వాలయం, పిరమిడ్ వ్యాలీ ఇంటర్‌నేషనల్ మెడిటేషన్ సెంటర్, బెంగళూరులోని ఏడు వింతలలో మొదటి స్థానాన్ని సంపాదించి ప్రతి నిత్యం ధ్యాన విజ్ఞాన కార్యక్రమాలతో అలరారుతోంది!

# " మైత్రేయ బుద్ధా ధ్యానవిద్యా విశ్వాలయం " ప్రారంభోత్సవం

1994 నుంచి నాకు వచ్చిన ప్రతి ధ్యాన అనుభవాన్నీ పత్రీజీ విన్నారు. 2005 ఏప్రిల్ నెలాఖరులో నేను హైదరాబాద్ వచ్చి అంబర్‌పేటలోని పత్రీజీ ఇంటికి వెళ్ళాను.

వరండాలో పత్రీజీ అమ్మగారు సావిత్రీ దేవి గారు కూర్చుని ఉన్నారు. నేను నమస్కారం పెట్టగా .. ఇంతలో నిర్మలా మేడమ్ నన్ను పరిచయం చేసారు. ఎప్పుడు వచ్చినా నమస్కారం పెడతాను తప్ప నన్ను నేను పరిచయం చేసుకోలేదు. అమ్మ " ఏం నాయనా! ఎన్నో సార్లు కనబడతావు, నాతో ఎప్పుడూ మాట్లాడవు! మా అబ్బాయి (పత్రీజీ) నీ అనుభవాలు అన్నీ చెప్పాడు. నువ్వు కనబడినప్పుడు నీ అనుభవాలు వినమన్నాడు .. చెబుతావా? " అన్నారు. రెండు అనుభవాలు చెప్పాను; ఇంతలో పత్రీజీ నిర్మలా మేడమ్‌తో " బుద్ధ పౌర్ణమికి పిరమిడ్ వ్యాలీకి అమ్మను తీసుకొని రండి మేడమ్ " అన్నారు. నాలుగు రోజులు ముందుగానే వాళ్ళు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

పత్రీజీ " ధ్యానాంధ్రప్రదేశ్ మాసపత్రిక ఆఫీస్‌కు వెళ్దాం " అనగానే " నేను కూడా రెండు రోజుల ముందుగా పిరమిడ్ వ్యాలీకి చేరుకుంటాను కాబట్టి మీకు అక్కడ నా అనుభవాలు వివరిస్తాను " అని అమ్మ దగ్గర సెలవు తీసుకున్నాను.

బుద్ధపౌర్ణమికి రెండు రోజులు ముందుగానే నేను పిరమిడ్‌వ్యాలీకి చేరుకున్నాను. బుద్ధపౌర్ణమికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పందిళ్ళు, షెడ్లు, షామియానాలు వేయడం .. ఇలా జరుగుతూన్న పనులు చూసుకుంటూ అమ్మ ఉంటున్న పెంకుటింటికి వెళ్ళి నా అనుభవాలు అన్నీ చెప్పాను. " చాలా బాగున్నాయి నాయనా నీ అనుభవాలు. నీతో కలసి కొంచెం సేపు ధ్యానం చెయ్యాలని ఉంది " అన్నారు. అప్పటికే రాత్రి 8.30 గంటలు అవ్వడంతో అమ్మకు విశ్రాంతి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో "రేపు ఉదయం 10.30 గంటలకు వస్తాను; అప్పుడు ధ్యానం చేద్దాం " అని చెప్పి అమ్మ దగ్గర సెలవు తీసుకున్నాను.

మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు అమ్మదగ్గరకి వెళ్ళాలని బయలుదేరాను. ఒకరోజు ముందుగానే అక్కడకు చేరుకున్న పిరమిడ్ మాస్టర్లు ఎదురుపడేసరికి వారికి ' హాయ్ ' చెప్పుకుంటూ అమ్మ దగ్గరకు వెళ్ళేసరికి 10.45 గంటలు అయ్యింది. నిర్మలా మేడమ్ మరి ఇంకా కొంతమంది అమ్మతో మాట్లాడుతున్నారు. కొంతసేపు చూసాను .. వాళ్ళు మాట్లాడుతూనే ఉన్నారు. ఇంతలో ఒక వాయిస్ " ధ్యానం చేయటానికి ఉదయం 10.30 గంటలకు వస్తానని నువ్వే చెప్పావు; 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చావు; వాళ్ళ మాటలు ఆపి ధ్యానం చేయించు " అని వినిపించింది. వెంటనే నా వాయిస్ కూడా మారి " మాటలు అపండి! ధ్యానం చెయ్యాలి " అని అమ్మకు సౌకర్యంగా ఉండాలని కుర్చీలు వేసి నేను అమ్మ ప్రక్కనే కూర్చున్నాను. ప్రక్కవారి ఎడమ అరచేతిపై మన కుడిచేయి అరచేతిని బోర్లవేసి పట్టుకుని " చైన్ మెడిటేషన్ ఎంత సేపు చేద్దాం? " అని అమ్మను అడిగాను. " ఒక గంటసేపు చేద్దాం " అన్నారు. పదిమంది కలసి చైన్ మెడిటేషన్ ప్రారంభించాం.

కళ్ళుమూసుకున్న వెంటనే ఒక ఆస్ట్రల్ మాస్టర్ ఫుట్‌బాల్ సైజు అంత క్రిస్టల్ తెచ్చి " మీరేనా క్రిస్టల్ పెట్టేది? " అన్నారు. నాకు అప్పుడు గుర్తుకు వచ్చింది. " పిరమిడ్ నిర్మాణంలో పైపుల జాయింట్‌లలో వెయ్యి క్రిస్టల్స్ పైగా పెట్టారు. అయితే ఫుట్‌బాల్ సైజ్ అంత క్రిస్టల్ ఎలా పెడతారు అనుకుంటూండగా బంగారు కలర్‌లో పెద్ద పళ్ళెం వచ్చి క్రిస్టల్‌ని మోసుకెళ్ళి పిరమిడ్ పై భాగంలో ఫిక్స్ అయ్యింది. బుద్ధుడు, జీసెస్, మహమ్మద్ మూడు క్రిస్టల్స్ తెచ్చారు. " ఇవి ఎలా ఫిక్స్ చేస్తారు? " అనుకున్నాను. మూడు క్రిస్టల్స్ కలిసి పిరమిడ్ ఆకారంలో వెళ్ళి పిరమిడ్ పై భాగంలోని బంగారు కలర్ ప్లేట్‌కు క్రింద అతుక్కున్నాయి. కాస్సేపటికి ఆంజనేయస్వామి వచ్చి ప్రక్కప్రక్కనే కూర్చుని ఉన్న మా మీద గుండ్రని పైపు లాంటిది ఉంచి షవర్ తిప్పితే ఎలా నీళ్ళు పడతాయో అదే విధంగా మాపై ఎనర్జీ పడేటట్లు ఏర్పాటు చేసారు. అరగంట వరకూ అలాగే ఎనర్జీ వచ్చింది. తరువాత ఆంజనేయస్వామి వెళ్ళిపోయారు. అప్పుడు నేను కళ్ళు తెరిచి చూస్తే ఒక గంట పదిహేను నిమిషాలు అయ్యింది. ' ఓకే ' చెప్పాను .. అందరూ కళ్ళు తెరిచారు. అమ్మ కళ్ళు తెరవలేదు. రెండవసారి ' ఓకే ' చెప్పిన తరువాత అమ్మ కళ్ళు తెరిచారు. " ఎంతసేపు అయివుంటుందని మీరు అనుకుంటున్నారు? " అని అమ్మను అడిగాను. " ఒక గంట ధ్యానం చెయ్యాలని అనుకుంటే అరగంటకే ' ఓకే ' చెప్పారేంటి? " అన్నారు.

ఆ వయస్సులో కూడా అమ్మ ఒక గంట పదిహేను నిమిషాలు ధ్యానం చేస్తే అర్ధగంటలాగా అనిపించింది అంటే ఆమె ధ్యాన సాధన అమోఘం! పత్రీజీ అమ్మగారితో కలిసి ధ్యానం చేసే భాగ్యం ఎన్నో జన్మల పుణ్యఫలం!

అదే రోజు రాత్రి నేను ఒంటరిగా ధ్యానం చేస్తూండగా మరుసటిరోజు జరిగే బుద్ధపౌర్ణమి మరి మైత్రేయ బుద్ధ పిరమిడ్ ప్రారంభోత్సవం చూసాను. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలతో అన్నదాన మండపం నుంచి పత్రీజీ, ట్రస్టీస్, పిరమిడ్ మాస్టర్స్ గుంపులుగా బయలుదేరి వెళ్తున్నాం. పిరమిడ్ దగ్గరకు వెళ్ళగానే గౌతమబుద్ధుడు, ఋషీశ్వరులు, ఆస్ట్రల్ మాస్టర్స్ ఎదురుగా వచ్చి పూర్ణకుంభంతో స్వాగతం పలికి పిరమిడ్‌లోకి ఆహ్వానించారు. ఈ అనుభవం తర్వాత ధ్యానం నుంచి లేచాను.

ధ్యానంలో ఎలాగైతే చూసానో .. అచ్చం అలాగే మరుసటిరోజు మైత్రేయ బుద్ధ పిరమిడ్ ప్రారంభోత్సవం అద్భుతంగా జరిగింది! రాత్రి ఆరుగంటల ధ్యానం .. వర్షం ప్రారంభమై పిరమిడ్‌పైన ఉన్న రేకులపై చినుకులు పడుతూంటే లయబద్ధంగా, తబలా వాయించినట్లుగానే ఉంది. అరగంటసేపు ధ్యానం సరిగా కుదరకపోయినా తరువాత ఆరు గంటల ధ్యానం అరగంట లాగా గడిచిపోయింది. మూడు రోజుల పాటు రోజుకి ఆరుగంటలు .. ధ్యానం ఎంతో అద్భుతంగా జరిగింది. " మనమేనా ఆరుగంటల ధ్యానంలో కూర్చున్నది " అనిపించింది.

పాల్ విజయకుమార్, I.V. రెడ్డి, ఇంజనీరు ప్రసాద్, నరసింహారావు, P. చంద్రశేఖర్ గార్లు అద్భుతంగా ఏర్పాట్లు చేసారు. అలా ప్రతి సంవత్సరం బుద్ధపౌర్ణమి జరుపుకుంటూ దినదినాభివృద్ధి చెందుతూ పిరమిడ్ వ్యాలీ ఇంటర్‌నేషనల్ సెంటర్‌గా పేరు గాంచి, బెంగళూరు ఏడు వింతల్లో ఒకటిగా అదీ మొదటి స్థానంలో ఉంటూ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్‌కే ఒక గర్వకారణంగా నిలిచింది!

## “ 1998 - పత్రీజీతో ప్రయాణం ”

1998, ఆగస్టులో పత్రీజీ తిరుపతి వచ్చినప్పుడు “ కేశవరాజు! నేను నార్త్ ఇండియా వెళ్తున్నాను; నువ్వు కూడా రా! వెళ్దాం ” అన్నారు. వెంటనే లగేజీ సర్దుకుని బయలుదేరాను.

పత్రీజీ, సాయికుమార్ రెడ్డి, నేను .. ముగ్గురం .. ప్రొద్దుటూరు, గుంతకల్లు ధ్యానకార్యక్రమాలు తర్వాత గుంతకల్లు నుంచి ముంబాయికి ట్రైన్‌లో ప్రయాణం .. మరుసటి రోజు ఉదయం ముంబయి చేరుకున్నాం. శ్రేయాన్స్ డాగా గారి తమ్ముడు .. రైల్వేస్టేషన్‌కు వచ్చి మమ్మల్ని శ్రేయాన్స్ గారి ఇంటికి తీసుకెళ్ళారు. సముద్రపు ఒడ్డున 13వ అంతస్తులో వాళ్ళ అపార్ట్‌మెంటు. ధ్యానకార్యక్రమం తరువాత రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు పత్రీజీతో నేను, సాయికుమార్ రెడ్డి బీచ్‌లో తిరుగుతూ పత్రీజీ చెప్పే విషయాలను శ్రద్ధగా వింటూ రెండు గంటలపాటు సముద్రపు ఒడ్డున ఎంజాయి చేసాం.

శ్రేయాన్స్ గారు ఉజ్జయనిలో ధ్యాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ట్రైన్‌లో ముగ్గురం ఉజ్జయని చేరుకున్నాం. R & B గెస్ట్‌హౌస్‌లో మా బస ఏర్పాటు చేసారు. ఆ రోజు ఉజ్జయనిలో మహంకాళీ ఆలయ దర్శనం, నదీ సమీపంలో పురాతన ఆలయ దర్శనం, ధ్యానం .. సాయంత్రం ఉజ్జయనిలో ధ్యాన విజ్ఞాన కార్యక్రమం. మరుసటిరోజు రాత్రి భోపాల్ ప్రయాణం. భోపాల్‌లో శ్రేయాన్స్ గారు వసతి ఏర్పాటు చేసారు.

భోపాల్‌లో ఎవ్వరూ పరిచయం లేదు. సాయికుమార్ రెడ్డి, నేను యోగా సెంటర్స్ ఎక్కడ ఉన్నాయో తెలుసుకుని వెళ్ళి అడగగా .. అన్ని సెంటర్స్ వారు పత్రీజీచే ధ్యానం క్లాసు నిర్వహించటానికి ఒప్పుకున్నారు. అలా రెండు రోజులు ధ్యానం క్లాసులు నిర్వహించిన అనంతరం బేతుల్ చేరుకున్నాం. బేతుల్ శ్రేయాన్స్ గారి సొంత ఊరు, వాళ్ళ ఫ్యాక్టరీ చూసిన తరువాత బేతుల్ సమీపంలో ప్రకృతి ఒడిలో శ్రేయాన్స్ గారు పిరమిడ్ నిర్మించాలనుకున్న ప్రదేశానికి వెళ్ళి కొంతసేపు ధ్యానం చేసి తిరిగి బేతుల్ చేరుకున్నాం. సాయికుమార్ రెడ్డి ఒకరోజు ముందుగా హైదరాబాద్ వెళ్ళారు. పత్రీజీ, నేను మరుసటిరోజు హైదరాబాద్‌కి ప్రయాణం. రిజర్వేషన్ చేయిస్తే పత్రీజీకి S10, నాకు S5 లో బెర్త్ వచ్చింది.


బేతుల్‌లో ట్రైన్ ఎక్కాం. కొంతసేపటికి TTE వచ్చారు. పత్రీజీ టికెట్ చూపించాక నా టికెట్ కూడా చూపించి " ఇదే కోచ్‌లో ఒక బర్త్ ఇవ్వండిసార్, పత్రీజీ మా గురువుగారు .. ఆయనకు ఏమైనా అవసరమైతే చూసుకోవాలి " అని అడిగాను. " ట్రైన్ మొత్తం ఫుల్‌గా వుంది, ఏ మాత్రం ఖాళీ లేదు. మీరు వెంటనే వెళ్ళి మీ టికెట్ ' చెక్ ' చేసుకోవాలి. లేకపోతే మీరు రాలేదని వేరే వాళ్ళకు మీ బెర్త్ అలాట్ చేస్తారు" అన్నారు. ఆ మాటలు పత్రీజీ విని .. " కేశవరాజు! వెళ్ళి నీ టికెట్ చూపించి రా" అన్నారు. ఇప్పటి లాగా ఒక కోచ్ నుంచి ఇంకొక కోచ్‌కి వెళ్ళడానికి మధ్యలో దారిలేదు. దిగి వేరే కోచ్ ఎక్కాలి. ఎలా వెళ్ళాలి? ట్రైన్ స్పీడ్‌గా వెళ్తోంది. పత్రిసార్ నన్ను చూసి " ఇంకా వెళ్ళలేదా ? " అనేసరికి " వెళ్తున్నా సార్ " అంటూ డోర్ దగ్గరకు రాగానే ట్రైన్ ఆగింది. ఎంతసేపు ఆగుతుందో తెలియదు. నేను కోచ్‌నెంబర్ S5 కి వెళ్ళి TTE కి టికెట్ చూపించి మళ్ళీ తిరిగి వచ్చి

సార్ ఉన్న S10 కోచ్ ఎక్కాలి. ఇన్ని సందేహాలతో అక్కడ ఉన్న TTE గారిని " ఎంతసేపు ఆగుతుంది?" అని అడిగాను. " ఈ స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. ఏ క్షణమైనా బయలుదేరుతుంది" అనేసరికి నేను పరుగెత్తుకుంటూ S 5 కి వెళ్ళి నా బెర్త్ దగ్గరకు చేరుకోగానే ఆ కోచ్ TTE అక్కడకు వచ్చారు. నా టికెట్ చూపించి మళ్ళీ కోచ్ దిగి పత్రీజీ ఉన్న S10 కోచ్ ఎక్కుతూండగా ట్రైన్ కదిలింది. సార్ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాను. " నా పైన నమ్మకం లేదా? నేను వెళ్ళమన్న వెంటనే ఎందుకు వెళ్ళలేదు? " అన్నారు. " పత్రీజీయే ట్రైన్ ఆగేటట్టుగా చేశారా? ఏంటి?" అనిపించింది.

రాత్రి 10 గంటలు అవడంతో అందరూ పడుకోవడానికి రెడీ అవుతున్నారు. పత్రీజీకి అప్పర్ బెర్త్ .. " ఇక నువ్వు వెళ్ళవయ్యా " అంటూ సార్ తన బెర్త్‌పైకి ఎక్కారు. నేను అక్కడ నుంచి వెళ్ళకుండా సైడ్ బెర్త్‌లో ఒకప్రక్కగా కూర్చున్నాను. " ఆయన పడుకున్నాడు కదా! వాళ్ళకు ఇబ్బంది కలగకూడదు. నువ్వు వెళ్ళు " అన్నారు. " నేను వెళ్ళను సార్! ఇక్కడే రెండు బెర్త్‌ల మధ్యలో బెడ్‌షీట్ వేసుకుని పడుకుంటాను " అన్నాను. వెంటనే సార్ నా చేయి పట్టుకుని " పైకి ఎక్కు " అని లాగారు. ఇద్దరం అప్పర్ బెర్త్‌లో కూర్చున్నాం. కొంతసేపు తరువాత " పడుకోవయ్యా! అంటూ ప్రక్కకు జరిగారు. " మీరు పడుకోండి సార్ " అన్నాను. సార్ వినలేదు .. చేసేది లేక నేను సార్ దగ్గర తలపెట్టుకుని పడుకున్నాను; నిద్రపట్టలేదు. సార్ పొడవుగా ఉంటారు కదా! పైన తల తగలకుండా తలవంచుకుని ప్రక్క ఉన్న ఇనుప కడ్డీని చేత్తో పట్టుకుని కాళ్ళు ఎదురుగా ఉన్న బెర్త్‌కు ఆన్చి కూర్చుని ఉన్నారు. గురువుగారు కూర్చున్న విధానం చూసి నా గుండె గుభేల్‌మన్నది. " సార్ ! నాకు నిద్ర రావడంలేదు .. మీరు పడుకోండి

సార్! నేను కూర్చుంటాను " అన్నాను. వెంటనే చెంప చెళ్ళుమన్నది (చెంపపై కొట్టారు) క్షణాలలో నిద్రపోయాను. తెల్లవారు జామున 3.30 గంటలకు మెలకువ వచ్చి చూస్తే .. పత్రీజీ అలాగే కూర్చుని ఉన్నారు. " సార్! ఇప్పుడైనా పడుకోండి సార్! నేను కూర్చుంటాను " అన్నాను. వెంటనే ఇంకొక చెంపదెబ్బ పడింది. నిద్రపోయి ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ట్రైన్ చేరుకోగా అప్పుడు లేచాను.

బంధువులైనా, స్నేహితులైనా, తల్లి అయినా, తండ్రి అయినా ఒకే బెర్త్ ఉన్నప్పుడు " నువ్వు కొంచెంసేపు, నేను కొంచెంసేపు పడుకుందాం" అనే రోజులివి. అలాంటిది ఒక విశ్వవిఖ్యాత గురువుగారు ఒక శిష్యుడిని పడుకోమని అతి కష్టం మీద చిన్న స్థలంలో రాత్రంతా నిద్రలేకుండా కూర్చుని వచ్చారంటే .. తలచుకుంటేనే నా కళ్ళలో నీళ్ళు వస్తాయి. జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని సంఘటన ఇది. శిష్యులకు ఏ గురువూ ఇవ్వలేని గౌరవాన్ని, ఆప్యాయతను, ప్రేమను పంచే పత్రీజీతో కలిసి జీవించడం ఏన్నో జన్మల పుణ్య ఫలం!



1998-పత్రీజీతో D.కేశవరాజు

# " ప్రతి నెలా హైదరాబాద్ "

ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ధ్యానం క్లాసు నిర్వహిస్తూ ఉన్న తరుణంలో ప్రతి నెలా చివరివారం హైదరాబాద్ రమ్మని పత్రీజీ చెప్పారు.

2008 వ సంవత్సరం ఆగస్టులో అమర్‌నాధ్ యాత్ర తర్వాత ప్రతినెలా హైదరాబాద్ వచ్చి శివంరోడ్డులోని " క్షత్రియ గెస్ట్‌హౌస్ " లో ఉంటూ వారం రోజులపాటు పత్రీజీతో ధ్యానాంధ్రప్రదేశ్, స్పిరిచ్యువల్ ఇండియా ఆఫీసులకూ మరి ధ్యాన తరగతులకూ వెళ్తూ మొదటి వారంలో సార్ బెంగళూరుకు వెళ్ళిన వెంటనే నా ధ్యానప్రచారానికి నేను వెళ్ళే వాడిని.

అలా జరుగుతూండగా పత్రీజీ 2009 నవంబర్ నుంచి " ధ్యానాంధ్రప్రదేశ్ " మాసపత్రిక ఛీఫ్ ప్యాట్రన్‌గా నియమించారు! 2010 సంవత్సరం ఫిబ్రవరిలో " నువ్వు తిరిగింది చాలు .. తిరుపతిలో నీకేమీ పనిలేదు; హైదరాబాద్‌కు మకాం మార్చేయ్ " అని పత్రీజీ అన్నారు.

స్వంత ఇల్లు, పిల్లలు అందరూ తిరుపతిలోనే ఉంటారు. అయినా పత్రీజీ ఆజ్ఞమేరకు నేను, నా సతీమణి సుభాషిణి హైదరాబాద్ రావాలని నిర్ణయించాం. మార్చి నెల చివరిలో హైదరాబాద్‌కి వచ్చినప్పుడు " ఇల్లు చూసుకున్నావా? " అని సార్ అడిగారు. " ఇంకా దొరకలేదు, చూస్తున్నాను సార్! " అన్నాను. ఏప్రిల్ 1వ తేదీ అంబర్‌పేటలో పత్రీజీ ఇంటినుంచి షాలివాహన నగర్‌లోని " ధ్యానాంధ్రప్రదేశ్ " ఆఫీసుకు వస్తూన్నప్పుడు

మళ్ళీ అడిగారు పత్రీజీ. “ ఇంకా దొరకలేదు సార్ ” అన్నాను. ఆఫీసుకు చేరిన గంట తర్వాత మాతో గుజరాత్ టూర్‌కు వచ్చిన బాపూజీ రావు పిరమిడ్ మాస్టర్ వచ్చి .. నన్ను చూసి “ నేను రామాంతపూర్‌లో ఉంటాను. రండి సార్ మా ఇంటికి వెళ్ళి వద్దాం ” అన్నారు. “ పత్రీజీ నన్ను హైదరాబాద్ వచ్చేయమన్నారు; నేను ఇంటి కోసం చూడాలి ” అన్నాను. సార్ “ ఇప్పుడే ఆఫీసు గేటుకు TO LET బోర్డు చూసాను. మీరు చూడలేదా? ” అన్నారు. వెళ్ళి చూడగా మన ఆఫీసుపైన మొదటి అంతస్థులో ఖాళీ అయ్యిందని బోర్డుపెట్టారు. మన ఆఫీసులో వెంకటేశ్ దగ్గర ఇంటి ఓనర్ ఫోన్ నెంబర్ తీసుకుని ఫోన్ చేసాం. ఇంటిఓనర్ రాగానే .. నేను, పత్రీజీ, ధ్యానాంధ్రప్రదేశ్ ఆఫీస్ టీమ్ అందరం ఇల్లు చూసి ‘ ఓకే ’ చేసాం. “ ఆఫీసు పైన ఇల్లు దొరకడం చాలా బాగుందయ్యా! ” అన్నారు పత్రీజీ. “ నా కోసమే, నా సౌకర్యం కోసమే .. పత్రీజీ రమ్మన్న వెంటనే ఇల్లు దొరికింది ” అనిపించింది. పదిహేను రోజులలో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కాపురం మార్చాం. టూరు వెళ్తున్న విధంగా బట్టలు మాత్రమే తెచ్చుకుని ఇంటికి కావలసినవన్నీ హైదరాబాద్‌లో కొన్నాం.

పత్రీజీతో కలసి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో తిరుగుతూ పత్రీజీ ఉత్తర భారతదేశం, బయటదేశాలకు వెళ్ళినప్పుడు హైదరాబాద్‌లో ఉంటూ ధ్యానతరగతులు నిర్వహించేవాడిని. “ ధ్యానాంధ్రప్రదేశ్ ” పబ్లిషర్‌గా P. రమాదేవి మేడమ్ 2002వ సంవత్సరం నుంచి ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్నారు. ఒకరోజు పత్రీజీ “ రమాదేవి మేడమ్! ధ్యానాంధ్రప్రదేశ్ బాధ్యత ఇకమీదట కేశవరాజు చూసుకుంటాడు; మీరు విశ్రాంతి తీసుకోండి” అనేసరికి అందరికీ ఆశ్చర్యం! ధ్యానాంధ్రప్రదేశ్

ప్రారంభం నుంచీ కన్నబిడ్డలాగా చూసుకుంటూ ఎంతో సేవచేసారు రమాదేవి మేడమ్.

పత్రీజీ ఆజ్ఞను శిరసావహిస్తూ రమాదేవిగారు ధ్యానాంధ్రప్రదేశ్ మాసపత్రిక బాధ్యతను 2011 ఫిబ్రవరి నుంచి నాకు అప్పగించారు! 1994 లో పత్రీజీని కలిసినప్పటి నుంచి నేను ఎప్పుడూ పత్రీజీ మాటకు అడ్డు చెప్పలేదు. " ప్రతి తెలుగువారి ఇంటికి మాసపత్రిక చేరాలి " అన్న పత్రీజీ సంకల్పానికి పిరమిడ్ మాస్టర్ల సహకారంతో 2012 వ సంవత్సరంలో జూలై నెల నుంచి డిసెంబర్ నెల వరకూ నాలుగు లక్షల ధ్యానాంధ్రప్రదేశ్ మాసపత్రికలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.

2014 వ సంవత్సరంలో " ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం " రెండుగా విడిపోవడంతో పత్రీజీ ఆదేశానుసారం " ధ్యానజగత్ " మాసపత్రికగా పేరు మార్చడం జరిగింది. పోస్ట్ ద్వారా, రిజిస్టర్ పార్శిల్ ద్వారా, కొరియర్ ద్వారా పిరమిడ్ మాస్టర్ల సహాయ సహకారాలతో ప్రతి తెలుగింటికీ " ధ్యానజగత్ " చేరాలి. ఇది మనందరి బాధ్యత. పిరమిడ్స్ నిర్మించిన వారు, కేర్‌సెంటర్స్ నిర్వహిస్తున్నవారు .. ఒక్కొక్క సెంటర్ నుంచి పది మాసపత్రికలు తీసుకున్నా లక్షకాపీలు ప్రతినెలా లక్ష కుటుంబాలకు చేరి మన ప్రధానలక్ష్యమైన " ధ్యానజగత్ ", " శాకాహార జగత్ ", " పిరమిడ్ జగత్ " లు అతి త్వరగా సాధించగలుగుతాం.

2017 నవంబర్ 4వ తేదీ " ధ్యానజగత్ " మాసపత్రిక ఆఫీస్ శ్రీమతి మాధవి మేడమ్, శ్రీ Ch. అమరేంద్రరెడ్డి గారు కొత్తపేట, విజయపురి కాలనీ రోడ్డు నెంబర్ 1 లో నూతనంగా నిర్మించిన ***" మహాశక్తి పిరమిడ్ ధ్యానమందిరం "*** బిల్డింగ్‌కు మార్చబడింది.

" ఇంటి ముందు BMW కారు ఉండడం కంటే .. ఇంటిలో టీపాయ్ పై ' ధ్యానజగత్ ' మాసపత్రిక ఉంటే చాలా మంచిది. ధ్యానజగత్ మాసపత్రిక మనం చదివిన తరువాత .. వచ్చేనెల పత్రిక వచ్చేవరకు టీపాయ్ పై ఉంచితే మన ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు .. మనం టీ, కాఫీ ఇచ్చేలోపు ' టీపాయ్ ' పై ఏమి ఉంచితే అదే చదువుతారు. అలా " ధ్యానజగత్ " చదివితే .. అందులో ఏ ధ్యానానుభవమో, ఏ పత్రీజీ సందేశమో మరి ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల జీవిత అనుభవమో చూసి వారిలో కూడా మార్పు వచ్చి ధ్యానం చేయడం ద్వారా వారి జీవితాన్ని ధన్యం చేసుకుంటారు " అని ఖమ్మం పిరమిడ్ మాస్టర్ అన్నారు. దానిని బట్టి ఆమె ఎంతగా " ధ్యానజగత్ " లోని ప్రతి విషయాన్ని అర్థం చేసుకున్నారో అర్థమవుతుంది. వారికి " ధ్యానజగత్ " తరపున ధన్యవాదాలు.

* * *

ఖమ్మం వైరా రోడ్డులో నవీన్ చంద్ర గారి ఎలక్ట్రికల్ షాపు ఉంది. వారు పిరమిడ్ నిర్మించి పత్రీజీ ఖమ్మం వచ్చినప్పుడు " పిరమిడ్‌ను ప్రారంభించాలి " అని పత్రీజీని అడిగారు. " నేను అర్జెంటుగా హైదరాబాద్ వెళ్ళాలి; నాతో వచ్చిన కేశవరాజుతో చెబుతాను. రెండురోజులు ఇక్కడే ఉంచి పిరమిడ్‌ను ప్రారంభించుకోండి " అని పత్రీజీ చెప్పారు.

పత్రీజీ ఆజ్ఞప్రకారం ఖమ్మంలో రెండు రోజులు ధ్యానం క్లాసులు నిర్వహించి పిరమిడ్ ప్రారంభించాను. నవీన్ చంద్ర గారు ప్రతినెలా కొన్ని మ్యాగజైన్స్ తెప్పించుకుని వారి ఖాతాదారులకు ఉచితంగా ఇస్తూంటారు. తన స్కూటర్‌లో ఎప్పుడూ కొన్ని మ్యాగజైన్స్ ఉంటాయి. ఒక రోజు సాయంత్రం 5 గంటలకు వారి షాప్ సమీపంలో మిర్చిబజ్జి తిని .. మిర్చిబజ్జీ

వేసే ఆవిడకు ఒక ధ్యానజగత్ మాసపత్రిక ఇచ్చారట. " నాకు చదువు రాదు " అంది ఆవిడ. " మీ ఇంట్లో పిల్లలతో చదివించుకోండి " అని చెప్పారు. మరుసటి రోజు మళ్ళీ బజ్జీ కొట్టుకు వెళ్తే ఆమె బజ్జీలు వేసేది ఆపి, నవీన్ చంద్ర గారికి నమస్కారం పెట్టి " చాలా బాగుంది పుస్తకం; నా మనవడు చదివితే విన్నాను. అంత మంచి పుస్తకం నాకు ఉచితంగా వద్దు. దానిపై ధర ' 30 రూ. ' అని వుంది. ఇదిగో తీసుకోండి" అనగా .. నవీన్ గారు " అంత మంచి పుస్తకం కాబట్టే నీకు ఊరికే ఇచ్చాను. మీకు నచ్చింది కాబట్టి రూ. 300 కట్టండి. ఒక సంవత్సరం పాటు మీ అడ్రస్‌కు వస్తుంది " అని చెప్పగానే ఆవిడ రూ. 300 కట్టి ధ్యానజగత్ చందాదారులుగా చేరారు!

" ధ్యానజగత్ " మాసపత్రిక ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపుతోంది. అజ్ఞానులను సుజ్ఞానులుగా మార్చడమే కాక, అందరికీ అర్థమయ్యే విధంగా సరళంగా, పత్రీజీ చేతులు మీదుగా రూపుదిద్దుకుని మీ ముంగిటకు వస్తోంది " ధ్యానజగత్ " !

చందాదారులు కండి! - చదవండి - చదివించండి! పత్రీజీ మానసపుత్రిక " ధ్యానజగత్ " మాసపత్రిక. ప్రతి చందాదారుడు నెలకు ఒకరిని చందాదారునిగా చేర్చి " ధ్యానజగత్, శాకాహారజగత్, పిరమిడ్ జగత్ " లలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను.

# " స్కూల్స్‌లో ధ్యానం క్లాసు "

" కేశవరత్న అడ్వర్‌టైజర్స్ " ద్వారా తిరుపతిలోని అన్ని సంస్థలతో పరిచయాలు బాగా పెరిగాయి. 1994లో తిరుపతి వచ్చినప్పుడు పత్రీజీ వారం లేక పదిరోజులు ఉండేవారు. తిరుపతిలోని అన్ని స్కూల్స్, కాలేజీల కరస్పాండెంట్స్‌తో నాకు పరిచయాలు ఉన్నందున విద్యార్థులకు ధ్యానం క్లాసులు నిర్వహించే వాళ్ళం.

ఒక నెలలో పత్రీజీ వచ్చినప్పుడు ఒకే రోజు మూడు స్కూల్స్‌లో క్లాసులు నిర్వహించవలసి వచ్చింది. నా దగ్గర అప్పుడు ' సువేగా ' మోపెడ్ (బైక్) ఉన్నది. అందులో పత్రీజీని తీసుకెళ్ళడం కష్టం. అందుకని M.M. స్వామిని రమ్మన్నాను. అతని వద్ద LML వెస్పా స్కూటర్ ఉంది. ఇద్దరం భీమాస్ డీలక్స్‌కు చేరుకున్నాం. పత్రీజీతో " క్లాసుకు వెళదాం సార్ " అన్నాను. పత్రీజీ లాడ్జి నుంచి క్రిందకు దిగిన వెంటనే " సార్! మీరు M.M. స్వామి స్కూటర్ ఎక్కండి; నా మోపెడ్‌లో ఇద్దరు వెళ్ళడానికి కష్టం అవుతుంది " అన్నాను. " నేను నీతోనే వస్తాను " అని సార్ నా మోపెడ్ ఎక్కారు. మంచినీళ్ళ గుంట సమీపంలో బాలాజీ కాలనీ దగ్గర రెండు స్కూల్స్‌కు వెళ్ళాలి. అదేమో ఎత్తైన ప్రదేశం .. మోపెడ్ ఒకరిని లాగడమే కష్టం .. అలాంటిది ఇద్దరిని లాగాలి. అది లాగలేక మిస్‌ఫైర్ అవుతూ ' టప్ ' అని శబ్దం వచ్చి ఆగిపోతుందేమో అనే సమయంలో .. నా వెనుక కూర్చొన్న పత్రీజీ నా భుజం తట్టి ' పద ' అంటారు. అలా మోపెడ్

ఆగకుండా రెండు స్కూల్స్‌లో క్లాసులు పూర్తి చేసాం. ఇక మూడవ స్కూల్ మంగళం దగ్గర .. అంటే 8 కి.మీ. వెళ్ళాలి. ఇంకా ఎత్తైన ప్రదేశం. " ఇప్పుడైనా M.M. స్వామి స్కూటర్ ఎక్కండి సార్ " అన్నాను. సార్ వినలేదు. ఆ మోపెడ్‌లోనే మంగళం స్కూల్‌కు కూడా వెళ్ళాం. మధ్య మధ్యలో మోపెడ్ ' టప్ ' అని శబ్దం చేసినప్పుడల్లా నా భుజం తట్టి ' పద' అంటారు. అది మామూలుగా వెళ్తుంది. అక్కడ స్కూల్‌లో ధ్యానంక్లాసు పూర్తి అయిన తరువాత " ఈ రోజుకు ఇంకేమీ క్లాసులు లేవు కదా! " అన్నారు. " లేవు సార్! " అన్నాను. " అయితే నీ బండిలో నువ్వు రా! .. నేను M.M. సామి స్కూటర్‌లో వెళతాను " అని వెళ్ళిపోయారు. నా మోపెడ్ స్టార్ట్ కాలేదు. మెయిన్‌రోడ్డు వరకు తోసుకువచ్చి మెకానిక్‌కు చూపించి రిపేర్ అయ్యిన తరువాత సార్ ఉన్న లాడ్జికి వచ్చాను.

సార్ నాతో " నేను, M.M. స్వామి స్కూల్స్‌కు వెళితే అక్కడ కరెస్పాండెంట్స్ మాకు తెలియదు కదా! అందుకే పని అయ్యేంత వరకు ఆటంకం కలగకుండా నీతో వచ్చాను" అన్నారు. నా మోపెడ్ కూడా పత్రీజీ మాట విని .. ఇద్దరినీ ఎత్తైన ప్రదేశంలో కూడా సునాయాసంగా, సమయానికి ధ్యానం క్లాసులు చెప్పవలసిన స్కూల్స్‌కు చేర్చింది!



# " తిరుమల ట్రెక్కింగ్ "

1995 నుంచి 2002 వరకు తిరుమల శేషాచలం కొండల్లో అనేకానేక ట్రెక్కింగ్‌లు నిర్వహించాం.

ఒకసారి పార్వేటి మండపం నుంచి మూడు రోజులు ట్రెక్కింగ్‌కు బయలుదేరాం. మొదటిరోజు రాత్రి ధ్యానంలో నాకు రెండవరోజు రాత్రి మేము బసచేయబోయే ప్రదేశం కనబడింది. పత్రీజీతో పాటు కొంతమంది ముందుగా వెళ్ళారు. అక్కడ ఒక కుంట వుంది, నీళ్ళు కొద్దిగానే ఉన్నాయి కానీ, స్వచ్ఛంగా లేవు. పత్రీజీ ఆ నల్లటి నీళ్ళు వున్న కుంటలో దిగి, అందరినీ రమ్మని .. ఆ కుంటలో మునగమన్నారు. కొందరు నీళ్ళు బాగా లేవని మునగకుండా పక్కకు వెళ్ళారు. ఇంతలో నేను వచ్చాను. సార్ నన్ను పిలిచారు. నేను వెళ్ళి కుంటలో మునిగాను. బయటకు వస్తూంటే ఏదో తెలియని ఆనందం, ఎంతో తేజోవంతంగా వుంది. వెంటనే ఒక ఆలోచన వచ్చింది. " అతి సమీపంలో ప్రవాహం ఉండే ఉంటుంది " అని వెతికాను. ఇరవై అడుగుల దూరంలో ఒక బండ క్రింద నుంచి స్వచ్ఛమైన ప్రవాహం చూసి, పత్రీజీతో చెప్పి .. అందరం వెళ్ళి స్వచ్ఛమైన ప్రవాహంలో స్నానం చేసాం. ఇది ధ్యానంలో నా అనుభవం.

మరుసటిరోజు మా ప్రయాణంలో సాయంత్రానికి నేను ఎద్దైతే ముందురోజు ధ్యానంలో చూసానో అచ్చం అలాగే జరిగింది. రాత్రి ధ్యానం, పత్రీజీ సందేశం, ధ్యానుల అనుభవాల అనంతరం రాత్రి 10.30 గంటలకు

పత్రీజీ " ధ్యానంలో నీకు వచ్చిన అనుభవం చెప్పవయ్యా " అన్నారు. ఈ అనుభవాన్ని పత్రీజీకి గానీ, ఇతరులకు గానీ ఎవ్వరికీ చెప్పలేదు, మరి పత్రీజీకి ఎలా తెలిసింది? " పత్రీజీకి మన గురించి, మన అనుభవాల గురించి మనకంటే ఎక్కువగా ఆయనకే తెలుసు " అని మరొక్కసారి ఋజువైంది.

అందరూ ప్రకృతి ఒడిలో బండలపైనా, చెట్లక్రిందా నిద్రపోయాం. తెల్లవారు జామున 3.30 గంటలకు బ్యాగుల శబ్దం .. బ్యాగ్ జిప్ తీస్తున్న శబ్దం వచ్చింది. వారు చిన్నగా మాట్లాడుకుంటున్న మాటలు అన్నీ వింటూ ఉన్నాను. మాట్లాడిన వాళ్ళల్లో ఇద్దరి గొంతు గుర్తు పట్టాను. ఉదయం 6.00 గంటలకు వారిని అడిగాను. " తెల్లవారుజామున మీ బ్యాగుల శబ్దం, మీ మాటలు విన్నాను " అని. వారు " కేశవరాజు గారు! పత్రీజీ పిలిచినా ఆ కుంటలోని నల్లని నీళ్ళు చూసి వెళ్ళి మునగలేదు. మీరు అనుభవం చెప్పిన తరువాత ఇంతదూరం వచ్చి పత్రీజీతో కలిసి స్నానం చేసే భాగ్యం కోల్పోయాం. తెల్లవారిన తరువాత మునిగితే ' రాత్రి ఎందుకు మునగలేదు? ' అని ఎవరైనా ప్రశ్నిస్తారని తెల్లవారుజామునే వెళ్ళాం. అయినా మీకు తెలిసిపోయింది. మమ్మల్ని మీరు గుర్తుపట్టారు. మునిగిన తరువాత ఎంతో హాయిగా వుంది " అన్నారు!

పత్రీజీ ఏం చెప్తే అది చేయడమే మన పని. ముందురోజే ఆస్ట్రల్ మాస్టర్స్ వచ్చి మరుసటి రోజు జరుగబోయే సన్నివేశాన్ని చూపించినందుకు వారికి ధ్యానాభివందనాలు !

# " చిన్నప్పటి అనుభవం "

1963వ సంవత్సరంలో నేను 3వ తరగతి చదువుతూన్న సమయంలో మా కుటుంబం, మా మేనమామ కుటుంబం తిరుమలకు వెళ్ళాం. స్వామి దర్శనం అనంతరం ఎవరెవరు స్వామిని ఏమేమి కోరుకున్నారో వివరించారు. మా మేనమామ కుమారుడు S.R. సుబ్రమణ్యం రాజును అడిగారు. అతను " ' స్వామీ! నాకు బాగా చదువు రావాలి, మంచి ఉద్యోగం రావాలి' అని కోరుకున్నాను " అన్నాడు. వెంటనే నా వంతు వచ్చింది. " నేను ఏమీ కోరుకోలేదు " అన్నాను. " గుడిలోనే ఉన్నాం కదా .. ఇప్పుడైనా కోరుకో" అన్నారు. " నేను ఏమీ కోరుకోను. మనకంటే గొప్పవాడైన దేవుడి దగ్గరకి వచ్చి కోరికలు కోరడం ఏమిటి? మనకు ఏం కావాలో ఆయనే ఇస్తాడు " అన్నాను. " వీడు మన మాటలు వినేటట్లు లేడు, వదిలేయండి " అన్నారు.

అబ్బికండ్రిగలో ప్రాథమిక పాఠశాల తర్వాత తడుకు రైల్వేస్టేషన్ సమీపంలో K.V.S.N. Z P హైస్కూల్‌లో 6వ తరగతిలో నేను, శ్రీరాములు .. మా ఊరి నుంచి మేము ఇద్దరమే. శ్రీరాములుకు సినిమాల పిచ్చి ఎక్కువ .. క్రొత్త సినిమా వచ్చిందంటే వెళదామని నాతో చెప్పేవాడు. ' సినిమా ' అంటే ఇంట్లో ఒప్పుకోరు కాబట్టి .. ఏదో బుక్ కావాలని ఇద్దరం ఒకే రకంగా అబద్ధం చెప్పి ఒక రూపాయి యాభై పైసలు తీసుకుని మా ఊరు నుంచి పుత్తూరుకు రానూ పోనూ బస్సుకు యాభై పైసలు,

నోట్ బుక్ పావలా, మసాలా దోసె పావలా, సినిమాకు పావలా .. ఇంకా పావలా మిగలగా బిస్కెట్స్ తినేవాళ్ళం. నాకు ఇష్టం లేకపోయినా వాడి కోసం నేను కూడా వెళ్ళే వాడిని.

సినిమాకు వెళ్ళాలి అంటే రెండు రోజులు ముందు నుంచే ఇంట్లో ఎలా చెప్తే రూపాయి యాభై పైసలు ఇస్తారో .. ఆలోచించి చెప్పేవాళ్ళం. ఈలోగా నేను కలలో ఏదో ఒక సీను చూసేవాడిని. నాకు ఏమీ అర్థం అయ్యేది కాదు. రెండురోజులు తరువాత నేను కలలో చూసింది .. ఆ సినిమాలో సన్నివేశం ఉండేది. అప్పుడు నాకు తెలియదు .. మూడవ కన్ను గురించి, సూక్ష్మశరీరయానం గురించి. " ఇదంతా సాధ్యమే " అని ధ్యానంలోకి వచ్చిన తరువాత తెలిసింది.

ప్రాపంచికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో సందేహాలు నివృత్తి చేసిన బ్రహ్మర్షి పితామహ పత్రీజీ గారికి శతకోటి ధ్యానాభివందనాలు.

---

గుంటూరు జిల్లా ధ్యానవిజ్ఞాన కార్యక్రమం బ్రోచర్‌ను విడుదల చేస్తోన్న
గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి K. విజయమ్మ గారు



# " 2001 లో తిరుమల అనుభవం "

మొదటి కైలాస మానససరోవర యాత్ర 2001లో దిగ్విజయంగా పూర్తి చేసుకున్న తరువాత " నేను, కంచి రఘురాం, కుప్పు స్వామి ముగ్గురం కలిసి తిరుమల వెళ్ళాలి " అనుకున్నాం. " మోటార్‌సైకిల్‌పై తిరుమల వెళ్ళాలి " అని అలిపిరి వచ్చాం. సాయంత్రం 5.30 గంటలు అయ్యింది. ఘాట్ రోడ్డులో పులి తిరుగుతున్నట్లు సమాచారం ఉంది. " మీరు మోటార్‌సైకిల్‌పై వెళ్ళ కూడదు " అని సెక్యూరిటీ మమ్మల్ని ఆపారు.

బస్సులో తిరుమల వెళ్ళి దర్శనం చేసుకున్నాం. " చాలా సంవత్సరాల తరువాత దర్శనానికి వచ్చాం కదా! పది నిమిషాలు ధ్యానం చేద్దాం " అని హుండీ సమీపంలో పరిమళపు అర ప్రక్కన యోగ నరసింహస్వామి ఆలయం వెనుక ముగ్గురం కూర్చున్నాం. వెంటనే వెంకటాచలపతి నాకు ఎదురుగా వచ్చి " ఇన్ని సంవత్సరాలు రాలేదు ఎందుకు? " అన్నారు. " మీరే కదా స్వామీ .. ' నా దగ్గరకు రావలసిన పనిలేదు; పత్రీజీ ఏం చెబితే అది చెయ్యి చాలు ' అన్నారు. అందుకే నేను రాలేదు " అన్నాను. " నాతో కొంచెం సేపు ఉంటావా? " అన్నారు. నేను "సరే " అన్నాను. వెంటనే ఆలయంలో ఉన్న వెంకటాచలపతి విగ్రహం వద్దకు తీసుకెళ్ళి, రెండు చెంపలకూ గంధం పూసి, నుదుటి మీద ముద్దు పెట్టుకుని .. " అలా తిరిగి వద్దాం.." అని తుంబురుతీర్థం, రామకృష్ణ తీర్థం, కుమార ధార

తీర్థాలలో ముంచి, తిరిగి తీసుకువచ్చి లడ్డు తినిపించి .. “ ఇంకా వుంటావా?” అన్నారు. “ మీ ఇష్టం స్వామీ!” అన్నాను. “ మీ వాళ్ళు ఇప్పటికే ధ్యానం నుంచి లేచి నీ కోసం చూస్తున్నారు. ‘ టైమ్ ’ అయ్యింది, ఇక నువ్వు వెళ్ళు ” అని పంపారు. నేను వచ్చి నా శరీరంలో ప్రవేశించి మెల్లగా కళ్ళు తెరుస్తూంటే .. “ పదినిమిషాలు ధ్యానం చేద్దాం అనుకుంటే .. అరగంట ధ్యానంలో కూర్చున్నావు. మధ్యలో రెండుసార్లు లేపినా లేవలేదు” అని కంచి రఘురాం అన్నారు.

ధ్యానానుభవాలు చెప్పుకుంటూ సెంట్రల్ బస్‌స్టేషన్ వద్దకు వెళ్ళగా బస్‌స్టాండ్ బయట ఒక బస్సు కండక్టర్ “ లాస్ట్ బస్సు ఇదే సార్! .. మూడు సీట్లు మాత్రమే ఉన్నాయి! ఎవరైనా ఉన్నారా? ” అంటూ మాకు వినబడేటట్లు అంటున్నారు. మేము వెళ్ళి బస్సు ఎక్కి తిరుపతికి చేరుకున్నాం. వెంకటాచలపతి ‘ టైమ్ ’ అయ్యింది అని చెప్పడం, స్వామివారు నాకు ప్రసాదం తినిపించడం, పవిత్రమైన మూడు తీర్థాలు తిప్పడం .. ఎన్ని జన్మల పుణ్య ఫలమో! జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని గొప్ప అనుభవం!

---

2006- ఖమ్మం జిల్లా ధ్యానవిజ్ఞాన కార్యక్రమం బ్రోచర్‌ను విడుదల చేస్తోన్న
జిల్లా కలెక్టర్ శ్రీ శశిభూషణ్ కుమార్ IAS గారు



# " ధ్యానం అందరికీ అవసరం "

2003లో చెన్నై వెళ్ళాను. గోవిందప్పనాయకన్ వీధిలో సునీత మేడమ్, జగదీష్ నిర్వహిస్తున్న స్కూల్‌లో రాత్రంతా పౌర్ణమిధ్యానం, సత్సంగంతో గడిచిపోయింది.

ఉదయం 5.30 గంటలకు చెన్నై రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాను. తిరుపతి వెళ్ళడానికి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ ఫ్లాట్‌ఫారమ్ మీద ఉంది. నేను ట్రైన్‌లో కూర్చున్నాను; ట్రైన్ బయలుదేరలేదు. " క్సాసేపు ధ్యానం చేద్దాం " అని కళ్ళు మూసుకున్నాను. ధ్యానం కుదరలేదు కానీ నా చెవిలో ఎవరో " ధ్యానం అందరికీ అవసరం " అనే పుస్తకం వ్రాయమని చెప్తున్నారు. వెంటనే నా బ్యాగ్‌లో నోట్‌బుక్, పెన్ను తీసుకుని " ధ్యానం అందరికీ అవసరం " అని టైటిల్ వ్రాసాను. ట్రైన్ కదిలింది .. తిరుపతికి చేరుకున్నాను.

మరుసటిరోజు నుంచి తెల్లవారుజామున 3 గంటలకు ఎవరో నిద్ర లేపుతారు. నేను వెంటనే లైటు వేసుకుని పెన్ను, పేపర్ తీసుకుంటాను. అంతే నా చెవిలో వాళ్ళు చెప్తూ వుంటారు. నేను వ్రాస్తూ వుంటాను. రోజుకు ఒక టాపిక్ .. విద్యార్థులకు ధ్యానం, గృహిణులకు ధ్యానం, వ్యాపారవేత్తలకు ధ్యానం, రైతులకు ధ్యానం ఇలా ప్రతిరోజూ వ్రాసే వాడిని. అలా " ధ్యానం అందరికీ అవసరం " పాకెట్ సైజు పుస్తకం తయారైంది!

ఒక రోజు " ప్రతిఒక్కరికీ ధ్యానం అవసరం " అనే టైటిల్‌తో వ్రాస్తున్నాను. మధ్యలో " భూమండలం ఎవడబ్బసొత్తూ కాదు .. ఏ

జీవినీ చంపి తినే హక్కు ఎవరికీ లేదు ” అని చెప్పి వ్రాయమన్నారు. “ నేను 1994 వరకు కూడా మాంసం తిన్న వాడినే. ఇంత కఠినంగా వ్రాస్తే మా బంధువులు, స్నేహితులు పుస్తకం చదివిన తర్వాత నన్ను తిడతారు ” అని పదం మార్చి వ్రాయాలనుకున్నాను. వెంటనే చెంప చెళ్ళుమన్నది(చెంప దెబ్బ కొట్టారు). “ మేం చెప్పింది వ్రాయడానికే నిన్ను ఎంచుకున్నాం కానీ నీ ఇష్ట ప్రకారం వ్రాయడానికి కాదు ” అని చెప్పి మరీ వ్రాయించారు ఆస్ట్రల్ మాస్టర్స్. పుస్తకం వ్రాయడం పూర్తి అయిన తరువాత కరెక్షన్స్ కోసం ఎదురుచూస్తూండగా పత్రీసార్ తిరుపతి విచ్చేసారు.

ఆ పుస్తకాన్ని పత్రిసార్ రాత్రి 11.30 గంటల వరకు కరెక్షన్స్ చేసారు. ఒక పేజీని పత్రీజీ ముందుమాట కోసం ఉంచాను. పత్రీజీ అప్పటికప్పుడు “ మధురం-మధురం .. ధ్యానం మధురం ” అనే పాటను వ్రాసి ఇచ్చారు. ఆ పాట నేను వ్రాసిన బుక్‌లో మొదటిగా ప్రింట్ అవటం నా భాగ్యం!

2003 నవంబర్ 11వ తేదీన పత్రీజీ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లో నిర్వహించారు. నేను వ్రాసిన “ ధ్యానం అందరికీ అవసరం” పుస్తకం పత్రీజీ చేతుల మీదుగా రిలీజ్ చేసి, 50,000 ప్రతులకు పైగా ఉచితంగా పంపిణీ చేసాం. ఆ విలువైన సందేశాలతో కూడిన “ ధ్యానం అందరికీ అవసరం ” పుస్తకం మీ కోసం ..

## " ధ్యానం అందరికీ అవసరం "

## " పత్రీజీ సందేశం "

### " మధురం "

పుష్పం లోని తేనె మధురం !
దేహం లోని ఆత్మ మధురం !
పుష్పం మధురం ! తేనె మధురం !
దేహం మధురం ! ఆత్మ మధురం !
మధురం ! మధురం ! అంతా మధురం !
సంసారం మధురం ! ధ్యానం మధురం !
అనిత్యం మధురం ! నిత్యం మధురం !
మధురం ! మధురం ! అంతా మధురం !
కామం మధురం ! అర్థం మధురం !
ధర్మం మధురం ! మోక్షం మధురం !
మధురం ! మధురం ! అంతా మధురం !
శ్వాస మధురం ! శ్వాస ధ్యాస మధురం !
త్రినేత్రం మధురం ! పరలోక యానం మధురం !
మధురం ! మధురం ! అంతా మధురాతి మధురం !

– బ్రహ్మర్షి పత్రీజీ

# " ముందు మాట "

చిన్నప్పటి నుండి నాలో ఒక తపన ఉండేది. " ప్రతి ఒక్కరిలో ఏదో శక్తి ఉంది అది నడిపిస్తూ వుంది; మనలో దాగి వున్న శక్తి ఏంటి? ఎలా తెలుసుకోవాలి? " అని నాకు తెలిసిన వాళ్ళను అడిగాను .. సరియైన సమాధానాలు రాలేదు. తర్వాత కొంతమంది స్వామీజీల దగ్గరకు వెళ్ళాను. వాళ్ళు చెప్పింది నాకు నచ్చలేదు.

చివరగా 1994 ఫిబ్రవరి లో బ్రహ్మర్షి పత్రీజీ గారిని తిరుపతిలో కపిలతీర్థం దగ్గర ఉన్న ' దివ్యారామం ' లో కలుసుకున్నాను. " నాకు కావలసిన సమాధానం ఈయన దగ్గర దొరుకుతుంది " అనీ, " ఈయనే ఈ జన్మకు నా ఆఖరి గురువు " అనీ, " ఇంకెవరి దగ్గరకూ వెళ్ళనవసరం లేదు " అనీ ఆయన ముఖం చూసిన వెంటనే నాకు అనిపించింది. తర్వాత ఆయనతో పరిచయం, ధ్యానాభ్యాసం జరిగి .. నా ఆధ్యాత్మిక జీవితం అలా మొదలయింది.

2003వ సంవత్సరంలో కొన్ని రోజులు తెల్లవారుజామున 3.30 గం॥లకే ఎవరో నన్ను లేపినట్లుగా ఉండేది. నిద్రలేచిన వెంటనే " ఏదో వ్రాయాలి " అనిపించేది. పెన్ను , పేపరు తీసుకొన్న వెంటనే నాతో ఎవరో మాట్లాడుతున్నట్లు, ఎదో వ్రాయమన్నట్లు అనిపించేది. అలా వ్రాయగా ఈ పుస్తకం తయారైంది. వాళ్ళు చెప్పిన మాటలే ఈ అక్షర రూపం.

## " ధ్యానం అందరికీ అవసరం "

పుడమితల్లిపై పుట్టిన ప్రతి జీవికీ మరణం తప్పదు కదా! " అన్ని జన్మలకన్నా మానవ జన్మ గొప్పది " అన్నారు కదా! గొప్పదైన మానవజన్మ ఎత్తినప్పుడు గొప్ప గొప్ప విషయాలపైన మనస్సు పెట్టాలి కదా ! " గొప్ప" అంటే మనిషిని మనిషిగా చూడటం, మంచిని పెంచడం, సాటి ప్రాణి కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకోవడం, ఇలాంటివి ఎన్నో .. ఎన్నెన్నో !

అయితే ప్రస్తుత పరిస్థితులలో మంచి ఎక్కడుంది? గొప్పదనం ఎక్కడుంది? కనీస మానవత్వం మట్టిలో కలిసి పోయింది. దీనికి కారణం ఏమిటి?

పరిస్థితులపై అవగాహన లేకపోవడం, ఆధ్యాత్మిక చింతన లేకపోవడం, ఆధ్యాత్మికతపై అవగాహన లేకపోవడం, ఆత్మజ్ఞానం లేకపోవడం .. ఇలా ఎన్నో కారణాలు.

ప్రతి మనిషీ ' ధ్యానం' చేయాలి; చుట్టుప్రక్కల ఉన్నవారిని ధ్యానసాధన చేయటానికి ప్రోత్సహించాలి; ధ్యానం చేయించాలి; ప్రతి ఒక్కరూ ధ్యానం చేయగలగాలి; అలా జరిగిన రోజు ప్రపంచం అంతా ఆనందమే .. ఆనందం!

హింస ఉండదు – అరాచకాలు ఉండవు, అన్యాయం వుండదు, ఆత్మహత్యలుండవు, మానభంగాలుండవు, నరుక్కోవడాలు ఉండవు.

ఎప్పుడైతే ప్రతి మనిషి తనను తాను తెలుసుకుంటాడో అప్పుడు అంతా ఆనందమే. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, తనవెంటే ఉంటాయి. దీనినే " సూక్ష్మంలో మోక్షం" అంటాం. " సూక్ష్మంలో మోక్షం " ఎలా వస్తుంది? " శ్వాస మీద ధ్యాస " ద్వారా! నిరంతర ' ధ్యాన ' సాధన ద్వారా.

మనలను మనం రక్షించుకోవాలంటే .. మనం మన కుటుంబం ఆనందంగా ఉండాలంటే, ఈ సమాజం బాగుపడాలంటే .. ఈ భూమండలం సస్యశ్యామలంగా ఉండాలంటే .. ప్రతి ఒక్కరికీ ప్రశాంతంగా జీవనం సాగాలంటే .. చేయాలి ప్రతి ఒక్కరూ విధిగా ధ్యానం! ముముక్షువులకు అంకితం ఈ ప్రయత్నం!!

## " విద్యార్థులకు ధ్యానం "

విద్యనభ్యసించేవాడు విద్యార్థి. విద్య రెండు రకాలు, ప్రాంపంచిక విద్య, ఆధ్యాత్మిక విద్య.

ప్రాపంచిక విద్యను అన్ని పాఠశాలల్లో, కాలేజీలలో బోధిస్తారు. అయితే దానికి ఆధ్యాత్మిక విద్య తోడైతేనే నూటికి నూరు శాతం ఫలితం కలుగుతుంది.

విద్యార్థులారా! ఆధ్యాత్మిక విద్యకు ఎలాంటి పుస్తకాలు అవసరం లేదు. పైసా ఖర్చులేదు. ఇది చాలా సులభమైనది. ప్రతిరోజూ ఒక అర్థగంట సుఖాసనంలో కూర్చుని చేతులు రెండూ కలుపుకుని, వ్రేళ్ళలో వ్రేళ్ళు పెట్టుకుని, కళ్ళు రెండూ మూసుకుని ఎలాంటి ఆలోచనలు లేకుండా సహజసిద్ధంగా జరుగుతూన్న ' శ్వాస ' ను గమనించడమే.

' ధ్యానం ' వల్ల ఏకాగ్రత పెరిగి, మంచి జ్ఞాపకశక్తి కలిగి, ఏ పాఠమైనా ఒక్కసారి చదివితే చాలు ఇట్టే బుర్రకెక్కుతుంది. నూటికి నూరుశాతం మార్కులు వస్తాయి. తల్లిదండ్రుల మన్ననలు, ఉపాధ్యాయుల ప్రశంసలు, సాటి విద్యార్థులతో ప్రేమ, స్నేహం, సంఘంలో గౌరవం లభిస్తాయి. చూశారా! అర్థగంట ' ధ్యానం 'తో అన్నీ లాభాలే! ధ్యానం చేయటానికి ఎవరి సహాయం అవసరం లేదు.

" కూసంత సమయాన్ని కేటాయించు .. కొండంత లాభం పొందు". ప్రతి విద్యార్థి ధ్యానం చేయాలి. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.

- ♦ శ్వాస మీద ధ్యాస పెట్టు – జీవితాన్ని చక్కబెట్టు.
- ♦ ధ్యానమే జీవితపు తొలిమెట్టు.
- ♦ ధ్యానమే జీవితంలో మలిమెట్టు.
- ♦ ధ్యానం చేసి .. పై చదువులు చదవడానికి మనస్సు పెట్టు.
- ♦ ధ్యానం చెడు అలవాట్లకు గొడ్డలిపెట్టు.
- ♦ ధ్యానం ఆనందమయ జీవితానికి ఏకైక మెట్టు.
- ♦ ఇక పట్టుబట్టు; ఆత్మవిశ్వాసంతో ఎక్కు మెట్టు పై మెట్టు.

విద్యార్థి దశనుండే చదువుతో బాటు ధ్యానం చేయాలి. ఆనందమయ జీవితానికి ధ్యానం ఒక్కటే సరైన మార్గం అని తెలుసుకోవాలి.

**" పరిపక్వ విద్యార్థి-ఆనాపానసతి ధ్యానవిద్యార్థి "**

## " గృహిణులకు ధ్యానం "

" ఇల్లు చూడు, ఇల్లాలిని చూడు " అన్నారు కదా పెద్దలు! కుటుంబ భారాన్ని భర్త మోసినా, గృహిణికి భర్త కంటే రెంట్టింపు బాధ్యతలుంటాయి. ఇంటిపని, వంటపని, పిల్లల బాధ్యత, భర్త అవసరాలు, చుట్టాల తాకిడి ; ఇలా ఎన్నో బాధ్యతాయుతమైన, కఠినమైన సమస్యలతో గృహిణులు ప్రతిరోజూ నలుగుతూ జీవితం పై విరక్తి కలిగే వారెందరో ఉన్నారు. ఉద్యోగం చేసే మహిళలైతే వారి బాధ్యతలు, సమస్యలు వర్ణనాతీతం.

జీవితపు కష్టాల కడలిని అవలీలగా దాటాలంటే –

సంసార సమస్యలను అతిసులభంగా ఛేదించాలంటే –

దైనందిన పని వొత్తిడి తగ్గి అవగాహన పెరగాలంటే –

భర్తతో అన్యోన్యంగా ఉండాలంటే –

పిల్లలకు అత్యధిక ప్రేమను పంచాలంటే –

బంధువుల మన్ననలు పొందాలంటే –

సమయస్ఫూర్తి, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే .. చేయాలి తప్పక ' ధ్యానం '. ధ్యానం వల్లనే ఆనందం, ఆరోగ్యం, మనశ్శాంతి.

ఇల్లే కదా స్వర్గసీమ ! ఇల్లాలు బాగుంటే ఇల్లు బాగుంటుంది, ఇల్లు బాగుంటే పిల్లలు, భర్త, బంధువులు బాగుంటారు. ప్రతి ఇంట ఆనందం ఉంటే ప్రపంచమంతా ఆనందమే. కనుక ప్రతి గృహిణి చేయాలి తప్పక ధ్యానం – అప్పుడవుతుంది ఇల్లంతా ఆనందమయం.

***" ధ్యానం " అంటే " శ్వాస మీద ధ్యాస "***

స్త్రీలు మారితేనే సమాజం మారుతుంది.

ఈ ప్రపంచంలో స్త్రీ ల దే ప్రముఖ పాత్ర.

స్త్రీలలో మార్పు వస్తే ప్రపంచమంతా మార్పు వస్తుంది

ప్రతి స్త్రీ తప్పక ధ్యానం చేయాలి. అప్పుడే ఇంటిల్లిపాదీ ధ్యానులవుతారు. అలా మార్పు వచ్చినప్పుడే ప్రతి ఇల్లు, ప్రతి పల్లె, ప్రతి పట్టణం, ప్రతి రాష్ట్రం, ప్రతి దేశం ధ్యానమయం అవుతుంది. ఆనందమయం అవుతుంది. అప్పుడే ప్రపంచమంతా స్వర్గమయం అవుతుంది.

**" ధ్యాన కుటుంబం-బ్రహ్మానంద కుటుంబం ! "**

# " రైతులకు ధ్యానం "

అన్నదాత ఆనందమే దేశప్రగతికి సోపానం.

రైతన్నల శ్రమదానమే ప్రజల కడుపునింపే ఆయుధం. ప్రకృతి సహకరిస్తేనే రైతు కళకళ; దేశం గలగల. దేశ ప్రగతికి రైతు వెన్నెముకలాంటి వాడు. రైతు తాను కష్టిస్తూ జీవనాధారమైన ఆహారాన్ని అందరికీ సమకూరుస్తున్నాడు. అలాంటి రైతు ఎల్లవేళలా ఆనందంగా ఉండాలి. కానీ పరిస్థితుల ప్రభావం, ప్రకృతి అనుకూల పరిస్థితులు లేక ఎదుటివారి ఆదరణలేక అన్ని విధాలా కష్టాల పాలౌతున్నాడు; కన్నీటి పాలౌతున్నాడు.

పరిస్థితులు ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండవు కదా! భూదేవిని నమ్మిన వాడు ఒడిదుడుకులకు లోనైనా .. అవగాహనతో, ఆత్మస్థైర్యంతో నిలదొక్కుకున్నప్పుడే సత్ఫలితాలు పొందవచ్చు.

ఎన్ని కష్టాలొచ్చినా రైతు దిగాలుపడకూడదు. ఎండ, వాన, దుఃఖం–సుఖం ప్రక్కప్రక్కనే ఉంటాయి. సమస్యలను మొక్కవోని ఆత్మ స్థైర్యంతో ఎదుర్కోవాలి !

ప్రతి రైతు కూడా అవగాహనతో మెలగాలంటే
సమస్యలను నైపుణ్యంతో ఎదుర్కోవాలంటే
కుటుంబ భారాన్ని అవలీలగా నెట్టుకుపోవాలంటే
ప్రకృతిని ద్వేషించకుండా సమయపాలనతో
అధిక దిగుబడి పొందాలంటే
ప్రతి రైతు విధిగా, తప్పనిసరిగా చేయాలి ' ధ్యానం '.

ప్రతి నిత్యం ' ధ్యానం ' చేస్తే అందరూ అవుతారు మన నేస్తం.

కడుపు నింపే రైతన్న కష్టాల పాలవకూడదు. కష్ట, నష్టాలను ఎదుర్కొనే ధైర్యం, ఆత్మస్థైర్యం కావాలంటే ప్రతి రైతూ తప్పక చేయాలి ‘ ధ్యానం’.

ఇంటివద్ద, పొలం వద్ద, ఎక్కడైనా ‘ ధ్యానం ’ చెయ్యవచ్చు. ప్రకృతిని నమ్మిన రైతు నిరంతరం ప్రకృతి సహజంగా జరుగుతూన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను ప్రతిరోజూ గమనించాలి. ఫలితాన్ని అనుభవించాలి. సాధన చేస్తే సాధించలేనిదేముంది? అందుకే ప్రయత్నించాలి; సాధన చేయాలి, జీవితమంతా ఆనందించాలి.

## “ వ్యాపారస్థులకు ధ్యానం ”

ఉత్పత్తిదారునికీ, వినియోగదారునికీ మధ్య ఉండే వ్యక్తి వ్యాపారి.

ప్రతి వ్యాపారికీ ఒడిదుడుకులు, లాభనష్టాలు సహజమే! ప్రతి వ్యాపారికీ ప్రతినిత్యం ఎంతో టెన్షన్; “ వ్యాపారం లేదు ” అనో, “ లాభం ఆశించినంత రాలేదు ” అనో, “ అధికారుల ఒత్తిడి ” వల్లనో ‘ మనశ్శాంతి’ ఉండదు.

“ మనశ్శాంతి ” అనేది డబ్బుతో కొనేది కాదు. అవగాహనతో వచ్చేది, పరిస్థితుల అవగాహన ! పరిస్థితుల అవగాహన కావాలంటే ఏకైక మార్గం ‘ ధ్యానం ’. ధ్యానం ఒక్కటే అందరినీ సరైన మార్గంలో నడుపుతుంది. మన ప్రవర్తన ఎప్పుడైతే సరైనదౌతుందో మనకు తెలియకనే అన్నీ సమకూరుతాయి. అందుకే ప్రతి వ్యాపారికీ కావాలి ప్రతినిత్యం ‘ ధ్యానం’. అప్పుడే అవుతుంది ప్రతిక్షణం లాభదాయకం.

సంపూర్ణ ఆరోగ్యానికి నిండైన మనశ్శాంతికి ఏకైక మార్గం ‘ ధ్యానం’. ప్రతినిత్యం ప్రతి వ్యాపారి చేయాలి ధ్యానం. అప్పుడే పొందుతారు

అధికలాభాన్నీ, అత్యధిక ఆనందాన్నీ, సంపూర్ణ ఆరోగ్యాన్నీ, పరిపూర్ణ మనశ్శాంతినీ.

**" తప్పక చేయాలి ధ్యానం-విధిగా పొందాలి లాభం "**

## " పారిశ్రామికవేత్తలకు ధ్యానం "

అనునిత్యం పరిశ్రమించేవాడు పారిశ్రామికవేత్త.

ఏ పరిశ్రమలోనైనా ఎక్కువ శ్రమించేవాడు యజమాని, ' రా ' మెటీరియల్, మిషనరీ, వర్కర్స్, క్వాలిటీ, మార్కెటింగ్. ఈ ఐదూ ఐదు వ్రేళ్ళు లాంటివి. చిటికెనవ్రేలు ' రా ' మెటీరియల్, దాని ప్రక్కది మిషనరీ, నడిమివ్రేలు వర్కర్స్, చూపుడువ్రేలు క్వాలిటీ, బొటనవ్రేలు మార్కెటింగ్.

ఐదువ్రేళ్ళు కలిస్తేనే పిడికిలి. పిడికిలి గట్టిగా బిగిస్తే అంటే పైన చెప్పిన ఐదు విషయాలు సక్రమంగా చేసుకో గలిగితే అంతా లాభదాయకమే ! ఇక అడ్డు ఏముంది ?! అంతా ఆనందమే ! ఎంత నైపుణ్యం ఉన్న మేనేజ్‌మెంటు అయినా అన్ని విషయాలలో చాలా జాగ్రత్త అవసరం. నిత్యజాగరూకత, సమయస్ఫూర్తి, పరిస్థితుల అవగాహన కావాలి. వీటిపై నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాలంటే పారిశ్రామిక వేత్తలు చేయాలి తప్పక ' ధ్యానం '.

ప్రతిరోజూ పారిశ్రామిక వేత్తలు ' ధ్యానం ' చెయ్యాలి. వర్కర్స్ చేత ' ధ్యానం ' చేయించాలి. వారు ధ్యానం చేయటానికి తగిన వసతి కల్పించాలి. ఇక చూడొచ్చు ఫ్యాక్టరీ పురోభివృద్ధి ! ప్రతి ఒక్కరూ అవగాహనతో, తమ తమ డ్యూటీ సక్రమంగా చేసుకుంటూ సమిష్టికృషితో సమగ్ర అభివృద్ధికి

ఎంతో తోడ్పడతారు! యజమాని, వర్కర్సు ఎంతో అన్యోన్యంగా కలసి మెలసి ప్రగతి సాధిస్తారు ! పారిశ్రామిక రంగ ప్రగతికి ఏకైకమార్గం ' ధ్యానం '.

' ధ్యానం ' అంటే ' శ్వాస మీద ధ్యాస '. ధ్యానం ఎప్పుడైనా, ఎక్కడైనా చేయవచ్చు. సమయం, నియమం ఏమీ లేదు.

ఇంటిలోనూ, ఆఫీసులోనూ, ఫ్యాక్టరీలోనూ, ప్రయాణంలోనూ, ఎక్కడైనా సరే కాస్తంత ఖాళీ సమయం దొరికినా, లేక కొంత సమయం కేటాయించైనా ప్రతి ఒక్కరూ, ప్రతి నిత్యం ధ్యానం చెయ్యాలి. అప్పుడే అనునిత్య ప్రగతి. వున్నచోటే పురోగతి.

యజమాని అయినా, కూలీ అయినా ఎవరైనా, ఎక్కడ ఉండే వారైనా, ఏ స్థాయిలో ఉన్న వారైనా ప్రగతి సాధనకై ప్రతి నిత్యం ధ్యాన సాధన చెయ్యాల్సిందే !

## " ఉద్యోగస్థులకు ధ్యానం "

పరుగో పరుగు ! ఉద్యోగి జీవితమంతా పరుగుల మయం!!

ఇంటి నుండి ఆఫీసుకు పరుగు, ఆఫీసు నుండి క్యాంపులకు పరుగు. ఆఫీసులో ఉంటే ఫైళ్ళపై పరుగు. పరుగు ఆలస్యమైతే పై అధికారి వద్ద పరాజయం. పరాజయం పాలైతే ఎంత పరుగెత్తినా ఫలితం లేని జీవితం. సమయ పాలన పాటించాలంటే, ఫైళ్ళపై అవగాహన పెరగాలంటే, క్యాంపులు దిగ్విజయం కావాలంటే .. ఉన్నదిలే ఒక చిట్కా! .. పట్టుకో ఎంచక్కా !

‘ శ్వాస మీద ధ్యాస ’ ఉంచు; అదే నిను నడిపించు ఆనందంగా – పరమానందంగా ! ఏ ఉద్యోగికైనా కావాలి ప్రతినిత్యం ‘ ధ్యానం ’. అప్పుడే జీవితం ఆనందమయం. పరుగులు మాని పరవశించాలంటే ప్రతి నిత్యం చేయాలి ‘ ధ్యానం ’. ఆనందమయ జీవితానికి అదొక్కటే మార్గం.

## “ రాజకీయవేత్తలకు ధ్యానం ”

పదంలోనే ఉన్నది మెలిక ! మెలికనెరిగి మెలగాలి అందరి మన్ననలు పొందాలి !

రాజకీయాల్లో ఉన్నవారికి పదవులలో చిన్న, పెద్ద తేడాలున్నా వారిస్థాయికి తగ్గ సమస్యలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రతినిత్యం ఎదురుచూస్తూంటాయి. ప్రతి రాజకీయ నాయకునికీ రెండు సమస్యలు. వ్యక్తిగత సమస్య, ప్రజల సమస్య. ప్రజల సమస్య పరిష్కారం కాకుంటే వ్యక్తిగత సమస్యలు ఎక్కువవుతాయి. అందుకే ప్రతి రాజకీయ నాయకుడు అవగాహనతో, నేర్పుతో, సమయస్ఫూర్తితో ప్రతి సమస్యనూ పరిష్కరించాలి. అప్పుడే అందరి మన్ననలు పొందుతాడు. ప్రజలచేత ఆదరింపబడతాడు.

నిత్య జాగరూకతతో మెలగటానికీ, నైపుణ్యతకూ, సమయస్ఫూర్తికీ, ప్రజలకు మెరుగైన సేవలందించడానికీ ఎంతో ఓర్పు, నేర్పు కావాలి.

వున్న ఓర్పుకు, వున్న నేర్పుకు కొంత ‘ ధ్యానం ’ తోడైతే అన్ని విషయాలలో విజయం వీరిదే ! రాజకీయవేత్తలు మనశ్శాంతిగా ఉంటేనే దేశం ప్రశాంతంగా ఉంటుంది ! కాబట్టి ప్రతి రాజకీయవేత్త ధ్యానం చేస్తే వారి ప్రగతికి దేశ పురోగతికి తోడ్పడిన వారవుతారు.

కూసంత సమయాన్ని కేటాయించి కొండంత లాభం పొందటానికి సాధన చేయాలి. అదే ‘ ధ్యాన ’ సాధన.

## “ ప్రతి ఒక్కరికీ ధ్యానం అవసరం ”

మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకు భౌతికపరమైన వ్యామోహంతోనే జీవితాన్ని గడుపుతూంటాడు. “ కోరికలు ఉంటాయి, అవి మంచివిగా ఉండాలి, మంచిని పెంచేవిగా ఉండాలి; పదిమందికీ ఉపయోగపడేవిగా ఉండాలి” అని కొందరు.

“ నేను బాగుండాలి; అందరికన్నా మిన్నగా ఉండాలి; అందరికంటే గొప్పగా ఉండాలి; అందరూ నన్నే గౌరవించాలి; అందరూ నాకు అణిగిమణిగి ఉండాలి; పేరు, ప్రతిష్ట నాకే దక్కాలి ” .. ఇలా పరి పరి విధాల దురాలోచనలో ఇంకొందరు అంధకారమైన జీవితం జీవిస్తూ ఉంటారు.

అయితే సత్యాన్ని గ్రహించే వారెందరు? ఈ భూమండలంలో జన్మ తీసుకున్న ప్రతి జీవికీ మనకున్నంత స్వేచ్ఛ, మనకున్నంత ఆనందం, మనకున్నంత సుఖం తప్పకుండా ఉండాలి. ఈ భూమండలం ఎవడబ్బ సొమ్మూ కాదు. ప్రతి జీవికీ సొంతం ఉంది. సాటి జీవిని హింసించి, చంపి తినే హక్కు ఎవ్వరికీ లేదు. హింసతోనే పుట్టుంది ముసలం ! హింసతోనే ప్రారంభమౌతుంది అనర్థం ! అందుకే ఈ భూమండలంలో శాంతి, సుఖం, మనశ్శాంతి, ఆనందం, ఆరోగ్యం కరువయ్యాయి.

ఎవరు చేసుకున్న కర్మకు వారే బాధ్యులు. భూమండలంలో స్వయంగా చేసుకున్న అనర్థాలకే మానవుడు కష్టాల పాలవుతున్నాడు; మనశ్శాంతి లేక దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్నాడు.

అందరూ ఆనందంగా జీవించాలంటే, అందరికీ సుఖమయ జీవితం కావాలంటే అందరూ మనశ్శాంతితో సుఖపడాలంటే ఈ భూమండలమంతా సస్యశ్యామలంగా వికసించాలంటే .. ఒకే ఒక్క మార్గం " ఆనాపానసతి ". అంటే " శ్వాస మీద ధ్యాస "

" భూమి మీద జన్మ తీసుకున్నది భూమిపై అశాంతిని నెలకొల్పటానికి కాదు; అరాచకాలు సృష్టించటానికి కాదు " అని ప్రతి ఒక్కరూ గ్రహించి మనిషి ఎందుకోసం భూమి మీదకి వచ్చాడో తెలుసుకోవాలి, తెలుసుకుని మసలుకుని జీవించాలి.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక పాఠాలు నేర్చుకోవటానికీ, ఆత్మ పరిపక్వస్థితికి చేరుకోవటానికీ .. కావలసిన పాఠాలు నేర్చుకుని జీవిత విధానాన్ని మార్చుకుని మసలుకొని " ఆత్మస్థితి నుంచి పరమాత్మ స్థితికి ఎదగటానికి .. సరైన వేదిక భూమండలం " .. అని గ్రహించాలి. అలా గ్రహించినవాడే యోగి, ఋషి, రాజర్షి, బ్రహ్మర్షిగా ఎదిగి పూర్ణాత్మస్థితికి ఎదుగుతున్నాడు. గ్రహించలేనివాడు హింస, దౌర్జన్యకాండలకు పాల్పడి జీవితం వ్యర్థం చేసుకుంటున్నాడు.

ఎన్నిజన్మల పుణ్యఫలమో మానవుడిగా జన్మించాం. మానవుడిగా జన్మించి క్రూరమైన జంతువులాగా ప్రవర్తిస్తే ఇక మానవుడిగా జన్మించి ప్రయోజనమేమిటని ఆలోచించాలి.

ప్రతి మానవుడు కూడా జన్మ పరంపర గురించి తెలుసుకోవాలి. " ఈ జన్మలో చేయవలసిన అత్యున్నత కార్యక్రమాలేమిటి ? " అని గ్రహించాలి. తనను తాను తెలుసుకోవాలంటే ' ధ్యానం ' తప్పనిసరి. ధ్యానం చేసినప్పుడే ఈ జన్మలో ఏం చేయాలో తెలుస్తుంది. అలా తెలుసుకుని ఆచరించినప్పుడే ఆత్మోన్నతి కలుగుతుంది. భౌతికపరమైనవి ఎంత సంపాదించినా అవి మన వెంట రావు. ఆత్మ పరంగా ఎంత

సంపాదించుకుంటావో అదే మన వెంట వచ్చేది అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి. ప్రతిరోజూ ధ్యానం చేసి ధ్యాన సంపద పెంచుకోవాలి. ధ్యానసంపద పెరిగినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం, సంపూర్ణ ఆనందం, సంపూర్ణ మనశ్శాంతి, సంపూర్ణ ఆత్మానందం కలుగుతాయి. దీనికి ఒక్క రూపాయి కూడా ఖర్చులేదు. 23 గంటలూ సంసారం, ఉద్యోగం, వ్యాపారం కోసం పాటుపడినా ఒక్క గంట మన కోసం, మన ఆత్మ ఉన్నతి కోసం ' ధ్యానం ' చేస్తే, అంతా ఆనందమే! మరి ఇక ఆలస్యమెందుకు ?

**" ధ్యానం చేయండి-ధన్యత పొందండి "**

## " అర్థ గంట ధ్యానం ! జీవితమంతా ఆనందం ! "

అర్థ గంట ధ్యానం ! ఆరోగ్యానికీ, ఆనందానికీ, మనశ్శాంతికీ మార్గం! ' ధ్యానం ' అంటే ' శ్వాస మీద ధ్యాస ' !

ప్రతి క్షణం పరుగులు తీసే మన మనస్సు
వాస్తవానికి కాంక్షించేది ప్రగతిపథం !
అన్నీ వున్నా ఏదో తెలియని లోటు !
ఎంత డబ్బు వెచ్చించినా ఎప్పటికీ తీరని సమస్యలు !
అయితే ..
సకల సమస్యల పరిష్కారాలకూ ఉన్నదిలే ఒక చిట్కా !
ఆ చిట్కాను .. ఆ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని ..
ఎంచుకుందాం ఎంచక్కా !

డబ్బుతో పనిలేకుండానే మన పని అవుతుంది !

కాసుకుందాం ! .. కాసులతో అవసరం లేని పనిని !

చూసుకుందాం మన అంతరంగాన్ని !

మసలుకుందాం ఆత్మానుభవ రారాజులుగా !

చేసుకుందాం జీవితాన్ని పూలబాటగా –

బంగారు తోటగా!

అలజడి, అశాంతి, అనారోగ్యం ..

అన్నవి పూర్ణంగా మటుమాయమై,

ఆరోగ్యం, ఆనందం, మనశ్శాంతి ..

అన్నవి సంపూర్ణంగా పొందడానికి,

‘ శ్వాస ’ పై మనస్సు పెడదాం !

దివ్యప్రగతిని సాధించుదాం !

ఆత్మానందంతో .. సత్యాన్ని .. ధ్యానప్రభోదం ద్వారా .. అందరికీ పంచుదాం !

అందరి మన్ననలనూ పొందుదాం !

▲ ▲ ▲

అహర్నిశలూ శ్రమించే మనస్సుకు,

మనిషి కేవలం ఓ అర్థగంట విశ్రాంతి ఇస్తే ..

పొందుతాడు శాంతి, మనశ్శాంతి, పరిపూర్ణ ఆరోగ్యం !

ప్రగతి సాధిస్తూ ఎదగడానికి గదా

మనం జన్మ తీసుకున్నది !

తెలియని దానిని క్రమక్రమంగా తెలుసుకుంటూ,

తెలిసినదానిలో తెలివిగా మసలుకుంటూ,

సవ్య, నవ్య మార్గాన్ని ఎంచుకుంటూ

ఆత్మ మనుగడను సాధించడానికి ' శ్వాస ' మీద నిఘా పెట్టాలి !

సాధరణంగా ఉన్న మనిషి ..

అసాధారణంగా మారడానికీ ..

ఆత్మ మనుగడ లేని మనిషి ..

ఆత్మ మనుగడ వైపు పయనించడానికీ ..

అనారోగ్యంతో ఉన్న మనిషి ..

సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావడానికీ ..

బొత్తిగా శాంతం లేని మనిషి ..

మరి సంపూర్ణంగా మనశ్శాంతి పొందడానికీ ..

లేశమైనా ప్రకాశం లేని జీవితంలో ..

అత్యంత ప్రకాశం నింపడానికీ ..

అమాయక ఆత్మ స్థాయి నుంచి –

మాయ రహిత పూర్ణ జ్ఞాన ఆత్మ స్థాయికి ఎదగడానికీ ..

ఇలా .. ఇలా ..

నిత్య జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవడానికీ ..

ఉన్నది ఒకే ఒక మార్గం !

దాని నామధేయం " అనాపానసతి " !

అంటే " శ్వాస మీద ధ్యాస " !

మనం పూజించే మహర్షులూ, మహాత్ములూ అందరూ ధ్యాన సాధన చేసి, చేసి .. సత్యాన్ని సాధించి, సాధించి .. ఎట్టకేలకు మనకు ప్రసాదించిన మహామంత్రమే ఆనాపానసతి !

అంటే శ్వాస మీద ధ్యాస ! అంటే వాయుపుత్రుడు కావడం!

మహాత్ములందరి లాగా మనమూ

ధ్యానసాధన చేసి మనమూ మహాత్ములవుదాం !

▲ ▲ ▲

ధ్యానపథం, ఆత్మసత్యం .. అన్నవి తెలిసిన మరుక్షణమే

ధ్యానసాధన, సత్యాన్వేషణ మొదలు పెట్టాలి.

మరి ఇంకా ఆలస్యమెందుకు ?

శ్వాస మీద ధ్యాస పెడ్దాం ! - ఆత్మ సత్యం వైపు పయనిద్దాం !

- ఇదే మహర్షులు మనకిచ్చిన మహాఉపదేశం !

శ్వాస మీద ధ్యాస తో సాధించలేనిది ఏమున్నది ఈ

లోకంలో ? శ్వాస ఉంటేనే శివం ! శ్వాస లేకుంటే శవమే !

శ్వాస మీద ధ్యాస పెడ్దాం !

జీవితాలను చక్కబెట్టుకుందాం !

## " ధ్యానమే జీవితం ! "

ఓ మనిషీ ! పరుగులు మానుకో ! నిన్ను నీవు తెలుసుకో !

ప్రపంచాన్ని వెతుకుతున్నావు; నిన్ను నీవు వెతికేది ఎప్పుడో ?

ప్రకృతి శాస్త్రాలనే వల్లె వేస్తున్నావు !

ఆత్మశాస్త్రం తెలుసుకునేదెప్పుడో ?

పరుల గురించి ఆలోచిస్తున్నావు !

స్వంతం గురించి ఆలోచించేదెప్పుడో ?

▲ ▲ ▲

డబ్బుకోసం అన్వేషిస్తున్నావు !

సత్యం గురించి అన్వేషించేదెప్పుడో ?

ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నావు !

వ్యాపారం కోసం అన్వేషిస్తున్నావు !

మరి ఆత్మ గురించి అన్వేషణ ఎవరు చేస్తారు ?

" ఎవరో వస్తారు .. ఏదో చేస్తారు ! " ..

అని ఎదురు చూడకు సుమీ !

నీ గురించి అన్వేషణ నీవే చేయాలి !

నీ గురించి నీవే తెలుసుకోవాలి !

నిన్ను నువ్వు తెలుసుకున్నప్పుడే ఆనందం !

పరమానందం !!

నిన్ను నువ్వు తెలుసుకున్నప్పుడే

జీవితంలో పరమపద సోపాన అధిరోహణం !

‘ పరమపదం ’ అన్నదానిని అధిరోహించినప్పుడే
జీవితంలో ఏం చేయాలో తెలుస్తుంది !

నిన్ను నువ్వు తెలుసుకున్నప్పుడే
నీ జీవిత గమనం తెలుస్తుంది !

నిన్ను నీవు తెలుసుకున్నప్పుడే కార్యసిద్ధి చేకూరుతుంది !
నిన్ను నీవు తెలుసుకున్నప్పుడే ఈ లోకంలోనూ, మరి
పరలోకంలోనూ సుఖశాంతులతో ఉంటావు !

▲ ▲ ▲

లేనివాడు లేదనీ,
ఉన్నవాడు ఉన్నదాన్ని కాపాడుకోవాలనీ ..
వ్యర్థ కాలయాపన చేస్తూ
అమూల్యమైన కాలాన్ని వృథా చేస్తున్నాడు !

కాలాన్ని వృథా చేస్తే జీవితం చక్కబడుతుందా ?
జీవితం చక్కబడాలంటే కాలయాపనకు తిలోదకాలు ఇవ్వాలి !

కాలయాపన అన్నదానిని మానుకుని ..
కాలక్షేపం అన్నాదానిని మానుకుని ..

కాల దుర్వినియోగం అన్నదానిని మానుకుని ..
కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం నేర్చుకోవాలి !

అమూల్యమైన కాలాన్ని సంపూర్ణంగా
సద్వినియోగం చేసుకోవడానికి ఏకైక మార్గం ..
ఆనాపానసతి .. అదే శ్వాస మీద ధ్యాస !

▲ ▲ ▲

శ్వాస మీద ధ్యాస పెట్టు – జీవితాన్ని చక్కగా చక్కబెట్టు !

శ్వాస మీద ధ్యాస పెట్టు – పనికిరాని అలవాట్లకు వాత పెట్టు !

శ్వాస మీద ధ్యాస పెట్టు –

దివ్య జీవితానికి నాంది పల్కు !

▲ ▲ ▲

" శ్వాస మీద ధ్యాస " అన్నది మాత్రమే

పూర్ణాత్మ స్థాయి చేరడానికి సరాసరి మెట్టు !

శ్వాసే జీవితం ! శ్వాస ఉంటేనే ఈ లోకం –

శ్వాస లేకపోతే పరలోకం !

శ్వాస ఉండగానే జీవితాన్ని చక్కబెట్టుకోవాలి !

" ధ్యానమే జీవితం – జీవితమే ధ్యానం " ..

అనే స్థాయికి త్వరత్వరగా ఎదగాలి !

అప్పుడే ఆనందం ! పరమానందం !! ఆత్మానందం !!!

▲ ▲ ▲

డబ్బుతో పొందలేనిది మనశ్శాంతి !

డబ్బుతో పొందలేనిది శారీరక ఆరోగ్యం !

డబ్బుతో పొందలేనిది ఆత్మానందం !

డబ్బుతో పొందలేనిది ఆత్మశక్తి !

.. పై నాలుగూ పొందితే నిన్ను మించినవాడు ఉండడు !

.. ఈ లోకం లోనూ, మరి పై లోకం లోనూ !

ఈ నాలుగూ పొందడానికి ' కాసులు ' లాభం లేదు.

మరి దేనితో ఈ నాలుగూ లభిస్తాయి ?

.. కేవలం ‘ ధ్యానం ’ తోనే ఈ నాలుగూ లభిస్తాయి !

ఒక్కొక్క దానికీ కనీసం పది పది నిమిషాలుగా ..

వెరసి .. మొత్తం నలభై నిమిషాల సమయాన్ని ..

ప్రతిరోజూ ధ్యానానికి కేటాయిస్తే చాలు ..

పై నాలుగూ నీ వెనువెంటే ఉంటాయి !

పుట్టినప్పటినుంచీ చనిపోయేంతవరకు

నిన్నంటిపెట్టుకుని ..

సహజ సిద్ధంగా జరుగుతూన్న .. ఉచ్ఛ్వాస నిశ్వాసలను .. కేవలం ఓ నలభై నిమిషాలు గమనిస్తే చాలు !

శ్వాస ధ్యాసే ధ్యాన జీవితం !

**“ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస ”**

## “ సర్వత్రా అహింస ! సర్వత్రా ధ్యానం ! ”

పుడమి తల్లి విలపిస్తున్నది ..

ప్రపంచమంతా ధ్యానమయం కావాలని !

ప్రకృతి కాంక్షిస్తున్నది .. మానవాళి పవిత్రం కావాలని !

పశు పక్ష్యాదులు ఎదురు చూస్తున్నాయి ..

మానవాళి అహింసాత్మకం ఎప్పుడవుతోందని !

▲ ▲ ▲

ఎంతో తెలివైన మానవుడు

చేయవలసింది మారణ హోమమా ?

ఏమిటీ అన్యాయం? ఏమిటీ అక్రమం ??

ప్రకృతిని కాపాడవలసిన మానవుడే పరమ ఛండాలుడై

ప్రకృతి ముద్దుబిడ్డలైన పశుపక్ష్యాదులను సంహరిస్తున్నాడు !

“ పక్షి జాతిని బట్టి పరగహింసలు బెట్టి,

కుక్షి నింద కూడు కూరుటకును,

వండి తినెడివాడు వసుధ ఛండాలుడు !

విశ్వదాభిరామ వినురవేమ ! ”

తోటి జంతు జాతి దేవుళ్ళను క్రూరాతిక్రూరంగా హింసించి భక్షించే నేరగాళ్ళు ఉన్నంత వరకు భూమిపై శాంతి లేదు గాక లేదు !

అయితే నేరగాళ్ళ కాలం చెల్లింది !

ధ్యానాగ్ని వారిని ఇక దహించి వేస్తుంది !

పరమ ఛండాలురుగా ఉండేవాళ్ళే

వాల్మీకి మహర్షులుగా మారుతారు !

దేవతలంతా అద్భుత సందేశమిస్తున్నారు

మానవాళికి .. వెంటనే మారమని !

వెంటనే మనస్సు మార్చుకోమని ..

మానవాళికి సవినయంగా విన్నవించుకుంటున్నారు !

▲ ▲ ▲

ఉపదేశాన్ని సద్వినియోగపరచుకుంటాడు తెలివైనవాడు ;

మూర్ఖుడు ఉపదేశాన్ని జారవిడుచుకుంటాడు.

వేమనాచార్యుల వారు ఎంత చక్కగా చెప్పారో !

" ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు !
చూడ చూడ రుచుల జాడ వేరు !
పురుషులందు పుణ్య పురుషులు వేరయా !
విశ్వదాభిరామ వినుర వేమ ! "

.. పుడమి పురుషులందరూ
ఇక పుణ్య పురుషులు అయ్యే తరుణం వచ్చేసింది !
ఉప్పులాగా కాకుండా కర్పూరం లాగా జీవించాలి.
సత్యం అనే సుగంధంతో అందరూ విరాజిల్లాలి !
మానవుడు మాణిక్యం లాగా ప్రకాశించాలి.

" అజ్ఞానాన్ని తొలిగించుకో ..
ఆత్మజ్యోతిని వెలిగించుకో ! .. "

అని 1990వ సం॥ నుంచి ఊరు ఊరూ తిరిగి ప్రచారం చేస్తున్నారు బ్రహ్మర్షి పత్రీజీ !

ధ్యాన విధానం గురించీ .. ధ్యానవిశిష్ఠత గురించీ .. అందరికీ అరిటిపండు వొలిచి ఇచ్చినట్లుగా తెలియజేశారు .. తెలియజేస్తున్నారు .. పత్రీజీ !

అలాంటి మహాత్ముడు భూమి మీద
సజీవంగా వుండగా ఇంకా ఎందుకు సందిగ్ధం ?

ఇకనైనా ధ్యానం గురించి తెలుసుకుని, ధ్యానాభ్యాసం చేద్దాం !
జీవితాలను వెంటనే సరిదిద్దుకుందాం !

## " భిన్నత్వంలో ఏకత్వం ! "

భిన్నత్వంలో ఏకత్వం ! ఇది గొప్ప కార్యం !!

భిన్న రుచులు .. మరి విభిన్న అభిరుచులతో ..

ప్రస్తుత భూమండల మనుగడ సాగుతోంది.

అయితే ఈ తరుణంలో భిన్నత్వంలో ఏకత్వం కావాలి

ఎటు వెళుతున్నామో తెలియని ఈ స్పీడ్ యుగంలో ఎంతో అయోమయ స్థితి.

భార్యకూ భర్తకూ మధ్య ఎడబాటు !

పిల్లలకూ తల్లిదండ్రులకూ మధ్య ఎడబాటు !

ఎడబాటుకి మూలం, " పనికిరాని తపన " లో ఉంది!

" డబ్బు సంపాదించాలి ", " హోదా కావాలి ",

" గొప్పగా ఉండాలి " ఇలా .. ఇలా ..

వీటి కోసమే జీవన పోరాటం సాగుతోంది !

అందువల్లనే మానవుడు మనశ్శాంతి లేక అలమటిస్తున్నాడు

▲ ▲ ▲

" ' డబ్బు ', ' హోదా ' .. అన్నవి మహాతాత్కాలికం " .. అని తెలుసుకునే సమయం ఆసన్నమైంది.

ఏదైనా మితంగానే ఉండాలి !

" అతి సర్వత్ర వర్జయేత్ " .. అని పెద్దలన్నారు గదా !

అతిని సర్వవేళలా వర్జించాలి !

మితిలోనే అన్ని వేళలా వుండాలి !

సరికాని దానిని విసర్జించాలి !

సరియైన దానితో ఏకం కావాలి !

“ సరియైన జీవన విధానం ”

“ సరియైన భోజనం ”

“ సరియైన నిద్ర ”

“ సరియైన కరుణ ”

“ సరియైన ప్రగతి ”

“ సరియైన బంధుత్వం ”

“ సరియైన స్నేహం ”

.. అన్నవి .. సకలం ..

“ సరియైన ధ్యానం ” తోనే ముడిపడివున్నాయి.

ధ్యానవిస్ఫోటం ద్వారా సరియైనవి దగ్గరై

సరికానివి దూరమయ్యే రోజులు దగ్గరకొచ్చేసాయి !

సరికానివన్నీ దూరమై .. సరియైనవన్నీ దగ్గర కావాలంటే నిన్ను నీవు తెలుసుకోవాలి !

నిన్ను నీవు తెలుసుకుంటేనే సరికానివన్నీ దూరమై

సరియైనవన్నీ చెంత చేరుతాయి !

▲ ▲ ▲

నిన్ను నీవు తెలుసుకోవటానికి ఏకైక మార్గం ..

ఆనాపానసతి .. అంటే శ్వాస మీద ధ్యాస !

శ్వాస మీద ధ్యాస పెడ్దాం – జీవితాన్ని చక్కబెట్టుకుందాం !

జీవితాన్ని చక్క బెట్టుకోవడమంటే ..

“ మిత ఆహారం ”

“ మిత నిద్ర ”

“ మిత సంభాషణ ”

ఇలా .. ఇలా ..

ఏదైనా మితంగానే గ్రహించాలి !

అమితంగా సీకరిస్తే అనర్థాలకు చేరువవుతాం !

మితంగా స్వీకరిస్తే అర్థవంతమైన జీవనం జీవిస్తాం !

▲ ▲ ▲

“ అర్థవంతమైన జీవనం ” అంటే ?

జీవిత లక్ష్యం తెలుసుకుని జీవించడం !

జీవిత లక్ష్యం తెలుసుకోవాలంటే ?

శ్వాస మీద ధ్యాస పెట్టాల్సిందే !

శ్వాస మీద ధ్యాస వల్లనే ..

జీవితలక్ష్యం తెలుస్తుంది !

జీవితలక్ష్యం తెలిసినప్పుడే జీవన విధానం మారుతుంది ! శ్వాస మీద ధ్యాస వల్ల నాడీమండలశుద్ధి జరిగి సంపూర్ణ ఆరోగ్యం, మనశ్శాంతి, పరిస్థితుల అవగాహన, సరియైన జీవన విధానం, ఏకాగ్రత, బుద్ధి కుశలత .. మొదలైనవన్నీ పుష్కలంగా పొందగలగటమే గాక ఆత్మ విజ్ఞాన సంపద అపారంగా పెరుగుతుంది !

ఆత్మ విజ్ఞాన సంపద వల్ల భూమండలంలోనూ,
పై లోకాలలోనూ ఆనందంగా ఉంటాం.

## " మీ భవిష్యత్తు - మీ చేతుల్లో "

పుట్టినవాడు గిట్టక మానడు – గిట్టినవాడు పుట్టక మానడు
పుట్టుట చచ్చుట కొరకేనా?
పుట్టి ఉద్ధరించేదేముంది? చచ్చి సాధించేదేముంది ?
అంతా మాయ ! ' మాయ ' లోనే పుడుతున్నాం,
మాయలోనే చస్తున్నాం.
ఎందుకు పుడుతున్నామో ? ఎందుకు చస్తున్నామో ?
ఎవరికి ఎరుక ? ఏలేవాడికే ఎరుక !
ఏలేవాడు ఎవరు ? నీ శరీరాన్ని ఏలేవాడు నువ్వే !
అంటే ఆత్మ ! అత్మే సత్యం ! ఆత్మే నిత్యం ! ఆత్మే నిరంతరం !
ఆత్మకు అన్నీ తెలుసు ! ఆత్మకు అన్నీ తెలుసునని నీకు తెలియదు;
అందుకే అజ్ఞానం ! అంధకారం !
అంధకారంలో వుంటే సత్యం ఎలా గోచరిస్తుంది ?
అంధకారాన్ని ఛేదించి అజ్ఞాన పొరలనుంచి బయటపడితే అప్పుడు సత్యం గోచరిస్తుంది.

▲ ▲ ▲

సత్యాన్వేషణ చేస్తే కదా ' సత్యమే నిత్యం ', ' సత్యమే నిరంతరం' అని తెలిసేది.

నీవు చేయాల్సింది చేస్తే .. రావాల్సింది అదే వస్తుంది.

విత్తనం నాటితే కదా .. పంట వచ్చేది !

విత్తనం నాటకనే పంట ఎలా వస్తుంది ?

ఇదీ అంతే ! అర్థమయిందా ??!!

ఇంకా ఎంతమంది రావాలో మనల్ని మార్చటానికి !

ఎంతమంది వచ్చినా .. వారి జీవితాలను అర్పించి సత్యం తెలియజేసినా, పాటలుగా పాడుకుంటూ, భజనలు చేసుకుంటూ ఆరాధిస్తున్నామే తప్ప వారు ఏం చేశారో, ఏం చెప్పారో అది చేసి వాళ్ళంతటి వారు కావాలని మనం ఎందుకు తపన చెందమో??!!

▲ ▲ ▲

ఎంతసేపటికీ డబ్బు, డబ్బు .. భజన, భజన !

అదికాదు చేయవలసింది. డబ్బుతో పొందలేనిది, భజనతో పొందలేనిది ఇంకొకటి ఉందనీ .. అదే సత్యమనీ .. అదే నిత్యమనీ .. అదే చేయవల్సిందనీ ఎప్పుడు గ్రహిస్తారో అని పైనున్న వాళ్ళు బాధపడుతున్నారు మనల్ని చూసి!

ఈ దాగుడుమూతలు ఇంకెన్ని సంవత్సరాలో ?

“ చేసుకున్నవాడికి చేసుకున్నంత మహదేవా ” అని వదిలేశారు.

అయితే, 2012 డిసెంబర్ 21 నాటికి ముహూర్తం నిర్ణయించారు! “ ఈ లోపలే అటో ఇటో తేల్చేయండి ” అని హెచ్చరిస్తున్నారు, అంటున్నారు .. పై లోకాల్లో. దీన్ని మార్చడానికి ప్రణాళిక వేసేశారు ! అందుకే “ గుద్ది చెప్తున్నాం ! ఓ మనిషీ మారు ! మంచి మార్గంలో నడువు ” అని ! విన్నారా సరి ! లేకుంటే హరి !

సత్యలోకాలలోని సహ సృష్టికర్తలు అందరూ ఏక కంఠంతో .. అమృత హస్తాలతో .. స్వాగతం పలుకుతున్నారు ! మనస్సు మార్చుకుని మంచిని పెంచమని ! మనుగడ సాధించమని ! ఈ అమృత ఘడియలు మళ్ళీ మళ్ళీ రావు, రావు, రావు !

▲ ▲ ▲

దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలి ! " మళ్ళీ సర్దుకుందాము " అనుకుంటే మరుక్షణం దీపం ఉండదు ! వెలిగించడానికి నీవే వుండవు. మరి ఎప్పుడు జ్ఞాన జ్యోతిని వెలిగించుకుంటావు?

" ఆత్మజ్ఞానం పొందాలి " అని తపన వున్నదా ? " పుట్టాం, పెరిగాం " అనుకుంటే అనంతకోటి జీవరాసుల్లో నీవూ ఒకడివి. మరి మనిషిగా పుట్టి నీవు సాధించేదేమిటి? " పుట్టుట గిట్టుట కొరకే " అనుకుంటే మరి పుట్టుక దేనికి ? ఈ భూమికి భారంగా వుండడానికా ??

" కృషి వుంటే మనుష్యులు ఋషులైతారు, మహాపురుషులౌతారు అదే టార్గెట్! అందుకే జన్మ తీసుకున్నది.

మూడుపూటలా మెక్కి దున్నపోతులా నిద్రపోవడానికా జన్మ ? సిగ్గుగా లేదూ ? " సిగ్గును నిగ్గుతేల్చి సిరులు పండించు నీ జీవితంలో పసిడికాంతులు వెదజల్లు ! ధ్యానం అనే సుగంధంతో పరిమళాలు వెదజల్లు ప్రపంచమంతా .. పరవశించిపోయేలా!"

" ప్రయోగించు ధ్యానమనే ఆయుధాన్ని వజ్రాయుధంలా !

ధ్యానవీర లేవరా ! దీక్షబూని సాగరా !

కుళ్ళు అనే మహమ్మారి కూకటేళ్ళు పెకలించరా !

అజ్ఞానమున్నచోట జ్ఞానంతో నింపరా !

అసత్యమనే చీకటిని పారద్రోలి సత్యంతో పయనించరా !

ఎవరు వారు? ఎచటివారు ? అలజడి లేపే ఆ చెడ్డవారు ?

తరిమి తరిమి కొట్టరా !

సత్యమెరిగి, నిత్యమెరిగి మనమంతా ఒకటేనని చెప్పరా !

ఓ నరుడా ! మనమంతా ఒకటేనని చాటి చెప్పరా !

సత్యాన్వేషణకై ఇచటి కొచ్చి పక్కదారి పట్టకురా !

సత్యమెరిగి నడచుకోరా !

" మానవుడే మహనీయుడూ .. మాననీయుడూ "

అని ఎలుగెత్తి చాటరా ఓ మానవుడా !

" పడవెళ్ళి పోతోందిరా ! నీ దారి గోదారిరా !

గాలిబుడగ వంటి బ్రతుకు – ఏ క్షణమైనా వెళ్ళిపోవురా !

సత్యమెరిగి జీవించరా ! ఇకనైనా జీవించరా !

మంచిని మరచి వంచన నేర్చి నరుడే ఈనాడు

పామరుడైనాడు ! వంచన మరచి మంచిని పెంచి నరుడే

రేపు మహాత్ముడవుతాడు, మహాపురుషుడౌతాడు ..! ఎలాగంటే

శ్వాస మీద ధ్యాస పెట్టి – జ్ఞానాన్ని చేతబట్టి – పల్లె పల్లె చాటి

చెప్పి .. ధ్యాన బాట వేస్తారురో ఓ అన్నలార ! అక్కలారా !

రస్తాలన్నీ ఒక్కటాయెరో ! దేశమంత ధ్యానమాయెరో !

ఓ అన్నలార, ప్రపంచమంత ఒక్కటాయెరో !

ధ్యానమనే సుగంధాన్ని వెదజల్లరో !

అందుకే ధ్యానం చేద్దాముర్‌ో ! మనమంతా ఒకటేనురో !

నువ్వు నేను ధ్యానం చేస్తే, పల్లె పల్లె ధ్యానులైతే

నగరమంత జ్ఞానులైతే, అవుతారు దేశమంతా

ఆత్మజ్ఞానులే, ఓరన్నలార ! ప్రపంచమంతా ఆత్మ బంధువులే !

మంచికోసం ఒక అడుగు ముందుకు వేస్తే .. వంద అడుగులు ముందుకు నడపడానికి పై లోకాల వారి  అండ దండలున్నాయి !

" నాకెందుకులే ? " అని వెనకడుగు వేస్తే

వేయి అడుగులు వెనక్కి పోతావు !

ఎన్నో జన్మలు అంధకారంలో బ్రతికావు, ఈ జన్మలోనైనా అంధకారం నుండి బయటపడి ఆత్మజ్ఞానం వైపు పయనించు!

గమ్యాన్ని చేరుకోవడానికి సరైన మార్గం ఇదే.

శ్వాస మీద ధ్యాస పెట్టు – ఆనందంగా జీవించు !

శ్వాస మీద ధ్యాస పెట్టు – పరమపథం వైపు పయనించు !

శ్వాస మీద ధ్యాస పెట్టు – మహాత్ముల అడుగు జాడల్లో పయనించు

" పట్టు పట్టరాదు .. పట్టి విడువరాదు .. పట్టు పట్టెనేని బిగియ పట్టవలయు .. పట్టి విడుచుట కంటె పడి చచ్చుట మేలు " అన్నారు కదా!

అందుకే  పట్టుబట్టు పరమాత్మ స్థాయికి ఎదిగే వరకు !

మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు

అందుకే అజ్ఞానాన్ని ఛేదించు – ఆత్మజ్ఞానం వైపు పయనించు !

## " ఎన్ని జన్మల పుణ్య ఫలమో !! "

" పుట్టాం ! పెరిగాం ! చనిపోయాం ! " ..

.. ఇదేనా జీవితం ?

పక్షులు, జంతువులు, జలచరాలు ..

ఇలా ప్రతి జీవి కూడా చేస్తున్న పని ఇదే.

ఇవన్నీ కూడా మనలాగే పుడుతున్నాయి;

మనలాగే పెరుగుతున్నాయి, చనిపోతున్నాయి !

చీమలు, తేనెటీగలు మొదలైనవి

ఆహారాన్ని దాచుకుంటున్నాయి కూడా !

అదే పని మనం కూడా చేసి, చేసి, చేసి ఛస్తూన్నాం !

ఉద్యోగమో, సద్యోగమో చేయడం ..

డబ్బు సంపాదించడం, ఆస్తులు ఏర్పరచుకోవడం ..

సంపాదించినది దాచుకోలేక నానా అవస్థలూ పడడం ..

సంపాదించడానికీ, దాచుకోవడానికీ ..

కొన్ని తప్పులూ, నేరాలూ " తప్పదు కనుక " చేయడం ..

వెరసి మనిషి పతనానికి చేరుతున్నాడు.

" ఎన్ని జన్మల పుణ్య ఫలమో మానవజన్మ ఎత్తాం "

.. అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు కదా!

మరి మానవ జన్మ స్థితిని ఫలవంతం చేసుకోవాలి కదా?

మనిషి జంతువులాగా కాక మనిషిగా,

మహనీయుడుగా ఎదగాలంటే ఏం చేయాలి ?

జీవితాంతం సంపాదించినది

ఈ శరీరాన్ని వదిలినప్పుడు వెంట రాదు కదా!

మరణశయ్యపై ఉన్నప్పుడు ఆలోచన వచ్చినా ఏం లాభం?

అప్పుడిక ఫలితమేముంది ! ఏమీ చేయలేని స్థితి !

వయస్సు ఉడిగినప్పుడు కాకుండా వయస్సు ఉన్నప్పుడే

ఈ స్థితి నుంచి  బయటపడాలి !

"బయట పడటానికి ఒక మార్గం ఉంది ..

అదే ' శ్వాస మీద ధ్యాస '

.. అంటూ మానవాళికి అత్యున్నతమైన మార్గాన్ని చూపారు ..

చూపుతున్నారు .. బ్రహ్మర్షి పత్రీజీ !

" భౌతిక పరమైన సంపాదన మన వెంట రాదు ;

ఆధ్యాత్మికపరంగా, ఆత్మపరంగా ఎదగాలి !

ఆత్మ జ్ఞానాన్ని సంపాదించాలి !

అదే నిజమైన సంపాదన ..

మన వెంట  వచ్చే సంపాదన ! "

.. అని ఊరూ వాడా, పల్లె, పట్టణం తిరుగుతూ

అతి సామాన్యులకు సైతం అతి పెద్ద ఆధ్యాత్మిక సత్యాలు తెలియజేస్తూ, భూమండలాన్ని ఆత్మజ్ఞానపరాయణుల నిలయంగా తీర్చిదిద్దాలని నిర్విరామ కృషి చేస్తున్నారు బ్రహ్మర్షి పత్రీజీ !

ఎన్ని జన్మల పుణ్యఫలమో మానవ జన్మ ఎత్తాం !

ఎన్ని జన్మల పుణ్యఫలమో ' శ్వాస మీద ధ్యాస ' పెట్టాం.

ఎన్ని జన్మల పుణ్య ఫలమో ' ఆత్మజ్ఞానులం ' అయ్యాం !

ఇక ధ్యానప్రచారమే ముద్దు ! ఇక ఆకాశమే హద్దు !

అతి త్వరలో " ధ్యాన జగత్ " సాధిద్దాం !!!

రండి ! కదలి రండి !

శాంతినీ, కరుణనూ పంచుదాం !

కాంతినీ, ప్రజ్ఞనూ పెంచుదాం !

ధర్మాన్నీ, జ్ఞానాన్నీ స్థాపిద్దాం !!

పత్రీజీ గారి దారి వెంబడి కదలి వెళ్దాం !

మన జన్మను సార్థకం చేసుకుందాం !

" ధ్యాన భారత్ జై ! "

" ధ్యాన జగత్ జై ! "

---

## " సత్యమేవ జయతే ! ధ్యానమేవ జయతే ! "

" సత్యమేవ జయతే ! .. " అన్నది ఉపనిషత్ సూక్తి

అంటే, " సత్యమే ఎప్పుడూ జయిస్తూ ఉంటుంది ".

అసత్యమే ఎప్పుడూ ఓడిపోతూ ఉంటుంది.

" సత్యం అనబడే సూర్యుడు అప్పుడప్పుడూ ' అజ్ఞానం ' అనబడే మబ్బుల ద్వారా ' కనుమరుగు ' కావచ్చు ! కానీ, ' సూర్యగోళం ' అయిన సత్యం అంతలోనే దేదీప్యమానంగా కంటికి మరలా ప్రత్యక్షం అవుతుంది ! "

ఏది సత్యం ? ఏది అసత్యం ?

నిత్యమైనదే సత్యం ! అనిత్యమైనదే అసత్యం !

మరి ఏది నిత్యం? ఏది అనిత్యం ?

ఆత్మే నిత్యమైనది ! అనాత్మే అనిత్యమైనది !

కనుక ' ఆత్మ ' అన్నదే సత్యం.

' ఆత్మ ' అన్నదే ' స్వయంప్రకాశమైన సూర్యగోళం ! '

మనస్సులోని మాలిన్యాలే ఆత్మను కనుమరుగు చేసే

కారుమబ్బులు !!

' మాలిన్యం ' .. అంటే త్రికరణశుద్ధి రాహిత్యమే !

అంటే మనసా, వాచా, కర్మణా, ' ఏకం ' గా ఉండకపోవటమే.

' నేను మేను ని ' అన్న అజ్ఞానమే ఆత్మ వెలుగుకి ' తెర ' కట్టేది.

" తెర తీయగ రాదా ? .. " అని శ్రీ త్యాగరాజ స్వామి ఎంతగా మొరబెట్టుకున్నా, ఎంతగా ప్రార్థించినా, " బయట నుంచి ' తెర ' తీసే నాధుడు " ఎవ్వడూ వుండడు !

మనం మన స్వంత తమో రజో గుణాలతో జన్మజన్మలుగా అల్లుకున్న ' తెర ' ను మనమే మన స్వప్రయత్నంతోనే కరిగించుకోవాలి.

మన ' తెర ' ను మనకు మనంగా శూన్యం చేస్తేనే తప్ప మన ' సత్యం', మన ' ఆత్మ ', మళ్ళీ జాజ్వల్యమానంగా ప్రకాశించదు.

దానికి మార్గం వుంది -

అదే " ఆనాపానసతి ధ్యాన విధానం ".

మనం సదా ..

" అసత్యులమై .. నిత్య ఓటములతో, నిత్య నిరాశా, నిస్పృహలకు లోనవుతూనే వుండాలా ? "

లేక, " సత్యులమై .. నిత్య జయాలతో, నిత్య విజయాలతో నత్యానందులుగా విలసిల్లుతూ వుండాలా? " అన్నది ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

ఏ నిర్ణయం – అంటే, " సత్యమా ? " .. " అసత్యమా ? " " జయమా? " .. " అపజయమా? ", " ధ్యానమా? " .. " ప్రార్థనా?" " అంతరంగమా? " .. " బహిరంగమా ? " .. అన్నది ప్రతి ఒక్కరూ ఎవరికి వారే తమ ఏకాంత స్థితుల్లో పూర్తిగా విశ్లేషించి తీసుకోవాలి.

– బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

## " ఆధ్యాత్మికత అంటే ? "

' ఆధ్యాత్మికత ' అన్న పదానికి విపరీత పదం ' ప్రాపంచికత ' !

' ప్రాపంచికత ' అన్న పదానికి విపరీత పదం ' ఆధ్యాత్మికత ' !

' కేవలం ప్రాపంచికత ' అన్నది రేయి లాంటిదైతే ' ఆధ్యాత్మికత ' అన్నది ' పగలు ' లాంటిది.

' కేవలం ప్రాపంచికత ' లోనే బ్రతుకుతూన్న వారు చీకటిలో కొట్టుమిట్టాడుతున్నటువంటి వారు.

ఆధ్యాత్మికతను సంతరించుకున్నవారు దివ్యమైన వెలుగులో చుట్టు ప్రక్కలున్న వాటినీ, మరి స్వంత మనస్సులో ఉన్నవాటినీ .. అన్నింటినీ .. యదార్థంగా అంటే ' వున్నది ఉన్నట్టుగా ' .. చూస్తూ అద్భుతమైన రమణీయతలో విహరిస్తూ ఉన్నటువంటి వారు.

రోజులు మారాయి ! చీకటి రోజుల్ని ఇక ఈ భూమండలంలో వ్రేళ్ళతో  లెక్కించవచ్చు !

ఇక ముందున్నది నిత్య పగలే ! నిశీధికి ఇక సమాధి కట్టబడుతోంది! ' కేవల ప్రాపంచికత ' యొక్క అంతిమ ఘడియలు సమీపించాయి !

' ప్రాపంచికత ' అన్నది బూజు పట్టిన పాత చింతకాయపచ్చడి !' కేవలం 'నామా ' లు పెట్టుకోవడమే ' ప్రాపంచికత '

'నామా ' లు తీసివెయ్యడమే ' ఆధ్యాత్మికత ' !

అయితే ఏ ' నామా ' లు ? నిలువు నామాలా ? అడ్డ నామాలా?

నిలువు నామాలూ కాదు ; అడ్డ నామాలూ కాదు !

తీసివేయవలసింది ' నా ', ' మా ' లు !

' నా శరీరం ', ' నా ఇల్లు ', ' నా పిల్లలు ' ..

' నా పొలం ', ' నా వ్యాపారం ', ' నా రాజ్యం ' .. ఇవే మానవుడికి పట్టిన 'చీడలు ' ! అలాగే, ' మా జాతి ', ' మా కులం ', 'మా దేశం ', ' మా వర్గం ' .. ఇవే మానవ జాతికి పట్టిన  ' పీడలు ' !

ఆరువేల సంవత్సరాల క్రిందటే భగవద్గీతలో శ్రీ కృష్ణుడు " నిర్మమో నిరహంకారః " అని నెత్తి నోరూ బాదుకుని ఎన్నో విధాలుగా చెప్పాడు కదా !

ఇక నుంచీ ' నా ',  ' మా ' అనేవి తీసేసి ' మన ' అని పెట్టుకుందాం !

– బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

## " త్రి రత్నాలు "

" సత్యం " అన్నది మూడు రత్నాలుగా భాసిస్తోంది !

ఇవే పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ వారి ' త్రి ' రత్నాలు !

1. ధ్యానం 2. స్వాధ్యాయం 3. సజ్జన సాంగత్యం ;

ఈ మూడు రత్నాలే ఆత్మను ధగద్ధగాయమానంగా అలంకరింపజేసేవి !

ఈ మూడు రత్నాలే మానవుడిని శాశ్వతంగా అలరింపజేశేవి!

" ధ్యానం " అంటే " శ్వాస మీద ధ్యాస " .. ఫలం – " ఆత్మానుభవం "!

" స్వాధ్యాయం " అంటే మహామహుల జీవిత చరిత్రల్లోకి వెళ్ళటం

.. ఫలం – " విశేషమైన జ్ఞానలాభం " !

" సజ్జన సాంగత్యం " అంటే యోగుల అనుభవాలను వారి ముఖతః

వినడం .. ఫలం – అపారమైన " మిత్ర లాభం " !

పిరమిడ్ స్పిరిచ్యువల్ మాస్టర్ల యొక్క భూషణాలే ఈ

' త్రి ' రత్నాలు !

ప్రపంచంలో జనులందరూ ఇదే విధంగా త్రిరత్న శోభితులవ్వాలి !

శుద్ధమైన ఆత్మానుభవంతో, అపారమైన ఆత్మ విజ్ఞానంతో మరి మిత్ర కోటి

లాభంతో సర్వ జనులూ మహా ఆనందంగా జీవించాలి !

ధ్యానం శరణం గచ్ఛామి !

స్వాధ్యాయం శరణం గచ్ఛామి !!

సజ్జన సంగం శరణం గచ్ఛామి !!!

– బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

## " ధ్యాన జగత్ కి జై "

" భౌతిక పరమైన సంపాదన మన వెంట రాదు;

ఆధ్యాత్మికపరంగా, ఆత్మపరంగా ఎదగాలి !

ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలి !

అదే నిజమైన సంపాదన ..

మన వెంట వచ్చే సంపాదన !

రండి ! కదలిరండి !!

శాంతినీ, కరుణనూ పంచుదాం !

కాంతినీ, ప్రజ్ఞనూ పెంచుదాం !!

ధర్మాన్నీ, జ్ఞానాన్నీ స్థాపిద్దాం !!! "

" ధ్యాన భారత్ జై ! "

" ధ్యాన జగత్ జై ! "

– బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

# " గురువుగారికి ప్రణామాలు "

" జన్మనెత్తితిరా అనుభవించితిరా .... కాదు జీవితం అంటే ! " జన్మనెత్తితిరా ఆత్మానందం పొందితిరా "... అనే లెవల్ కు తీసుకొచ్చిన పరమగురువు, లోక కళ్యాణం కొరకు అవతరించిన లేటెస్టు మాస్టరు బ్రహ్మర్షి పితామహ పత్రీజీ !

" తాను తెలుసుకున్న సత్యాన్ని, ఆనందాన్ని తన కోసమే కాదు, పరులకోసం " అని తన జీవితాన్నే త్యాగం చేసిన ధన్యజీవి పత్రీజీ !

ఉన్నత విద్య నభ్యసించి, ఉన్నత అధికారిగా జీవితం సాగిస్తున్న తరుణంలో ఒక మెరుపు మెరిసింది తన మనస్సులో. వెంటనే పదవికి రాజీనామా చేసి పరిణితి చెందిన బుద్ధితో, పరిపక్వ స్థితికి చేరిన ఆత్మ పరుగులు తీసింది, పరవళ్ళు తొక్కింది పరుల కోసం జీవితాన్ని త్యాగం చేయమని !

రాజుగారు తలచుకొంటే కొరడా దెబ్బలకూ కరువా, ప్రకృతి కరుణిస్తే అన్నానికీ కరువా ?

పరమ గురువు తలచుకుంటే ఆత్మజ్ఞానులు కరువా! మొదలయ్యింది అన్వేషణ, ప్రారంభమైంది – ధ్యానం ప్రచారం.

" రతనాలసీమ - రాయలసీమ " గడ్డ అయిన కర్నూలు లో అవతరించింది మొట్టమొదట " బుద్ధా పిరమిడ్ ధ్యానకేంద్రం " కర్నూలు శ్రీ B.V. రెడ్డి గారి సహకారంతో.

గోదావరి గలగలలు, కృష్ణమ్మ పరవళ్ళు లాగా పరుగులు తీసింది ధ్యానప్రచారం! మురళీగానంతో పరవశించారు తెలుగు ప్రజలు ఆత్మానందంతో! ఎటుచూసినా 'శ్వాస మీద ధ్యాస' ఉంచారు ఆంధ్ర రాష్ట్రమంతటా!

" ఇంతటితో ఆగదు, నా ప్రయాణం! కావాలి ధ్యాన ప్రపంచం " అంటూ నిరంతర, నిర్విరామ కృషి చేస్తున్నారు గురూజీ. సత్యం తెలుసుకున్న ప్రతి ఒక్కరూ పిరమిడ్ మాస్టర్లై సత్యబోధనకై నలుమూలలా పరుగులు తీస్తున్నారు. " గురువుగాని గురువు... పరమగురువుకు ఇదే మనమిచ్చే గురుదక్షిణ" అని 'ధ్యానప్రచారం' మొదలుపెట్టారు ప్రతి ఒక్కరూ!...

నరుక్కోవడాలు, చంపుకోవడాలు ఇక ఉండవు!
దౌర్జన్యాలు, దహనకాండలు ఇక ఉండవు!
ఆత్మహత్యలు, అరాచకాలు ఇక ఉండవు!
అన్యాయం - అక్రమం ఇక ఉండదు!
కష్టాలు, నష్టాలు ఇక ఉండవు !
కరువు, కాటకాలు ఇక ఉండవు !
దోచుకోవడాలు, దాచుకోవడాలు ఇక ఉండవు !
ఎన్నో లాభాలు, ఎంతో ఆనందం !
ఎంతో సుఖం, ఎంతో సంతోషం !

ఎంతో ఆహ్లాదం, ఎంతో సస్యశ్యామలం


ప్రపంచమంతటా కావాలంటే... !

మనమందరం తప్పక చేయవలసింది ఒక్కటే !

అది అందరూ చేయగలిగింది, అందరికీ సులువైంది, సుఖమైంది. అదే . . అదే . . " శ్వాస మీద ధ్యాస ".

" శ్వాస మీద ధ్యాస పెట్టు - ఆనందం పంచిపెట్టు " అని పిరమిడ్ మాస్టర్స్ అందరూ .. ఊరు ఊరూ తిరుగుతూ ధ్యానప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆశిస్తూ .. గురూజీ గారికి శతకోటి ధ్యానాభివందనాలు !

**ఇంటింటా ధ్యానం - ప్రపంచమంతా జ్ఞానం!**



ఓం నమః శ్శివాయ

# ॥ ఓం కేశవాయ నమః ॥

"ధ్యానరత్న" కేశవరాజు



ధ్యాన మహోత్సవాలు-2003 లో బ్రహ్మర్షి పితామహ పత్రీజీ గారి ద్వారా
"ధ్యానరత్న" అవార్డు అందుకుంటున్న కేశవరాజు




2003 లో శ్రీ అజేయ కల్లం, E.O., T.T.D., Prof. P. మురళి, V.C., S.V.U., శ్రీ చదలవాడ కృష్ణమూర్తి, M.L.A., తిరుపతి
వారి ద్వారా జేసీస్‌లో ఉత్తమ అవార్డు 'కమలపత్ర' అందుకుంటున్న Jc. D. కేశవరాజు